
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

★★★★★★



20

అమరావతి కృష్ణా

సోమవారం 28 ఆగస్టు 2017

గణపతి నవరాత్రులు జిల్లాలో వైభవంగా జరుగుతున్నాయి. మూడోరోజు ఆదివారం కలిసి కావడంతో జిల్లాలోని పలు చవితి పందిళ్ల వద్ద గణపతి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి కృష్ణానది, సముద్రం, పలు పెద్ద కాల్వల్లో నిమజ్జనం చేశారు. యువత డ్యాన్స్ చేస్తూ, గణేష్ మహారాజ్‌కి జై అంటూ ఉత్సాహంగా సందడి చేశారు.

● నిమజ్జనం

- లోపలి పేజీల్లో ▸



వేదాద్రి వద్ద కృష్ణానదిలో వినాయక నిమజ్జనం...

సమాజం కోసం జీవించండి!

- ఇప్పటికీ ఆర్థిక, సాంఘిక అసమానతలు
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



12

స్వర్ణభారత్ ట్రస్టులో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

అమలు అంతంత మాత్రమే

- అందరికీ అందని అన్నఅమృత హస్తం
- అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమి
- రేషన్ బియ్యంతో భోజనం



ముసునూరు అంగన్‌వాడీకేంద్రంలో పౌష్టికాహారాన్ని తీసుకుంటున్న గర్భిణులు, బాలింతలు

16

దుర్గగుడి అభివృద్ధి పనులకు..

వాస్తు బ్రేక్..!

దుర్గగుడిలో వాస్తువిరుద్ధంగా జరుగుతున్న అన్ని పనులకు ట్రస్ట్ బోర్డు రెడ్‌సిగ్నల్ చూపడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వాస్తు సమ్మతంగా ప్రస్తుత నిర్మాణాలను వేరొక చోట నిర్మించేందుకు అభ్యం తరం లేదని ట్రస్ట్‌బోర్డు స్పష్టం చేసింది. భక్తులకు అవసర మయ్యే పనులు తప్ప, మిగతా వేటినీ అనవసర వ్యయం చేసి నిర్మించరాదని ట్రస్టు బోర్డు తేల్చి చెప్పింది.

- అభివృద్ధి పనుల నిలిపివేత
- దేవస్థానం మాజీ ఆగమ పండితుడు రాక
- ట్రస్ట్‌బోర్డు సభ్యులకు పలు సూచనలు
- 30న జరగాల్సిన సమావేశం వాయిదా

6లో



బందరు పట్నం

చూడర బాబూ...

అదేదో పాత సినిమాలో కాశీపట్నం చూడర బాబూ.. పాట మాదిరిగా బందరు పట్నం చూడర బాబూ.. అన్నట్టుగా ఉంది జిల్లా కేంద్రం. నియంత్రణ లేకపోవడంతో ప్రాచీన మచిలీపట్నం పశువులకు అడ్డాగా మారిపోయింది. ప్రధాన రహదారులే గేదెలు, ఆవులకు ఆవాసాలుగా ఉన్నాయి. ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

12లో

- పశువుల అడ్డాగా జిల్లా కేంద్రం
- రోడ్లే ఆవాసాలు
- ట్రాఫిక్ సమస్య
- తరచూ ప్రమాదాలు
- నియంత్రణ చర్యలు ప్రారంభం
- అవగాహనతోనే నివారణ సాధ్యం



ప్రభుత్వ విద్యకు ఆదరణ

- కొల్లేరు పాఠశాలలు కళకళ
- పెరిగిన విద్యార్థుల సంఖ్య
- సౌకర్యాల మెరుగు
- ఫలించిన విద్యాశాఖ కృషి



శృంగవరప్పాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

19

ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యా శాఖ అధికారులు చేస్తున్న కృషి సత్ఫలితాలనిస్తోంది. కొల్లేరు ప్రాంతంలోని ప్రభుత్వ బడులు భేషుగ్గా నడుస్తుండడమే దానికి ప్రత్యక్ష నిదర్శనం. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ తల్లిదండ్రులు కార్పొరేట్ వైపు మొగ్గు చూపుతుండడం పరిపాటిగా మారింది. అయితే, ఇటీవల ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో 'బడి పిలుస్తోంది', 'అమ్మ బడి (ప్రభుత్వ బడి)' కార్యక్రమాలు విజయ వంతంగా నిర్వహించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య బాగా పెరిగింది. సౌకర్యాల కల్పన, ఉత్తమ విద్య అందించడమే దీనికి ప్రధాన కారణం.

సీపీఎస్ రద్దు కోసం..

● ఉద్యోగ పర్వం

ప్రభుత్వ ఉద్యోగుల గర్జన

- బెజవాడలో 'మిలియన్ మార్చ్'
- సెప్టెంబర్ 1న లక్షలాది మంది ఉద్యోగులతో కిక్కిరిసిపోనున్న బెజవాడ
- తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి మహార్యాలీ
- బిషప్ అజరయ్య స్కూల్‌లో భారీ బహిరంగ సభ

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమల్లోకి తీసుకు రావటంపై ప్రభుత్వ ఉద్యోగులు అమీ తుమీ తేల్చుకోవటానికి సిద్ధమయ్యారు. బెజవాడ వేదికగా లక్షలాది మందితో గర్జించటానికి 'మిలియన్ మార్చ్'కు ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్‌లో అన్ని ప్రభుత్వ సంఘాల ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా పాలు పంచుకుంటున్నాయి.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)
కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం తప్పనిసరి చేసిన సీపీఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వర్తింపు చేస్తూ ఉన్నతాధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయంపై ప్రభుత్వ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఉద్యోగుల సమిష్టి ఆందోళనలతో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ప్రయోజనం కల్పించే దిశగా ఫ్యామిలీ పెన్షన్, డెత్ గ్రాట్యుటీలకు సంబంధించిన జీవోలు జారీ చేసినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం సీపీఎస్ వ్యవస్థ రద్దునే కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ విషయంలో సంఘటిత చైతన్యాన్ని చాటడానికి భవిష్యత్తులో నిర్వహించబోయే మహోద్యమం గురించి కార్యాచరణ రూపొందించుకోవటానికి ఈ మిలియన్ మార్చ్‌కు శ్రీకారం చుడుతున్నారు.

● ఏమిటీ సీపీఎస్ ?

సీపీఎస్ అంటే... కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్. దీనిని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఉద్యోగుల భవిష్య నిధి (పీఎఫ్) స్థానంలో ఈ సరికొత్త విధానాన్ని తీసుకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన నూతన విధానం ఇది. దీని ప్రకారం 2004 సంవత్సరం తర్వాత వచ్చిన ఉద్యోగులంతా సీపీఎస్ పరిధిలోకి వస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసమే ఈ విధానం తీసుకున్నప్పటికీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని తమ ఇష్టానుసారం అనుసరించవచ్చునని సూచించటం జరిగింది. దీనిని అమలు చేయాలన్నా, చేయకూడదనుకున్నా పూర్తి విచక్షణాధికారం రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్‌ను తప్పనిసరి చేయలేదు.

● ఉన్నతాధికారుల అనాలోచిత చర్యతో అమల్లోకి :

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల అనాలోచిత దుందుడుకు చర్యల ఫలితంగా... ఇక్కడి ప్రభుత్వ ఉద్యోగులు సీపీఎస్ విధానంలోకి వచ్చారు. ఒక్క ఉదుటున జీవో నెంబర్ 653, 654, 655లను జారీ చేసి, సీపీఎస్ వ్యవస్థను అమల్లోకి తీసుకు వచ్చింది. ఈ విధానాన్ని అమలు చేసే ముందు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల అభిప్రాయం ఏమిటన్నది కూడా తీసుకోకుండా ఏకపక్షంగా అమల్లోకి తీసుకు వచ్చారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది ఉద్యోగులు ఆందోళన బాట పడుతున్నారు.

● పాత విధానం ఇలా ..

గతంలో ఉన్న విధానాన్ని చూస్తే... ఉద్యోగులు భవిష్యనిధి కోసం తమ వంతు ప్రతినెలా దాచుకునేవారు. దీనికి ప్రభుత్వం కొంత మ్యాచింగ్ కలిపి జమ చేస్తుంది. పదవీ విరమణ తర్వాత వడ్డీతో సహా మొత్తం దాచుకున్న సొమ్మును పొందేవారు. కేడర్‌ను బట్టి నిర్ణీత గ్రాట్యుటీ, పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, కమ్యూటేషన్‌లు పొందేవారు.

● కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానం ఇలా :

సీపీఎస్ నూతన విధానంలో పాత విధానం ఉండదు. కేడర్‌ను బట్టి ఉద్యోగి బేసిక్‌లో డీఏ 10 శాతం ఎంత మొత్తం అయితే అంత మొత్తం ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వేసి ఆ మొత్తాన్ని శాశ్వత పదవీవిరమణ (ప్రాన్) ఖాతాలో జమ చేస్తుంది. ఇలా ఈ ఖాతాలో ఉన్న సొమ్మును ఎన్ఎస్‌బీఎల్ అనే ప్రైవేటు సంస్థ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుంది. ఈ సంస్థకు చెందిన ఫండ్ మేనేజర్లు రకరకాల సంస్థలలో పెట్టుబడులు పెడతారు. మన రాష్ట్రానికి వచ్చేసరికి ఎల్ఐసీ, యూటీఐ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలలో పెట్టుబడులు పెడతారు.

● 'సీపీఎస్' పై ఎందుకింత రాద్ధాంతం ?

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానంలో గ్రాట్యుటీ, పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, కమ్యూటేషన్‌లు వంటివి ఉద్యోగులు పొందే పరిస్థితి లేదు. అనేక ఇబ్బందుల గురించి ప్రభుత్వ ఉద్యోగులు ప్రస్తావిస్తూ పెదవి విరుస్తున్నారు. ఉద్యోగి చనిపోతే దహన సంస్కారాలకు రూ.15 వేలు తప్పితే ఈ విధానం ద్వారా పొందే అదనపు ప్రయోజనాలు లేవు. పదవీ విరమణ చెందిన ఉద్యోగికి తాను దాచుకున్న సొమ్ములో పూర్తిగా తీసుకోవటానికి వీలు లేదు. ఉద్యోగి సొమ్మును 60 - 40 గా విభజిస్తారు. ఉద్యోగి వాటా 60 శాతంలో 30 శాతం ట్యాక్స్ మినహాయింపులుపోను మిగిలిన సొమ్మును అందిస్తారు. అంటే ఒక ఉద్యోగి రూ.30 లక్షలు దాచుకుంటే అందులో 30 శాతం రూ.9 లక్షలు పోగా రూ.21 లక్షలు మాత్రమే ఇస్తారు. ఇక పోతే మిగిలిన 40 శాతం ఉద్యోగుల పొదుపును మళ్ళీ యాన్యుటీలలో (షేర్ మార్కెట్) పెట్టుబడులు పెడతారు. వీటిపై వచ్చే వడ్డీని 12 నెలల దామాషాలో విభజించి ఏ ఏడాది కాఏడాది పింఛను ఇస్తారు. సీపీఎస్ విధానంలో భాగంగా ఉద్యోగుల దాచుకున్న సొమ్మును స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల మార్కెట్ హెచ్చు తగ్గులకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి. మార్కెట్ పడిపోతే ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలు కూడా తగ్గిపోతాయి. చనిపోయిన ఉద్యోగులు పింఛను అందుకోవాలన్నా కష్ట సాధ్యంగా ఉంటుంది.

● పోరాటాలతో... డెత్‌గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధన

ప్రభుత్వ ఉద్యోగులంతా సంఘటితమై విజయవాడ నుంచి ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఉధృత స్థాయిలో ఆందోళనలు చేయటంతో ప్రభుత్వం స్పందించింది. హర్యానా తర్వాత మన రాష్ట్రం రెండవదిగా డెత్ గ్రాట్యుటీని ప్రవేశపెట్టింది. ఫ్యామిలీ పెన్షన్‌ను మొదటి సారిగా మన రాష్ట్రమే అమలు చేసింది. చనిపోయిన ఉద్యోగులు డెత్ గ్రాట్యుటీతో పాటు, ఫ్యామిలీ పెన్షన్ లను పొందే సౌకర్యం ఉంది

సీపీఎస్ పూర్తిగా రద్దు చేసేందుకు మహోద్యమం



కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానంలోని ఇబ్బందులను గుర్తించిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులంతా సంఘటితమయ్యారు. ఇటీవల ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులు పదవీ విరమణ చెందితే ఒకరికి రూ. 534, మరొకరికి రూ. 232ల చొప్పున పింఛను వస్తోంది. ఇటీవల ఓ ఎస్ఐ, అతని భార్య ప్రమాదంలో చనిపోతే వారి పిల్లలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. రేపు మాకేమైనా అయితే మా పిల్లల పరిస్థితి ఏమిటన్న భయం ప్రతి ప్రభుత్వ ఉద్యోగిని వేధిస్తోంది. అందుకే సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ మిలియన్ మార్చ్‌కు శ్రీకారం చుట్టాం. ఏపీ అమరావతి జేఏసీ, ఏపీ ఎన్‌జీఓ వంటి సంఘాలు కూడా మా ఆందోళనలకు మద్దతుగా నిలుస్తూ పోరాటంలో పాలు పంచుకుంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పోరు బాట పట్టిన ఫలితంగానే రా ష్ట్ర ప్రభుత్వం నుంచి డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్‌లను పొందటం జరిగింది. ఫ్యామిలీ పెన్షన్‌లో కూడా ఒక మెలిక ఉంది. ప్రాన్ ఖాతాలో ఎంప్లాయీ దాచుకున్న మొత్తం సొమ్మును కూడా ప్రభుత్వం తీసుకుంటోంది. దీనిని మేం వ్యతిరేకిస్తున్నాం. మేం ఒక్కటే చెబుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రాన్ అక్కౌంట్లలో ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ రూ. 1500 కోట్లతో పాటు , ఉద్యోగుల పొదుపు రూ. 1500 కోట్లు రూ. 3000 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వం తన అవసరాల కోసం వాడుకుని పాత విధానాన్నే కొనసాగించాలని వేడుకుంటున్నాము. సీపీఎస్ ను పూర్తిగా రద్దు చేసేందుకు మేం ఆందోళన బాట పట్టాము. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేం ఎక్కడా పోరాడటం లేదు. శాంతియుతంగా, వినయంగా మా సంఘటిత కాంక్షను ప్రభుత్వానికి తెలియచెప్పటం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

సీఎం దాసు, ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు

ఆర్పీఎఫ్‌లో 19,952 ఉద్యోగాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)
రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)లో 19,952 ఉద్యోగాలను భర్తీ చేయడానికి రైల్వేశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది అక్టోబర్ 14 వతేదీలోపల దరఖాస్తులను పంపంచాల్సి ఉంటుంది. రూ.5,200 నుంచి 20,200 వరకు వేతనం గల ఉద్యోగాలు ఉన్నాయి. వేతనంతోపాటు రూ.2000 గ్రేడ్ పే కూడా ఇవ్వనున్నారు. ఈ ఉద్యోగాలు పొందేందుకు అభ్యర్థులకు 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో వయస్సు ఉండాలి. జనరల్ కోటాలో 8901, ఎస్సీ కోటాలో 3317, ఎస్టీ కోటాలో 3363, ఓబీసీ కోటాలో 4371 ఉద్యోగాలు ఉన్నాయి. రాత పరీక్ష, మెడికల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్‌లలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఇండియన్‌రైల్వే.జీవోవి, ఐఎన్ వెబ్‌సైట్‌ను చూడొచ్చు

హెచ్‌ఓడీలకు బస్సు పాసులు

గుంటూరు, విజయవాడల్లో నివాసం ఉంటూ వెలగపూడిలోని సచివాలయంలో ఉద్యోగం చేసే హెచ్‌ఓడీలకు, ప్రయాణసదుపాయం లేని గెజిటెడ్ అధికారులకు కూడా రాయితీబస్సు పాస్‌లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటి వరకు సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు కొందరికి మాత్రమే రాయితీతో కూడిన బస్సు పాసులు ఇస్తూ వస్తున్నారు. ఇది కూడా సీఆర్‌డీఏ పరిధిలో ప్రయాణించేందుకు మాత్రమే వీలుండేది. అయితే అధికారిక పనులపై జిల్లా బస్సులలో ప్రయాణించాలంటే ఉద్యోగులు తమ డబ్బులు చెల్లించి ప్రయాణించవలసి వస్తోంది. ఈ విషయాన్ని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాయి. ప్రభుత్వం బస్సుపాసులు అంగీకరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికే ప్రయాణ సదుపాయం ఉన్న గెజిటెడ్ ఉద్యోగులకు మినహా మిగిలిన గెజిటెడ్ ఉద్యోగులకు, హెచ్‌ఓడీలకు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, నాలుగోతరగతి ఉద్యోగులు అందరికీ బస్సు పాసులు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. మొత్తం రూ.1350 విలువగల బస్సు పాసులో ప్రభుత్వం రూ.900 భరిస్తుంది. పాసు తీసుకునే ఉద్యోగులు రూ.450 చెల్లించాల్సి ఉంటుంది. దీనిత గుంటూరు, విజయవాడలలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు.

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

జన్మభూమి కమిటీ సభ్యుడి అభ్యంతరం

(నూజివీడు)

హౌస్ ఫర్ ఆల్ పథకం కింద నూజివీడు పట్టణానికి మంజూరైన 3070 గృహాలకు ఎంపికైన లబ్ధిదారుల్లో పలువురు అనర్హులుగా ఉన్నారని, నిజమైన లబ్ధిదారులకు గృహాల మంజూరులో అన్యాయం జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలనీలో ప్రభుత్వం ఈ పథకం క్రింద జిప్లస్ 3 కేటగిరిలో 3070 గృహాల నిర్మాణానికి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. నివాస గృహాలు లేని వారు దరఖాస్తులు చేసుకోమని ఇటీవల నూజివీడు పురపాలక సంఘం ప్రజలను కోరింది. దీంతో 4,200 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా పురపాలక సంఘానికి అందాయి. ఈ దరఖాస్తులను రెవెన్యూ శాఖ విచారణ జరిపి వాటిలో 2450 దరఖాస్తులు సక్రమంగా ఉన్నాయని పురపాలక సంఘానికి జాబితా ఇచ్చింది.

ఈ జాబితాలోనే అనేక అవకతవకలు ఉన్నాయని నూజివీడు పట్టణ జన్మభూమి కమిటీ సభ్యుడు మోచర్ల కృష్ణంరాజు ఆంధ్రజ్యోతికి ఆదివారం తెలిపారు. ఇక్కడ పురపాలక సంఘం వారు వార్డుల వారీగా లబ్ధిదారుల ఎంపిక జాబితాను వార్డు కౌన్సిలర్లకు ఇచ్చే విషయంలో వివక్షత చూపారన్నారు. స్థానిక పురపాలక సంఘంలో పాలకపక్షమైన వై.ఎస్.ఆర్. సభ్యులకు ఈనెల 20వ తేదీన లబ్ధిదారుల జాబితాను ఇవ్వగా, ప్రతిపక్షమైన టీడీపీ సభ్యులకు ఈనెల 24వ తేదీన జాబితాలు అందాయన్నారు. ఇక్కడే టీడీపీ ఇచ్చే ఈ పథకాన్ని మాయచేసి వై.సి.పి. తామే లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చుతున్నట్లుగా ప్రజలను మభ్య పెడుతోందని, దీనికి స్థానిక రెవెన్యూ, పురపాలక అధికారుల సహకారం తీసుకుంటోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జరుగుతున్న ఈ పథకం తమ కృషివల్లే వచ్చిందనే భ్రమను పట్టణ ప్రజల్లో కల్పిస్తూ స్థానిక వై.సి.పి. నాయకులు లబ్ధి పొందటానికి ప్రయత్నిస్తున్నారన్నారు.

ఈ లబ్ధిదారుల జాబితాలో అవకతవకలు జరిగాయి అనే దానికి ఉదాహరణగా 17వ వార్డులో 107 మంది ఇచ్చిన దరఖాస్తులలో రెవెన్యూ శాఖ విచారణలో కేవలం 29 మాత్రమే అర్హులవి ఉన్నట్లుగా జాబితా ఇచ్చారన్నారు. అయితే ఈ 29మంది జాబితాలో కూడా ఐదుగురు పూర్తి అనర్హులు ఉన్నారు. ఈ విషయాన్ని తాను రుజువులతో అధికారులకు చూపానన్నారు. కేవలం ఈ ఒక్క వార్డులోనే కాదని, ప్రతివార్డులోనూ ఇదేతంతు సాగిందన్నారు.

ఉదాహరణకు 3వ వార్డులో మూడు అంతస్తులు, రెండు అంతస్తుల భవనాలు ఉన్న వ్యక్తులు కూడా రెవెన్యూ వారు ఇచ్చిన కొత్త గృహనిర్మాణ అర్హుల జాబితాలో ఉన్నారని, వాటిని తాము రుజువు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ విషయాన్ని ఈనెల 24వ తేదీన స్థానిక పురపాలక కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్ల సమక్షంలో జరిగిన సమావేశంలో జన్మభూమి కమిటీ సభ్యుడిగా అభ్యంతరం తెలిపానన్నారు. ఈ జాబితాలో ఉన్న కొన్ని అవకతవకలను అధికారులకు వివరించడంతో ఆ సమావేశానికి హాజరైన ఏపీ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నోడు వెంటనే స్పందించి ఈనెల 26వ తేదీన జరగాల్సిన భూమిపూజను నిలుపుదల చేసి తిరిగి పట్టణ లబ్ధిదారుల ఎంపికను రీసర్వే చేయమని సంబంధిత అదికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. దీంతో భూమిపూజ కార్యక్రమం నిలిచిపోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదటికి వచ్చిందన్నారు. ఇకనైనా అధికారులు పక్షపాతం మాని నిజంగా అర్హులైన పేద లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

బీవీపీ బృందగాన పోటీలు

గుడివాడ (రాజేంద్రనగర్): స్థానిక అలంకార్ ఫంక్షన్‌హాల్‌లో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ బృందగాన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బివిపి గుడివాడ శాఖ అధ్యక్షురాలు కె.వి. సుజాత మాట్లాడుతూ విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడానికే ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గాయకుడు పోపూరి శ్యాంసుందర్ పర్యవేక్షణలో జరిగిన జాతీయ బృందగాన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, మాంటిస్సోరి, సిద్దార్ధ, లిటిల్ ఫ్లవర్(ముదినేపల్లి) పాఠశాలల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ సిల్క్‌బోర్డు (కేంద్ర ప్రభుత్వం) రిటైర్డ్ సైంటిస్టు డాక్టర్ ఎం. రమేష్‌బాబు సౌజన్యంతో విద్యార్థులకు మెమోంటోలు, ప్రశంసా పత్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ నేతలు, చోడవరపు విజయకుమార్, ఉరిటి రామారావు, దేవిచంద్ జైన్, బొగ్గరపు తిరుపతయ్య, మెరుగు మాలబ్రహ్మయ్య, మాదాసు సత్యనారాయణ, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ వైద్యుడు శ్యాంకుమార్

సింగలూరులో మిత్రుడి సేవా కార్యక్రమాలకు ముగ్ధులైన మిత్రబృందం

గుడ్లవల్లేరు: నిత్యం వారి వారి వృత్తుల్లో బిజీగా ఉండే మిత్రులంతా తమ మిత్రుడు సింగలూరు గ్రామంలో నిర్వహిస్తున్న సేవ కార్యక్రమాలను చూసి అభినందించారు. వారు స్వయంగా సింగలూరు గ్రామానికి వచ్చి ఆయా కార్యక్రమాలను చూశారు. వారే హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో డెంటల్ కళాశాల పూర్వ విద్యార్థులు. వీరు శనివారం అమరావతిలో కలుసుకున్నారు. వీరిలో గుడ్లవల్లేరు మండలం సింగలూరు గ్రామానికి చెందిన డాక్టర్ బండారు శ్యాంకుమార్ కూడా ఉన్నారు. ఆయన హైదరా బాద్‌లో ప్రాక్టీస్‌ను వదిలి వచ్చి సింగలూరులో సామాజిక సేవా కార్యక్రమాలను చేయడాన్ని మిగిలిన మిత్రులు తెలుసుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో, దేశాలలో డెంటల్ డాక్టర్లుగా, ప్రొఫెసర్లుగా స్థిరపడిన కొందరు ఆదివారం సింగలూరు గ్రామానికి వచ్చారు. గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఆయన నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను, గ్రామీణ మహిళలకు చేస్తున్న ఉపాధి కార్యక్రమాలను, విద్యార్థులకు అందిస్తున్న చేయూతను, పేద వర్గాలకు అండగా నిలుస్తున్న కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. తమ మిత్రుడు ఏదో సేవ చేస్తున్నాడని తెలుసుకాని ఈ విధమైన సేవలు చేస్తున్నాడని అనుకోలేదని, ఆయన సేవలు తమకు ఆదర్శనీయమని మిత్రుల బృందం అభినందనలతో ముంచెత్తారు. సింగలూరులోని డాక్టర్ అమ్మవడి - నాన్నజడి పేరిట ఏర్పరచుకున్న తోటలోని అన్ని రకాల పండ్ల, పూలమొక్కలను, కోనేరును, ఓ వైపు వరిపంటను వారు తిలకించారు. చీరలు నేయడాన్ని, మగ్గం పనులను చూశారు. అందరూ చేనేత చీరలను కొన్నారు. ఆంధ్రజ్యోతితో తమ మనోభావాలను ఇలా పంచుకున్నారు.



సింగలూరులో నేత పనులను పరిశీలిస్తున్న డాక్టర్ల బృందం

శ్యాం సేవలు అనిర్వచనీయం



డాక్టర్ మురళీకృష్ణ, విజయవాడ

సేవను కూడా వ్యాపారంగా చేస్తున్న ఈ రోజుల్లో గ్రామాభివృద్ధి కోసం ప్రాక్టీసును వదిలిరావడం అభినందనీయం.

సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయడం ఆదర్శనీయం



డాక్టర్ మధుసూదన్,నారాయణ డెంటల్ కళాశాల ప్రొఫెసర్

శ్యాం సొంత ఊరిలో సేవలు సమాజానికి ఆదర్శనీయం. ఈ స్ఫూర్తితో మాకు కూడా మా గ్రామాల్లో ఎంతో కొంత సేవ చేయాలని సంకల్పించుకున్నాం.

సింగలూరు స్వచ్ఛ భారత్‌కి ప్రతీక



డాక్టర్ మహాసేత్, నేపాల్, ఖాట్మండో డెంటల్ వైద్యుడు

సింగలూరు గ్రామం నాకు చాలా నచ్చింది. చిన్న గ్రామం అయినా స్వచ్ఛ భారత్‌కు ప్రతీకగా ఉంది. గ్రామంలో వివేకానంద విగ్రహం, ప్రజలు చదువుకునేందుకు పత్రికా రీడింగ్ రూమ్, గాంధీజి ఇష్టపడే నేత పరిశ్రమ, గ్రామంలో అందరూ ఉపాధి పొందుతూ స్వయం ఉపాధి కూడా చేసుకుంటూ కాలుష్య రహిత గ్రామంగా చూసుకుంటున్నారు.

ప్రభుత్వం దత్తత తీసుకుంటున్న గ్రామాలు కూడా..



డాక్టర్ చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, ఒంగోలు

ప్రభుత్వం దత్తత తీసుకున్నవి, కొంతమంది సెలబ్రీటీస్ దత్తత తీసుకున్న గ్రామాలు కూడా ఇంతలా లేవు. నిస్వార్థంగా గ్రామస్తుల సహకారంతో బాగుచేసుకోవడం అభినందనీయం.

మానవ సేవ చేయడం గొప్ప అదృష్టం



ప్రసాద్, డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్, తిరువాళ్ళూరు, తమిళనాడు

మానవ సేవ చేయడంలో ఎంత ఆనందం ఉంటుందో మా మిత్రుడు నిరూపించాడు. ప్రతి ఒక్కరం స్పందిస్తాం

సినిమాలు

చల్లపల్లి: సాగర్: అర్జున్‌రెడ్డి, **కోమల:** వివేకం, **కమల్:** జయ జానకి నాయక, **అవనిగడ్డ: వెంకటేశ్వర:** జయ జానకి నాయక, **రామకృష్ణ:** అర్జున్‌రెడ్డి

గ్యాస్ సమాచారం

అవనిగడ్డ: విజయకృష్ణ గ్యాస్ ఏజెన్సీస్.. ఫోన్ నెం. 272381- సరఫరా తేది: ఆగస్టు 30 లోపు, **చల్లపల్లి:** శ్రీ సత్యసాయి గ్యాస్ ఏజెన్సీస్.. ఫోన్ నెం. 223911 -సరఫరా తేది: ఆగస్టు 28న

(ఆగస్టు 27వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి)

క్రీడలతో మానసికోల్లాసం

చల్లపల్లి సబ్‌జోన్ బాలబాలికల కబడ్డీ పోటీలు ప్రారంభం

అవనిగడ్డ: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని , క్రీడాకారులు తమకు అభిరుచి ఉన్న క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. చల్లపల్లి సబ్‌జోన్ పరిధిలోని పాఠశాల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఐ.పద్మారాణి అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెంపొందడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందే అవకాశముందన్నారు. పి.వి.సింధు వంటి ఆణిముత్యాలను అందించిన ఈ రాష్ట్రానికి బాల బాలికలు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భోగాది సుబ్రహ్మణ్యేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సనకా నాగమునీశ్వరరావు, ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్, కృష్ణాజిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షుడు మత్తి హరిగోపాల్, వ్యాయామోపాధ్యాయుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తొలుత కబడ్డీ కోర్టును హెచ్‌ఎం పద్మారాణి ప్రారంభించారు. బాలుర విభాగంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అవనిగడ్డ- జడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీకాకుళం విద్యార్థులు తలపడగా.. అవనిగడ్డ విజేతగా నిలిచింది. నాగాయలంక స్కాలర్-అవనిగడ్డ సెయింట్‌ఆన్స్ తలపడగా.. సెయింట్ ఆన్స్ విద్యార్థులు విజేతగా నిలిచారు. తలగడదీవి హైస్కూల్- పులిగడ్డ ఏపీఆర్ మధ్య జరిగిన పోటీల్లో ఏపీఆర్‌ఎస్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కోడూరు జడ్పీ -వక్కలగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాలల మధ్య జరిగిన పోటీలో కోడూరు జట్టు విజేతగా నిలిచింది. అలాగే బాలికల విభాగంలో కె.కొత్తపాలెం జట్టు మొవ్వ జట్టుపై.. భావదేవరపల్లి జట్టు మోపిదేవి జట్టుపై విజయం సాధించాయి. బాలికల విభాగంలో నాగాయలంక స్కాలర్ వర్సెస్ లింగారెడ్డిపాలెం పాఠశాల విద్యార్థుల మధ్య పోటీ నిర్వహించారు.



కబడ్డీ కోర్టును ప్రారంభిస్తున్న హెచ్‌ఎం పద్మారాణి



నాగాయలంక-లింగారెడ్డిపాలెం విద్యార్థినుల మధ్య జరుగుతున్న పోటీ



వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

తక్కువ ధరకే వ్యాధి నిరోధక వ్యాక్సిన్లు

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద దివిసీమ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం టైఫాయిడ్ వ్యాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ ఆర్గనైజర్ మత్తి సుదర్శన్ మాట్లాడుతూ, ప్రస్తుతం టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాల తీవ్రత అధికంగా ఉందన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆమోదం పొందిన భారతి బయోటెక్ ఆధ్వర్యంలో వ్యాక్సిన్‌ను తక్కువ ధరకే వేస్తున్నట్లు చెప్పారు. రూ.500 విలువ కలిగిన వ్యాక్సిన్‌ను రూ.100లకే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. క్లబ్ కార్యదర్శి బండే రాఘవ, సభ్యులు ఆర్.వి.కృష్ణారావు, తోట జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

అవనిగడ్డ రూరల్: బీఏంసీఈఎఫ్ (భారతీయ బ్యాక్‌వార్డ్ అండ్ మైనార్టీ కమ్యూనిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్) మహాసభలను విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకుడు దోవా గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన తన కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 20వ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 2, 3 తేదీల్లో విజయవాడ మాచినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. బొంతు నరేష్, గరికముక్కు నాగేశ్వరరావు, కుంపటి అశోక్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీకే ఓట్లు వేయండి

మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'లకనం'

నాగాయలంక: కాకినాడ కార్పొరేషన్‌కు ఈ నెల 29న జరిగే ఎన్నికలకు టీడీపీ, బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని మత్స్యకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ఆప్రాంత మత్స్యకారులను కోరారు. గత ప్రభుత్వాల కంటే టీడీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. వేట నిషేధిత కాలంలో గత ప్రభుత్వాలు 31 కిలోల బియ్యాన్ని ఇస్తే, చంద్రబాబు ప్రభుత్వం రూ.4 వేల జీవనభృతిని మత్స్యకారులకు ఇస్తుందన్నారు. వేటసమయంలో ప్రమాదవశాత్తు మత్స్యకారుడు చనిపోతే చంద్రన్న బీమా ద్వారా రూ.5 లక్షలు ఇస్తుందన్నారు.

'నంద్యాల' గెలుపోటములపై బెట్టింగ్‌ల జోరు

కోడూరు: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికల గెలుపోటములపై మండల వ్యాప్తంగా వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. వైసీపీ తరపున పోటీ చేసిన శిల్పా మోహనరెడ్డి రెండు ఓట్ల తేడాతోనైనా గెలుస్తారని కార్యకర్తలు బెట్టింగ్‌లు కాస్తున్నారు. టీడీపీ తరపున పోటీ చేసిన భూమా బ్రహ్మానందరెడ్డి 10 వేల ఓట్లతో గెలుపొందుతారని రూపాయికి రెండు రూపాయలు ఇచ్చి బెట్టింగ్‌లు కాస్తున్నారు. సుమారు లక్షలాది రూపాయలకుపైగా పందేలు కాస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

టీడీపీ యువనేత క్రాంతి ప్రవీణ్ హఠాన్మరణం

పాగోలు (చల్లపల్లి): పాగోలుకు చెందిన టీడీపీ నాయకుడు, యువనేత కంఠంనేని క్రాంతి ప్రవీణ్ (32) గుండెపోటుతో ఆదివారం హఠాన్మరణం చెందారు. కుమార్తెను అవనిగడ్డలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌కు తీసుకువెళ్లి వైద్యం చేయించి నాగాయితిప్పలోని పిన్నిగారింట వదిలి తాను తిరిగి అవనిగడ్డ హాస్పటల్‌కు వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వెళ్లాడు. ఈ సమయంలో గుండెపోటుతో ఆసుపత్రి వద్దే కన్నుమూశారు. మొవ్వ మండలం కోసూరు వీఆర్వోగా పని చేస్తున్న కంఠంనేని శేషగిరిరావుకు ప్రవీణ్ కుమారుడు. టీడీపీ నేత హఠాన్మరణంపై దిగ్భ్రాంతిని వ్యక్తంచేసిన పలువురు నేతలు, ప్రవీణ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



క్రాంతి ప్రవీణ్ (ఫైల్ ఫొటో)

భక్తిశ్రద్ధలతో బొజ్జగణపయ్యకు పూజలు



పులిగడ్డలో పూజలు నిర్వహిస్తున్న రామకృష్ణ దంపతులు

ఘంటసాల: మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఘంటసాల, కొడాలి, తెలుగురావుపాలెం, లంకపల్లి, శ్రీకాకుళం, పాపవినాశనం తదితర గ్రామాల్లో చలువ పందిళ్లలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి పుష్పాలు, పండ్లు తదితరాలతో పూజలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోదుమూడి, పులిగడ్డలలో..

అవనిగడ్డ రూరల్: మోదుమూడి ఉత్సవ పందిరిలో గ్రామానికి చెందిన బచ్చు మురళీకృష్ణ దంపతులు స్వామికి పూజలు నిర్వహించారు. పులిగడ్డ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చవితి పందిరిలో మండలి రామకృష్ణ - వీరకుమారి దంపతులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రవణ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అవనిగడ్డ ఆరో వార్డులో దామెర్ల అంజిబాబు దంపతులు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు..

నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువపందిరిలో మూడో రోజైన ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తజనులను విశేషంగా అలరించాయి. స్థానిక సంకర్షణ భజనా మండలి నిర్వహించిన శ్రీవిఘ్నేశ్వర సహస్ర నామ, శ్రీలక్ష్మీ సహస్రనామ స్తోత్ర పారాయణం, తాడేపల్లిగూడెంకు చెందిన నేమాని నాగలక్ష్మీ భాగవతారిణి పురాణ కథా కాలక్షేపం భక్తులను రంజింపజేశాయి. మర్రిపాలెంకు చెందిన అవదూత భక్తమండలి భజనలు సభికులను అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటచిదంబరరావు, వెంకట నర సింహారావు, చిట్టా సాంబశివరావు, నారాయణరావు పర్యవేక్షించారు.

నిమజ్జనాలను 5లోగా నిర్వహించాలి

మండలంలో వివిధ చలువపందిళ్లలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలను సెప్టెంబర్ 5వ తేదీలోగా నిమజ్జనం చేయాలని ఎస్సై కె.రాజారెడ్డి నిర్వాహకులకు సూచించారు. మండలంలో 39 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు గుర్తించామన్నారు. నిమజ్జనం ఊరేగింపును ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఏదైనా ఘటన జరిగితే నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు. ఊరేగింపు వివరాలను పోలీసులకు ముందస్తుగా తెలియజేయాలని రాజారెడ్డి కోరారు.



రావివారిపాలెంలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

ఆనందోత్సాహాలతో నిమజ్జనోత్సవం

మోపిదేవి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మోపిదేవి శివారు రావివారిపాలెంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల ఊరేగింపు డప్పుకళాకారులు, యువతీ,యువకుల ఆనందోత్సాహాల నడుమ పురవీధుల్లో కొనసాగింది. రావివారిపాలెం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామిని ఊరేగిస్తూ సమీపంలో మోపిదేవివార్పు వద్ద కృష్ణానదిలో నిమజ్జనం గావించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కోడూరు..

కోడూరు: స్థానిక ఐదవ వార్డులో ఉత్సవ పందిరిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఉంచి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. ఉల్లిపాలెం సమీపంలో కృష్ణానదిలో నిమజ్జనానికి తరలివెళ్ళారు. పలు గ్రామాల్లో గణనాథులకు పూజలు నిర్వహించారు.



కోడూరులో స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



అవనిగడ్డలో అంజిబాబు దంపతుల పూజలు

అన్నసమారాధన

మోపిదేవి: గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణ యాదవ యూత్ ఆధ్వర్యంలో గొల్లపాలెంలో రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కారుమూరి జగన్నాథం స్వామి విగ్రహాన్ని వితరణగా అందించారు. నాగు, యేసు, రమేష్, శివరామకృష్ణ, బసవయ్య పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకట్టుకుంటున్న మట్టి గణపతి

చల్లపల్లి: స్థానిక ప్రధాన సెంటర్లో హీరో షోరూమ్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన మూడున్నర అడుగుల మట్టి గణపతి విగ్రహం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంటోంది. మట్టి గణపతే మహా గణపతి అంటూ పర్యావరణానికి విఘాతం కలగకుండా మట్టి విగ్రహాలనే పూజించాలనే ప్రచారాల నేపథ్యంలో నిర్వాహకులు దాసరి శ్రీనివాసరావు మట్టి విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పందిట్లో గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. దాసరి శివ, భక్తులు పాల్గొన్నారు.



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఏటీఎంలో సాంకేతిక సమస్య-ఖాతాదారుల ఆందోళన

కోడూరు: స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగదు డ్రా చేసినా.. రాకపోగా డ్రా చేసినట్టు మెస్సేజ్‌లు రావటంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌కు తెలియజేయగా.. అకౌంట్‌లో నగదు ఉందని, భయాందోళన చెందవద్దని చెబుతున్నారు. కాగా, ఇదే విషయమై సమాధానం చెప్పేందుకు కొంతమంది ఖాతాదారులపై మేనేజర్ మండిపడినట్టు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంలో సాంకేతిక లోపాలను సరిచేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.





అడుగడుగునా గోతులు పడి బురదకయ్యగా మారిన డొంకరోడ్డు. రెయిలింగ్ విరిగి శిథిలావస్థకు చేరిన వంతెన

వక్కలగడ్డ-యార్లగడ్డ బీటీ రోడ్డు కలేనా?!

వక్కలగడ్డ-యార్లగడ్డ డొంకరోడ్డు అభివృద్ధి కలగానే మిగిలింది. తారురోడ్డు నిర్మాణం కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. కేసీపీ సహకారంతో రైతులే స్వచ్ఛందంగా రహదారిని కొంతమేర బాగు చేసుకుంటున్నా, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి డొంకరోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి పరచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- **అధ్వానంగా డొంక రోడ్డు**
- **ఇక్కట్లకు గురౌతున్న రైతులు, వాహనదారులు**
- **పట్టించుకోని అధికారులు, పాలకులు**
- **అభివృద్ధిపర్చాలని వినతి**

(వక్కలగడ్డ-చల్లపల్లి)

వక్కలగడ్డ నుంచి యార్లగడ్డ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్లు ఉన్న డొంకరోడ్డు రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. పొలాలకు వెళ్లాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులు తీసుకురావాలన్నా ఈ రోడ్డుమీదుగానే వెళ్లాలి. ఇదే మార్గంలో రెండు కోళ్ల ఫారాలు సైతం ఉన్నాయి. శ్మశానవాటికకు ఈ రహదారి మీదుగా వెళ్లాలి. 1930లో కాలువలను ఏర్పాటుచేయగా, నాటి నుంచి డొంకరోడ్డు ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఆనాటి నుంచి నేటి వరకూ ప్రభుత్వ నిధులతో రహదారి నిర్మాణం జరగలేదని రైతులు పేర్కొంటున్నారు. 50ఏళ్ల క్రితం పంట కాలువ, మురుగుకాల్వలపై వంతెనలు నిర్మించినప్పటికీ రహదారి నిర్మాణం చేపట్టలేదనీ, దశాబ్ధాలుగా స్వచ్ఛందంగా రాకపోకలకు వీలుగా అభివృద్ధి చేసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. కేసీపీ ఆర్థిక సహకారంతో మరమ్మతులు చేసుకుంటూ వస్తున్నామని రైతులు వివరించారు. చెరకు సీజన్‌లో పరిసర గ్రామాల నుంచి చెరకును ఈ మార్గం ద్వారా లక్ష్మీపురం తీసుకువెళుతుంటారు.

డొంకరోడ్డు వక్కలగడ్డ పరిధిలో పూర్తి అధ్వానంగా తయారైంది. యార్లగడ్డ పరిధిలో గతంలో ప్రభుత్వ నిధులతో రహదారికి రబ్బీసు తోలినప్పటికీ మధ్యలో వదిలేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. యార్లగడ్డను దత్తత తీసుకున్న ఆయుష్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు సహకారంతో డొంక రోడ్డులో గోతులు పూడ్చించారు. పూర్తిస్థాయిలో బీటీ రహదారి నిర్మాణం చేపడితేనే తమ ఇబ్బందులు తొలగుతాయని రైతులు పేర్కొంటున్నారు.

డొంకరోడ్డు మీదుగా చల్లపల్లి, ఘంటసాల మండలాలకు కలిపేలా లింకురోడ్డు నిర్మాణం జరిగితే రెండు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నిమ్మగడ్డ-యార్లగడ్డ-వక్కలగడ్డ రహదారి ఐదున్నర కిలోమీటర్ల మేర నిర్మించి, దేవరకోట మార్గాన్ని అభివృద్ధిపరిస్తే అటు వ్యవసాయదారులకు, ఇటు ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బీటీ రోడ్డు కోసం ఎదురుచూస్తున్నాం
దేవభక్తుని ప్రసాద్, రైతు



డొంకరోడ్డును బీటీ రహదారిగా అభివృద్ధి చేస్తారని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం. వర్షాకాలంలో పొలం వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. నడిచేందుకు, ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లేందుకు వీలులేని స్థితిలో ఉంది. చెరకు రవాణాకు, కరకట్టపైకి రాకపోకలకు ఈ రోడ్డు నిర్మాణం ఎంతో అవసరం. ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణానికి కృషిచేయాలి. గ్రామీణ ప్రాంతాలను కలిపేలా లింకురోడ్ల నిర్మాణానికి చొరవచూపాలి.

ప్రతిపాదనలు పంపాం
రామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ

వక్కలగడ్డ నుంచి నిమ్మగడ్డ వరకు రూ.5.6 కోట్లతో బీటీ రహదారి నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే రహదారిని అభివృద్ధి చేస్తాం.



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

ఘంటసాల: చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక జలధీశ్వరస్వామి ఆలయ సమీపంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, చిన్న కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఏజేఎఫ్‌సీఎం హెచ్.అమర రంగేశ్వరరావు మాట్లాడుతూ, లోక్‌అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమతీర్పు అన్నారు. కేసుల్లో రాజీమార్గం అవలంబించటం రాజమార్గమవుతుందన్నారు. జూనియర్ సివిల్ జడ్జి బి.లక్ష్మీనారాయణ, సర్పంచ్ కొతవరపు నాగరత్నం, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కొతవరపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన న్యాయమూర్తులు

న్యాయమూర్తులు వై.శ్రీనివాసరావు, బి.లక్ష్మీనారాయణ, హెచ్.అమరరంగేశ్వరరావు స్థానిక బౌద్ధమహాస్థూపాన్ని పరిశీలించారు. మ్యూజియమ్‌లోని బౌద్ధ శిల్పసంపదను తిలకించారు. బౌద్ధశిల్ప సంపద గురించి జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ న్యాయమూర్తులకు వివరించారు. అనంతరం బౌద్ధస్థూపం ప్రాంగణంలో అశోక మొక్కలు నాటారు.

ఐవీఎం సేవలు అభినందనీయం

- **65 మంది వృద్ధులకు పింఛన్లు అందజేత**

పురిటిగడ్డ(చల్లపల్లి): ఇండియా విలేజ్ మినిస్ట్రీస్(ఐవీఎం) సేవలు అభినందనీయమని మచిలీపట్నం ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ విభాగం డీఎస్పీ కె.హరి రాజేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం



పింఛన్లు అందజేస్తున్న డీఎస్పీ హరిరాజేంద్రబాబు

పురిటిగడ్డలో ఐవీఎం కార్యాలయంలో పురిటిగడ్డ, పరిసర గ్రామాలకు చెందిన వృద్ధులు, వితంతువులకు ఐవీఎం ఆధ్వర్యంలో నెలవారీ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 65 మంది వృద్ధులకు నెలకు రూ.400 చొప్పున పింఛన్లను డీఎస్పీ దంపతుల చేతులమీదుగా అందజేశారు. ఐవీఎం వ్యవస్థాపకులు వేములపల్లి సురేష్, సంస్థ ప్రతినిధులు రోజా, విజయ, పరుచూరి జస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో భక్తుల సందడి

కోడూరు: హంసల దీవి సమీపంలోని సాగర సంగమం, సముద్రతీరం వద్ద ఆదివారం యాత్రికులు, భక్తుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వివిధ వాహనాల్లో యాత్రికులు తరలివచ్చి పుణ్యస్నానా లుఆచరించారు. డాల్ఫిన్ భవనం వద్ద సేదతీరి తిరుగు ప్రయాణంలో హంసలదీవిలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న యాత్రికులు

వృద్ధులకు పండ్లు పంపిణీ

చల్లపల్లి: లయన్స్‌క్లబ్-వీఆర్‌కె నగర్.. చల్లపల్లి ఆధ్వర్యంలో స్థానిక ఆదరణ అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఎస్సై దాడి చంద్రశేఖర్ చేతులమీదుగా వృద్ధులకు పండ్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎ.గురవయ్య, కార్యదర్శి బుల్లా కిషోర్, కోశాధికారి ఎం.గోపాలకృష్ణయ్య, నర్రా సాయిబాబు, టి.సాంబశివరావు, కస్తూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ షో

చల్లపల్లి: వినాయక ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీలక్ష్మీగణపతి దేవాలయం వద్ద శనివారం రాత్రి ప్రదర్శించిన మ్యాజిక్ షో ఆహుతులను అలరించింది. ఏలూరుకు చెందిన కళాకారుడు హుస్సేన్ తన బృందంతో అబ్బురపరిచేలా ప్రదర్శన చేసి ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నాడు.

సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం



మాట్లాడుతున్న రీజనల్ చైర్మన్ మండవ ప్రసాద్

అవనిగడ్డ: నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా

వైభవంగా ఎన్ఎంయూ ఆవిర్భావ దినోత్సవం

స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని రీజినల్ కార్యదర్శి రావి సుబ్బారావుతోపాటు పలువురు కార్మిక నాయకులు ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నేతలు మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీని లాభాల బాటలో పయనింపజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సక్రమంగా డ్యూటీలు నిర్వహిస్తూ అటు యూనియన్‌కు, ఇటు సంస్థకు పేరు తెచ్చిపెట్టాలని కార్మికులకు సూచించారు. రీజినల్ అధ్యక్షుడు బి.కొండలు, రీజినల్ చైర్మన్ మండవ ప్రసాద్, రీజినల్ కార్యదర్శి రావి సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.బి.ప్రసాద్, నాయకులు ఆర్.వి.ఎల్.నారాయణ, ఆళ్ల కుమార్, కె.ఎస్.ఎన్.మూర్తి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



లాభం.. లూటీ!

వాహన డీలర్ల భోజ్యానికి.. వినియోగదారులకు లభించే జీఎస్టీ రిలీఫ్ సొమ్ము కాస్తా స్వాహా అవుతోంది. నగరంలోని కొందరు వాహన డీలర్లు ఈ నయా దందాకు తెరలేపారు! జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులు అందుకోగలుగుతున్నారా లేదా అన్నది పక్కాగా తెలుసుకునే ఎన్‌ఫోర్స్‌మెంట్ లేకపోవటంతో.. ఈ దందా యథేచ్ఛగా సాగిపోతోంది.

- జీఎస్టీ ప్రయోజనం.. వాహన డీలర్ల భోజ్యం
- వినియోగదారులకు ప్రయోజనం నాస్తి
- కొందరు వాహన డీలర్ల నయా దందా
- ఫిర్యాదులతో తలలు పట్టుకుంటున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జీఎస్టీ ప్రయోజనాలపై చాలామందికి అవగాహన లేక మోసపోతున్నారు. జీఎస్టీపై కొద్దో, గొప్పో అవగాహన ఉన్న వారు వాహనాలు పాత ధరకే విక్రయిస్తున్నారని, వాహనాల ధరలు తగ్గటం లేదని రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులతో రవాణా శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జీఎస్టీకి సంబంధించి ఎన్‌ఫోర్స్ చేసే అధికారం తమది కాదని రవాణా శాఖ భావిస్తోంది. జీఎస్టీని అమలు చేసే బాధ్యత ఆ శాఖకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. అసలు జీఎస్టీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగమే లేకపోవటం వల్ల సమస్య ఏర్పడుతోంది. వాహనదారుల జేబులు లూటీ అవుతుంటే వాహన డీలర్లు మాత్రం కాసులు పిండుకుంటున్నారు. కొంతమంది వాహన డీలర్ల దందాపై ప్రత్యేక కథనం..

వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ప్రయోజనాలను కొందరు వాహన డీలర్లు.. వాహనదారులకు అందకుండా చేస్తున్నారు. ఈ ప్రయోజనాలను కూడా కొందరు వాహన డీలర్లే వ్యక్తిగతంగా లబ్ధి పొందుతుండటంతో వినియోగదారులకు అంతగా ప్రయోజనం కలగటం లేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత.. లబ్ధిదారులకు ఎంత ప్రయోజనం కలుగుతుందన్న దానిపై ఆయా సంస్థలు తప్పనిసరిగా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసి సూచించాల్సి ఉంటుంది. నగరంలోని వాహన డీలర్లు ఎక్కడా బోర్డులను ప్రదర్శిస్తున్న దాఖలాలు లేవు. వాహనదారులకు కంటితుడుపు ప్రయోజనం కల్పించి చేతులు దులుపుకొంటున్నాయి. ఇప్పటివరకు వాహన డీలర్ ఒక వాహనాన్ని విక్రయించే ముందు దాని ధరతో పాటు వివిధ రకాల పన్నుల న్నింటినీ కలిపి చూస్తే.. ఎంత అవుతుందో.. జీఎస్టీ అమల్లోకి వచ్చాక దానిని పరిగణనలోకి తీసుకుని ఆ ప్రయోజనాన్ని వాహన కొనుగోలుదారునికి అందించాల్సి ఉంది. కానీ, ఆచరణలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది.

వాహన డీలర్ల దందా..

రూ.లక్ష విలువ ద్విచక్రవాహనం కొనాలంటే.. ఈడీ 12.50 శాతం చొప్పున రూ.12,500, ఎన్‌సీసీడీ 1 శాతం రూ.1000, సెస్ 0.12 శాతం రూ.125 కలిపితే మొత్తం రూ.1,13,625 అవుతుంది. దీనికి సీఎస్‌టీ 2 శాతం రూ.2,272 కలిపితే మొత్తంగా రూ.1,15,897 అవుతుంది. దీనికి 14.50 శాతం వ్యాట్ రూ.16,805 కలిపితే ఓవరాల్‌గా ఆ వాహనం ధర రూ.1,32,702 అవుతుంది. ఇందులో మతలబు ఉంది. వ్యాట్‌తో కలిపి 32.70 శాతం పన్నులు చూస్తున్నాం.

ఇక జీఎస్టీ విషయానికి వద్దాం. ఆ వాహనంపై 28 శాతం జీఎస్టీ విధింపు వల్ల ఆ వాహనం ఖరీదు రూ.1,28,000 అవుతుంది. అంటే జీఎస్టీ వల్ల వాహనదారుడికి వచ్చే ప్రయోజనం రూ.4,700 అన్నమాట. అయితే ఈ ప్రయోజనం అందుతుందా అంటే లేదనే చెప్పాల్సి వస్తోంది. వాస్తవంగా పైన చెప్పుకున్న మతలబు విషయానికి వద్దాం. పైన వసూలు చేస్తున్న పన్ను లెక్కల్లో కొంత గందరగోళం కూడా ఉంది. లక్ష రూపాయల వాహనానికి ఈడీ 12.50 శాతం, ఎన్‌సీసీడీ 1 శాతం, సెస్ 0.125, సీఎస్‌టీ కలిపితే 15.625 శాతం అవుతుంది. దీనికి 14.50 శాతం కలిపితే 30.125 శాతం అవుతుంది. అంటే 2.31 శాతం మేర ఇన్నాళ్లూ కొందరు వాహన డీలర్లు తమ దగ్గరకు వచ్చిన వాహన కొనుగోలుదార్లకు కన్నం పెట్టారు.

జీఎస్టీ రావటం వల్ల వాహనదారుడికి రూ.4,700 మేర ప్రయోజనం కలుగుతుంటే ఆ మొత్తంలో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారు. వినియోగదారులకు కనీస అవగాహన లేకపోవటం వల్ల ఒక వాహనానికి రూ.3వేలు పైన వాహన డీలరే లబ్ధిపొందుతున్నాడన్నమాట. కొంతమంది డీలర్లు నిజాయితీగా వ్యాపారం చే సేవారు కూడా ఉన్నారు. కానీ సింహభాగం డీలర్లు ఇదే పని చేస్తుండటం గమనార్హం. దీనిపై బాధ్యత ఎవరిది? వాహన కొనుగోలుదారుల నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు? అన్నది అంతుచిక్కటం లేదు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏది?

జీఎస్టీ అమలుచేసే ముందు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టాన్ని తీసుకువస్తున్నట్టు ప్రకటించింది. ఒక రకంగా భయటపెట్టినంత పని చేసింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇదే కేంద్ర ప్రభుత్వం మాట మార్చింది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక.. ఎంత మేర ప్రయోజనం కలుగుతుందో తెలియటానికి నాలుగైదు నెలల సమయం పడుతుందని, వినియోగదారునికి ఖచ్చితంగా జీఎస్టీ వల్ల ఎంత ప్రయోజనం కలుగుతుందో ఆ మేరకు ఆ విషయం తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయమని సూచించింది. ఇప్పటి వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఊసే లేదు. జీఎస్టీ ప్రయోజనం ప్రజలకు అందకపోతే ఎన్‌ఫోర్స్‌మెంట్ చూసుకుంటుంది. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ లేకపోవటం వల్ల వినియోగదారులు మోసపోతే ఎవరికి మొరపెట్టుకోవాలన్నదే ప్రశ్నగా ఉంది.

దుర్గగుడి అభివృద్ధి పనులకు..

వాస్తు బ్రేక్..!

- ఆలయానికి దేవస్థానం మాజీ ఆగమ పండితుడు రాక
- ట్రస్ట్‌బోర్డు సభ్యులకు పలు సూచనలు చేసిన వెంకటేశ్వర సోమయాజులు
- 30న జరగాల్సిన ట్రస్ట్‌బోర్డు సమావేశం వాయిదా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

దుర్గగుడిలో వాస్తువిరుద్ధంగా జరుగుతున్న అన్ని పనులకు ట్రస్ట్‌బోర్డు రెడ్‌సిగ్నల్ చూపడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. వాస్తు సమ్మతంగా ప్రస్తుత నిర్మాణాలను వేరొక చోట నిర్మించేందుకు అభ్యంతరం లేదని ట్రస్ట్‌బోర్డు స్పష్టం చేసింది. భక్తులకు అవసరమయ్యే పనులు తప్ప, మిగతా వేటిని కూడా అనవసర వ్యయం చేసి నిర్మించరాదని కూడా బోర్డు తేల్చి చెప్పింది. రెండునెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన ట్రస్ట్‌బోర్డు సభ్యులు మొదటి సమావేశంలోనే మోతమోగించారు. ముఖ్యంగా కొన్ని నిర్మాణాలను నిలుపుదల చేయాలని, దేవస్థానంలో అమ్మవారి దర్శనం టికెట్‌ను రూ.300 నుంచి రూ.150కు తగ్గించాలని కోరారు. దీనిపై ఈవో స్పందిస్తూ తీర్మానాల రూపంలో వస్తే ఈ విషయాలన్నిటినీ పరిశీలన చేస్తామని చెప్పారు. ఆ తరువాత కథ మలుపులు తిరిగింది. విషయం మంత్రి ఉమామహేశ్వరరావు ద్వారా సీఎం దృష్టికి వెళ్లింది. రాజధాని ప్రాంతంలో అతిపెద్ద ఆలయం దుర్గగుడిలో వాస్తు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే పాలకులకూ ఇబ్బంది కలుగుతున్నట్టు సంకేతం పంపారు. దీంతో అమరావతి నిర్మాణానికి వాస్తు చూసిన పండితుడు రాముయ్యను ఇటీవల దుర్గగుడికి తీసుకువచ్చి అన్ని ప్రదేశాలను చూపించగా ఆయన కొన్ని సూచనలు చేశారు. వాటిపై నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈలోపల కమిటీ సభ్యులు ముఖ్య కార్యదర్శిని కలిసారు. ఆయన సలహా మేరకు నలుగురితో కమిటీని నియమించాలని నిర్ణయించారు. కమిటీని కూడా రేపో మాపో ప్రకటించను న్నారు. ఈలోగా ఈనెల 30న ట్రస్ట్‌బోర్డు సమావేశం జరగనున్నట్టు దేవస్థానం అధికారులు ప్రకటించడంతో ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంసిద్ధులయ్యారు. తాము ఏవైతే సంస్కరణలు, మార్పులు, చేర్పులు చేపట్టాలనుకున్నారో వాటన్నిటినీ కూడా తీర్మానాల రూపంలో పెట్టి తీన్మార్ మోగించాలనుకున్నారు. అయితే 30వ తేదీ సమావేశాన్ని వాయిదా వేసి, వచ్చే నెల రెండునగాని, మూడునగాని సమావేశం ఉంటుందని అనధికారికంగా ప్రకటించారు. ఈలోపల ఆదివారం దేవస్థానానికి ఆగమ సలహాదారుగా సుదీర్ఘకాలం పనిచేసిన 93 సంవత్సరాల వయోవృద్ధుడు వెంకటేశ్వరసోమయాజులును ట్రస్ట్‌బోర్డు ఆలయానికి వీల్‌చైర్‌లో తీసుకువచ్చారు. ఆయనకు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు పద్మశేఖర్, బడేటి ధర్మారావు, శంకరంబాబు, సూర్యలత తదితరులు యాజులతో సమావేశమయ్యారు. ఆయన ఆగమ శాస్త్రాన్ని అనుసరించి కొన్ని సూచనలు చేశారు. దీంతో మొత్తంగా ఇప్పుడు ఆలయంలో వాస్తుకు విరుద్ధంగా జరుగుతున్న అన్ని పనులను నిలిపివేయాలని ట్రస్ట్‌బోర్డు సభ్యులు నిర్ణయించారు.



దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆగమపండితుడు వెంకటేశ్వరసోమయాజులతో సమావేశమైన ట్రస్ట్‌బోర్డు సభ్యులు

వాటర్ ఫాల్స్ నిర్మాణం, చీరల కౌంటర్ వద్ద పెద్ద ద్వారాన్ని తెరవడం, ఈశాన్య నిర్మాణంలో వంటశాల పనులను నిలిపివేయడం, ఆశీర్వచన కార్యక్రమాన్ని యధావిధిగా ఆలయం పక్కన ప్రాకార మండపంలోకి మార్చడం, సీవీ రెడ్డి ఛారిటీస్‌లో షెడ్లకు బదులు పర్మినెంట్ గదులతో విశ్రాంతి భవనాన్ని నిర్మించడం, గొల్లపూడిలో కూడా గోశాలకు బదులు విశ్రాంతి భవనం, ఉండవల్లి స్థలంలో కూడా విశ్రాంతి భవన నిర్మాణం వంటివి చేపట్టడం వంటివాటిపై తీర్మానాలను ప్రవేశపెట్టడానికి ట్రస్ట్‌బోర్డు సభ్యులు నిర్ణయించారు. ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గూడపాటి పద్మశేఖర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సూచనలతో ఆలయంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. దేవస్థానంలో వాస్తు విరుద్ధంగా సాగించే నిర్మాణాలను, అనవసర నిర్మాణాలను చేపట్టకుండా నిరోధిస్తామని, అవసరమనుకుంటే వాటిని వేరొకచోట, భక్తులకు అనుగుణంగా వాస్తు సమ్మతంగా నిర్మించడానికి అంగీకరిస్తామని తెలిపారు. ఇప్పటికైతే అన్ని పనులు నిలిపివేసినట్టు బడేటి ధర్మారావు తెలిపారు.

దేశాభివృద్ధిలో ఏయూ పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు

- ఆంధ్ర విశ్వవిద్యాలయ అభివృద్ధికి అ'పూర్వ' సహకారం అందిద్దాం
- ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు
- ఏఎన్‌యూలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం అమరావతి చాప్టర్ సమావేశం

ఏఎన్‌యూ: దేశాభివృద్ధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల పాత్ర కీలకమైనదని ఆంధ్రా వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైక్‌మెన్ ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్ర వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్ర వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను ఏకం చేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి, వికాసానికి దోహదపడేలా సంఘం కృషి చేస్తుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి 92 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. దేశానికి ఇద్దరు ఉప రాష్ట్రపతులను అందించిన ఘనత వర్సిటీకి దక్కిందన్నారు. జీఎంఆర్, మహమ్మద్ జానీ వంటి ప్రముఖులను సమాజానికి అందించిందని తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది డిసెంబర్ 10న ఆచార్య సీఆర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సమావేశం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాన్నామన్నారు.

కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో అమరావతి చాప్టర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ చారిత్రాత్మకంగా ఖ్యాతి గడించిన ఏయూను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాజకీయ నాయకులను, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలను తయారు చేసిన విద్యాసంస్థను మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనకు అన్నం పెట్టిన తల్లి లాంటి విశ్వవిద్యాలయం వృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభయే ప్రామాణికంగా తీసుకుని ప్రోత్సహిస్తూ, సంఘంలో మంచి గుర్తింపు వచ్చేలా వర్సిటీ సహకారం అందించినట్లు తెలిపారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ జువాలజీ డిగ్రీ అర్హత గల వారికి ఫార్మసీలో పీహెచ్‌డీ చేయడానికి ఎక్కడ అనుమతి ఇవ్వలేదని, ఏయూ మాత్రం అవకాశం కల్పించిందన్నారు. పారిశ్రామికవేత్త బొమ్మిడాల కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏయూ పూర్వ విద్యార్థుల సంఘంలో సభ్యునిగా ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇతర సేవలు అందించాలని సూచించారు. విదేశాల్లో కూడా నూతన చాప్టర్‌లు ప్రారంభించాలన్నారు. సెప్టెంబర్ 16న ఢిల్లీలో నూతనంగా చాప్టర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నేపాల్, ఆఫ్రికా దేశాలలో చాప్టర్ ప్రారంభించాలన్నారు. ఆంధ్ర వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల పూర్వ విద్యార్థుల స్పందన బాగుందన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేద్దామన్నారు. ఏయూ పూర్వ విద్యార్థి, ఏఎన్‌యూ విశ్రాంత ఉద్యోగి నూతక్కి వెంకటప్పయ్య, ఏయూ పూర్వ విద్యార్థి సంఘానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. సంఘం జాయింట్ సెక్రటరీ రవిశంకర్ జీఎస్టీపై రచించిన గ్రంథాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఆచార్య జంపాల రాజేష్, డాక్టర్ ఏవీ రవికుమార్, డాక్టర్ ఎల్.పాపారావు, డాక్టర్ ఎం.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




జీఎస్టీపై రవిశంకర్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ, ఏఎన్‌యూ వీసీలు తదితరులు, నూతన చాప్టర్‌లో సంతకం చేస్తున్న దృశ్యం

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

- నాలుగు పళ్ల విభాగంలో విజేత కృష్ణా జిల్లా
- 6 పళ్ల విభాగంలో గుంటూరు జిల్లా

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని కాకాని వెంకట్రామయ్య క్రీడా ప్రాంగణంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఒంగోలు జాతి రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండు, నాలుగు, ఆరు పళ్ల విభాగాల్లో పోటీలు ముగియగా ఆదివారం వ్యవసాయ విభాగంలో పోటీలు జరుగుతున్నాయి. రెండు పళ్ల విభాగంలో విజేతలకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు బహుమతులను అందజేశారు. మొదటి మూడు బహుమతులను గుంటూరుకు చెందిన అనిల్‌చౌదరి అందజేయగా, మిగిలిన బహుమతుల పారితోషకాన్ని జి.వెంకటేశ్వరరావు, మన్నవ మల్లేశ్వరరావు, కాకాని సురేష్‌బాబు అందజేశారు.

నాలుగు పళ్ల విభాగంలో..

నాలుగు పళ్ల విభాగంలో కృష్ణా జిల్లా ఘంటసాల మండలం, దాలిపర్రు గ్రామానికి చెందిన బొందలపాటి కోటేశ్వరరావు ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లా యాపిలి మండలం, సింగనూరుపల్లె గ్రామానికి చెందిన సదా ఆంజనేయులు గౌడ్‌కు చెందిన ఎడ్ల జత ద్వితీయ, గుంటూరు జిల్లా అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన వట్టికుంట భార్గవచౌదరికి చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. కడప జిల్లా రాజుపాలెం మండలం, వాసుదేవాపురం గ్రామానికి చెందిన మారెళ్ల మోక్షారెడ్డికి చెందిన ఎడ్లు నాలుగో, కృష్ణాజిల్లా గన్నవరం మండలం మెట్లపల్లికి చెందిన చిలకపాటి రాజీవ్ ఎడ్ల జత ఐదోస్థానంలో నిలిచాయి.


పోటీపడుతున్న ఎడ్లజత

ఆరుపళ్ల విభాగంలో..

ఆరుపళ్ల విభాగంలో మంగళగిరి మండలం, నవలూరు గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్ల జత ప్రథమ, తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రబాబుకి చెందిన ఎడ్లు ద్వితీయ, కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్, వేమూరి మౌర్యచంద్రలకు చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా పర్చూరు మండలం, గొల్లపూడికి చెందిన చితలపూడి రామారావు ఎడ్లజత నాలుగో, నరసరావుపేట మండలం, పెట్లూరివారిపాలేనికి చెందిన మోజాల వెంకట దుర్గారావు ఎడ్ల జత ఐదో స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ డక్కుమళ్ల భాగ్యారావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శివరామప్రసాద్, నిర్వాహకులు పమిడి అంజియ్య, కాకాని సురేష్ పాల్గొన్నారు.

పీజీ ఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం


విద్యార్థులకు అడ్మిషన్ పత్రం అందిస్తున్న వీసీలు

ఏఎన్‌యూ : రాష్ట్రవ్యాప్తంగా ఎంఫార్మసీ, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి వర్సిటీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కేంద్రంలో ఆదివారం పీజీ ఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. ఆంధ్రా, ఏఎన్‌యూ వర్సిటీల వీసీలు ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు పీజీ ఈసెట్ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని కో ఆర్డినేటర్ డాక్టర్ రామచంద్రన్, డాక్టర్ రవికుమార్ తెలిపారు. సోమవారం జీపాట్, గేట్‌లో అర్హత సాధించిన వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ వుంటుందన్నారు.


కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

కార్మికులకు పీఎఫ్ చెల్లించకపోతే చర్యలు

పీఎఫ్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్

మంగళగిరి టౌన్: యాజమాన్యం ప్రతి కార్మికునికి పీఎఫ్ చెల్లించాల్సిందేనని, అలా చెల్లించని పక్షంలో సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ పీఎఫ్ కమిషనరు వైడీ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళగిరి చిల్లపల్లి కల్యాణ మండపంలో ఆదివారం ఎన్నారై ఆసుపత్రి, హాయ్‌ల్యాండ్, వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు పీఎఫ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎన్నారై నర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు ఏటుకూరి గంగాధర్‌రావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎఫ్ చెల్లించిన సర్వీసు ఆరేళ్లు దాటితే హౌసింగ్, హెల్త్ లోన్లు తీసుకోవచ్చని చెప్పారు. పది సంవత్సరాలు అలా చెల్లిస్తే 58 సంవత్సరాలు దాటిన తరువాత నెలకు రూ.వెయ్యి పెన్షన్ వస్తుందన్నారు. విధుల్లో వున్నప్పుడు ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.ఆరున్నర లక్షల ఇన్స్యూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఈపీఎఫ్ యూనియన్ రాష్ట్ర నేత కె.నాగరాజు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఈపీఎఫ్‌పై అవగాహన కలిగి వుండాలన్నారు. పీఎఫ్ చెల్లించిన తరువాత యూనిక్ నెంబరు వస్తుందని, కాంట్రాక్టరు మారినప్పుడల్లా పీఎఫ్ తీసుకోకూడదని, ఆ పీఎఫ్‌ను వేరే అకౌంటులోకి జమ చేసుకోవచ్చని, పీఎఫ్ తీసుకుంటే సర్వీసు తగ్గిపోతుందని తెలియజేశారు. పీఎంఏవై పథకంలో ప్రతి కార్మికునికి ఇల్లు కట్టించుకోవడానికి రూ.రెండున్నర లక్షల సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు తమ సమస్యలను వివరించారు. పీఎఫ్ చెల్లిస్తున్నప్పటికీ తమకు ఫోనులో సందేశాలు రావడంలేదని, యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. యూనియన్ నేత ఏటుకూరి గంగాధర్‌రావు మాట్లాడుతూ యాజమాన్యాలే కార్మికులకు పీఎఫ్‌పై అవగాహన కల్పించే క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎన్నారై నర్సింగ్ యూనియన్ కార్యదర్శి మాధవి, నాయకులు వరలక్ష్మీ, మల్లేశ్వరీ, విజయకుమారి, శాంతకుమారి, రాణి, ఎంపీటీసీ కే శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ జీ శ్రీనివాసరావు, వి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న పీఎఫ్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గుంటూరు(పాతగుంటూరు): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) ఆధ్వర్యంలో ఐబీపీఎస్, ఆర్‌ఆర్‌బీ ఉద్యోగాల కోసం రాష్ట్రస్థాయిలో ప్రీమియర్ అకడమీ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సీజీజీబీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, జీఎం ఫణికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ నేటి నుంచి(సోమవారం) స్థానిక బ్రాడీపేట 6వ లైనులోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌బీ సిడబ్ల్యుఈ-3కి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్ పెట్టాల్సిందే!

- సెప్టెంబర్ 1 నుంచి అమలుకు సన్నద్ధమయ్యాం
- ప్రభుత్వ ఉద్యోగులు హెల్మెట్ వాడకపోతే చర్యలు
- కళాశాల విద్యార్థుల బాధ్యత తీసుకోవాలి
- ప్రభుత్వ శాఖాధిపతులు, ప్రిన్సిపాల్స్‌కు లేఖలు
- మీరా ప్రసాద్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే మానవ నష్టం తీర్చలేనిది. హెల్మెట్ నిండు జీవితాలను నిలబెడుతుంది. సెప్టెంబర్ 1 నుంచి జిల్లా, నగర వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిందే! ఎవరికీ మినహాయింపులు లేవు. ప్రభుత్వ ఉద్యోగులు హెల్మెట్ వాడి



ఆదర్శంగా నిలవకపోతే చర్యలు తప్పవు! కళాశాల విద్యార్థులు విధిగా హెల్మెట్‌ను వాడాలి. లైసెన్స్‌లు లేకపోతే జైలుకు పోవడమేనన్న భయాన్ని ఇప్పటికే రవాణా శాఖ కలుగ చేసింది. హెల్మెట్ వినియోగానికి సంబంధించి ఎంతోకాలంగా రవాణా శాఖ అవగాహనా కార్యక్రమాలు చేపడుతోంది. గత రెండుసార్లు అమలు చేయటానికి దగ్గరగా వచ్చి కొంత సమయం ఇవ్వాల్సి వచ్చింది. ఈసారి నూటికి నూరు శాతం అమలు చేయటం జరుగుతోంది అని జిల్లా ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) మీరా ప్రసాద్ అన్నారు. ఈ నేపథ్యంలో, రవాణా శాఖ సన్నద్ధతపై 'ఆంధ్రజ్యోతి' ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడారు.

● రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకే...

ప్రజల ప్రాణాలు కాపాడాలన్న లక్ష్యంతోనే హెల్మెట్ అమలుకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ మహత్కార్యానికి పోలీసు శాఖ భాగస్వామ్యం కూడా తోడౌతోంది. కిందటి సారి రెండు పర్యాయాలు హెల్మెట్‌ను అమలు చేయాలని చూశాం. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు వచ్చాయి. ఈసారి పోలీసుశాఖ భాగస్వామ్యం ఉంది. కలెక్టర్ లక్ష్మీకాంతం ద్వారా పోలీసు శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడటం జరిగింది. నేను వ్యక్తిగతంగా సీపీ గౌతమ్ సవాంగ్, జాయింట్ సీపీ, డీసీపీ క్రాంతి రాణాలతో కలిసి అనేకమార్లు ఈ విషయమై చర్చించటం జరిగింది. పోలీసు శాఖ నుంచి మంచి స్పందన ఉంది.

● విస్తృత అవగాహన కల్పిస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా గణనీయంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రోడ్డు సేఫ్టీ మీటింగ్‌లలో తీసుకునే నిర్ణయాలను అమలు చేస్తున్నాం. యువతను లక్ష్యంగా చేసుకుని కళాశాలల్లో విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

● నిబంధనలు పాటించకపోతే జైలుకే

నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే రవాణా శాఖ ఏం చేస్తుందోనన్న భయాన్ని ఇప్పటికే వాహనదారులలో కలిగించాం. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే జైలుకు పంపిస్తున్న ఘనత రవాణా శాఖదే. జిల్లాలో ఇప్పటి వరకు 270 మంది ఈ విధంగా జైలు శిక్షలు అనుభవించటం జరిగింది. జైలుశిక్షల భయంతో తమ పిల్లలకు వాహనాన్ని ఇచ్చే విషయంలో కూడా తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. ఓవర్‌లోడ్ విషయంలో వాహనదారులు కూడా భయపడుతున్నారు. హెల్మెట్ తప్పనిసరి కార్యక్రమాన్ని కూడా మేం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాం. ఆచరణలో ఆ దిశగా కృషి చేస్తాం.

● కలెక్టర్ ప్రత్యేక కృషి చేస్తున్నారు

రోడ్డు ప్రమాదాలను తగ్గించటానికి జిల్లా కలెక్టర్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. రోడ్డు సేఫ్టీ మీటింగ్‌లను నిర్వహిస్తూ అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగి కూడా విధిగా హెల్మెట్ ధరించేలా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ లేఖలు రాశారు. అలాగే విద్యాసంస్థల యాజమాన్యాలకు కూడా కలెక్టర్ లేఖలు రాశారు. ఎవరు హెల్మెట్ ధరించకపోయినా సంబంధిత ఉన్నతాధికారులు, యాజమాన్యాలు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని



మరీ హెచ్చరించారు.

● రోడ్డు సేఫ్టీ ఆడిటింగ్ చేపడుతున్నాం

జిల్లాలో జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించటానికి రోడ్డు సేఫ్టీ ఆడిటింగ్ చేపడుతున్నాం. ఇందులో భాగంగా ఆరు టీములు క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నాయి. మొత్తం 36 మంది సిబ్బంది రోడ్ల మీదనే ఉండి ప్రమాదాలకు గురౌతున్న పరిస్థితులపై అధ్యయనం చేస్తున్నారు.

● పెరగనున్న టీమ్‌లు

హెల్మెట్‌ను తప్పనిసరి చేయటానికి కిందటిసారి 10 టీమ్‌లను ఏర్పాటు చేయటం జరిగింది. ఈసారి ఇవి పెరిగే అవకాశం ఉంది. రవాణా, పోలీసు అధికారులతో కూడిన టీమ్‌లు ఈ సారి ఏర్పడతాయి. వేర్వేరుగా పనిచేస్తే అంతగా సత్ఫలితాలు ఇవ్వవు. కలిసి చేయటం వల్ల నూటికి నూరు శాతం అమలు చేయవచ్చు.

ఇది నిజమేనా... వివరాలు సేకరించండి!

- 'క్రీడా దందా'పై కలెక్టర్ స్పందన
- గుర్తింపులేని అసోసియేషన్ల వివరాలు సేకరించాలని ఆదేశాలు
- సేకరణలో జిల్లా క్రీడాపాధికార సంస్థ అధికారులు
- స్పందించిన పలువురు క్రీడాకారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: గుర్తింపులేని క్రీడా అసోసియేషన్ల నిర్వాకంపై కలెక్టర్ లక్ష్మీకాంతం సీరియస్ అయ్యారు. 'క్రీడా దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. ఏయే అసోసియేషన్లు ఈ తరహాలో క్రీడాకారుల నుంచి డబ్బుల వసూలకు పాల్పడుతున్నాయో వెంటనే వివరాలు సేకరించాలని, ఆరోపణలు నిజమని తేలితే వెంటనే తదుపరి చర్యలకు ఉపక్రమించాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీ చేశారు. అయితే పలువురు క్రీడాకారుల వాదనలు అందుకు భిన్నంగా ఉన్నాయి. తాము పాల్గొన్నవి గుర్తింపులేని సంఘాలని తెలియజేయాల్సిన శాప్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు తమకు కనీస సమాచారం కూడా అందించలేదని, తమకు ఎలా అవగాహన ఉంటుందని ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల మచిలీపట్నంలో నిర్వహించిన పోటీల్లో



పాల్గొన్న తమకు ఆ అసోసియేషన్‌కు గుర్తింపు లేదన్న విషయం అధికారులు తెలియజేయలేదని పలువురు క్రీడాకారులు స్పష్టం చేస్తున్నారు. బందరులో జరిగిన టోర్నీకి మంత్రి కొల్లు రవీంద్ర కూడా హాజరవడంతో గుర్తింపు ఉంటుందని ఊహించామని క్రీడాకారులు వాపోతున్నారు.

● పదిహేను రోజుల క్రితమే తెలిస్తే..

'ఈ వార్తను పదిహేను రోజుల కిందే మీరు రాస్తే బాగుండేది కదా! మేం అనవసరంగా ఇంత దూరం వచ్చే వాళ్లం కాదు కదా!' అంటూ కొందరు క్రీడాకారులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకొచ్చారు. కనీసం శాప్ అధికారులైనా.. ఆ అసోసియేషన్‌కు గుర్తింపు లేదని చెప్తే మా పరిస్థితి మరోలా ఉండేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.

● అధికారులే చర్యలు తీసుకోవాలి

గుర్తింపులేని అసోసి యేషన్లలో పాల్గొనే క్రీడాకారులకు అధికారులే కనీస సమాచారం అందించి అప్రమత్తం చేయాల్సి ఉంది. లేకుంటే విషయం తెలియని క్రీడాకారులు సమయాన్ని వృథా చేసుకుంటారు. కష్టపడి సాధించిన సర్టిఫికెట్లు కూడా నిరుపయోగం అవుతాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.



ఉపరాష్ట్రపతి వెంకయ్యకు వీడ్కోలు పలుకుతున్న మంత్రులు, గవర్నర్ నరసింహన్

వెంకయ్యనాయుడుకు ఘన వీడ్కోలు

ఎయిర్‌పోర్టు(గన్నవరం): కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని చెన్నై వెళుతున్న ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘనంగా వీడ్కోలు పలికారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించి రోడ్డు మార్గాన ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, నక్కా ఆనంద్‌బాబు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దినేష్ కుమార్, డీజీపీ నండూరి సాంబశివరావు, ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు, ప్రోటోకాల్ కార్యదర్శి ఎన్. శ్రీకాంత్, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, సీపీ గౌతం సవాంగ్, డీసీపీ క్రాంతి రాణా తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2న కొబ్బరి దినోత్సవం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 2 వతేదీన విజయవాడలోని శుభం కల్యాణ మండపంలో జాతీయ స్థాయి సమ్మేళనం నిర్వహించనున్నట్టు కొచ్చిలోని కోకోనట్‌బోర్డు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆ రోజు కేంద్ర వ్యవసాయమంత్రి రాధామోహన్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభిస్తారని, వివిధ రాష్ట్రాల నుంచి 400 మంది కొబ్బరి రైతులు వారి అనుభవాలను కూడా పంచుకుంటారని తెలిపారు. కొబ్బరితో ఆరోగ్య జీవనం అనే అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు. కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేయడం కోసం శాస్త్రవేత్తలు సూచనలు చేస్తారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడుతో పాటు, వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. కొబ్బరిపండించే రాష్ట్రాలలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. ఛత్తీస్‌ఘడ్‌లో హెక్టారుకు 16,808 కాయలు దిగుబడి అవుతుండగా, ఏపీలో హెక్టార్‌కు 13,579 కాయలు దిగుబడి అవుతున్నాయని చెప్పారు. కొబ్బరి ఉత్పత్తులను మార్కెట్ చేయడం కోసం ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ అర్గనైజేషన్లు ఏర్పాటు, ఇంకా ఇతరత్రా రుణ సదుపాయాలు, ప్రోత్సాహకాలు వంటి అనేక అంశాలు సదస్సులో చర్చకు వస్తాయని చెప్పారు.

ఆంధ్రా హాస్పటల్స్‌లో పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్‌లు



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రామారావు

విజయవాడ, ఆంధ్రజ్యోతి : హీలింగ్ లిటిల్ హార్ట్, యూకే చారిటీ వారి సౌజన్యంతో ఏడుగురితో కూడిన ఇంగ్లాండ్ పిల్లల గుండె జబ్బుల వైద్య బృందం, ఆంధా హాస్పటల్స్, హార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్స్, ఆంధ్ర హాస్పటల్స్‌లో సెప్టెంబర్ 9వ తేదీ వరకు పిల్లల గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ పి.వి.రామారావు తెలిపారు. డీవీ మానర్ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ వైద్య బృందంలో పిల్లల గుండె జబ్బుల వైద్య నిపుణులు, డాక్టర్ బ్రాంకో మిమిక్ - కార్డియాలజిస్ట్, డాక్టర్ జూలియా, డాక్టర్ జోహ్ తదితరులు 25 మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. పిల్లలకు కాంప్లికేషన్స్, గుండెలో రంధ్రాలు, ఊపిరితిత్తులలోని రక్తనాళాలలో వత్తిడి ఎక్కువగా ఉండటం, మూడు లేక నాలుగు రకాల గుండె సమస్యలు ఉన్న క్లిష్టమైన జబ్బులతో ఉన్న పిల్లలకు శస్త్ర చికిత్సలు చేయటం జరుగుతుందన్నారు. 2015 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఆరు సార్లు ఆంధ్ర హాస్పటల్స్‌లో 164 మంది పిల్లలకు సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక నుంచి ప్రతి రెండు నెలలకొకసారి చిన్న పిల్లల గుండెలకు శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రా హాస్పటల్స్ రాష్ట్ర ఇండియన్ అకాడమి ఆఫ్ పెడియాట్రిక్స్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వైద్యులు ప్రసంగించారు. సదస్సులో రాష్ట్రంలోని పిల్లల డాక్టర్లు, ఇంటెన్సివ్ కేర్ స్పెషలిస్టు, కార్డియాలజిస్టులు పోస్టుగ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు. ఇంగ్లాండ్ వైద్యులు డాక్టర్ విక్రమ్ కుడుములు, డాక్టర్ జోహ్, డాక్టర్ జూలియా, డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు, డాక్టర్ దుర్గారావు, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నంధ్యాలలో టీడీపీ గెలుపు ఖాయం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్

విజయవాడ: నంధ్యాల ఉప ఎన్నికలో అధిక మెజార్టీతో టీడీపీ గెలుపు ఖాయమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని కోరుకుంటున్న నంధ్యాల ప్రజలు టీడీపీ ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆహర్నిసలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనను కోరుకుంటున్న నంధ్యాల ప్రజలు టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించబోతున్నారని తెలిపారు. అవినీతి కేసుల్లో ఏ1 నిందితుడిగా ఉన్న జగన్ తన రాజకీయ లబ్ధి కోసం ఎందరో అమాయకులను ఆయన కేసులకు బలి చేశారని ఆరోపించారు. నంధ్యాలలో విదేవ్షాలను రెచ్చగొట్టే విధంగా వైసీపీ నేతలు కుట్ర చేసున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు.

31 లోగా పాన్‌కార్డ్‌కు ఆధార్ లింక్

ఆదాయ పన్నుశాఖ గడువు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఆదాయ పన్ను చెల్లింపు దారులతో పాటు, ఇటీవల కొత్తగా రిటర్న్‌లు దాఖలు చేసినవారు ఈనెల 31 లోగా తమ పాన్ నెంబర్లకు ఆధార్ లింక్ చేయాలని ఆదాయపు పన్ను శాఖ సూచించింది, సుప్రీం కోర్టు ఇటీవల ఆధార్‌పై ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆధార్ లింక్ చేయకుండా వుండటానికి వీలులేదని ఆదాయ పన్నుశాఖ ప్రకటిం చింది. ఆదాయ పన్ను రిటర్న్‌లు దాఖలు చేసిన వారిలో ఇప్పటివరకు సగం మంది మాత్రమే ఆధార్‌తో లింక్ అయినట్లు గుర్తించింది. అయితే మరొకొంత మంది ఆధార్‌లింక్ అయినప్పటికీ రిటర్న్‌లు దాఖలు చేసి రిజిస్టర్ చేయించుకోలేదని కూడా వెల్లడించింది. అయితే దాఖలు అయిన రిటర్న్‌లలో ఇప్పనటివరకు నాలుగో వంతు రిటర్న్‌లను ఇ- వెరిఫికేషన్‌ను నిర్వహించినట్లు తెలు స్తోంది. ఉదాహరణకు సుమారు లక్ష మంది రిటర్న్‌లు దాఖలు చేస్తే వారిలో 25 వేల రిటర్న్‌లను మాత్రమే ఇ వెరిఫికేషన్ అయ్యాయి. ఇ వెరిఫికేషన్‌లో ఏదైనా తేడాలు వచ్చినట్లయితే వాటిని సరి చేసుకోవాలని లేక పోతే నోటీసు వచ్చే అవకాశం ఉంది.

29బి చెల్లదు..

ఆదాయ పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లు దాఖలు చేయడానికి గాను ఫారం 29బి ద్వారా ఒక డిక్లరేషన్ ఇచ్చేవారని, ఇప్పుడు అది చెల్లదని కొత్త ఫార్మెట్‌లో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుం దని, దీనిని త్వరలోనే ప్రకటిస్తామని ప్రత్యక్ష పన్నుల బోర్డు ప్రకటించింది. ఇ ఫైలింగ్ చేసే వారికి త్వరలో కొత్త ఫార్మెట్ అందుబాటులోకి వస్తుందని, అప్పటి దాకా వేచి ఉండాలని సూచించింది.

ఈపోస్ ద్వారానే ఎరువుల పంపిణీ

వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్

పెనమలూరు : కేంద్రం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి తీసుకురానున్న ఈపోస్ ద్వారానే రైతులకు ఎరువులు డీలర్లు పంపిణీ చేయాల ని అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. పోరంకి సాయి కల్యాణ మండపంలో జిల్లా ఆదివారం ఎరువులు, పురుగుల మందుల రిటైల్ డీలర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో వలే ఎరువుల దుకాణం వద్దకొచ్చి రైతు ఎన్ని బస్తాలు కావాలంటే అన్ని అందించే విధానానికి స్వస్తి పలకాలని, రసీదులు ఇక ఉండదన్నారు. భూమి విస్తీర్ణత, సాయిల్ టెస్ట్ ద్వారా ఆ రైతుకు చెందిన భూమికి ఎంత మేరకు ఎరువులు అవసరమవుతాయో ఈపోస్ విధానంలో తెలిసిపోతుందన్నారు. రైతు ఆధార్, వేలిముద్ర వల్ల అతనికి చెందిన వ్యవసాయ పద్ధతి, విధివిధానం మొత్తం తెలిసిపోతుందన్నారు. అదే విధంగా జీఎస్టీ తప్పక అమలు చేయవల్సి ఉంటుందన్నారు. సంఘ అధ్యక్షుడు విజయ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సునీత కుమార్, అగ్రికల్చర్ అధికారి శ్రీనివాసరావు, ఆడిటర్ లక్ష్మణరావు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, సభ్యులు పాల్గొన్నారు.

రికవరీకి చర్యలు!

● సీఎంఆర్ రాకపోవడంతో మిల్లుల నిర్వాహకులకు నోటీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సీఎంఆర్ రాకపోవడంతో మిల్లర్ల నుంచి రికవరీకి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కచ్చితమైన విధానం లేకపోవడం వల్ల పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్‌కు బియ్యం మిల్లుల నుంచి రావాల్సిన కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పెండింగ్‌లో ఉంటోంది. 2014-2015 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ఐదు రైసు మిల్లర్ల నుంచి సుమారు రెండు వేల క్వింటాళ్లకు పైగా సీఎంఆర్ రావాల్సి ఉండడంతో ఆ మిల్లులకు రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద క్రిమినల్ నోటీసులు పంపినట్లు జిల్లా సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మేనేజర్ వరకుమార్ ఆంధ్రజ్యోతికి చెప్పారు. త్వరలో వారి నుంచి సీఎంఆర్‌ను రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు.. నాగాయలంక మండలంలో ఒకటి, గుడ్లవల్లేరులో ఒకటి, గుడివాడలో రెండు మిల్లులు, హనుమాన్ జంక్షన్‌లో ఒక మిల్లులకు క్రిమినల్ నోటీసులు అందాయి.

రికవరీ సాధ్యమేనా..

మిల్లర్ల నుంచి రావాల్సిన రికవరీపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మిల్లర్ల నుంచి సీఎంఆర్‌ను రాబట్టాలంటే సరుకును, సరుకు లేదంటే మిల్లును వేలం వేయాలి మిల్లులు ఇతరత్రా రుణాలు చెల్లించాల్సి వున్నా, తనఖా వంటివి ఉన్నా రికవరీ కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బ్యాంక్ గ్యారంటీతో మెరుగు పడిన పరిస్థితి

సీఎంఆర్‌ను రాబట్టడంలో ఎదురవుతున్న పరిస్థితులు, అలాగే మిల్లర్లకు ధాన్యం తోలిన తరువాత వారి చుట్టూ తిరగడం, ఇంకా ఇతర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మిల్లర్లను బ్యాంక్ గ్యారంటీ పరిధిలోకి తీసుకువచ్చారు. గతంలో సీఎంఆర్ ఇవ్వడానికి మిల్లర్లకు గడువు పెట్టినా, ఆ గడువును పొడిగించుకోవడం, అధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉండేది, వీటి పరిష్కారానికి రెండేళ్ల నుంచి మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ తీసుకుంటున్నారు. ఎంత ధాన్యాన్ని తీసుకుంటున్నారో, అంత ధాన్యానికి సంబంధించిన విలువకు బ్యాంక్ గ్యారంటీ చూపించిన తరువాత దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆన్‌లైన్‌లో సంబందిత మిల్లుకు ధాన్యాన్ని తోలుతారు. అది కూడా గ్యారంటీ ఇచ్చిన మొత్తాని కంటే ఎక్కువ మొత్తం ధాన్యం తోలడానికి వీలులేదు. ఒక వేళ అదనంగా తోలినట్లయితే సంబందిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇప్పుడు రబీలో 3.50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని మిల్లర్లకు తోలారు. దీనికి గాను ఇంకా పది శాతం మేరకు సుమారు 30,189 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ రావాల్సి ఉంది. ఇటీవల సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ సర్వర్‌లో సమస్యలు తలెత్తడంలో వసూలు చేయడానికి వీల్లేని పరిస్థితి ఉందని, త్వరలో వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఇప్పుడు బ్యాంక్ గ్యారంటీ ఉంది గనుక మిల్లర్లు సీఎంఆర్‌ను ఎగ్గొట్టడానికి వీలులేదని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు మిల్లర్లకు సీఎంఆర్ ఇవ్వటానికి గడువు ఉందని , ఆ తరువాత చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

సీఎంఆర్ అంటే

మిల్లులకు ఇచ్చిన ధాన్యంలో క్వింటాకు 68 కిలోల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ కార్పొ రేషన్‌కు అప్పగించాలి. మిల్లుల నుంచి తీసుకునే బియ్యాన్ని కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అంటారు. దీనికి గాను మిల్లర్లకు కూడా ప్రతిఫలం ఉంటుంది. ఇతర త్రా నిబంధనలు కూడా అమలు చేస్తూ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌కు మిల్లర్లు బియ్యం అప్ప గించాలి. ఇప్పుడు దాదాపు 2000 క్వింటాళ్ల బియ్యం (సీఎంర్) రావాల్సి ఉంది.

రైతులకు మేలు కలగాలి

బలరాం జయంతి సభలో జలగం కుమార స్వామి



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి

పటమట : వ్యవసాయ అనుబంధ పంటలు విస్తరించి రైతులకు మేలు కలగాలని రాష్ట్ర కిసాన్ సంఘ్ అధ్యక్షుడు జలగం కుమార స్వామి అన్నారు. బలరాం (నాగలి) జయంతి సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్, గో ఆధారిత వ్యవసాయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పటమట ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బలరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్గానిక్ మందులు వాడకం నివారించి పాత పద్ధతులను అవలంబించి వ్యవసాయ ఉత్పత్తులను పండించాలన్నారు. వ్యవసాయ ఉత్తత్తులకు పేరొందిన ఏపీలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను పండించే రైతులకు గిట్టుబాటు ధర నిర్ణయించుకునే అవకాశాన్ని కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి శ్రీకృష్ణ, గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆశా కిరణ్, నారాయణ ప్రసాద్, ఫన్‌టైమ్స్ కార్యదర్శి వేమూరి సాంబశివరావు, ఉమామహేశ్వరరాజు, గాంధీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనసుకు, భాషకు అవినాభావ సంబంధం : పాల్



మాట్లాడుతున్న సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పాల్

పటమట : మనసుకు భాషకు అవినాభావ సంబంధం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ సైకాలజిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యు.పాల్ అన్నారు. త్రివేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సైకాలజిస్టులు, ఉపాధ్యాయులకు నాచురల్ ప్రొనౌన్‌షేషన్ లాంగ్వేజ్ (ఎన్ఎల్‌పీ, సహజ భాష)పై ఒకరోజు శిక్షణ జరిగింది. పాల్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు, మహిళలు, యువత ఏ రంగంలో పనిచేస్తున్నా ఆ రంగంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఎన్ఎల్పీ అద్భుతమైన ప్రక్రియయన్నారు. రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు వి. రమేష్, ప్రత్యూష సుబ్బారావు ఎం.ఎం. ముఖర్జీ, ఎమ్. రాణి, సోమయాజులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే ముఖ్యం



పెసర నిల్వలను పరిశీలిస్తున్న మంత్రి దేవినేని ఉమా

మైలవరం టౌన్: రైతు ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మైలవరం మార్కెట్ యార్డులో 400 క్వింటాళ్ళ పెసర నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివారం వ్యాపారులతో సమావేశం నిర్వహించి దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. .మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు క్వింటా పెసలుకు రూ.5200లు చెల్లించాల్సిందేనన్నారు. ఇందుకోసం ఈనెల 29న సబ్ కలెక్టర్ కార్యాలయంలో జేడీ అగ్రికల్చర్, జేడీ మార్కెటింగ్, డీఎం మార్క్‌ఫెడ్‌లతో సమావేశం నిర్వహిస్తామని తెలియజేశారు. మార్కెట్ యార్డుల్లో కూడా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిందేనని తెలిపారు. మిల్లర్లు, కమిషనర్‌ల బాగోతాలు బయటపెట్టేందుకు విజిలెన్స్ దాడులకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో ధరకు రిటైల్డ్ ధరకు సుమారు రూ.2వేలు తేడా రావడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. తప్పకుండా మద్దతు ధరకు రైతుల వద్ద కొనుగోలు చేయాల్సిందేనని చెప్పారు. ఏఎంసీ ఛైర్మన్ ధనేకుల సాంబశివరావు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వెంకటేశ్వరరావు, తాతా పోతురాజు, రాయల లీలాప్రసాద్, మల్లెల రాధాకృష్ణ, దూరు బాలకృష్ణ, పరికెల నాగేశ్వరరావు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

నేత్రదానానికి యువత ముందడుగు



నేత్ర దాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డాక్టర్ సమరం

బెంజ్‌సర్కిల్: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పటమట తొమ్మిదో డివిజన్‌కు చెందిన యువజన చైతన్య వేదిక నాయకులు మరణాంతరం తమ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. వీరు యువజన వేదిక అధ్యక్షుడు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో 10 మందికి పైగా ఆదివారం బెంజ్‌సర్కిల్‌లోని స్వేచ్ఛా గోరా ఐ బ్యాంకుకు వెళ్ళి నేత్రాలు ఇవ్వడానికి అంగీకరిస్తూ పత్రాలను అందజేశారు. నజీర్ మాట్లాడుతూ నేత్రదానం ద్వారా మరొకరికి జీవితం ఇచ్చినట్టేనన్నారు. అనంతరం వీరికి డాక్టర్ సమరం నేత్రదాన సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో యువజన చైతన్య వేదిక నాయకులు మీసాల నాగభూషణం, మీసాల జనార్దన్, యు. సత్యనారాయణ, బంగారు రాజీవ్ గాంధీ, జి. మాణిక్యాలరావు, మల్లికార్జున్, పోలి రాజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు 30న

పటమట : జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30న ఉద్యోగాల ఎంపిక నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పి. రమేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిజేశారు. ఏజీఎస్ లో కస్టమర్ సపోర్టు ఎగ్జిక్యూటివ్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 28 (సోమవారం) నుంచి 30వ తేదీలోపు తమ పేర్లను నేషనల్ కెరీర్ సర్వీస్ పోస్టల్ www.ncs.gov.in ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ నుంచి తమ మొబైల్‌కు వచ్చిన ఎన్‌సీఎస్ ఐడీ ద్వారా 30వ తేదీ ఉదయం 10:30 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.



సెల్‌ఫోన్‌తో... హాని వైపు

అభివృద్ధి పథమా... అధోగతి మార్గమా

యువతను బానిసలు చేస్తున్న ఫోన్ మేనియా

- సోషల్ నెట్‌వర్క్‌లకు ఎడిక్ట్ అవుతున్న ఈ-తరం
- వీడియో గేమ్స్ ప్రభావంతో చితికిపోతున్న బాల్యం
- అరగంట చేతిలో ఫోన్ లేకుంటే పిచ్చెక్కుతున్న వైనం
- అతి వినియోగంతో దారితప్పుతున్న జీవితాలు
- ప్రయోజనం కంటే దుష్పరిణామాలే అధికం
- పక్కనే ఉన్నా మనసు విప్పి మాట్లాడుకోలేని వారెందరో
- పిల్లల తీరుపై తల్లిదండ్రుల ప్రభావం కూడా

- సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగంతో కోరి కష్టాలు
- మారాం చేస్తున్నారని...స్టేటస్ సింబల్‌గా పిల్లలకీ ఫోన్లు
- నష్టాన్ని మాత్రం గుర్తించని వారే అందరూ
- ఇలాగే కొనసాగితే పెనుముప్పే అంటున్న నిపుణులు



చేతిలో సెల్ ఫోన్... చెవిలో ఇయర్ ఫోన్స్... మాట్లాడుతూ ప్రయాణం... వీక్షిస్తూ విహారం...ఇంటా, బయటా ఎప్పుడూ చూసినా ఇదే వ్యాపకం. అధునాతక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక సెల్ ఫోన్ ఇప్పుడు సామాన్యుని సాధనమైంది. సమాచార మాధ్యమంగా ఉపయోగపడాల్సిన ఫోన్ నాలుగు అడుగులు ముందుకు వెళ్లి మరెన్నో కొత్తపుంతలు సొంతం చేసుకుంది. స్మార్ట్‌ఫోన్‌లు వచ్చాక అరచేతిలోకి ప్రపంచం వచ్చి చేరింది. అంతాబాగున్నా ఎదురవుతున్న దుష్పరిణామాలపైనే నిపుణుల ఆందోళన. ఛాటింగ్...షూటింగ్...లిజనింగ్...వ్యూయింగ్... ఎప్పుడు చూసినా ఇదే వ్యాపకం...మంచి కోసం కంటే చెడువైపు యువత అడుగులు వేస్తుండడమే భయపెడుతోంది. సాంకేతిక అద్భుతం సాధించామని సంతోషించాలా...జీవితాలు దారి తప్పుతున్నాయని భయపడాలా అన్న డైలమా ఇప్పుడు అన్నివర్గాలను వెంటాడుతోంది. ఈ ప్రయాణం 'ఎటు వైపు సాగుతుంది' అన్నదే అందరినీ భయపెడుతున్న అంశం.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

బస్సులో వెళ్తున్నంత సేపు సెల్ ఫోన్ చాటింగ్... రోడ్డుపై నడుస్తున్నా ఫోన్‌తోనే వ్యాపకం...చివరికి తరగతి గదిలోనూ ఇదే పని...వీడియోస్, మేసేజెస్ చూడడం. అవకాశం దొరికితే ఫోన్‌లోని కెమెరాకు పని చెప్పడం...కొందరు ఆకతాయిలు అశ్లీల దృశ్యాల చిత్రీకరణకు తెగబడడం...పోర్న్ సైట్లు వీక్షిస్తున్న ప్రబుద్ధులూ కొందరు...వీడియో గేమ్స్‌తోనే జీవితం అనుకునేది మరికొందరు...ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తెచ్చిపెట్టుకున్న 'సమస్యల కుంపటి' ఇది. నాలుగేళ్ల పసిపిల్లల నుంచి పాతికేళ్ల యువతరాన్ని బానిసలను చేస్తున్న సెల్ ఫోన్ ప్రభావం ఇది. సమాచార సాంకేతిక విప్లవంతో మనిషిని ఉన్నత పథంవైపు వేగంగా అడుగులు వేయించాల్సిన సాంకేతిక పరిజ్ఞానం జీవితాలను దారితప్పిస్తున్న సాధనంగా మారిపోవడం విషాదం. అరచేతిలో ప్రపంచం ఇమిడిపోయే సౌలభ్యం వల్ల ప్రపంచాన్ని చదివి ప్రగతి బాట పట్టాల్సిన యువతరం పెడదోవ పట్టి బంగారు భవిష్యత్తును తమకు తానుగానే నాశనం చేసుకుంటున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ మాయాజాలం, దాని ప్రభావం, పరిణామాలపై నిపుణులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

ఇవీ లెక్కలు

- దేశంలో ఫేస్‌బుక్ ఉపయోగిస్తున్న వారి సంఖ్య 24 కోట్లు దాటింది. ఈ విషయంలో అమెరికాను అధిగమించేశాం. వీరిలో ఏడు కోట్ల మంది భారతీయులు నిత్యం ఫేస్ బుక్ చూస్తున్నారు. ఎక్కువ మంది రోజుకు కనీసం మూడుసార్లు ఈ సైట్‌ను వీక్షిస్తున్నట్టు సర్వేల్లో తేలింది.
- ట్విట్టర్‌ను 2.3 కోట్ల మంది, యూట్యూబ్‌ను ఆరు కోట్ల మంది వీక్షిస్తున్నారు.
- కళాశాలకు వెళ్లే యువతే కాదు. పదేళ్ల పిల్లల నుంచి 90 ఏళ్ల వృద్ధుల వరకు అంతా సోషల్ మీడియా మేనియాలో చిక్కుకుంటున్నారు.
- సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడపడం వల్ల డిప్రెషన్‌కు గురయ్యే ప్రమాదం వుందని యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది.
- తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ వినియోగించే సమయంలో పిల్లలు దగ్గర వుంచుకోవడం వల్ల స్మార్ట్ ఫోన్ ఆపరేట్ చేసే విధానం, ఫోన్‌లోని విషయాలను, సమాచారాన్ని ఏకాగ్రతతో చూడడం, దానిని గుర్తు పెట్టుకోవడం, ఎక్కువగా ఆకర్షితులు కావడం జరుగుతుంది.
- జర్నల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధ్యయనంలో దాదాపు 170 మంది తల్లి దండ్రులను విడివిడిగా కూర్చోబెట్టి పరిశోధన చేయగా, 48 శాతం మంది మూడు అంతకంటే ఎక్కువ సార్లు సెల్ వల్ల డిస్టబ్ అవుతు న్నట్టు, 17 శాతం మంది ఎటువంటి ఇబ్బంది లేదని వెల్లడించారు.

ఇలా చేస్తే మేలు

- పరిమితంగా వాడితే సెల్‌ఫోన్ వినియోగం ఎంతో ఉపయుక్తం
- పిల్లలతో వీడియో గేమ్స్ ఆడించాల్సి వస్తే నిర్థిష్ట సమయం పెట్టాలి
- ఉద్రేకం, కక్షపూరిత, క్రూరత్వాన్ని ప్రేరేపించే ఆటల జోలికి వెళ్లకుండా కట్టడి చేయాలి
- రాత్రి సమయాల్లో ఆటలు ఆడకుండా నిరోధించాలి
- యువత చేసే చాటింగ్‌లపై ఓ కన్నేసి ఉంచడం అవసరం
- ఎప్పటికప్పుడు వారి మిత్రులతో మాట్లాడి పిల్లల ప్రవర్తన గురించి తెలుసుకోవాలి.
- అప్పడప్పుడు పిల్లల సెల్ ఫోన్‌లను పరిశీలిస్తుండాలి
- వారి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే స్నేహితుడిలా అడిగి తెలుసుకోవడం
- ఒంటరిగా సెల్ ఫోన్‌తో ఎక్కువ సమయం గడుపుతుంటే ఆరాతీయాలి.
- ప్రత్యేకంగా ఆడపిల్లల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తప్పనిసరి



దారితప్పిన లక్ష్యం

'సాంకేతిక విప్లవం మంచి, చెడు రెండింటికీ దోహదపడుతుంది. దాని ఫలితం వినియోగించే వారిపైనే ఆధారపడి ఉంటుంది'...రెండో ప్రపంచ యుద్ధకాలంలో అమెరికా జపాన్‌పై అణుబాంబు దాడి అనంతరం ఆ బాంబుల రూపశిల్పి అయిన శాస్త్రవేత్త ఇలా ఆవేదన వ్యక్తం చేశారట. సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించే తత్వాన్నిబట్టి దాని ప్రభావం సమాజంపై కనిపిస్తుంది. మంచి, చెడు అన్నవి వినియోగించే వ్యక్తిపైనే ఆధారపడి ఉంటాయి. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, స్నాప్‌చాట్, టెలీగ్రామ్... ఇలా మాధ్యమం ఏదైనా వాటి అంతిమ లక్ష్యం అత్యంత వేగంగా సమాచార మార్పిడి మాత్రమే. దూరంగా ఉన్న వారిని చేరువ చేయాలి. దూరమైపోతున్న వారికి దగ్గరకావాలి. కానీ ఇవే మాధ్యమాలు రాత్రిపూట దగ్గరగా ఉండాల్సిన దంపతుల్ని దూరం చేస్తున్నాయి. ఎవరి ప్రపంచంలో వారు బతికేలా చేస్తున్నాయి. పుస్తకాలతో కుస్తీపట్టాల్సిన విద్యార్థులను పట్టాపగ్గాలేని వారిగా తయారు చేస్తున్నాయి. ముచ్చటించుకునే సమయం హరించుకుపోతోంది. ఒత్తిడి పెంచి అనారోగ్యాన్ని తెచ్చి పెడుతోంది.

ఎందుకు బానిసలవుతున్నారు..



సామాజిక మాధ్యమం ఏదైనా యువత బానిసలవడానికి ప్రధాన కారణం లైక్‌లు, కామెంట్లని వేరుగా చెప్పక్కర్లేదు. మనం చేసే ప్రతిపనిని, ఉండే ప్రతి చోటుని పక్కవారితో క్షణాల్లో షేర్ చేసుకోవడం, వాటికి వచ్చే లైకులు, కామెంట్లు చూసి మురిసిపోవడం ఒక వ్యసనంగా మారింది. విద్యార్థుల్లో ఈ ధోరణి మరీ శృతిమించిపోయింది. చివరకు పడక గదిలో భార్యతో గడిపే శృంగార సన్నివేశాలను సహితం గ్రూపులో పెట్టి ఆనందించే ప్రబుద్ధులు తయారయ్యారు. కొన్ని విషయాల్లో వాదనలకు దిగుతూ వైషమ్యాలు పెంచుకుంటున్నారు. లైక్‌లు వస్తాయని పెట్టిన ఫొటోకు ఆశించిన మేరకు కామెంట్లు రాకపోవడం వల్ల ఆందోళనకు, ఒత్తిడికి, నిరాశకు గురవుతున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుండడం గమనార్హం. సున్నిత మనస్కులైన యువత మరింత కుంగిపోతున్నది. తెలియకుండానే ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. ఈ లక్షణాలన్నీ పూర్తి స్థాయిలో అనుభవిస్తున్న విద్యార్థిని ఇంటర్‌నెట్‌కు దూరంగా కొన్ని గంటలు, రోజులు, నెలలు వుంచాల్సి వస్తే పిచ్చోల్లుగా మారిపోతున్నారు. ఈ శతాబ్దపు అద్భుతమైన ఆవిష్కరణల్లో ఒకటైన సోషల్ మీడియా కోట్లాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా నాలుగేళ్ల చిన్నారుల నుంచి పాతికేళ్ల యువకుడి వరకు శ్వాస...ధ్యాసగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు.

విలువలు కరిగిపోతున్నాయి

కొత్త టెక్నాలజీ, ఫీచర్ల వల్ల తల్లిదండ్రులు వారి పిల్లలతో గడిపే సమయం తగ్గుతోందని పలు సర్వేల్లో తేలింది. మనుషుల్లో విలువలు కరిగిపోవడానికి సెల్ ఫోన్ కారణమని చెబుతున్నారు. రోడ్డుపై ప్రమాదం జరిగితే బాధితులకు సాయం అందించి వారిని కాపాడే ప్రయత్నం కంటే ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకే ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారని పలు సందర్భాల్లో వెల్లడైంది. విలువలు కరిగిపోతున్నాయనేందుకు ఇంతకంటే ఉదాహరణ ఏముంది. స్కూల్ నుంచి వచ్చిన పిల్లాడి హోమ్ వర్కు కంటే, వాడి ఇబ్బందుల కంటే తమ సెల్‌లోవచ్చే మెసేజ్‌లపైనే ఎక్కువ మంది తల్లిదండ్రులు దృష్టి పెడుతున్నారు. గంటకోసారైనా సెల్ లాక్ ఓపెన్ చేసి ఏం మెసేజ్‌లు వచ్చాయో చూడందే రోజు గడవని విద్యార్థులున్నారు. వైఫేతో జీవితాన్ని అనుసంధానించుకున్న వారికీ లోటులేదు. దంపతులు మాట్లాడుకోవాలంటే చాటింగ్ పూర్తవ్వాలి. గతంలో క్షణం తీరిక లేని భర్త ఇప్పుడు అర్ధరాత్రి వరకు సోషల్ మీడియాతోనే కాలక్షేపం చేస్తాడు. అదే సమయంలో భార్యతో మనసువిప్పి మాట్లాడే తీరుబాటు మాత్రం ఉండదు.




అనర్థాలకు లెక్కే లేదు

సెల్‌ఫోన్‌లో గంటల కొద్దీ మాట్లాడే వారిని అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మొబైల్ పదేళ్లు వాడితే యుక్తవయస్కుల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని స్వీడన్ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రేడియేషన్ వల్ల మెదడులో కణాలపై తీవ్ర ప్రభావం పడి కణితులు ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఫోన్‌కు కవర్ లేకుండా జేబులో పెట్టుకోవడం వల్ల రేడియేషన్ వల్ల గుండెపై ప్రభావం పడుతుందంటున్నారు. పునరుత్పత్తి సమస్యలు, స్పెర్మ్ కౌంట్ తగ్గిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయన్న ప్రచారం ఉంది. కానీ ఇవన్నీ ఇంకా పరిశోధన దశలోనే వున్నాయని, శాస్త్రీయంగా పూర్తి స్థాయిలో నిరూపితం కాలేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మణికట్టు నుంచి మెదడుకు వెళ్లే నాళం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. ఫోన్‌ను మితిమీరి వాడితే రక్తపోటు పెరుగుతుందని, నిద్రలేమి సమస్య వస్తుందని, చెవి పోటు పెరుగుతుందని నిపుణులంటున్నారు. తలనొప్పి, కళ్లు తిరగడం, అసౌకర్యం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతారు. కంటి వైద్య నిపుణులు అపోహని కొట్టిపారేస్తున్నా ఎక్కువ సేపు సెల్ చూడడం వల్ల కంటి చూపు మందగిస్తుందన్న ప్రచారం కూడా ఉంది. సెల్‌ఫోన్ రేడియేషన్ నాన్ అనైజింగ్ (అనైజింగ్, నాన్ అనైజింగ్ రెండు రకాలు) కావున రేడియేషన్ ప్రభావం ఉండదని సెల్ కంపెనీలు చెబుతున్నా దీర్ఘకాలం ఎక్కువ సమయం వాడితే ప్రభావం కచ్చితంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



కొత్త పరిచయాలతో ఇబ్బందులు



ఫేస్ బుక్... ముఖపరిచయం లేని వారిని కలిపే సాధనం. కానీ కాంప్లిమెంట్‌లు... కృతజ్ఞతలు... ఆహ్వానాలు...ఇంకా ఎన్నో. ఒకరంటే ఒకరికి తెలియక పోయినా కొన్నాళ్ల చాటింగ్ తర్వాత మూడో కంటికి తెలియకుండా కలుసుకోవడం, మాయమాటలు నమ్మి సర్వం సమర్పించుకోవడం, ఆ తర్వాత మోసపోయామని తెలిసి లబోదిబో మనడం... ఆ తర్వాత ఫిర్యాదులు, కేసులు షరామామూలే. ఎక్కడ మొదలై ఎక్కడ అంతమవుతుందో తెలియని ఈ పరిచయాల వల్ల విద్యార్థులు చాలా విలువైన కెరీర్‌ను నష్టపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ ఏక్టివిటీలపై దృష్టి పెడుతుంటే మరికొందరు కనీసం పట్టించుకోవడం లేదు. మరికొందరికి అంత పరిజ్ఞానం ఉండడం లేదు. తల్లిదండ్రులు కని పెడుతున్నారని పిల్లలు పసిగడితే వివరాలు తెలియకుండా వారు ఇంకా జాగ్రత్త పడుతున్నారు. చాటింగ్‌లు, హిస్టరీలు ఎప్పటికప్పుడు డిలీట్ చేస్తూ అప్రతమ్తంగా వుంటున్నారు. ఆన్‌లైన్ పరిచయాల వల్ల మోసపోతున్న వారిలో ఆడపిల్లలే అధికంగా వుంటున్నారు.

దూరం తరిగింది...పెరిగింది



సెల్‌ఫోన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక అరచేతిలోకి ప్రపంచం వచ్చి దూరం తగ్గింది. కానీ మనుషుల బాంధవ్యాల మధ్య దూరం మాత్రం పెరిగింది. వీడియో కాలింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చాక అమెరికాలో ఉన్న కొడుకుతో మాట్లాడి దగ్గరనే ఉన్న అనుభూతి పొందుతున్నారు తల్లిదండ్రులు. అత్యవసర పత్రాలు, ఇతర ఫైళ్లు ఒక చోటు నుంచి మరో చోటుకు పంపేందుకు గతంలో నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వచ్చేది. అత్యవసరమైతే కొన్ని సందర్భాల్లో దాదాపుగా అసాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు ఇంట్లో వున్న సెల్ ఫోన్‌లో ఫొటో తీసి అవసరమైన పత్రాలు క్షణాల్లో కావలసిన చోటుకు పంపుకునే వీలు కలిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని ప్రయోజనాలున్నాయి. ఒక మంచి ప్రయోజనం కోసం రూపొందిన సెల్ ఫోన్ అంతే చేటును చేస్తోంది. ముఖ్యంగా విద్యార్థి దశపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. సెల్ మేనియాలో పడి చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏకాగ్రతను కోల్పోతున్నారు. తమ విలువైన కాలాన్ని వృథా చేసుకుంటున్నారు.

మయోపియా వచ్చే అకాశాలు ఎక్కువ



సెల్‌ఫోన్లను తరచూ దగ్గరగా చూడడం వల్ల మయోపియా వచ్చే అవకాశాలు ఉంటాయి. పిల్లలు ఒక గంటకు మించి ఫోన్ చూడకూడదు. ప్రస్తుతం ఫోన్ల వాడకం ఎక్కువవ్వడం వల్ల మానసికంగా సమాజానికి దూరమవుతున్నారు. ఫోన్‌ను అవసరాలకు అనుగుణంగా ఉపయోగించేవారు చాలా తక్కువ మంది ఉన్నారు. మెజారిటీ మాత్రం పని ఉన్నా, లేకపోయినా సెల్‌ఫోన్లను తరచుగా వాడుతున్నారు. ఇంతేకాకుండా ఫోన్లు ఎక్కువగా మాట్లాడడం వల్ల చెవులకు ప్రమాదం వాటిల్లే సూచనలు కూడా ఉన్నాయి. ఎక్కువగా ఫోన్లు మాట్లాడేవారు ఇయర్ ఫోన్లు ఉపయోగించడం మంచిది.

● డాక్టర్ చక్రపాణి, కంటి వైద్య నిపుణుడు

'స్మార్ట్'... మనుషుల్లో తగ్గింది



స్మార్ట్ ఫోన్లు వచ్చాక మనుషుల్లో స్మార్ట్‌నెస్ తగ్గింది. భార్యాభర్తల మధ్య అనుమానాలు పెరుగుతున్నాయి. స్నేహితుల మధ్యా ఇదే పరిస్థితి. విపరీతంగా పెరుగుతున్న ఫోన్ల వాడకం మానవ సంబంధాలను పూర్తిగా మార్చేస్తుంది. ఎంత ఎక్కువ సేపు ఫోన్లతో ఉంటే అంత మానసిక సంతృప్తిని పొందే పరిస్థితులు వచ్చాయి. దీనివల్ల ఇంటలెక్చ్యువల్ పవర్ పూర్తిగా తగ్గిపోతోంది. యువతీయువకులు సోషల్ మీడియాలో ఐడెంటిటీ కోసం పాకులాడుతున్నారు.

డాక్టర్ రాధికారెడ్డి, మానసిక వైద్య నిపణురాలు



బందరు పట్నం చూడర బాబూ..

● పశువుల అడ్డాగా జిల్లా కేంద్రం ● రోడ్లే ఆవాసాలు
● ట్రాఫిక్ సమస్య ● తరచూ ప్రమాదాలు
● నియంత్రణ చర్యలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం)

శతాబ్దాల చరిత్ర గల బందరు పేరు చెప్పగానే బందరు లడ్డూ, రోల్డుగోల్డు నగలు ఎలా గుర్తుకు వస్తాయో అదే మాదిరి ఆవులు, గేదెలు రోడ్లపై ఉండే పట్నంగా పేరుంది. ఆవులు సహజంగా రొచ్చులో ఉండలేవు. అవి రోడ్లపైకి రావడం అలవాటు పడ్డాయి. క్రమేణా ఆ రోడ్లే మకాంగా మారిపోయాయి. వీటికితోడు గేదెలు తయారయ్యాయి. రెండూ కలసి రోడ్లపై తిరగడం రోజురోజుకు అధికమవుతోంది. దీంతో పట్టణంలో పలు చోట్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోయారు. ట్రాఫిక్ సమస్య సరేసరి. మచిలీపట్నంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీస్ కానిస్టేబుళ్లకు గేదెలు, ఆవుల్ని మలేయడం తెలిసి ఉండాల్సిన పరిస్థితి. ఎందుకంటే డ్యూటీలో ఉన్నప్పుడు తప్పకుండా గేదెల్ని, ఆవుల్ని తోలాల్సి ఉంటుంది. వాహనదారుల ఇక్కట్లు సరేసరి. చచ్చి గీపెట్టినా రోడ్డుకు అడ్డంగా నిలబడ్డ పశువులు అంగుళం కదలవు. చేయిపడిపోయేటట్టు హారన్ కొట్టినా పట్టించుకోవు. చేసేది లేక చివరకు ఆయా వాహన డ్రైవర్లు కిందకు దిగి పశువుల్ని పక్కకు తోలుకుంటేనే తమ గమ్య స్థానాలకు చేరుకోలేరు. అందుకే మచిలీపట్నంను పశువులపట్నం చూడర బాబూ అంటూ హేళన చేస్తున్నారు.

అవగాహనే మంత్రం...

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో రోడ్లపై సంచరిస్తున్న పశువుల్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పోలీస్, మునిసిపల్ అధికారులు సంయుక్తంగా ఇందుకు ముందుకు రావడం హర్షణీయం. అయితే నియంత్రణ చర్యలు అవగాహనతో ముడిపడి ఉండాలి. రోడ్లపై పశువులు సంచరించడం వల్ల ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి, వాటి ఫలితాలపై పశువుల యజమానులకు అవగాహన కల్పించాలి. అలా కాకుండా బందీల దొడ్లపై ఆధారపడితే ఫలితం ఉండదు. ఇంతకు ముందు ఇలాగే పశువుల్ని బందీల దొడ్డిలో పెడితే రాత్రికి రాత్రే గేట్లు, గోడలు బద్దలు కొట్టి వాటిని తోలుకుపోయిన దాఖలాలు ఉన్నాయి. ఈసారి పోలీస్‌హెచ్చరికలు గట్టిగా ఉన్నాయి కాబట్టి అలా జరగక పోవచ్చు. స్వయాన ఈ విషయాన్ని ఎస్పీ త్రిపాఠి సమీక్షిస్తున్నారు కాబట్టి మునుపటి పరిస్థితులు ఉండక పోవచ్చు. కాని పశువుల యజమానుల్లో వ్యతిరేక భావం వ్యక్తం కావచ్చు. సహకరించడానికి ముందుకు రాకపోవచ్చు. అందుకే అవగాహన అవసరం. అవగాహన కార్యక్రమాలు గతంలోను జరిగాయి. అలా కాకుండా నిర్దిష్టంగా జరగాల్సి ఉంది. ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలపై యజమానులు స్పందించే రీతిలో నిర్వహించాలి. పశువులు అడ్డు తగిలి ప్రమాదాలకు గురయిన వారితో అవగాహన సదస్సులో మాట్లాడించి వారి పరిస్థితిని తెలియజేస్తే మార్పునకు అవకాశం ఉంటుంది. ఆవులు, గేదెల్ని యజమానులు అలా వదిలేయడం వల్ల వాటికి సైతం జరుగుతున్న కష్టనష్టాలను తెలియజెప్పాలి. ముఖ్యంగా పాలిథిన్ కవర్లు, ఇతరత్రా ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల ఆయా పశువుల ఉదరకోశ బాధలు పట్ల అవగాహన కల్పించాలి. రోడ్లపై తిరిగే ఆవులు జీవకళ కోల్పోయి కనిపిస్తున్నాయి. కారణం అవి తినే ఆహారమే. ఎక్కువగా పాలిథిన్ కవర్లు, చెత్త కుప్పల్లో పడేసిన వేస్ట్ తినడం వల్ల పాపం నోరులేని జీవాలు జీవన మరణ సమస్యను ఎదుర్కొంటున్నాయి. పైగా పొద్దస్తమానం చీత్కారాలకు గురవుతున్నాయి. అలా కాకుండా గ్రామీణ తరహాలో వాటిని పోషిస్తే సమస్యలు తీరడంతో పాటు నాలుగు కాలాల పాటు ఆవులు, గేదెలు ఆరోగ్యంగా ఉంటాయి. ఆ రీతిలో అవగాహన అవసరం.



రేవతీ సెంటర్ మునిసిపాలిటీ దొడ్లో కట్టేసిన ఆవులు, గేదెలు

మూగ జీవాల ఘోష

ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు అంటూ నెత్తీ నోరు కొట్టుకుంటున్న ప్రజానీకాన్ని పశువులు ప్రశ్నిస్తున్నాయి. పకడ్బందీగా నివారణ చర్యలు చేపట్టామంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నాయి. బందిఖానాలో పెట్టి తిండి తిప్పలు లేకుండా మా ఉసురు పోసుకుంటున్నారంటూ నిందిస్తున్నాయి. రోడ్డుపై ఒక్కచోటే తిష్ట వేయకుండా గాలి వాటంగా పోయే మా గురించి ఇంత రాద్దాంతం చేసే పెద్ద మనుషులు బందరులో కనిపించే అడ్డగోలు ట్రాఫిక్‌పై ఎందుకు స్పందించరంటున్నాయి. ఏదో జాతరలో మాదిరి రోడ్డు కిరువైపులా వెలుస్తున్న బడ్డీకొట్లు, దుకాణాల సంగతే మిటంటున్నాయి. లండన్‌లో మాదిరిగా అతి పొడవుగా, వెడల్పు రోడ్లు బందరులోనే ఉన్నాయంటారు. అవి ఇరుకిరుకుగా ఎందుకు తయారయ్యాయో చెప్పగలరా అంటూ సవాల్ విసురుతున్నాయి. నడి రోడ్లపై పిల్లర్లు పోసి పెద్ద పెద్ద బిల్డింగులు నిర్మించిన బడాబాబులు మీకు కనిపించడం లేదా అని గర్జిస్తున్నాయి. ప్రతి షాపు ముందు కనీసం వందడుగుల ఆక్రమణలు కనిపించడం లేదా అంటున్నాయి. అంతెందుకు మెయిన్‌రోడ్డులో హోర్డింగ్‌లు ఏరీతిలో దర్శనమిస్తున్నాయి. అసలు బందరు ట్రాఫిక్‌కు దిశ నిర్దేశం ఉందా అంటూ హుంకరిస్తున్నాయి. అనేక ప్రైవేటు స్కూళ్ల బస్సులు, ఆర్టీసీ హయ్యర్ బస్సులు రోడ్లకు అడ్డంగా పార్కింగ్ చేస్తుంటే మీ నిబంధనలు ఏమయ్యాయంటున్నాయి. కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాళ్ల ముందు ఇష్టారాజ్యంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుంటే ఏమి చర్యలు తీసుకున్నారని అడుగుతున్నాయి. డ్రైనేజీలు, రోడ్లు ఆక్రమించుకుని కారు పార్కింగ్‌లు నిర్మిస్తే చర్యలేవి అంటున్నాయి. అదేదో సామెత చెప్పినట్టు ..బందరులో ట్రాఫిక్ సమస్య మా వల్లే తలెత్తుతున్నట్టు అధికారులు, పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉంది. వారికి ప్రజాప్రతినిధులు వంతపాడటం వింతగా ఉంది. అయినా ఒకర్ని అని ఏమి లాభం, మా యజమానులు మంచోళ్ళయితే మాకు ఈ తిప్పలు రావుగా...!

మీ కోసం వద్దు.. సమాజం కోసం జీవించండి!

● స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఆర్థిక, సాంఘిక అసమానతలు
● సొంత లాభం కొంతమానుకుని సామాజిక సేవ చేయండి
● ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం/ఉంగుటూరు)

'మీ కోసం జీవించవద్దు.. సమాజం కోసం జీవించండి!! స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఆర్థిక, సాంఘిక అసమానతలు ఉన్నాయి. విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందించలేని పరిస్థితి నెలకొంది. ఉద్యోగ, ఉపాధి కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారు. ఆకలితో అలమటించే వారు ఉన్నారు. వీటన్నింటినీ ప్రభుత్వాలు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వాలే అన్నీ చేయాలని ఇన్నాళ్లూ ఒక అపోహ ఉండేది. ప్రభుత్వంతో పాటు ప్రజల నుంచి కూడా సహకారం లభించినప్పుడే సంపూర్ణ అభివృద్ధి దిశగా అడుగులు వేయగలం. ప్రతి వ్యక్తీ సమాజ హితం కోసం పనిచేయాలి. సమాజ సేవ, స్వచ్ఛంద సేవ చేయటం అంటే నాకు ఎంతో ఇష్టం. సమాజ సేవ చేయటం ద్వారా వచ్చే ఆనందం నిరుపమానం. ఒక్కసారి దానిని ఆస్వాదిస్తే సమాజ సేవలో ఉన్న మాధుర్యమేమిటో మీకు తెలుస్తుంది' అని భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్ అమరావతి రాజధాని ప్రాంతంలో రెండోరోజు ఆదివారం తన పర్యటనలో ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, భారత 13వ ఉపరాష్ట్రపతిగా పదవి అలంకరించిన తర్వాత మొదటిసారిగా తెలుగునేలకు వచ్చి పౌర సన్మానం స్వీకరించటం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు రాజకీయాలకు దగ్గరగా ఉండేవాడినని, ఉప రాష్ట్రపతి పదివికి ఉన్న పరిమితులు, అధికారాలు, ఆంక్షలు నేపథ్యంలో, తాను అన్నింటికీ దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. తనకు ఎంతో ఇష్టమైన స్వర్ణభారత్ ట్రస్టుకు కూడా రాలే నని, అధికారులతో మాట్లాడి ఇష్టమైన ట్రస్టుకు వచ్చానన్నారు. స్వచ్ఛంద సేవ చేయాలన్నా, సమాజ సేవ చేయాలన్నా తనకు ఎంతో ఇష్టమని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేయటం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని, అందులో పాల్గొంటేనే అది తెలుస్తుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రజలు విరివిగా పాల్గొనాలన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఆర్థిక అసమానతలు , సాంఘిక అసమానతలు ఉండటం దురదృష్టకరమన్నారు. సరైన విద్య, వైద్య సేవలు కూడా అందటం లేదన్నారు. ప్రజలు ఆకలికి అలమటిస్తున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వంతో ప్రజలు కలిసి పనిచేస్తే వేగంగా అభ్యున్నతి సాధ్యమౌతుందని పేర్కొన్నారు. పూజలు, ప్రార్థనల వల్ల ఎంత పుణ్యం వస్తుందో, సామాజిక సేవ చేస్తే అంత పుణ్యం వస్తుందన్నారు. న్యాయం జరగని వారికి న్యాయం దక్కేలా చేసినా అంతే ప్రతిఫలం లభిస్తుందన్నారు. సొంత లాభం కొంతమానుకుని సమాజ సేవ చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

గవర్నర్ ఈఎల్ఎస్ నరసింహన్ మాట్లాడుతూ, స్వర్ణభారతి ట్రస్టు గ్రామీణ ప్రాంతాల ప్రజల అభ్యున్నతికి ఎంతగా దోహదపడుతుందో తెలుసుకోగలిగానన్నారు. వెంకయ్యనాయుడు రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కావటం చేత గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు చేయటానికి ఈ ట్రస్టు ఎంతో దోహదపడుతుందన్నారు. ట్రస్టు ద్వారా నైపుణ్య శిక్షణ కల్పించటం వల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి కామినేని శ్రీనివాస్, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, కలెక్టర్ లక్ష్మీకాంతం, పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్ పాల్గొన్నారు.

స్వర్ణభారతి ట్రస్టులో విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. విద్యార్థినులు ఎంతో పరిణితితో అడిగిన ప్రశ్నలకు ఆయన ఛలోక్తులతో సమాధానాలు ఇచ్చారు. అవేంటో చూద్దాం...

● మీరెప్పుడూ ఎందుకు తెల్లటి దుస్తులనే ధరిస్తారు?

వెంకయ్య: తెలుపు చాలా స్వచ్ఛమైనది. కలర్‌ఫుల్ వస్త్రాలు వేసుకోవచ్చుగా అనిచాలా మంది అడుగుతుంటారు. మంచి డ్రెస్సులు వేసుకుని కలర్‌ఫుల్‌గా ఉండటం నాకు సంతృప్తిగా ఉండదు. నేను తెలుపు మార్చను. తెలుపు వేసుకోవటం నాకు ఇష్టం.

● పర్సనల్ లైఫ్‌ను, పొలిటికల్ లైఫ్‌ను ఎలా మేనేజ్ చేయగలుగుతున్నారు?

వెంకయ్య : ప్రజా జీవితంలో ఉన్నప్పుడు పర్సనల్ లైఫ్‌ను త్యాగం చేయక తప్పదు. సొంత లాభం కొంత మానుకుని సేవ చేయాలి. పదవికి వన్నె తేవాలంటే మానసికంగా సిద్ధం కావాలి. ప్రజా సేవే పరమావధిగా మారాలి.

● మీ విజయసూత్రం ఏమిటి? మీరోల్ మోడల్ ఎవరు?

వెంకయ్య : ఫార్ములా ఏమీ లేదు. హార్డ్‌వర్క్ చేయటమే . కష్టే ఫలి. కష్టపడి పనిచేయటం, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే విజయం మీ వెంట వస్తుంది. మంచిగా జీవించటం కష్టం. చెడుగా జీవించటం తేలిక. మంచిగా జీవిస్తే విజయాలు వాటంతటవే వస్తాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాకు రోల్ మోడల్. ఆయన బారిష్టర్ చదివారు. సామాజిక సేవ పట్ల ఆయన ఆకర్షితులై పనిచేశారు. ఆయన తర్వాత నాకు అద్వానీ, వాజపేయి అంటే స్ఫూర్తి.

● రానురాను విద్యావిధానంలో నైతిక విలువలు పడిపోతున్నాయి .. మీరిచ్చే సలహా ఏమిటి?

వెంకయ్య : ప్రస్తుత విద్యావ్యవస్థలో సమూల మార్పులు రావాలి. ఉద్యోగం కోసం చదువు కాకుండా ఉండాలి. పిల్లలపై ఒత్తిడి పెంచే చదువులు ఉండకూడదు. సిలబస్ తగ్గించాలి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యావ్యవస్థలు సమిష్టిగా కొన్నినియమాలు పెట్టుకునిపనిచేయాలి. ప్రభుత్వం దీనికోసం కృషి చేయాలి.

● గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి ఏ విధంగా దోహదపడాలి ?

వెంకయ్య : పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాలలోనే నిరుద్యోగం ఎక్కువగా ఉంది. పేద వర్గాలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. గరీబీ హఠావో వంటి నినాదాలు ఇచ్చినంత మాత్రాన వీటిని రూపుమాపలేం. గ్రామీణ ప్రాంతాలలో ఉండే వారికి శిక్షణలు కల్పించాలి. ఉపాధి కల్పించాలి. అన్నింటికీ మించి ప్రభుత్వ వ్యవస్థను మార్చాలి.

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3. Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!





'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.

- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?
మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.
లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.


బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన
జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ▶ ....
2. వియోనిగం ▶ ....
3. భాతంసుప్ర ▶ ....
4. చాపంయతి ▶ ....

చుక్కలు కలపండి



ఆక్వా రైతుకు ఆధునిక పరిజ్ఞానం

- చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- రూ.15 లక్షలతో మొబైల్ ల్యాబ్ మంజూరు
- అవనిగడ్డలో ఆక్వా ల్యాబ్ మంజూరు
- రూ.1.50 కోట్లతో నిర్మాణం

నాగాయలంక: దివిసీమలో ఆక్వా రైతులకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ఆక్వా సాగు విస్తరింపచేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. రానున్న కాలంలో తీర ప్రాంతంలోని బంజరు భూముల్లో ఆక్వా సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు సంసిద్ధమవుతోంది.

దివిసీమలోని నాగాయలంక, కోడూరు ప్రాంతాల్లో రైతులు ఆక్వా సాగును 80వ దశకం నుంచి ప్రారంభించారు. సాగు ఆశాజనకంగా ఉండటంతో 90వ దశకంలో రైతులు తమ మాగాణి భూములను తవ్వి ఆక్వా సాగును విరివిగా చేశారు. 1994లో కురిసిన భారీ వర్షాలకు ఆక్వా చెరువులు నిండి వైరస్ రావటంతో రైతులు చాలా మంది ఆర్థికంగా నష్టపోయారు. ఆర్థికంగా నిలబడి ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న పెద్ద రైతులు మాత్రమే సాగును కొనసాగిస్తున్నారు.



ఆక్వా ల్యాబ్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కేటాయించిన స్థలం

నాగాయలంక, కోడూరు మండలంలోని తీర ప్రాంతాల్లో రమారమి 12 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. వాటిలో ఎక్కువ శాతం రొయ్యలు కాగా, చేపలు, పీతల సాగును చేస్తున్నారు. రొయ్యలు, పీతలు, చేపలకు కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన లేకపోవటంతో రైతులు నష్టపోతున్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని మత్స్యశాఖ నిపుణులు దివిసీమలోని ఆక్వా సాగును పరిశీలించారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేస్తే తీర ప్రాంతాల్లో ఆక్వా సాగును విస్తరింపచేయవచ్చునని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. స్పందించిన ప్రభుత్వం రూ.15 లక్షల విలువ గల మొబైల్ ల్యాబ్‌ను మంజూరు చేసింది. రూ.8 లక్షలతో మొబైల్ వాహనం కొనుగోలు, రూ.7 లక్షలతో పరీక్షలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేస్తారు. ఆక్వా రైతులు మొబైల్ ల్యాబ్ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే చెరువు వద్దకు ల్యాబ్ టెక్నిషియన్, సిబ్బంది వెళ్తారు. చెరువులో నీరు, వైరస్ పరీక్షలు చేస్తారు. వారికి



ఏటిమొగలో రొయ్యల చెరువులు

సాంకేతిక సలహాలు, సూచనలు ఇచ్చి పంటను కాపాడేందుకు కృషి చేస్తారు. అవనిగడ్డలో ఆక్వా ల్యాబ్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ల్యాబ్‌ను నిర్మించేందుకు నాగాయలంక వెళ్లే రహదారి పక్కన రెవెన్యూ అధికారులు 11 సెంట్ల భూమిని కేటాయించారు. దీనిలో ఆక్వా ల్యాబ్ శిక్షణా కేంద్రాన్ని రూ.1.50 కోట్లతో నిర్మించేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆక్వా ల్యాబ్, శిక్షణా కేంద్రంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చి నిపుణులను తయారు చేయనున్నారు. ఈ చర్యలతో దివిసీమలో ఆక్వా సాగు విస్తరించటంతో రైతుకు, రాష్ట్రానికి ఇతోధిక ఆదాయం వస్తుందని ఆక్వా రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మేలైన సీడ్‌ను సబ్సిడీపై ఇవ్వాలి

ఆక్వా సాగును ప్రోత్సహించాలంటే రైతుకు మేలైన సీడ్‌ను ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వాలి. ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉంటే ఆక్వా సాగు చేసేందుకు ఆసక్తి చూపుతారు - **మండవ బాలవర్థిరావు, ఆక్వా రైతు, నాగాయలంక**



ఆక్వా సాగుకు అనుకూలం

ఆక్వా సాగుకు నాగాయలంక, కోడూరు ప్రాంతాలు అనుకూలంగా ఉన్నాయి. రైతులకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇటీవల సంగమేశ్వరంలో మత్స్యశాఖ ద్వారా పీతల సాగుపై రైతులకు శిక్షణనిచ్చాం - **పి.సురేష్, మత్స్యశాఖ ఏడీఏ, అవనిగడ్డ**



గుళ్ళపూడి గంటల చెరువు నుంచి నీటి చౌర్యం

- చెరువులో ఏడు బావులు తవ్వకం, వాటికి విద్యుత్ మోటార్ల ఏర్పాటు
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతుల గగ్గోలు

గుళ్ళపూడి - గంపలగూడెం: మండలంలోని గుళ్ళపూడి గ్రామం గంటల చెరువులో కొందరు నీటి చౌర్యానికి పాల్పడుతూ ఆయకట్టుదారుల భూములకు నీరు అందకుండా చేస్తున్నారు. గుళ్ళపూడి గ్రామంలో గంటల చెరువు కింద అధికారికంగా 100 ఎకరాల ఆయకట్టులో వరి సాగుచేస్తున్నారు. వీరు కాకుండా అనధికారికంగా కొందరు చెరువులో మోటార్లు ఏర్పాటు చేసుకుని నీటి చౌర్యానికి పాల్పడుతూ 50 ఎకరాలు సాగు చేస్తున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి ఎన్ఎస్‌పి ఎడమకాలువ సాగునీరు జోన్-2 పరిధిలో గల చివరి భూములు వరకు రాకపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడింది.

గంటల చెరువు కేవలం వర్షాధారానికి పరిమితం. చెరువులో ఉన్న నీటిని విద్యుత్ మోటార్లతో తరలించి అనధికార సాగుదారులు వినియోగించుకుంటున్నారు. దీంతో చెరువు ఆయకట్టుదారుల భూములకు నీరు లేక వరి ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆయకట్టుదారులు తమ పంట ఎలాగైనా కాపాడుకోవాలని చెరువులో వేసిన మోటార్లపై అధికారులకు ఫిర్యాదులు చేయగా వారు స్పందించి మోటార్లను అక్కడి నుంచి తొలగించివేశారు. దీంతో అనధికార సాగుదారులు మరో పన్నాగం పన్ని అమలుపరిచారు. చెరువు పరిధిలో ముందుగా బావి తవ్వి చెరువులో ఉన్న బోరుకు ఆరడుగుల లోతులో గాడితీసి చెరువు నీటిని బావిలోకి తెప్పించారు. చెరువులోనే మరో బావి తవ్వి గాడి తీసి ఆ బావికి నీరు నింపారు.

ఈ విధంగా గంటల చెరువు మొత్తం 7 బావులు తీసి నీటితో నింపారు. ఆ బావులకు 4 విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకుని పైపుల ద్వారా నీటిని తరలిస్తున్నారు. చెరువులో ఏకంగా 7 బావులు తవ్వుతున్నా ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల రైతుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖాధికారులు సంయుక్తంగా గంటల చెరువులో ఏర్పాటు చేసిన బావులను పూడ్చివేసి అక్కడున్న విద్యుత్ మోటార్లను తొలగించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



చెరువులో తవ్విన బావులు, వాటికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు

పాత పాఠ్యపుస్తకాలే గతి

- ఇంటర్ విద్యార్థులకు ఏడాదిగా అందని నూతన పాఠ్యపుస్తకాలు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల అవస్థలు

నూజివీడు టౌన్: పాఠశాల, కళాశాలలకు వారధి ఇంటర్ విద్య. సరైన సమయానికి సిలబస్ పూర్తిచేయాలన్నా, మెరుగైన ఫలితాలు సాధించాలన్నా పాఠ్యపుస్తకాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. పాఠశాలల్లోకి అడుగుపెట్టగానే విద్యార్థులకు సరికొత్త పాఠ్య పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం అందించేది. ఇది రెండేళ్లనాటి మాట. సంవత్సరకాలంగా పాఠ్యపుస్తకాలను విడుదల చేయకపోవడంతో ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల విద్యార్థులు పాత పాఠ్యపుస్తకాలనే ఉపయోగించాల్సి వస్తోంది. నలిగిపోయి చినిగిపోయి పేజీలకు పేజీలు లేచిపోయిన పుస్తకాలతో ఎలా చదవాలో తేల్చుకోలేని పరిస్థితి. ఒకవైపు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాఠ్యాంశాలను నేర్చుకోవడంలో దూసుకుపోతున్నారు. గత సంవత్సరం వరకు ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల చేరికలు అంతంత మాత్రంగానే ఉండగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అడ్మిషన్‌లను నిర్వహించారు. ప్రస్తుతం పాఠ్యపుస్తకాల కొరత ఆందోళన రేకెత్తిస్తోందని అధ్యాపకులు వాపోతున్నారు. ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ కళాశాలల్లో పేద, నిరుపేద వర్గాల విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారు. వీరు 2 వేల నుంచి రెండున్నర వేల రూపాయల వరకు ఖర్చుచేసి పాఠ్య పుస్తకాలను కొనుగోలుచేయటం తలకుమించిన భారంగా మారుతుందని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒక ఏపీఆర్‌జేసీ, ట్రైబల్‌వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఒకటి, సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో 8, గవర్నమెంట్ మోడల్ జూనియర్ కళాశాలలు రెండు, కోఆపరేటివ్ జూనియర్ కళాశాలలు ఐదు ఉన్నాయి. ఇందులో దాదాపు 8వేల మంది విద్యనభ్యసిస్తుండగా 62వేల పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంది. గత రెండు సంవత్సరాల నుంచి పుస్తకాల సరఫరా నిలిపివేయడంతో పాతపుస్తకాలతోనే విద్యాబోధన జరుగుతోందంటూ విద్యార్థులు వాపోతున్నారు. ఇక నూజివీడు మడుపల్లి జూనియర్ కళాశాల విషయానికి వస్తే 336 మంది విద్య నభ్యసిస్తుండగా వారికి గత సంవత్సరం నుంచి నూతన పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేస్తున్నామనే ప్రకటనలను చేతల్లో చూపాలని పలువురు కోరుతున్నారు.



నూజివీడులోని మడుపల్లి తాతయ్య జూనియర్ కళాశాల

కల్తీ నెయ్యి స్వాధీనం

ఇబ్రహీంపట్నం: కల్తీ నెయ్యి రవాణాపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. జాతీయ రహదారిపై విజయవాడ వైపు నుంచి జగ్గయ్యపేట వైపు వెళుతున్న వాహనాన్ని రింగ్ సెంటర్ చెక్‌పోస్టు సమీపంలో తనిఖీ చేశారు. డబ్బాల్లో ఐదు వేల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఫుడ్ కంట్రోల్ అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత మృతి హత్య కేసుగా మార్పు

చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావునగర్‌లో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సజ్జా పార్వతి కేసును హత్య కేసుగా మార్పుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చల్లపల్లి ఎస్సై దాడి చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయగా, శవపరీక్ష చేసిన వైద్యుల సూచన మేరకు హత్య కేసుగా మార్పుచేసినట్లు వివరించారు. ఈ కేసులో భర్త సజ్జా రమేష్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడి అరెస్టు

చిట్టినగర్: బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన యువకుడిని కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఫైజర్‌పేట ప్రాంతానికి చెందిన బాలిక (17)కు అదే ప్రాంతానికి చెందిన జడ్డి అనిల్ మాయ మాటలు చెప్పి ఈ నెల 25న తీసుకెళ్లాడని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనిల్‌ను అరెస్టు చేశారు.

ఉచిత న్యాయం ఇలా...



ప్రసాదరావు ప్రత్తిపాటి, సీనియర్ న్యాయవాది

న్యాయవాదిని పెట్టుకొనే స్థోమతలేని వారు సిటీ సివిల్ కోర్టుల్లోని మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయసాయం పొంద వచ్చని సీనియర్ న్యాయవాది ప్రసాదరావు ప్రత్తిపాటి తెలియ జేస్తున్నారు. ఉచిత న్యాయ సాయం, లోక్ అదాలత్ విధులు, నిర్వహణ, ప్రీ లిటిగేషన్ కేసుల అంశాలపై ఆయన ఇలా చెబుతున్నారు.

- విజయవాడ లీగల్

న్యాయం దృష్టిలో అందరూ సమానులే. సమాన అవకాశాలు కల్పించడానికి, ముఖ్యంగా ఏ పౌరుడూ ఆర్థిక కారణాలు, లేక మరే ఇతర బలహీనతల వల్లో న్యాయం పొందే అవకాశం కోల్పోకుండా ఉండడం కోసం ఉచిత న్యాయ సహాయం అందించాలని ప్రభుత్వం భావించింది. ఫలితంగా 1976లో రాజ్యాంగానికి 39ఎ అధికరణ జతచేసి బీద, బలహీనవర్గాల వారికి ఉచిత న్యాయం అందించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా నిర్దేశించారు. అందుకు చట్టాన్ని కూడా రూపొందించారు. అదే న్యాయ సేవల అధికారిక చట్టం. ఆ చట్టం మేరకు రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ఉమ్మడిగా చర్చించి కొన్ని సూత్రాలు, నిర్దేశాలను రూపొందించారు. చట్టం, దాని అనుబంధ సూత్రాల ప్రకారం దిగువ తెలిపిన వారు ఉచిత న్యాయం పొందడానికి అర్హులు.

ప్రీ లిటిగేషన్ కేసులు...

ప్రీలిటిగేషన్ కేసులను పీఎల్‌సీలని పిలుస్తారు. ఏడాదికి రూ.లక్ష లోపు ఆదాయమున్న వారు సమస్యలు కాగితంపైరాసి పీఎల్‌సీ కార్యాలయంలో ఇచ్చి న్యాయ సహాయం పొందవచ్చు.

దరఖాస్తు ఎలా ?

ఉచిత న్యాయం కావాల్సిన వారు కేసు పూర్వాపరాలు, కావాల్సిన పరిష్కారం వివరిస్తూ అఫిడవిట్‌ను, సంబంధిత డాక్యుమెంట్లను జతచేస్తూ దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు పైన తెలిపిన అర్హతల్లో ఏవి కలిగి వున్నదీ తెలియజేస్తూ తగిన అధారాలు పంపిన నిబంధనల మేరకు చర్య తీసుకొంటారు.

దరఖాస్తు చేయాల్సిన చిరునామా...

జిల్లా కోర్టులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, లేక మండల న్యాయసేవాధికార సంస్థ, హైకోర్టులోని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలోగానీ కేసు వివరాలు తెలుపుతూ దరఖాస్తు చేసుకోవాలి.

ఎవరెవరు పొందవచ్చు

1. షెడ్యూల్ కులం, తెగకు చెందిన వారు
2. మానవ అక్రమ రవాణా బాధితులు, యాచకులు
3. స్త్రీలు, పిల్లలు
4. మతిస్థిమితం లేనివారు, దివ్యాంగులు
5. సామూహిక విపత్తు, హింసాకాండ, కుల వైషమ్యాలు, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, పారిశ్రామిక విపత్తులు, వంటి వాటిల్లో చిక్కుకున్న వారు
6. పారిశ్రామిక కార్మికులు
7. ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) చట్టం 1956లో సెక్షన్ 2(జి)లో తెలిపిన 'నిర్బంధం', 'సంరక్షణ నిర్బంధం'తో సహా లేక బాల నేరస్థుల న్యాయచట్టం, 1986 సెక్షన్ 2 (జె)లో తెలిపిన నిర్బంధం లేక మెంటల్ హెల్త్ చట్టం, 1987 సెక్షన్ 2 (జి)లో తెలిపిన మానసిక వైద్యశాల లేక మానసిక చికిత్సాలయాల్లో తెలిపిన వారు
8. వార్షిక ఆదాయం రూ.లక్షకు మించని వ్యక్తులు

మీడియేషన్ సెంటర్...

సెక్షన్ 89 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం ఏ కోర్టులోనైనా సివిల్ కేసు విచారణ ప్రారంభమయ్యే ముందు మీడియేషన్ సెంటర్‌కు కేసును పంపించాలి. దాన్ని 30 రోజుల్లోగా ఆ సెంటర్ సభ్యులు ఇరువర్గాలతో మాట్లాడి పరిష్కారం చేసి ఆర్డర్‌ను కోర్టుకు పంపిస్తారు. పరిష్కారం కాకపోతే కేసు ఎక్కడి నుంచి వచ్చిందో అక్కడికే పంపిస్తారు. ఈ సెంటర్ ప్రతి జిల్లాకు ఒకటి వుంటుంది. కృష్ణాజిల్లాకు విజయవాడలో వుంది.



మీ కోసం

ఈ కార్యాలయం మండల న్యాయసేవాధికార భవనంలో వుంది. మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రతి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పీఎల్‌సీలను నిర్వహిస్తారు.

సహాయ విధానాలు...

1. ఉచితంగా న్యాయ సలహా ఇప్పించడం,
2. కేసు పరిశీలించి అవసరమైతే దరఖాస్తుదారుని తరఫున న్యాయవాదులను నియమించి కేసులు చేపట్టడం,
3. సాయం పొందిన వారి కోర్టు ఫీజు, కేసుకు సంబంధించిన కోర్టు ఖర్చులు భరించడం,
4. ఆ కేసుల్లో జడ్జిమెంట్ నకళ్లు ఉచితంగా ఇవ్వడం.

విజయవాడ సిటీ సివిల్ కోర్టులో లోక్ అదాలత్ రోజూ సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారని ప్రత్తిపాటి చెబుతున్నారు. అన్ని కోర్టుల్లో రాజీ అయిన కేసులను లోక్ అదాలత్‌కు బదలాయిస్తారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఈ అదాలత్ నిర్వహిస్తుంది. ఈ కోర్టుకు న్యాయమూర్తి, ఇద్దరు లోక్ అదాలత్ సభ్యులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారు. వీటిల్లో పరిష్కారమైన కేసులకు అప్పీలు లేదు.



నున్నలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్రలో కళా ప్రదర్శనలు

అగ్రిగోల్డ్ బాధితుల గోడు పట్టదా!

● చైతన్య యాత్రలో నాగేశ్వరరావు డిమాండ్

నున్న (విజయవాడ రూరల్) : అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, వారికి న్యాయం చేయాలని బాధితుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమం తీవ్రతరం చేయనున్నట్లు పేర్కొన్నారు. బాధితుల చైతన్యయాత్ర ఆదివారం రూరల్‌లోని నున్న మీదుగా నూజివీడుకు వెళ్లింది. ఈ సందర్భంగా కళాకారులు పలు ప్రదర్శనలు చేశారు. చైతన్య యాత్ర ద్వారా బాధితులంతా ఒక్కటై ప్రభుత్వానికి నిరసనలు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. యాత్రలో మాజీ ఎమ్మెల్సీ జల్లీవిల్సన్, సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవే లక్ష్యం

● బ్రాహ్మణసేవా సంఘం అధ్యక్షుడు కొప్పవరపు

గాంధీనగర్ : సమాజసేవే లక్ష్యంగా బ్రాహ్మణ సేవా సంఘం పని చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పవరపు బలరామ్ తెలిపారు. హనుమాన్‌పేటలో మారుతీ ప్రసన్న కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన పేద బ్రాహ్మణ వధూవరుల పరిచయ కార్యక్రమంలో ఆచార వ్యవహారాలు సమాజానికి ఆదర్శంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు.

వివాహ పరిచయ వేదికకు దాదాపు 500 మంది వధూవరులు విచ్చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎస్.ప్రభాకరరావు, పి.కాశీవిశ్వనాథం, మురళీకృష్ణ, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పెరిగిన రైతు ఆత్మహత్యలు

● వ్యవసాయం విదేశాలకు తాకట్టు ● గిట్టుబాటు ధర, రుణ మాఫీలపై కేంద్రం చట్టం తేవాలి ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రొద్దుటూరు (కంకిపాడు) : టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారం కంటే ఆత్మహత్యలు పెరిగాయని, వ్యవసాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశాలకు తాకట్టు పెట్టారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. కంకిపాడు మండలం, ప్రొద్దుటూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సంపూర్ణ స్వాతంత్రం కోసం ఉద్యమించిన ఘనత కమ్యూనిస్టులకు తగ్గుతోందన్నారు. రైతు సమస్యలు, ప్రజా సమస్యలు పరిష్కరించాలని స్వాతంత్రం ముందు నుంచి ఉద్యమిస్తున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టులే అన్నారు. కమ్యూనిస్టులు కొంత బలహీన పడినప్పటికీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ప్రజలకు, రైతులు చేసిందేముందని ప్రశ్నించారు. వ్యవసాయాన్ని విదేశాలకు అధికార పార్టీ తాకట్టు పెడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో పండుతున్న చెరకు, పామాయిల్, పత్తి వంటి వాటిని ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటోందన్నారు. చంద్రబాబు విధి విధానాల కారణంగా ఓపక్క రైతు ఆత్మహత్యలు, మరోపక్క పరిశ్రమలు మూత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు కాలం కష్టపడి పండించిన రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టం తేవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇష్టానుసారం కాకుండా ప్రతి రాష్ట్రాన్ని ఒకే ప్రాతిపదికన రుణ మాఫీ చేసే విధంగా కూడా చట్టం తీసుకురావాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిరుపూర్, కాఖజ్ నగర్ మిల్లులో పెండింగ్‌లో ఉన్న రూ.9.50 కోట్ల బకాయిలను సుబాబుల్ రైతులకు ప్రభుత్వం తక్షణం ఇప్పించే విధంగా చర్య లు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. గుడివాడ నుంచి నాగాయలంక వరకు వ్యవసాయ భూములను అధికార పార్టీ నేతలు ఆక్వా చెరువులుగా మార్చేశారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో అటు నంద్యాల, ఇటు కాకినాడలో పెద్ద ఎత్తున డబ్బులు పెట్టి ప్రజలను ప్రలోభాలకు అధికార పార్టీ గురిచేస్తోందని ఆరోపిం చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.నరసింహారావు, వి.కృష్ణ, జిల్లా కార్యదర్శి ఆర్.రఘు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాగంటి హరిబాబు, డివిజన్ కార్యదర్శి కోసూరి శివనాగేంద్రం, మండల కార్యదర్శి పంచకర్ల రంగారావు, ఈడా కోటేశ్వరరావు, తాడంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంపై పాదయాత్ర 17న

రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చేనెల 17వ తేదీన 156 రైతు సంఘాలతో కలిసి కంచికచర్ల నుంచి విజయవాడ వరకు భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు మధు తెలిపారు. అనంతరం విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

కావాలనే విద్యుత్ కోత

పి.రంగారావు, మండల కార్యదర్శి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రఘు ఏ ప్రాంతంలో సమావేశానికి హాజరైనా ఆ సమావేశాన్ని కావాలనే అధికార పార్టీ భగ్నం చేస్తోందని విమర్శించారు. కంకిపాడు మండల ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సదస్సులో అధికారులు విద్యుత్ అంతరాయానికి పాల్పడ్డారు. సదస్సు ప్రారంభం అవుతుండగా విద్యుత్ సరఫరా కట్ చేశారు. దీంతో సుమారు అరగంటపాటు చిన్నకారు, ఆటోలకు సంబంధించిన బ్యాటరీలతో సదస్సును నిర్వహించారు. సమావేశం ముగిస్తుందనగా సరఫరా పునరుద్ధరించారు. మండల విద్యుత్ శాఖ అధికారి ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో సీపీఎం నేతలు అసహనానికి గురయ్యారు.

అమలు అంతంత మాత్రమే

● అందరికీ అందని అన్నఅమృత హస్తం ● అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమి ● రేషన్ బియ్యంతో భోజనం ● రాకపోకలకూ ఇబ్బందే


ఖాళీగా ఉన్న నూజివీడు అంగన్‌వాడీకేంద్రం


అంగన్‌వాడీకేంద్రంలో బాలింత, చిన్నారులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో 37 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్నఅమృతహస్తం పథకం అమలు అంతంత మాత్రమే. పట్టణంలో ప్రీస్కూళ్ళు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మినహా ఎక్కడా సౌకర్యాలు లేక పోవడంతో అంగన్‌వాడీ పరిధిలో బాలింతలు, గర్భిణీలు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 37 కేంద్రాలకు 337 మంది గర్భిణులు, 299 మంది బాలింతలతో కలుపుకుని రెండు వేల మంది చిన్నారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సి ఉండగా, అందులో సగం మంది మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అమ లు కాలేదు. బాలింతలు, గర్భిణులకు ప్రతిరోజూ ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనం ఐరన్ ట్యాబ్‌లెట్లను అంగన్‌వాడీ కేంద్రాల అందించాల్సి ఉంది. దీంతో కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు సుమారు 3 నుంచి 4 గంటల సమయం ఉండాల్సిన పరిస్థితి ఉంది. వారు కిందే కూర్చోవాల్సి ఉండడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల లేమి

నూజివీడు రూరల్ : నూజివీడు మండల పరిధిలో మొత్తం 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో మూడు వేల మంది చిన్నారులకు, 478 మంది బాలింతలు, 599 మంది గర్భిణులు అన్న అమృతహస్తం పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. దాదాపు సగానికి పైగా ఈ పథకాన్ని వినియో గించుకుంటున్న దాఖలా కనిపించటం లేదు. విద్యుత్‌బిల్లులు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను గ్రామపంచాయతీలకు అందించినా అవి అన్ని గ్రామాల్లోనూ అమలు కావడం లేదు. మరోవైపు బాలింతలు సిజేరియన్ల కారణంగా అంగన్‌వాడీకేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారుతోంది.

రేషన్ బియ్యంతో ఇబ్బందులు

చాట్రాయి : ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అన్న అమృతహస్తం పథకం గర్భిణిలు, బాలింతలకు వరం అయినా కోటా బియ్యం వల్ల నీరు గారి పోతున్నది. మండల కేంద్రం చాట్రాయిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం గుడ్డు, పాలు పోషకవిలువలు కలిగిన కూరతో భోజనం పెడుతున్నారు కానీ కోటా బియ్యం వల్ల గర్భిణిలు, బాలింతలు కడుపు నిండా భోజనం చేయలేకపోతున్నారు. కోటా బియ్యంవల్ల అరుగుదల ఉండక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం మంచి బియ్యం ఇస్తుందనే ఆశతో రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నట్లు పలువురు చెప్పారు. కొంతమంది ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని గుడ్డు, కూరతో భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం పెట్టించుకుని తీసుకు వెళుతున్నారు. కేంద్రానికి రాలేని నిండుగర్భిణిలు, పచ్చి బాలింతలకు మాత్రం భోజనం వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇళ్ళకు పంపుతున్నారు. ప్రభుత్వం కోటా బియ్యానికి బదులు మంచి బియ్యం సరఫరా చేస్తే అన్న అమృతహస్తం పథకం మంచి ఫలితాలిస్తుంది.

అధికారుల వైఫల్యం

విస్సన్నపేట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలుకు అధికారులు సమర్ధంగా పనిచేయటం లేదనే విమర్శలు నెలకొన్నాయి. బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకు రావడంలో వైఫల్యం చెందుతున్నారు. గర్భిణులు, బాలింతల బంధువులు వచ్చి ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారే తప్ప అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్న నిబంధనను సమర్థంగా అమలు జరపటం లేదు. కొన్ని కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు ఇంటి వద్ద నుంచి అన్నం తెచ్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలతో భుజించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చిన రేషన్‌బియ్యం ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో అన్నం పెట్టాలని కోరుతున్నారు.

ఏటీత..లంకమేత..చందం

ఆగిరిపల్లి : రేషన్ బియ్యం అన్నం తినడం ఇష్టంలేక కొందరు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ఆసక్తి చూపటం లేదు. గర్భిణిలు, బాలింతలు పాలు, గుడ్డుకోసం, మధ్యాహ్నం భోజనం కోసం రెండు దఫాలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివాసం ఉండేవారు ఈ పథకానికి దూరమవుతున్నారు. భోజనం కోసం నడిచి రావాల్సి రావడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో భోజనానికి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. కొందరు మాత్రం వచ్చి అంగన్‌వాడీల్లో అసౌకర్యాల నడుమ భోజనం చేయలేక క్యారేజిల్లో భోజనం తీసుకువెళుతున్నారు. లంక మేత కోసం ఏటిఈతలా ఉందని వాపోతున్నారు. మండలంలో మొత్తం 67 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా, 470మంది గర్భిణిలకు 373 మంది, 413 మంది బాలింతల్లో 322 మంది అన్న అమృతహస్తం పథకంలో భోజనం చేస్తుండగా భోజనం నాణ్యతలేక కొన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో ఈ పథకంపై పెదవివిరుస్తున్నారు.

ముసునూరు మండలంలో

మండలంలోని 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో 382 మంది బాలింతలు, 437మంది గర్భిణులు, 3550 మంది చిన్నారులు అన్నఅమృతహస్తం పథకం ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇందులో 270 మంది బాలింతలు, 300 మంది గర్భిణుల మాత్రమే పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. చిన్నారులకు మాత్రం మెనూ ప్రకారం ఆహారం అందించటం లేదనే విమర్శలు ఉన్నాయి. కూరగాయలు తదితర వస్తువులను అంగన్‌వాడీకార్యకర్తలే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీనుండి రూ.5వేలు నిధులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు నిధులు అందలేదు. సౌకర్యాల లేమితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యంలో నాణ్యత లేకపోవడంతో సరిగ్గా ఉపయోగించుకోలేక పోతున్నారని సర్వత్రావిమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుడివాడలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర నేడు

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర సోమవారం గుడివాడలో జరుగుతుంది. ఈనెల 26న హనుమాన్ జంక్షన్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారంనాడు నూజివీడులో జరిగింది, తిరువూరు, నందిగామలో పర్యటనను పూర్తి చేసుకుని విజయవాడకు చేరుకుంది. సోమవారం గుడివాడ, మచిలీపట్నం, చల్లపల్లి, ఆవనిగడ్డ, రేపల్లెలో ఈ యాత్ర సాగుతుంది.

ఎన్నికల్లో బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

● యువతకు రమేష్‌నాయుడు సూచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికలలో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్ళొద్దని బీజేపీ యువమోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యాలయ మీడియా సెల్ ఇన్‌ఛార్జి దిలీప్‌లతో కలిసి మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా రూపొందించేందుకు తమ పార్టీ తరపున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బీజేపీ,టీడీపీకి ఉమ్మడి శత్రువులుగా ఉన్న కొందరు అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటితో పాటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యంగా కొందరు నాయకుల మాటలు విని యువత బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, దీని జోలికి పోవద్దని వారు సూచించారు.

ఆల్ మునిసిపల్ ఇంజనీర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

● ప్రెసిడెంట్‌గా ఎంపికయిన టి.రంగారావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జోన్-2 ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాటర్ సప్లై డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న టి.రంగారావు ఎంపికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్-2కు చెందిన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు. జోన్-2 కమిటీ ఎంపికలో సెక్రటరీగా అసిస్టెంట్ ఇంజనీరు డి.దుర్గారావు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా జె.ఫణి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు కే.వి. సాయిప్రసాద్, ట్రెజరర్‌గా విజయవాడ సర్కిల్-1 ఈఈగా పనిచేస్తున్న కే.కోటేశ్వర్రావు, సభ్యులుగా డీఈఈ ఎంసీఎస్.పాత్రుడు, డీఈఈ వి.పద్మాకర్ ప్రసాద్, ఏఈ కే.రాజ్‌కుమార్, ఏఈ పి.సూర్యకుమారి, ఏఈ డి.లక్ష్మీనారాయణ, ఏఈ డి.రామకిషోర్, డీఈఈ అబ్దుల్ రహీమ్, బి.హెచ్.సుబ్బారావు డీఈఈ, ఏఈ నాగేశ్వర్రావు ఎంపికయ్యారు.

డేరాబాబాతో లాలూచి వల్లే ఉత్తరాదిలో విధ్వంసం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

విజయవాడ : సిపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో దేరా బాబా సహకారంతో హర్యానాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. డేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. హింస చెలరేగే ప్రమాదం ఉన్నదని ముందే ఊహించి 200 రైళ్లను రద్దు చేసిన ప్రభుత్వం డేరాబాబా 200 వాహనాల కాన్వాయ్‌తో కోర్టు హాజరయ్యేందుకు ఎందుకు అనుమతించిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో దళితులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, అభద్రతాభావంతో వారు జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ఎండగడుతూ నెల రోజులూ ప్రచార కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. చోటామోటా నాయకులకు వారి విలువను బట్టి రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వెచ్చించి కొనుగోలు చేస్తున్నందున ఎన్నికల బదులుగా వేలాన్ని నిర్వహిస్తే సబబుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎక్కడికక్కడ నోట్లను ప్రధాన పార్టీలు వెదజల్లుతున్నాయని తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టిడీపీ, వైకాపా పోటీలు పడిమరీ ఓటర్లను కొనుగోలు చేశాయన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సినిమాలు

నటరాజ్	: నక్షత్రం
రేవతి	: ఫిదా
మినీ రేవతి	: లై
వినాయక్	: జయజానకినాయక
సిరికృష్ణ	: అర్జున్‌రెడ్డి
సిరి వెంకట్	: వివేకం
వెంకటేశ్వర	: నేనే రాజు నేనే మంత్రి
రామ్‌శాంతి	: గౌతమ్‌నంద
బృందావన్	: విఐపి-2
రామరాజు	: ఆనందోబ్రహ్మ

చురుగ్గా ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం

- భాస్కరపురం, వలందపాలెంలో వేగంగా జరుగుతున్న పనులు
- మరో ఐదు చోట్ల నిర్మాణానికి ప్రణాళికలు



భాస్కరపురంలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

మచిలీపట్నం-టౌన్: పట్టణంలో అమృతపథకం కింద ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 13వ ఆర్థిక సంఘం నిధులతో భాస్కరపురంలో దాదాపు మూడు కోట్ల వ్యయంతో ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 1,400 కిలోలీటర్ల ఈ ట్యాంకుతో రెండు వార్డుల్లో తాగు నీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. 13, 14 ఆర్థిక సంఘం నిధులతో మందులగూడెం, గిలకలదిండిలో మరో రెండు ట్యాంకుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించనున్నారు.

వలందపాలెం, చిలకలపూడిలో...

అమృత నిధులతో ట్యాంకులు, హెడ్ వాటర్ వర్క్ అభివృద్ధిపై ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఒక కోటి 47 లక్షల వ్యయంతో వలందపాలెంలో అమృత నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం ప్రారంభమైంది. చిలకలపూడిలో 500 కిలోలీటర్ల ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే ఇంకా పనులు ప్రారంభం కాలేదు. కాగా గడ్డిబజారు, రుస్తుంబాదాల్లో అమృతపథకం కింద మరో రెండు ట్యాంకులు నిర్మించేందుకు ఇంజనీర్లు ప్రణాళిక రూపొందించారు. నిధులు అందుబాటులోనే ఉన్నాయి. ఇలా మొత్తం ఏడు ట్యాంకుల నిర్మాణాలు పూర్తయితే పట్టణంలో తాగునీటి సమస్యకు పరిష్కారం ఏర్పడుతుంది. అమృత రెండో దశ కింద హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పైపులైన్ల నిర్మాణానికి పనులు చేపడతారు. ఇక్కడ పెద్ద స్థాయిలో నీటిని నిల్వ చేసేందుకు కావాల్సిన వనరులను సమకూర్చనున్నారు.

ఏడాదిలో నిర్మాణాలు పూర్తి చేస్తాం: చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, టీడీపీ పాలకవర్గం హయాంలో ఏడు ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నామని మునిసిపల్ చైర్మన్ బాబాప్రసాద్ తెలిపారు. ఏడాదిలో ట్యాంకుల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు పైపులైన్ల చివరి ప్రాంతాల్లో వేసవిలో నీరు రావడం లేదు. ట్యాంకుల నిర్మాణాలు పూర్తయితే పట్టణంలో తాగునీటి సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం ఏర్పడుతుందని చెప్పారు.



వలందపాలెంలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు



అవోపా సభలో మాట్లాడుతున్న చైర్మన్ బాబాప్రసాద్

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

మచిలీపట్నం-టౌన్: పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకు రావాలని మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. బుట్టాయిపేటలోని అన్నం వీరరాఘవయ్య కల్యాణ మండపంలో అవోపా ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని 120 మంది పేద విద్యార్థులకు లక్ష రూపాయలు నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చైర్మన్ మాట్లాడుతూ, అవోపా ఇస్తున్న సహాయం ఆసరాగా తీసుకుని విద్యార్థులు ఉన్నతస్థితికి ఎదగాలన్నారు. సంస్థ అధ్యక్షుడు నంబూరి గోపాలకృష్ణ, కార్యదర్శి కొల్లూరి రామమోహనరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్తగుండు రమేష్, కూరాళ్ళ రామచంద్రరావు, పాలకుర్తి సూర్యవరప్రసాద్, లక్ష్మీనందన్ తదితరులు ప్రసంగించారు. వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు చైర్మన్ బహుమతులు అందజేశారు. సీనియర్స్‌లో హేమలత, విజయశ్రీ, సాయిప్రియ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. జూనియర్స్‌లో జి.సాయిశివాని, బాలాంజనేయులు, లిఖిత ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు.

కలెక్టరేట్ ఆవరణలో ఎండుతున్న మొక్కలు



ఎండిపోతున్న ఈనెల 10న నాటిన మామిడి మొక్క

మచిలీపట్నం-టౌన్: కలెక్టరేట్ ఆవరణలో అధికారులు నాటిన మొక్కలు కొన్ని ఎండి పోతున్నాయి. కలెక్టరేట్ సమావేశపు హాలు ఎదురుగా నాటిన మొక్కలు ఎండి పోతున్నాయి. జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం నాటిన మామిడి మొక్క ఎండి పోయింది. నిత్యం పశువులు సంచరించే కలెక్టరేట్‌లో మొక్కలను పశువులు తినకుండా ట్రీ గార్డులు అమర్చారు. వర్షాలు కురవడం వల్ల మరికొన్ని మొక్కలు బతికాయి. ప్రస్తుతం కలెక్టర్ కలెక్టరేట్ ప్రాంగణంలోని మొక్కలకు వాటి పేర్లు రాసి బోర్డులు అమర్చారు. కలెక్టరేట్‌కు ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం కోసం అందంగా తీర్చిదిద్దుతున్నారు.



పరాసుపేటలో జరిగిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్సీ అర్జునుడు, చైర్మన్ బాబాప్రసాద్, కౌన్సిలర్ వెంకట్రావు, డా.అల్లాడి శ్రీనివాసరావు తదితరులు

తాగునీటి సమస్య లేకుండా చేయాలి

మచిలీపట్నం-టౌన్: ప్రజలకు 2030 నాటికి తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పీపుల్స్ మానిటరింగ్ కమిటీ (పీఎంసీ) కన్వీనర్ మధుసూదనరావు అన్నారు. స్థానిక నవీన్‌మిట్టల్ కాలనీలో పీఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం తాగునీటి వినియోగం, పారిశుధ్య పరిరక్షణపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో మధుసూదనరావు మాట్లాడుతూ, తాగునీటి సమస్యల వల్ల ప్రజలకు అనారోగ్యం వాటిల్లుతోందన్నారు. 2030 నాటికి ప్రతి పట్టణం, ప్రతి పల్లెలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మేకావానిపాలెం సర్పంచ్ జొన్నల పాండురంగారావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో గోల్డ్ సంస్థ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, టీడీపీ నాయకులు వాలిశెట్టి తిరుమలరావు, షరీఫ్, శామ్యూల్, నరేష్, సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

అన్ని దానాల్లో రక్తదానం మిన్న

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు

మచిలీపట్నం-టౌన్: అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు అన్నారు. కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు, కొట్టె ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో స్థానిక పరాసుపేటలోని కె.వి.ఆర్.పార్కులో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అర్జునుడు మాట్లాడుతూ, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం ముదావహమన్నారు. మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ, పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు, ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు రక్తం ఇచ్చేందుకు వచ్చిన దాతలను మరచి పోలేమన్నారు. కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు మాట్లాడుతూ, తాము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం (చంటి), ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు నారగాని ఆంజనేయప్రసాద్, లోగిశెట్టి వెంకటస్వామి, నాయకులు గోపీచంద్, తలారి సోమశేఖర్, వెంకటరాజు, ఇలియాస్ పాషా, పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి జి.పాపరాజు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు అల్లాడ శ్రీనివాసరావు, కార్మిక సంఘ నాయకులు మజ్జి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. 98 మంది రక్తదానం చేశారు. చిలకలపూడి పోలీసు శర్మ 57వ సారి రక్తదానం చేసి అతిథుల ప్రశంసలు అందుకున్నారు.

సొంత భవనమున్నా.. అద్దె భవనం పైనే మోజు

మచిలీపట్నం-టౌన్: బందరు అర్బన్ సమగ్ర శిశు సంక్షేమాధికారి కార్యాలయ భవన నిర్మాణం పూర్తయినా కార్యాలయం ఇంకా అద్దె భవనాల్లోనే మూలుగుతోంది. స్థానిక పోర్టు రోడ్డులో అర్బన్ సీడీపీవో కార్యాలయానికి రూ.20 లక్షలతో నూతన భవనం నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయి ఏడాదైనా జిల్లా కోర్టు రోడ్డులో కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అద్దె చెల్లిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారే తప్ప నూతన భవనంలోకి వెళ్ళడం లేదు. దీనిపై సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఏడాదిగా ప్రారంభానికి నోచని సీడీపీవో బందరు అర్బన్ కార్యాలయ నూతన భవనం, జిల్లా కోర్టు పక్కన అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కివస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176
చికెన్ స్కిన్‌లెస్	186

బ్రాయిలర్ ధరలు

వెన్‌కాబ్ (రూ.లలో)

ఫారం ధర	84
రిటైల్ ధర	99
చికెన్ విత్ స్కిన్	139
చికెన్ స్కిన్‌లెస్	163

బులియన్

బిస్కెట్ (100 గ్రా)బిస్కెట్ బంగారం	రూ.3,00,000
22 క్యారెట్లు (10 గ్రా)	రూ.27,750
వెండి (కిలో)	రూ40,200
వెండి (10 గ్రా)	రూ.402

గన్నవరం నుంచి విమాన వేళలు

ఎయిరిండియా	**సమయం**
ఢిల్లీ	9.05 (మంగళవారం మినహా)
	17.20, 20.40(ప్రతిరోజూ)
హైదరాబాద్	12.10 (బుధవారం)
	17.20 (ప్రతిరోజూ)
విశాఖపట్నం	10.55(బుధవారం మినహా)
	15.35 (బుధవారం)
తిరుపతి	7.55(బుధవారం మినహా)
స్పైస్‌జెట్	
హైదరాబాద్	9.35 (ప్రతిరోజూ)
	17.35 (ప్రతిరోజూ)
చెన్నై	14.00 (మంగళవారం)
	17.20 (మంగళ మినహా)
బెంగళూర్	14.00 (మంగళ మినహా)
	20.00 (ప్రతిరోజూ)
ట్రూజెట్	
హైదరాబాద్	21.55 (ప్రతిరోజూ)
చెన్నై	7.55 (ప్రతిరోజూ)
	17.15 (మంగళ,బుధ, గురు)

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.59



మంత్రి సునీతకు అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ ఉద్యోగులు



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు



దుర్గగుడిలో ఆలయ ఉద్యోగికి బంగారు పుష్పాలు అందజేస్తున్న వెంకట రమణ

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సునీత

వన్‌టౌన్: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను రాష్ట్ర మంత్రి పరిటాల సునీత ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో ఆలయ వేదపండితులు మంత్రికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, అమ్మవారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం బహూకరించారు.

పూర్ణాహుతితో ముగిసిన వినాయక చవితి వేడుకలు

దుర్గగుడిలోని మల్లిఖార్జున మండపంలో ఆదివారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయంలో ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కె.సూర్యలత, ఐ.పెంచలయ్య, సిహెచ్.సాంబసుశీల, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు 108 బంగారు పుష్పాలు

కనకదుర్గమ్మకు కర్నూలు జిల్లా బేతంచర్లకు చెందిన గుండా వెంకటరమణ దంపతులు 108 బంగారు పుష్పాలను ఆదివారం ఆలయ ఉద్యోగులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి శేషవస్త్రం, అమ్మవారి చిత్రం, అమ్మవారి లడ్డూ ప్రసాదాలు బహూకరించారు.

ఉద్యోగ కల్పనలో ప్రభుత్వాలు విఫలం

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విజయవాడ సెంట్రల్: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలు అమలు చేయని కారణంగానే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఇంతగా పెరిగిందని మాజీ ఎమ్మెల్సీ కె. ఎస్. లక్ష్మణరావు ఆరోపించారు. వీటిని అమలు చేసే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్ని దగా చేశాయన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం మహాత్మాగాంధీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయం ఆడిటోరియంలో 'విభజన హామీలు-ఖాళీల భర్తీ-ఉపాధి, అభివృద్ధికై' సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా ప్రసంగించిన లక్ష్మణరావు మాట్లాడుతూ వెలగపూడిలో టెంపరరీ భవనాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. ఉద్యోగ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలో 1.42 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే భర్తీ చేసినవి కేవలం 6500 పోస్టులేనన్నారు. నిరుద్యోగ భృతిని కూడా ప్రభుత్వం ఇవ్వకుండా ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. యువత ఆందోళన బాట పట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. సూర్యారావు తదితరులు ప్రసంగించారు.

కార్మికులకు అండగా ఉంటాం

శ్రమశక్తి ట్రేడ్ యూనియన్, ఐఎఫ్‌టీయు నేతల భరోసా

విజయవాడ : గ్యాస్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు శ్రమశక్తి ట్రేడ్ యూనియన్ కొండంత అండగా ఉంటుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రి దుర్గారావు, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రామారావు భరోసా ఇచ్చారు. శ్రమశక్తి ట్రేడ్ యూనియన్ 14వ మహాసభ గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. కార్మికుల కోసం కొరగంజి శేఖర్‌బాబు స్మారకంగా అక్షయపాత్ర భోజన పథకాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్లు కొరగంజి జనగ్మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ సుబ్బారావు, గిరిజ శంకర్ వరప్రసాద్, గద్దె హరిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సెమిస్టర్ విధానానికి అంబేద్కర్ వర్సిటీ శ్రీకారం

విజయవాడ సెంట్రల్: విజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకునేలా తమ విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఈ విద్యా సంవత్సరం (2017-18) నుంచి సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తోందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.సి. ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని యూనివర్సిటీ ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో అధ్యయన కేంద్రానికి చెందిన అకడమిక్ కౌన్సిలర్లకు చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) గురించి వివరించేందుకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సుల్లో చేరే విద్యార్థులు సీబీసీఎస్ కిందనే సబ్జెక్టుల్ని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. గతానికి భిన్నంగా డిగ్రీ మొదటి సంవత్సరంలోనే బిఏ, బీకాం, బీఎస్సీ సబ్జెక్టుల్ని ఎంచుకోవాలని కోరారు. సబ్జెక్టుల ఎంపికలో విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థికి సిలబస్ భారం తగ్గుతుందన్నారు. కౌన్సిలర్లు సేవా భావంతో పనిచేయాలని కోరారు. అన్ని డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల గడువు సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఉందని తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించి అడ్మిషన్ తీసుకోవచ్చని పేర్కొన్నారు.

బక్రీద్ త్యాగాలకు ప్రతీక

పండుగ విశిష్టతపై పుస్తకావిష్కరణ

విజయవాడ : బక్రీద్ పండుగ త్యాగాల ప్రతీక అని, ఈ పండుగ ఆవశ్యకతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఫ్తి మొహమద్ ఫారూక్ ఖాసిమ్ అన్నారు. ఆదివారం ఆటోనగర్‌లోని 3వ రోడ్డులో డిస్పోజల్ సెంటర్‌లోని ధారుల్ ఖాజివల్ ఈఫ్తా మసీదులో బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను తెలుపుతూ సయ్యద్ అబ్దుల్ ఖాశిం రచించిన ఖుర్బానికా ఫజాయిల్ ఓ ముసాయిల్ పుస్తకావిష్కరణ జరిగింది.

ఈ సందర్భంగా ఫారూఖ్ మాట్లాడుతూ ఖురాన్ అవతరణ సర్వ మానవాళి ప్రగతి కోసమేనని పేర్కొన్నారు. ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది ముక్తార్ ఆలి మాట్లాడుతూ ముస్లింలను ఓటు బ్యాంకులుగా వాడుకుంటున్న ప్రభుత్వాలు వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. తాను రచించిన పుస్తకాలను ఐదు వేలు ముద్రించినట్లు, వాటిని వివిధ మసీదుల ద్వారా ప్రతి ముస్లింకు అందజేయనున్నట్లు తెలిపారు. హుదా బైతుల్ మాల్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఆలీం, ముఫ్తి ఉబైదుర్ రహ్మాన్, ఉలేమాలు, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు ఆదరణ

- కొల్లేరు గ్రామాల్లో పాఠశాలలు కళకళ
- పెరిగిన విద్యార్థుల సంఖ్య
- ఫలించిన విద్యాశాఖ కృషి



శృంగవరప్పాడు పాఠశాల గార్డెన్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం



జంగంపాడులో ఇంటింటికి తిరుగుతూ ఉపాధ్యాయుల అవగాహన (పాతచిత్రం)

(కైకలూరు)

కొల్లేరు గ్రామాల్లో వేసవి కాలంలో ఇంటింటికి తిరిగి కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాశాఖ 'బడిపిలుస్తోంది' 'అమ్మబడి'పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, బోధన, మధ్యాహ్న భోజన వసతి తదితర అంశాలను వివరిస్తున్నారు. అనేక గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తుండగా, కొల్లేరు గ్రామాల్లో అందుకు భిన్నంగా ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. 158 మంది విద్యార్థులు ప్రయివేటు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడమే అందుకు నిదర్శనం. ఉపాధ్యాయులు, గ్రామస్థులు కృషి ఫలితంగా మూతపడాల్సిన పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి.

కైకలూరు మండలంలోని కొల్లేరు గ్రామాలైన శృంగవరప్పాడులో ఒకటి నుంచి ఎనిమిదోవ తరగతి వరకు 186 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. తొమ్మిది మంది ఉపాధ్యాయులతో బోధన. పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణ నడుమ సువిశాలమైన క్రీడాప్రాంగణంతో పాఠశాల నిర్వహణ సాగుతుంది. పూల మొక్కల మధ్యన 1996 ప్రతిష్ఠించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం ఆకర్షణీయంగా ఉంది. ఇక్కడ 18 మంది ప్రభుత్వ పాఠశాలలో చేరారు. గుమ్మళ్ళపాడు ఎస్టీ కాలనీ, బీసీ ఏరియాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు 40 మంది, పందిరిపల్లిగూడెంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 68 మంది, కొల్లేటికోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 197 మంది విద్యార్థులు ఉన్నారు. పెంచికలమర్రు గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో 155 మంది హాజరవుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో 42 మంది ప్రయివేట్ పాఠశాలల నుంచి చేరారు. పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించడంతో పిల్లల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొట్టాడ పంచాయతీ పరిధిలోని ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 42 మంది, రాజులకొట్టాడ 27 మంది, జంగంపాడు పల్లిపాలెంలో 141 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. చటాకాయలో 28 మంది, నత్తగుళ్ళపాడులో 31 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

ఆకట్టుకునేలా విద్యాబోధన

అన్ని పాఠశాలలో దేశనాయకుల చిత్రపటాలు, విజ్ఞాన పరమైన బొమ్మలను ఏర్పాటు చేశారు. కంప్యూటర్, డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేస్తే ఈ సంఖ్య మరింత పెరుగుతుందని పలువురంటున్నారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం, విద్యాశాఖ మరిన్ని సౌకర్యాలను కల్పించాలని కొల్లేరు ప్రజలు కోరుతున్నారు.

బోధన బాగుంది..

నబిగారి కేధారి, 5వ తరగతి, శృంగవరప్పాడు



రెండేళ్ల ప్రయివేట్ పాఠశాలకు వెళ్ళాను. అక్కడి కంటే ప్రభుత్వ బడిలో బాగా చెబుతున్నారని తెలిసి ఇక్కడ చేరా. అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు.

ప్రోత్సాహం బాగుంది

బలే చరణ్, 6వ తరగతి, పెంచికలమర్రు



విద్యా బోధన, సౌకర్యాలు తెలిసి ప్రభుత్వ పాఠశాలలో చేరా. విద్య, క్రీడలు తదితర అంశాల్లో ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది. ప్రయివేట్ పాఠశాలలో ఆటలను ఆడించే వారు కాదు.

ప్రాంతానికొక మాట మాట్లాడడం సరికాదు

సీపీఎం నాయకులకు ఏఎంసీ చైర్మన్ చిరుమామిళ్ల సూచన

నందిగామ: సుబాబుల్ విషయంలో వామపక్ష నాయకులు ప్రాంతానికొక మాట మాట్లాడడం సరికాదని ఏఎంసీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు అన్నారు. విలేకర్లతో ఆదివారం మాట్లాడుతూ పరిశ్రమలు పెద్దయెత్తున మూత పడటంతో కర్ర కొనుగోళ్లు మందగించిన మాట వాస్తవమేనన్నారు. అంత మాత్రాన ప్రభుత్వ వైఫల్యమనడం సరికాదన్నారు. రాజకీయ అనుభవం ఉన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు వంటి నాయకుడు 143, 493 జీవోల గురించి మాట్లాడడం సరికాదన్నారు. ఈ జీవోలు కావాలంటూ ప్రకాశం, నెల్లూరు జిల్లాల వామపక్షాల నాయకులు అక్కడ పోరాటం చేశారన్నారు. సుబాబుల్ రైతుల విషయంలో అన్ని రాజకీయ పార్టీలూ కలసి పని చేద్దాం. కానీ రాజకీయ లబ్ధి కోసం ప్రాంతానికో మాట మాట్లాడడం మానుకోవాలన్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో వామపక్ష నాయకులతో ఆ జీవోలు రద్దు చేయాలని ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వల్లే కనీసం 35 వందల రూపాయలు రైతుకు వస్తుందన్నారు. సుబాబుల్ రైతుల సమస్యల పరిష్కారం కోసం పలు సమావేశాలు నిర్వహించామని, ఈనెల 30న రాష్ట్రస్థాయిలో మరో మారు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌పీఎం బకాయిలు త్వరలో రైతులకు ఇప్పించనున్నట్లు తెలిపారు.



శ్రీనివాసరావు

గాలికుంటు వ్యాధిని నిరోధిద్దాం

(పెదపారుపూడి)

పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకకుండా పశుపోషకులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని యలమర్రు పశువైద్య సంచాలకులు ఎం.ఎస్.ఎ.దివాకర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రబలడానికి గల కారణాలను వివరించారు.

- ఇది అంటువ్యాధి. ఒక పశువు నుంచి మరోదానికి తేలిగ్గా సోకుతుంది.
- పశువుకు 106 డిగ్రీల జ్వరం.
- నోటిలో, డెక్కల మధ్య బొబ్బలు, పుండ్లు
- కుంటడం, కొన్ని సందర్భాల్లో డెక్కలు ఊడిపోతాయి.



పశువుకు సోకిన గాలికుంటు వ్యాధి

- పాడిపశువుకు పొదుగుపై, చనులపై పొక్కులు ఏర్పడి పుండ్లుగా మారతాయి.
- ఈ వ్యాధి వల్ల పెద్దపశువుల్లో మరణాలు ఉండకపోవచ్చు. దాని సామర్థ్యం గణనీయంగా తగ్గుతుంది.
- లేగదూడలు ఈ వ్యాధి బారిన పడితే మరణాలు సంభవించవచ్చు.

ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చేపట్టిందని దివాకర్ తెలిపారు. ఇప్పటికే గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్రంగా దేశంలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. సెప్టెంబరు 25వ తేదీ వరకు వ్యాక్సిన్‌ను పశువులకు వేస్తామని ఆయన తెలిపారు. రైతులందరూ పశువులకు వ్యాక్సిన్ చేయించి గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులను కాపాడుకోవాని కోరారు.

బృందాలు ఏర్పాటు చేశాం..



గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయడం కోసం బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పశుపోషకులు సహకరించి వ్యాక్సిన్‌ను చేయించాలన్నారు. వ్యాధి రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే పశువులను కాపాడుకోవచ్చునన్నారు.

దివాకర్, పశువైద్య సంచాలకుడు

ఇంటింటికి వెళ్ళి వ్యాక్సిన్ వేస్తున్నాం



గాలికుంటు వ్యాధి, కాళ్ల కాలి వప్పు, కుండి, గాలిపోచమ్మ, గాలిసెగ వంటి వ్యాధులు రాకుండా పశుపోషకుల ఇంటికి వెళ్ళి వ్యాక్సిన్‌ను వేస్తున్నాం. ఒకవేళ రైతులు అందుబాటులో లేకపోతే పశువైద్య శిబిరానికి తీసుకువచ్చి వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలి. పశుజాతి అంతరించిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉంది.

డాక్టర్ వై.క్రాంతికుమార్, వెంట్రప్రగడ పశువైద్యాధికారి


పెడనలో..

బంటుమిల్లి మండలం మల్లేశ్వరంలో



గుడ్లవల్లేరు ప్రధాన కూడలిలో

నిమజ్జనోత్సవం


బంటుమిల్లిలో


కృత్తివెన్ను మండలం చినగట్టులో


ముక్త్యాలలో


ముక్త్యాల వద్ద కృష్ణానదిలో నిమజ్జనం


నందిగామ మండలం హనుమంతుపాలెంలో


తోట్లవల్లూరు మండల గుర్విందపల్లిలో


పెదపారుపూడి మండలం వానపాములలో


నందివాడలో..


తిరువూరులో..

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మచిలీపట్నం-టౌన్ : గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రధాన దేవాలయాల్లో, చవితి పందిళ్ళలో ఆదివారం వైభవంగా వినాయకునికి అర్చనలు, లక్ష్మీగణపతి హోమాలు, విశేష అలంకరణలు చేశారు. బుట్టాయి పేటలోని చిట్టి పిళ్ళారయ్య స్వామి వారి దేవాలయంలో స్వామి వారికి లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. కూచిపూడి నర్తకీమణులు ఉదయశ్రీ, రాజేశ్వరి నాట్యార్చన అలరించింది. అష్టపది, అన్నమయ్య కీర్తనలకు కళాకారిణులు నాట్యం చేశారు. రామానాయుడుపేటలోని గణపతి దేవాలయంలో స్వామికి హరిద్రాలంకరణ చేశారు. జిల్లా పరిషత్ సెంటర్‌లోని గణపతి ఆలయం వద్ద వినుకొండకు చెందిన హరికథకుడు ప్రసాద్ హరికథా గానం చేశారు. ఖొజ్జిలిపేట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వినాయక చవితి పందిరిలో విద్యార్థులకు లింగాష్టకం పఠన పోటీలు నిర్వహించారు.


అన్నమయ్య కీర్తనకు నాట్యం చేస్తున్న ఉదయశ్రీ, రాజేశ్వరి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ...


స్వామివారి ప్రసాదాలు ఏసీకి అందిస్తున్న ఈవో శారదాకుమారి

మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ సత్యనారాయణ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. స్వామికి నిత్య కల్యాణం జరిపించారు. ఈవో ఎం.శారదా కుమారి ప్రసాదాలు, చిత్రపటాన్ని జిల్లా ఏసీ దంపతులకు అందించారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు, నాగమల్లేశ్వరరావు, చెన్నకేశవ ఉన్నారు. కాగా, ఆదివారం ప్రత్యేకత కావటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిదర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలు పోసి, నాగవల్లీ వృక్షానికి ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో ఎం.శారదాకుమారి ఆధ్వ ర్యంలో ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దుర్గమ్మ సత్వర దర్శనమే లక్ష్యం

● దుర్గగుడి పాలకమండలి సభ్యుడు పద్మశేఖర్



మోపిదేవి : బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా త్వరితగతిన దర్శనం కలిగించటమే లక్ష్యంగా ధర్మకర్తల మండలి కృషి చేస్తుందని ధర్మకర్తల మండలి సభ్యుడు గూడపాటి పద్మశేఖర్ అన్నారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అర్చక బృందం శేషవస్త్రాలతో ఆయనను సత్కరించి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఆలయంలో ప్రస్తుతం రూ.120 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా చూడాల్సిందిగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. అమ్మవారి దర్శనం టిక్కెట్ల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రస్తుతం ఉన్న రూ.300ల టికెట్‌ను రూ.150లకు తగ్గించాల్సిందిగా త్వరలో జరిగే బోర్డు సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. చల్లపల్లి మండల టీడీపీ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మోపిదేవి ఇన్‌చార్జి సర్పంచ్ కె.పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు రావి రత్నగిరి, నాయకులు తొట్టెంపూడి పెదబాబు ఆయన వెంట ఉన్నారు.

సినిమాలు

నటరాజ్	: నక్షత్రం
రేవతి	: ఫిదా
మినీ రేవతి	: లై
వినాయక్	: జయజానకినాయక
సిరికృష్ణ	: అర్జున్‌రెడ్డి
సిరి వెంకట్	: వివేకం
వెంకటేశ్వర	: నేనే రాజు నేనే మంత్రి
రామ్‌శాంతి	: గౌతమ్‌నంద
బృందావన్	: విఐపి-2
రామరాజు	: ఆనందోబ్రహ్మ

చురుగ్గా ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం

- భాస్కరపురం, వలందపాలెంలో వేగంగా జరుగుతున్న పనులు
- మరో ఐదు చోట్ల నిర్మాణానికి ప్రణాళికలు


భాస్కరపురంలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

మచిలీపట్నం-టౌన్: పట్టణంలో అమృతపథకం కింద ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 13వ ఆర్థిక సంఘం నిధులతో భాస్కరపురంలో దాదాపు మూడు కోట్ల వ్యయంతో ట్యాంకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 1,400 కిలోలీటర్ల ఈ ట్యాంకుతో రెండు వార్డుల్లో తాగు నీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. 13, 14 ఆర్థిక సంఘం నిధులతో మందులగూడెం, గిలకలదిండిలో మరో రెండు ట్యాంకుల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించనున్నారు.

వలందపాలెం, చిలకలపూడిలో...

అమృత నిధులతో ట్యాంకులు, హెడ్ వాటర్ వర్క్ అభివృద్ధిపై ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఒక కోటి 47 లక్షల వ్యయంతో వలందపాలెంలో అమృత నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం ప్రారంభమైంది. చిలకలపూడిలో 500 కిలోలీటర్ల ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే ఇంకా పనులు ప్రారంభం కాలేదు. కాగా గడ్డిబజారు, రుస్తుంబాదాల్లో అమృతపథకం కింద మరో రెండు ట్యాంకులు నిర్మించేందుకు ఇంజనీర్లు ప్రణాళిక రూపొందించారు. నిధులు అందుబాటులోనే ఉన్నాయి. ఇలా మొత్తం ఏడు ట్యాంకుల నిర్మాణాలు పూర్తయితే పట్టణంలో తాగునీటి సమస్యకు పరిష్కారం ఏర్పడుతుంది. అమృత రెండో దశ కింద హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పైపులైన్ల నిర్మాణానికి పనులు చేపడతారు. ఇక్కడ పెద్ద స్థాయిలో నీటిని నిల్వ చేసేందుకు కావాల్సిన వనరులను సమకూర్చనున్నారు.

ఏడాదిలో నిర్మాణాలు పూర్తి చేస్తాం: చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, టీడీపీ పాలకవర్గం హయాంలో ఏడు ట్యాంకుల నిర్మాణాలు చేపట్టనున్నామని మునిసిపల్ చైర్మన్ బాబాప్రసాద్ తెలిపారు. ఏడాదిలో ట్యాంకుల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు పైపులైన్ల చివరి ప్రాంతాల్లో వేసవిలో నీరు రావడం లేదు. ట్యాంకుల నిర్మాణాలు పూర్తయితే పట్టణంలో తాగునీటి సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం ఏర్పడుతుందని చెప్పారు.


వలందపాలెంలో నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు


అవోపా సభలో మాట్లాడుతున్న చైర్మన్ బాబాప్రసాద్

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

మచిలీపట్నం-టౌన్: పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకు రావాలని మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. బుట్టాయిపేటలోని అన్నం వీరరాఘవయ్య కల్యాణ మండపంలో అవోపా ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని 120 మంది పేద విద్యార్థులకు లక్ష రూపాయలు నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చైర్మన్ మాట్లాడుతూ, అవోపా ఇస్తున్న సహాయం ఆసరాగా తీసుకుని విద్యార్థులు ఉన్నతస్థితికి ఎదగాలన్నారు. సంస్థ అధ్యక్షుడు నంబూరి గోపాలకృష్ణ, కార్యదర్శి కొల్లూరి రామమోహనరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్తగుండు రమేష్, కూరాళ్ళ రామచంద్రరావు, పాలకుర్తి సూర్యవరప్రసాద్, లక్ష్మీనందన్ తదితరులు ప్రసంగించారు. వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు చైర్మన్ బహుమతులు అందజేశారు. సీనియర్స్‌లో హేమలత, విజయశ్రీ, సాయిప్రియ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. జూనియర్స్‌లో జి.సాయిశివాని, బాలాంజనేయులు, లిఖిత ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు.

కలెక్టరేట్ ఆవరణలో ఎండుతున్న మొక్కలు

మచిలీపట్నం-టౌన్: కలెక్టరేట్ ఆవరణలో అధికారులు నాటిన మొక్కలు కొన్ని ఎండి పోతున్నాయి. కలెక్టరేట్ సమావేశపు హాలు ఎదురుగా నాటిన మొక్కలు ఎండి పోతున్నాయి. జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం నాటిన మామిడి మొక్క ఎండి పోయింది. నిత్యం పశువులు సంచరించే కలెక్టరేట్‌లో మొక్కలను పశువులు తినకుండా ట్రీ గార్డులు అమర్చారు. వర్షాలు కురవడం వల్ల మరికొన్ని మొక్కలు బతికాయి. ప్రస్తుతం కలెక్టర్ కలెక్టరేట్ ప్రాంగణంలోని మొక్కలకు వాటి పేర్లు రాసి బోర్డులు అమర్చారు. కలెక్టరేట్‌కు ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం కోసం అందంగా తీర్చిదిద్దుతున్నారు.


ఎండిపోతున్న ఈనెల 10న నాటిన మామిడి మొక్క


పరాసుపేటలో జరిగిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్సీ అర్జునుడు, చైర్మన్ బాబాప్రసాద్, కౌన్సిలర్ వెంకట్రావు, డా.అల్లాడి శ్రీనివాసరావు తదితరులు

తాగునీటి సమస్య లేకుండా చేయాలి

మచిలీపట్నం-టౌన్: ప్రజలకు 2030 నాటికి తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పీపుల్స్ మానిటరింగ్ కమిటీ (పీఎంసీ) కన్వీనర్ మధుసూదనరావు అన్నారు. స్థానిక నవీన్‌మిట్టల్ కాలనీలో పీఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం తాగునీటి వినియోగం, పారిశుధ్య పరిరక్షణపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో మధుసూదనరావు మాట్లాడుతూ, తాగునీటి సమస్యల వల్ల ప్రజలకు అనారోగ్యం వాటిల్లుతోందన్నారు. 2030 నాటికి ప్రతి పట్టణం, ప్రతి పల్లెలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మేకావానిపాలెం సర్పంచ్ జొన్నల పాండురంగారావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో గోల్డ్ సంస్థ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, టీడీపీ నాయకులు వాలిశెట్టి తిరుమలరావు, షరీఫ్, శామ్యూల్, నరేష్, సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

అన్ని దానాల్లో రక్తదానం మిన్న

ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు

మచిలీపట్నం-టౌన్: అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు అన్నారు. కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు, కొట్టె ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో స్థానిక పరాసుపేటలోని కె.వి.ఆర్.పార్కులో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అర్జునుడు మాట్లాడుతూ, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం ముదావహమన్నారు. మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ, పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు, ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు రక్తం ఇచ్చేందుకు వచ్చిన దాతలను మరచి పోలేమన్నారు. కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు మాట్లాడుతూ, తాము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం (చంటి), ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు నారగాని ఆంజనేయప్రసాద్, లోగిశెట్టి వెంకటస్వామి, నాయకులు గోపీచంద్, తలారి సోమశేఖర్, వెంకటరాజు, ఇలియాస్ పాషా, పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి జి.పాపరాజు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు అల్లాడ శ్రీనివాసరావు, కార్మిక సంఘ నాయకులు మజ్జి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. 98 మంది రక్తదానం చేశారు. చిలకలపూడి పోలీసు శర్మ 57వ సారి రక్తదానం చేసి అతిథుల ప్రశంసలు అందుకున్నారు.

సొంత భవనమున్నా.. అద్దె భవనం పైనే మోజు

మచిలీపట్నం-టౌన్: బందరు అర్బన్ సమగ్ర శిశు సంక్షేమాధికారి కార్యాలయ భవన నిర్మాణం పూర్తయినా కార్యాలయం ఇంకా అద్దె భవనాల్లోనే మూలుగుతోంది. స్థానిక పోర్టు రోడ్డులో అర్బన్ సీడీపీవో కార్యాలయానికి రూ.20 లక్షలతో నూతన భవనం నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయి ఏడాదైనా జిల్లా కోర్టు రోడ్డులో కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అద్దె చెల్లిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారే తప్ప నూతన భవనంలోకి వెళ్ళడం లేదు. దీనిపై సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఏడాదిగా ప్రారంభానికి నోచని సీడీపీవో బందరు అర్బన్ కార్యాలయ నూతన భవనం, జిల్లా కోర్టు పక్కన అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం

షెడ్యూల్డ్ కుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా కర్రా సుధాకర్

మచిలీపట్నం-రూరల్: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా కర్రా సుధాకర్‌ను ఎన్నుకొన్నట్టుగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సునీల్ కుమార్ ఆదివారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వై.శ్యాం కుమార్, సునీల్‌కుమార్, ట్రెజరర్ మద్దాల కృష్ణకుమార్ పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ సంఘం షెడ్యూల్డ్ సంఘానికి అనుబంధంగా పనిచేస్తుందన్నారు. షెడ్యూల్డ్ కుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శిగా రాందాసు, ఉపాధ్యక్షుడిగా గణేష్, సంయుక్త కార్యదర్శులు వినోద్, ధర్మతేజ, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శామ్యూల్, నరేష్, మనోహర్, సంజయ్‌గాంధీ, కోశాధికారిగా రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

స్థూలకాయం నడుము నొప్పికి ప్రధాన కారణం

మచిలీపట్నం-రూరల్: స్థూలకాయం నడుమునొప్పికి ప్రధాన కారణమని ప్రముఖ కీళ్ళు, వెన్నుముక శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రాళ్ళపల్లి రామ్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ వాకర్ భవనంలో ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రామ్‌ప్రసాద్ 'నడుము నొప్పి - చికిత్స - నివారణ' అనే అంశంపై విపులంగా వివరించారు. నడక ద్వారా స్థూలకాయం తగ్గించుకోవచ్చునన్నారు. యస్‌యల్‌ఆర్ పరీక్ష ద్వారా నడుము నొప్పి, దాని తీవ్రతను స్వయంగా పరీక్షించుకోవచ్చునన్నారు. ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే నడకను ప్రారంభించటం మంచిదని ఆయన అన్నారు. సమావేశంలో ఉదయపు నడక మిత్ర మండలి అధ్యక్ష, కార్యదర్శులు యక్కల కరుణాకరరావు, యం.కిశోర్, మహిళా విభాగం అధ్యక్షురాలు బి.వింధ్యారేణ, పెసల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

రైలు

సమయం	రైలు నెంబరు	సర్వీసు
బందరు-విజయవాడ ప్యాసింజరు	77208	తె.గం. 2.55
బందరు-విజయవాడ ప్యాసింజరు	77270	తె.గం.4.30
బందరు-విజయవాడ ప్యాసింజరు	77212	ఉ.గం.7.15
బందరు-గుడివాడ ప్యాసింజరు	77234	ఉ.గం.10.15
బందరు-విజయవాడ ప్యాసింజరు	27262	ఉ. గం.11.50
బందరు-గుడివాడ ప్యాసింజరు	77216	మ.గం.2.30
మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (సోమ, బుధ, శుక్ర)	17211	మ.గం.3.15
బందరు-విజయవాడ ప్యాసింజరు	77218	సా.గం.5.20
మచిలీపట్నం-తిరుపతి ఎక్స్‌ప్రెస్	17402	సా.గం.6.55
బందరు-గుడివాడ ప్యాసింజరు	77220	రాత్రి గం.7.20
మచిలీపట్నం- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్	17249	రా.గం.8.30
మచిలీపట్నం-విశాఖపట్నం ప్యాసింజర్	57229	రా. గం.9.10

ప్రయాణీకులకు ఏదైనా సమాచారం కావాల్సి వస్తే స్టేషన్ మాస్టార్ 0872-223684 కు ఫోన్ చేయవచ్చు

బస్సు

సమయం	బస్సుసర్వీసు
తె.గం.4.00	బందరు-కాకినాడ ఎక్స్‌ప్రెస్
తె.గం.5.00	బందరు-తిరువూరు ఎక్స్‌ప్రెస్
తె.గం.5.30	బందరు-రాజమండ్రి ఎక్స్‌ప్రెస్
ఉ.గం.7.00	బందరు-తిరుపతి సూపర్ లగ్జరీ
ఉ.గం.7.40	బందరు-నరసాపురం ఎక్స్‌ప్రెస్
ఉ.గం.8.30	బందరు-రాజమండ్రి ఎక్స్‌ప్రెస్
ఉ. గం.9.45	బందరు-తిరువూరు ఎక్స్‌ప్రెస్
ఉ.గం.11.00	బందరు-బెంగుళూరు సూపర్ లగ్జరీ
సా.గం.4.00	బందరు-తిరుపతి సూపర్ లగ్జరీ
సా.గం.5.10	బందరు-రాజమండ్రి ఎక్స్‌ప్రెస్
రాత్రి.గం.6.00	బందరు-విశాఖపట్నం సూపర్ లగ్జరీ
రాత్రి.గం.7.00	బందరు-విశాఖపట్నం సూపర్ లగ్జరీ
రాత్రి.గం.8.00	బందరు-విశాఖపట్నం సూపర్ లగ్జరీ
రాత్రి.గం.8.45	బందరు-జీడిమెట్ల సూపర్ లగ్జరీ
రాత్రి.గం.9.00	బందరు-కెపిహెచ్‌బి ఇంద్రా ఏసి
రాత్రి.గం.9.15	బందరు-బాచుపల్లి(హైదరాబాద్)సూపర్‌లగ్జరీ
రాత్రి.గం.9.30	బందరు-బిహెచ్‌ఇఎల్ సూపర్ లగ్జరీ
రాత్రి.గం.9.45	బందరు-ఇసిఐఎల్ సూపర్‌లగ్జరీ
రాత్రి.గం.10.00	బందరు-బిహెచ్‌ఇఎల్ సూపర్‌లగ్జరీ

బస్సుల సమాచారం కోసం 08672-227000

రైతుబజార్ ధరలు



టమాటో 36.00, వంగ 25.00 బెండ 16.00, పచ్చిమిర్చి 16.00, కాకర 16.00, బీర 15.00, క్యాబేజి 14.00, క్యారెట్ 60.00, దొండ 16.00, బంగాళాదుంప 14.00, ఉల్లిపాయలు 13.00, గోరుచిక్కుళ్ళు 18.00, దోస 12.00, సొర 8, పొట్ల 10, అరటి 8, చిక్కుడుకాయలు 32, చామ 26.00, మునగ 5, ఆకుకూరలు కట్ట 2.00, కంద 30.00, బీట్‌రూట్ 22.00, కీరదోస 26.00, బీన్స్ 54.00, కాప్సికం 40.00, అలచంద 20.00, విడి గోంగూర కేజి 40.00, చిలకడదుంప 25.00, నిమ్మకాయలు 12.00, బొప్పాయి 15.00, కొత్తిమీర 10, పొదీనా 6, మామిడి 10, కొబ్బరికాయలు 16, అల్లం కేజి 62.00, వెల్లుల్లి కేజి 70.00, ముల్లంగి 7.00

గ్యాస్ సమాచారం

- నవ్య భారత్ ఎంటర్ ప్రైజెస్ గ్యాస్ సరఫరా తేదీ 27 వరకు, ఫోన్:254399, 254377, ఆన్‌లైన్ బుకింగ్ నెం.9440156789
- శ్రావ్య ఇండేన్ గ్యాస్ (బెల్ ఎదురు) 27 వరకు, ఫోన్: 224559, ఆన్‌లైన్ బుకింగ్ 9848824365
- సోమేశ్వర ఎంటర్‌ప్రైజెస్ (ఇండేన్, సుకర్లాబాద్) 27 వరకు, ఫోన్:222828, 223536, ఆన్‌లైన్ బుకింగ్ 9848824365
- వరదరాజులు అండ్ సన్స్(రాజా సెంటర్) హెచ్‌పి గ్యాస్,ఏ రోజుకారోజు ఫోన్: 222726, 223131, ఆన్‌లైన్ బుకింగ్ 9666023456
- విజేత ఎంటర్ ప్రైజెస్ చెమ్మనగిరిపేట (హెచ్‌పి), 27 వరకు, ఫోన్:222277, 223377, ఆన్‌లైన్ బుకింగ్ 9666023456
- లలిత భారత్‌గ్యాస్ ఏజన్సీస్, టౌన్‌హాలు ఎదురుగా, ఏ రోజుకా రోజు సరఫరా, ఫోన్: 222345, ఆన్‌లైన్ బుకింగ్ 9440156789

ఏవైనా సమస్యలు ఉంటే పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారు 9642036773కు ఫోన్ చేయాలి

మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలి

మునిసిపల్ వైస్ చైర్మన్ కాశీ విశ్వనాథం

మచిలీపట్నం-రూరల్: మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవలు చేయడం అభినందనీయమని మునిసిపల్ వైస్ చైర్మన్ పంచపర్వాల కాశీ విశ్వనాథం అన్నారు. పట్టణంలోని చిలకలపూడి సెంటర్‌లో మదర్ థెరిస్సా విగ్రహం వద్ద 107వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాట్లాడుతూ, మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకుని నవచైతన్య మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు. సమితి గౌరవాధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, 11 సంవత్సరాలు మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో పేద ప్రజలకు సేవలు అందించామన్నారు. రక్తదాన శిబిరాలు, నిరుపేదలకు సాయం తదితర కార్యక్రమాలను సమితి చేస్తోందన్నారు. థెరిస్సా జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని అందరు సమాజ సేవ చేయాలని సమితి అధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్ అన్నారు. కేక్ కట్ చేసి, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లాడి రాజా, కుమ్మరి జలాచంద్రుడు, గుంపెన రమేష్, నాంచారయ్య, హైదరాబాద్ మదర్ థెరిస్సా ట్రస్టు గౌరవ అధ్యక్షుడు గ్రంధి విజయ్‌కుమార్, వైశ్యాబ్యాంక్ అధికారి తాడేపల్లి రమేష్, చలమలశెట్టి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మదర్ థెరిస్సా సేవా సమితి సభ్యులు

రంగస్థల కళకు పూర్వ వైభవం తేవాలి

మచిలీపట్నం-కల్చరల్: రంగస్థల కళకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కళాకారులు, కళాభిమానులు ముందుకు రావాలని మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ పిలుపు నిచ్చారు. మచిలీపట్నం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక సువర్ణ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమాలలో చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీవీ వంటి ప్రముఖ రంగస్థల కళాకారులు జన్మించిన బందరు అప్పట్లో రాష్ట్రానికే రంగస్థల కళకు తల మానికంగా ఉండేదన్నారు. తాను టికెట్ కొని నాటకాలు చూసిన రోజులు ఉన్నాయన్నారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను పారంభించారు. రంగస్థల కళకు సంఘం చేస్తున్న కృషిని బాలాజీ అభినందించారు. సంఘ అధ్యక్షుడు చలమల శెట్టి గాంధి అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేతవరపు శివకుమార్ మాట్లాడుతూ, రంగస్థల కళలో ఎన్నో లలిత కళలు దాగి ఉన్నాయన్నారు. ఈ సభలో కార్యదర్శి శ్రవణం లక్ష్మీపతి, బి.సత్యనారాయణ సింగ్, బొడ్డు నాగరాజు, భవిష్య, బెల్లంకొండ ఏడుకొండలు, బి.పుల్లారావు, చలమల శెట్టి కోటేశ్వరరావు, యెండూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. లోకుమూడికి చెందిన పత్తిపాటి సునీల్ బాబు ప్రదర్శించిన భవాని శంకర, కంకటావకు చెందిన గొంతుపులి రాజు ప్రదర్శించిన శ్రీకృష్ణుడు ఏకపాత్ర, పెడనకు చెందిన మెట్ల జీవన్ ప్రదర్శించిన చాణక్య, సూరిశెట్టి గంగరాజు ప్రదర్శించిన లాజరస్, కోట సుబ్బారావు ప్రదర్శించిన దశరథ, పలగాని కోటేశ్వరరావు ప్రదర్శించిన సామ్రాట్ అశోక ఏకపాత్రలు అందరినీ అలరించాయి. అనంతరం పేద కళాకారులకు దుస్తులు అందచేశారు.





రంగస్థల కళాకారుల సంఘ వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న బాలాజీ, భవానీ శంకరుని ఏకపాత్రాభినయం చేస్తున్న పత్తిపాటి సునీల్

ఇటు తొలగింపు.. అటు ఆక్రమణలు

మచిలీపట్నం-టౌన్: పట్టణంలో ఒక పక్క టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు రోడ్ల పక్కన ఆక్రమణలు తొలగిస్తుండగా కొత్తగా ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా కోర్టు సెంటర్‌లో రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించి బడ్డీషాపులు నిర్మిస్తున్నారు. జిల్లా కోర్టు సెంటర్‌లో సాయిబాబా విగ్రహం నుంచి జిల్లా కోర్టు వరకు రోడ్డుకు ఇరుపక్కల బడ్డీ షాపులు వెలుస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే లక్ష్మీటాకీసు సెంటర్‌లో రోడ్ల మార్జిన్లు ఆక్రమణలకు గురయ్యాయి. స్టేట్ బ్యాంకు రోడ్డు పక్కన అద్దెకు ఇచ్చే ఎక్స్‌కవేటర్‌ను ఉంచుతున్నారు. దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఆక్రమణల తొలగింపుపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



జిల్లా కోర్టు రోడ్డులో గ్రంథాలయం పక్కన ఆక్రమించి నిర్మిస్తున్న షాపు

అమలు అంతంత మాత్రమే

● అందరికీ అందని అన్నఅమృత హస్తం ● అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమి ● రేషన్ బియ్యంతో భోజనం ● రాకపోకలకూ ఇబ్బందే



ఖాళీగా ఉన్న నూజివీడు అంగన్‌వాడీకేంద్రం



అంగన్‌వాడీకేంద్రంలో బాలింత, చిన్నారులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో 37 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్నఅమృతహస్తం పథకం అమలు అంతంత మాత్రమే. పట్టణంలో ప్రీస్కూళ్ళు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మినహా ఎక్కడా సౌకర్యాలు లేక పోవడంతో అంగన్‌వాడీ పరిధిలో బాలింతలు, గర్భిణీలు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 37 కేంద్రాలకు 337 మంది గర్భిణులు, 299 మంది బాలింతలతో కలుపుకుని రెండు వేల మంది చిన్నారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సి ఉండగా, అందులో సగం మంది మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అమ లు కాలేదు. బాలింతలు, గర్భిణులకు ప్రతిరోజూ ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనం ఐరన్ ట్యాబ్‌లెట్లను అంగన్‌వాడీ కేంద్రాల అందించాల్సి ఉంది. దీంతో కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు సుమారు 3 నుంచి 4 గంటల సమయం ఉండాల్సిన పరిస్థితి ఉంది. వారు కిందే కూర్చోవాల్సి ఉండడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల లేమి

నూజివీడు రూరల్ : నూజివీడు మండల పరిధిలో మొత్తం 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో మూడు వేల మంది చిన్నారులకు, 478 మంది బాలింతలు, 599 మంది గర్భిణులు అన్న అమృతహస్తం పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. దాదాపు సగానికి పైగా ఈ పథకాన్ని వినియో గించుకుంటున్న దాఖలా కనిపించటం లేదు. విద్యుత్‌బిల్లులు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను గ్రామపంచాయతీలకు అందించినా అవి అన్ని గ్రామాల్లోనూ అమలు కావడం లేదు. మరోవైపు బాలింతలు సిజేరియన్ల కారణంగా అంగన్‌వాడీకేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారుతోంది.

రేషన్ బియ్యంతో ఇబ్బందులు

చాట్రాయి : ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అన్న అమృతహస్తం పథకం గర్భిణిలు, బాలింతలకు వరం అయినా కోటా బియ్యం వల్ల నీరు గారి పోతున్నది. మండల కేంద్రం చాట్రాయిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం గుడ్డు, పాలు పోషకవిలువలు కలిగిన కూరతో భోజనం పెడుతున్నారు కానీ కోటా బియ్యం వల్ల గర్భిణిలు, బాలింతలు కడుపు నిండా భోజనం చేయలేకపోతున్నారు. కోటా బియ్యంవల్ల అరుగుదల ఉండక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం మంచి బియ్యం ఇస్తుందనే ఆశతో రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నట్లు పలువురు చెప్పారు. కొంతమంది ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని గుడ్డు, కూరతో భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం పెట్టించుకుని తీసుకు వెళుతున్నారు. కేంద్రానికి రాలేని నిండుగర్భిణిలు, పచ్చి బాలింతలకు మాత్రం భోజనం వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇళ్ళకు పంపుతున్నారు. ప్రభుత్వం కోటా బియ్యానికి బదులు మంచి బియ్యం సరఫరా చేస్తే అన్న అమృతహస్తం పథకం మంచి ఫలితాలిస్తుంది.

అధికారుల వైఫల్యం

విస్సన్నపేట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలుకు అధికారులు సమర్ధంగా పనిచేయటం లేదనే విమర్శలు నెలకొన్నాయి. బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకు రావడంలో వైఫల్యం చెందుతున్నారు. గర్భిణులు, బాలింతల బంధువులు వచ్చి ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారే తప్ప అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్న నిబంధనను సమర్ధంగా అమలు జరపటం లేదు. కొన్ని కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు ఇంటి వద్ద నుంచి అన్నం తెచ్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలతో భుజించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చిన రేషన్‌బియ్యం ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో అన్నం పెట్టాలని కోరుతున్నారు.

ఏటీత..లంకమేత..చందం

ఆగిరిపల్లి : రేషన్ బియ్యం అన్నం తినడం ఇష్టంలేక కొందరు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ఆసక్తి చూపటం లేదు. గర్భిణిలు, బాలింతలు పాలు, గుడ్డుకోసం, మధ్యాహ్నం భోజనం కోసం రెండు దఫాలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివాసం ఉండేవారు ఈ పథకానికి దూరమవుతున్నారు. భోజనం కోసం నడిచి రావాల్సి రావడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో భోజనానికి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. కొందరు మాత్రం వచ్చి అంగన్‌వాడీల్లో అసౌకర్యాల నడుమ భోజనం చేయలేక క్యారేజిల్లో భోజనం తీసుకువెళుతున్నారు. లంక మేత కోసం ఏటిఈతలా ఉందని వాపోతున్నారు. మండలంలో మొత్తం 67 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా, 470మంది గర్భిణిలకు 373 మంది, 413 మంది బాలింతల్లో 322 మంది అన్న అమృతహస్తం పథకంలో భోజనం చేస్తుండగా భోజనం నాణ్యతలేక కొన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో ఈ పథకంపై పెదవివిరుస్తున్నారు.

ముసునూరు మండలంలో

మండలంలోని 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో 382 మంది బాలింతలు, 437మంది గర్భిణులు, 3550 మంది చిన్నారులు అన్నఅమృతహస్తం పథకం ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇందులో 270 మంది బాలింతలు, 300 మంది గర్భిణుల మాత్రమే పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. చిన్నారులకు మాత్రం మెనూ ప్రకారం ఆహారం అందించటం లేదనే విమర్శలు ఉన్నాయి. కూరగాయలు తదితర వస్తువులను అంగన్‌వాడీకార్యకర్తలే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీనుండి రూ.5వేలు నిధులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు నిధులు అందలేదు. సౌకర్యాల లేమితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యంలో నాణ్యత లేకపోవడంతో సరిగ్గా ఉపయోగించుకోలేక పోతున్నారని సర్వత్రావిమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుడివాడలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర నేడు

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర సోమవారం గుడివాడలో జరుగుతుంది. ఈనెల 26న హనుమాన్ జంక్షన్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారంనాడు నూజివీడులో జరిగింది, తిరువూరు, నందిగామలో పర్యటనను పూర్తి చేసుకుని విజయవాడకు చేరుకుంది. సోమవారం గుడివాడ, మచిలీపట్నం, చల్లపల్లి, ఆవనిగడ్డ, రేపల్లెలో ఈ యాత్ర సాగుతుంది.

ఎన్నికల్లో బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

● యువతకు రమేష్‌నాయుడు సూచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికలలో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్ళొద్దని బీజేపీ యువమోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యాలయ మీడియా సెల్ ఇన్‌ఛార్జి దిలీప్‌లతో కలిసి మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా రూపొందించేందుకు తమ పార్టీ తరఫున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బీజేపీ,టీడీపీకి ఉమ్మడి శత్రువులుగా ఉన్న కొందరు అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటితో పాటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యంగా కొందరు నాయకుల మాటలు విని యువత బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, దీని జోలికి పోవద్దని వారు సూచించారు.

ఆల్ మునిసిపల్ ఇంజనీర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

● ప్రెసిడెంట్‌గా ఎంపికయిన టి.రంగారావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జోన్-2 ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాటర్ సప్లై డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న టి.రంగారావు ఎంపికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్-2కు చెందిన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు. జోన్-2 కమిటీ ఎంపికలో సెక్రటరీగా అసిస్టెంట్ ఇంజనీరు డి.దుర్గారావు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా జె.ఫణి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు కే.వి. సాయిప్రసాద్, ట్రెజరర్‌గా విజయవాడ సర్కిల్-1 ఈఈగా పనిచేస్తున్న కే.కోటేశ్వర్రావు, సభ్యులుగా డీఈఈ ఎంసీఎస్.పాత్రుడు, డీఈఈ వి.పద్మాకర్ ప్రసాద్, ఏఈ కే.రాజ్‌కుమార్, ఏఈ పి.సూర్యకుమారి, ఏఈ డి.లక్ష్మీనారాయణ, ఏఈ డి.రామకిషోర్, డీఈఈ అబ్దుల్ రహీమ్, బి.హెచ్.సుబ్బారావు డీఈఈ, ఏఈ నాగేశ్వర్రావు ఎంపికయ్యారు.

డేరాబాబాతో లాలూచి వల్లే ఉత్తరాదిలో విధ్వంసం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

విజయవాడ : సిపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో దేరా బాబా సహకారంతో హర్యానాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. డేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. హింస చెలరేగే ప్రమాదం ఉన్నదని ముందే ఊహించి 200 రైళ్లను రద్దు చేసిన ప్రభుత్వం డేరాబాబా 200 వాహనాల కాన్వాయ్‌తో కోర్టు హాజరయ్యేందుకు ఎందుకు అనుమతించిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో దళితులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, అభద్రతాభావంతో వారు జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ఎండగడుతూ నెల రోజులూ ప్రచార కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. చోటామోటా నాయకులకు వారి విలువను బట్టి రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వెచ్చించి కొనుగోలు చేస్తున్నందున ఎన్నికల బదులుగా వేలాన్ని నిర్వహిస్తే సబబుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎక్కడికక్కడ నోట్లను ప్రధాన పార్టీలు వెదజల్లుతున్నాయని తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టిడీపీ, వైకాపా పోటీలు పడిమరీ ఓటర్లను కొనుగోలు చేశాయన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

31 లోగా పాన్‌కార్డ్‌కు ఆధార్ లింక్

ఆదాయ పన్నుశాఖ గడువు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఆదాయ పన్ను చెల్లింపు దారులతో పాటు, ఇటీవల కొత్తగా రిటర్న్‌లు దాఖలు చేసినవారు ఈనెల 31 లోగా తమ పాన్ నెంబర్లకు ఆధార్ లింక్ చేయాలని ఆదాయపు పన్ను శాఖ సూచించింది. సుప్రీం కోర్టు ఇటీవల ఆధార్‌పై ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆధార్ లింక్ చేయకుండా వుండటానికి వీలులేదని ఆదాయ పన్నుశాఖ ప్రకటించింది. ఆదాయ పన్ను రిటర్న్‌లు దాఖలు చేసిన వారిలో ఇప్పటివరకు సగం మంది మాత్రమే ఆధార్‌తో లింక్ అయినట్లు గుర్తించింది. అయితే మరోకొంత మంది ఆధార్‌లింక్ అయినప్పటికీ రిటర్న్‌లు దాఖలు చేసి రిజిస్టర్ చేయించుకోలేదని కూడా వెల్లడించింది. అయితే దాఖలు అయిన రిటర్న్‌లలో ఇప్పటివరకు నాలుగో వంతు రిటర్న్‌లను ఇ- వెరిఫికేషన్‌ను నిర్వహించినట్లు తెలు స్తోంది. ఉదాహరణకు సుమారు లక్ష మంది రిటర్న్‌లు దాఖలు చేస్తే వారిలో 25 వేల రిటర్న్‌లను మాత్రమే ఇ వెరిఫికేషన్ అయ్యాయి. ఇ వెరిఫికేషన్‌లో ఏదైనా తేడాలు వచ్చినట్లయితే వాటిని సరి చేసుకోవాలని లేక పోతే నోటీసు వచ్చే అవకాశం ఉంది.

29బి చెల్లదు..

ఆదాయ పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లు దాఖలు చేయడానికి గాను ఫారం 29బి ద్వారా ఒక డిక్లరేషన్ ఇచ్చేవారని, ఇప్పుడు అది చెల్లదని కొత్త ఫార్మెట్‌లో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుం దని, దీనిని త్వరలోనే ప్రకటిస్తామని ప్రత్యక్ష పన్నుల బోర్డు ప్రకటించింది. ఇ ఫైలింగ్ చేసే వారికి త్వరలో కొత్త ఫార్మెట్ అందుబాటులోకి వస్తుందని, అప్పటి దాకా వేచి ఉండాలని సూచించింది.

ఈపోస్ ద్వారానే ఎరువుల పంపిణీ

వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్

పెనమలూరు : కేంద్రం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి తీసుకురానున్న ఈపోస్ ద్వారానే రైతులకు ఎరువులు డీలర్లు పంపిణీ చేయాల ని అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. పోరంకి సాయి కల్యాణ మండపంలో జిల్లా ఆదివారం ఎరువులు, పురుగుల మందుల రిటైల్ డీలర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో వలే ఎరువుల దుకాణం వద్దకొచ్చి రైతు ఎన్ని బస్తాలు కావాలంటే అన్ని అందించే విధానానికి స్వస్తి పలకాలని, రసీదులు ఇక ఉండదన్నారు. భూమి విస్తీర్ణత, సాయిల్ టెస్ట్ ద్వారా ఆ రైతుకు చెందిన భూమికి ఎంత మేరకు ఎరువులు అవసరమవుతాయో ఈపోస్ విధానంలో తెలిసిపోతుందన్నారు. రైతు ఆధార్, వేలిముద్ర వల్ల అతనికి చెందిన వ్యవసాయ పద్ధతి, విధివిధానం మొత్తం తెలిసిపోతుందన్నారు. అదే విధంగా జీఎస్టీ తప్పక అమలు చేయవల్సి ఉంటుందన్నారు. సంఘ అధ్యక్షుడు విజయ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సునీత కుమార్, అగ్రికల్చర్ అధికారి శ్రీనివాసరావు, ఆడిటర్ లక్ష్మణరావు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, సభ్యులు పాల్గొన్నారు.

రికవరీకి చర్యలు!

● సీఎంఆర్ రాకపోవడంతో మిల్లుల నిర్వాహకులకు నోటీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సీఎంఆర్ రాకపోవడంతో మిల్లర్ల నుంచి రికవరీకి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కచ్చితమైన విధానం లేకపోవడం వల్ల పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్‌కు బియ్యం మిల్లుల నుంచి రావాల్సిన కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పెండింగ్‌లో ఉంటోంది. 2014-2015 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ఐదు రైసు మిల్లర్ల నుంచి సుమారు రెండు వేల క్వింటాళ్లకు పైగా సీఎంఆర్ రావాల్సి ఉండడంతో ఆ మిల్లులకు రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద క్రిమినల్ నోటీసులు పంపినట్లు జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజర్ వరకుమార్ ఆంధ్రజ్యోతికి చెప్పారు. త్వరలో వారి నుంచి సీఎంఆర్‌ను రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు ఆయన తెలియజేశారు.. నాగాయలంక మండలంలో ఒకటి, గుడ్లవల్లేరులో ఒకటి, గుడివాడలో రెండు మిల్లులు, హనుమాన్ జంక్షన్‌లో ఒక మిల్లుకు క్రిమినల్ నోటీసులు అందాయి.

రికవరీ సాధ్యమేనా..

మిల్లర్ల నుంచి రావాల్సిన రికవరీపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మిల్లర్ల నుంచి సీఎంఆర్‌ను రాబట్టాలంటే సరుకును, సరుకు లేదంటే మిల్లును వేలం వేయాలి మిల్లులు ఇతరత్రా రుణాలు చెల్లించాల్సి వున్నా, తనఖా వంటివి ఉన్నా రికవరీ కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బ్యాంక్ గ్యారంటీతో మెరుగు పడిన పరిస్థితి

సీఎంఆర్‌ను రాబట్టడంలో ఎదురవుతున్న పరిస్థితులు, అలాగే మిల్లర్లకు ధాన్యం తోలిన తరువాత వారి చుట్టూ తిరగడం, ఇంకా ఇతర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మిల్లర్లను బ్యాంక్ గ్యారంటీ పరిధిలోకి తీసుకువచ్చారు. గతంలో సీఎంఆర్ ఇవ్వడానికి మిల్లర్లకు గడువు పెట్టినా, ఆ గడువును పొడిగించుకోవడం, అధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉండేది, వీటి పరిష్కారానికి రెండేళ్ల నుంచి మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ తీసుకుంటున్నారు. ఎంత ధాన్యాన్ని తీసుకుంటున్నారో, అంత ధాన్యానికి సంబంధించిన విలువకు బ్యాంక్ గ్యారంటీ చూపించిన తరువాత దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆన్‌లైన్‌లో సంబంధిత మిల్లుకు ధాన్యాన్ని తోలుతారు. అది కూడా గ్యారంటీ ఇచ్చిన మొత్తాని కంటే ఎక్కువ మొత్తం ధాన్యం తోలడానికి వీలులేదు. ఒక వేళ అదనంగా తోలినట్లయితే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇప్పుడు రబీలో 3.50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని మిల్లర్లకు తోలారు. దీనికి గాను ఇంకా పది శాతం మేరకు సుమారు 30,189 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ రావాల్సి ఉంది. ఇటీవల సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సర్వర్‌లో సమస్యలు తలెత్తడంలో వసూలు చేయడానికి వీల్లేని పరిస్థితి ఉందని, త్వరలో వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఇప్పుడు బ్యాంక్ గ్యారంటీ ఉంది గనుక మిల్లర్లు సీఎంఆర్‌ను ఎగ్గొట్టడానికి వీలులేదని అధికారులు చెబుతున్నారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు మిల్లర్లకు సీఎంఆర్ ఇవ్వటానికి గడువు ఉందని , ఆ తరవాత చర్యలు ఉంటాయని తెలుస్తోంది.

సీఎంఆర్ అంటే

మిల్లులకు ఇచ్చిన ధాన్యంలో క్వింటాకు 68 కిలోల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్‌కు అప్పగించాలి. మిల్లుల నుంచి తీసుకునే బియ్యాన్ని కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అంటారు. దీనికి గాను మిల్లర్లకు కూడా ప్రతిఫలం ఉంటుంది. ఇతర త్రా నిబంధనలు కూడా అమలు చేస్తూ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు మిల్లర్లు బియ్యం అప్ప గించాలి. ఇప్పుడు దాదాపు 2000 క్వింటాళ్ల బియ్యం (సీఎంఆర్) రావాల్సి ఉంది.

రైతులకు మేలు కలగాలి

బలరాం జయంతి సభలో జలగం కుమార స్వామి



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి

పటమట : వ్యవసాయ అనుబంధ పంటలు విస్తరించి రైతులకు మేలు కలగాలని రాష్ట్ర కిసాన్ సంఘ్ అధ్యక్షుడు జలగం కుమార స్వామి అన్నారు. బలరాం (నాగలి) జయంతి సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్, గో ఆధారిత వ్యవసాయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పటమట ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బలరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్గానిక్ మందులు వాడకం నివారించి పాత పద్ధతులను అవలంబించి వ్యవసాయ ఉత్పత్తులను పండించాలన్నారు. వ్యవసాయ ఉత్తత్తులకు పేరొందిన ఏపీలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను పండించే రైతులకు గిట్టుబాటు ధర నిర్ణయించుకునే అవకాశాన్ని కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి శ్రీకృష్ణ, గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆశా కిరణ్, నారాయణ ప్రసాద్, ఫన్‌టైమ్స్ కార్యదర్శి వేమూరి సాంబశివరావు, ఉమామహేశ్వరరాజు, గాంధీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనసుకు, భాషకు అవినాభావ సంబంధం : పాల్



మాట్లాడుతున్న సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పాల్

పటమట : మనసుకు భాషకు అవినాభావ సంబంధం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ సైకాలజిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యు.పాల్ అన్నారు. త్రివేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సైకాలజిస్టులు, ఉపాధ్యాయులకు నాచురల్ ప్రొనౌన్సియేషన్ లాంగ్వేజ్ (ఎన్ఎల్‌పీ, సహజ భాష)పై ఒకరోజు శిక్షణ జరిగింది. పాల్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు, మహిళలు, యువత ఏ రంగంలో పనిచేస్తున్నా ఆ రంగంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఎన్ఎల్‌పీ అద్భుతమైన ప్రక్రియన్నారు. రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు వి. రమేష్, ప్రత్యూష సుబ్బారావు ఎం.ఎం. ముఖర్జీ, ఎమ్. రాణి, సోమయాజులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే ముఖ్యం



పెసర నిల్వలను పరిశీలిస్తున్న మంత్రి దేవినేని ఉమా

మైలవరం టౌన్: రైతు ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మైలవరం మార్కెట్ యార్డులో 400 క్వింటాళ్ళ పెసర నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివారం వ్యాపారులతో సమావేశం నిర్వహించి దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. .మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు క్వింటా పెసలుకు రూ.5200లు చెల్లించాల్సిందేనన్నారు. ఇందుకోసం ఈనెల 29న సబ్ కలెక్టర్ కార్యాలయంలో జేడీ అగ్రికల్చర్, జేడీ మార్కెటింగ్, డీఎం మార్క్‌ఫెడ్‌లతో సమావేశం నిర్వహిస్తామని తెలియజేశారు. మార్కెట్ యార్డుల్లో కూడా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిందేనని తెలిపారు. మిల్లర్లు, కమిషనర్ల బాగోతాలు బయటపెట్టేందుకు విజిలెన్స్ దాడులకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో ధరకు రిటైల్ ధరకు సుమారు రూ.2వేలు తేడా రావడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. తప్పకుండా మద్దతు ధరకు రైతుల వద్ద కొనుగోలు చేయాల్సిందేనని చెప్పారు. ఏఎంసీ ఛైర్మన్ దనేకుల సాంబశివరావు, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వెంకటేశ్వరరావు, తాతా పోతురాజు, రాయల లీలాప్రసాద్, మల్లెల రాధాకృష్ణ, దూరు బాలకృష్ణ, పరికెల నాగేశ్వరరావు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు 30న

పటమట : జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30న ఉద్యోగాల ఎంపిక నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పి. రమేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిజేశారు. ఏజీఎస్ లో కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ పోస్టు భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 28 (సోమవారం) నుంచి 30వ తేదీలోపు తమ పేర్లను నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ www.ncs.gov.in ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ నుంచి తమ మొబైల్‌కు వచ్చిన ఎన్‌సీఎస్ ఐడీ ద్వారా 30వ తేదీ ఉదయం 10:30 గంటలకు జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

నేత్రదానానికి యువత ముందడుగు



నేత్ర దాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డాక్టర్ సమరం

బెంజ్‌సర్కిల్: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పటమట తొమ్మిదో డివిజన్‌కు చెందిన యువజన చైతన్య వేదిక నాయకులు మరణాంతరం తమ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. వీరు యువజన వేదిక అధ్యక్షుడు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో 10 మందికి పైగా ఆదివారం బెంజ్‌సర్కిల్‌లోని స్వేచ్ఛా గోరా ఐ బ్యాంకుకు వెళ్ళి నేత్రాలు ఇవ్వడానికి అంగీకరిస్తూ పత్రాలను అందజేశారు. నజీర్ మాట్లాడుతూ నేత్రదానం ద్వారా మరొకరికి జీవితం ఇచ్చినట్టేనన్నారు. అనంతరం వీరికి డాక్టర్ సమరం నేత్రదాన సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో యువజన చైతన్య వేదిక నాయకులు మీసాల నాగభూషణం, మీసాల జనార్దన్, యు. సత్యనారాయణ, బంగారు రాజీవ్ గాంధీ, జి. మాణిక్యాలరావు, మల్లికార్జున్, పోలి రాజ తదితరులు పాల్గొన్నారు.

పార్శ్వనాథ స్వామికి విశేష పూజలు

గుడివాడ టౌన్: మార్వాడి గుడి రోడ్డులో వేంచేసి ఉన్న జైన్ శ్వేతాం బర్ దేవాలయంలోని శ్రీ పార్శ్వనాథ స్వామి వారికి మార్వాడి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పర్వపజుషన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎనిమిది రోజులుగా ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్నట్టు భక్తులు తెలిపారు. 9వ రోజున 18 రకాల పాలు, పెరుగు తదితర పూజ సామాగ్రితో పార్శ్వనాథ స్వామికి అభిషేకాలు నిర్వహించామన్నారు.

డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు



లింగవరం గ్రామం వద్ద చంద్రయ్య డ్రెయిన్ గుర్రపుడెక్క తొలగిస్తున్న

గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ మండలం లింగవరం గ్రామ సర్పంచ్ మలిరెడ్డి నర్సారెడ్డి ఆధ్వర్యంలో లింగవరం కాలనీ పక్కన ఉన్న చంద్రయ్య డ్రెయిన్‌లో ఎక్స్‌కవేటర్ ద్వారా గుర్రపుడెక్క ఆదివారం తొలగించారు. కాలనీ డొంకరోడ్లలో ఉన్న ముళ్ళ పొదలను తొలగించారు. గ్రామంలో కొంతమందికి జ్వరాలు వస్తున్న విషయం తెలుసుకొని సర్పంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. లింగవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటూరి ఏసుపాదం, మట్టా జాన్ విక్టర్ గ్రామస్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు.

గంగాభవానీకి బంగారు నత్తు బహూకరణ



అమ్మవారికి బంగారపు నత్తు అందజేస్తున్న దాతలు

గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ మండలం బిళ్ళపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నాగగంగభవాని అమ్మవారికి గుడివాడ పట్టణానికి బాలచంద్రశేఖర్-లీలాభవాని దంపతులు బంగారపు నత్తు ఆదివారం ఉదయం సమర్పించారు. పూజారి కన్నయ్యకు అందచేయడం జరిగింది. తమ కోర్కెలు తీర్చినందుకు కృతజ్ఞతగా బంగారు నత్తు అందచేశామని ఈ దంపతులు పేర్కొన్నారు.

త్వరలో ఇంటింటికి బీజేపీ

గుడివాడ టౌన్: భారతీయ జనతా పార్టీని గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయిలో బలోపేతం చేసేందుకు ఇప్పటికే బూత్ కమిటీలు ఏర్పాటు చేశామని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ఇంటింటికి బీజేపీ కార్యక్రమం త్వరలో చేపడతామని బీజేపీ బందరు పార్లమెంట్ విస్తారక్ ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావులు అన్నారు. స్థానిక 17వ వార్డులో మాజీ కౌన్సిలర్ మరీదు విజయలక్ష్మి స్వగృహం వద్ద బూత్ స్థాయి కమిటీ ఎన్నిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 60 బూత్‌స్థాయి కమిటీలను నియమించామన్నారు. మిగిలిన కమిటీలు త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై బూత్ కమిటీలు స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు కూడా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పేరం శ్రీనివాసరావు, షేక్ హర్షాద్, బూత్‌స్థాయి కమిటీ ఇన్‌చార్జిలు శొంఠి దేవివరప్రసాద్, శొంఠి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చవితి ఉత్సవాలు

గుడ్లవల్లేరు : ఇందిరాకాలనీలో ఆ కాలనీ యూత్ ఏర్పాటుచేసిన వినాయకుడి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. విగ్రహాన్ని ఊరేగించి గుడ్లవల్లేరు లాకుల వద్ద నిమజ్జనం చేశారు. యువకులు డ్యాన్స్‌లతో ఎంతో ఉల్లాసంగా గ్రామోత్సవం నిర్వహించారు.

నిర్విఘ్నంగా వినాయక ఉత్సవాలు



స్వామివారికి 25 కేజీల లడ్డూను సమర్పిస్తున్న రెల్లి యూత్, యలవర్తి యువసేన సభ్యులు



మహాగణపతికి నీరాజనం



నందివాడలో వినాయక నిమజ్జనం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో గణపతి నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారు మహా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ పరిసే వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ నెరుసు చింతయ్య, మేనేజర్ ఎస్‌కె కిషోర్, పాలకవర్గ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన భరతనాట్యం పలువురిని ఆకట్టుకుంది.

రెల్లి యువత 25 కేజీల లడ్డూ సమర్పణ

గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యలవర్తి యువసేన, రెల్లి యువత సంయుక్త ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్‌లో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారికి పట్టు వస్త్రాలు, 25 కేజీల లడ్డును ఆదివారం సమర్పించారు. రెల్లి బజారు నుంచి తీన్‌మార్ డప్పులు, నృత్యాలతో ఊరేగింపుగా మార్కెట్ సెంటర్‌కు చేరుకుని స్వామివారికి లడ్డు ప్రసాదాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంపల హైమావతి, వసంతవాడ దుర్గారావు, కలిమి వెంకటరెడ్డి, టీడీపీ నేతలు వెంపల అప్పారావు, వడ్డాది నాగరాజు, రెల్లి యూత్ నాయకులు మాడుగుల రేణుకుమార్, వడ్డాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వేసిన చలువ పందిళ్ళలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

గుడ్లవల్లేరులో...

27 జిడివిఎల్ 1 : గుడ్లవల్లేరు ఎస్ఇఆర్ఎం హైస్కూల్ ప్రాంగణంలో వినాయకుని పందిరిలో హారతులిస్తున్న పురోహితుడు, తిలకస్తున్న భక్తులు

● గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గుడ్లవల్లేరులో ఎస్ఇఆర్ఎం హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సిద్దిబుద్ది వినాయకుని పూజా కార్యక్రమాల్లో మూడవరోజు పడవల వెంకటేశ్వరరావు దంపతులు, తాతాని సుబ్బయ్య దంపతులు, రాఘవులు దంపతులు, కోటేశ్వరరావు దంపతులు, వెంకటేశ్వరరావు దంపతులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అలానే గ్రామంలోని శ్రీ మద్గంగా పార్వతి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో విఘ్నేశ్వరుని నవరాత్రి మహోత్సవాల్లో గద్దె సోమరాజు దంపతులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరాలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అలానే ఎస్ఇఆర్ఎం విద్యా సంస్థల ప్రాంగణంలో సిద్ది, బుద్ది సమేత వినాయకునికి 27 రకాల ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాలలో వల్లభనేని వెంకట్రావు, ఈడ్పుగంటి ఉమా మహేశ్వరరావు, కొసరాజు వెంకటాద్రిచౌదరి, చంద్రం, యలమంచిలి రామకోటేశ్వరరావు, వల్లభనేని కృష్ణప్రసాద్, సిద్దేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొసరాజు వెంకటాద్రి(పెదబాబు), డైరెక్టర్లు గవిర్నేని రామారావు, అన్నె ప్రసాదరావు, స్వామి, నారాయణ ప్రసాద్, వీరభద్రరావు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్‌లో...

మండలంలో వినాయక ఉత్సవాలు మూడవరోజు విఘ్నేశ్వరుని చలువ పందిళ్లలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొమ్ములూరు, మోటూరు, లింగవరం తదితర గ్రామాల్లో శ్రీ వినాయకుని పందిళ్లలో గణేష్‌ను ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.భజన కార్యక్రమం నిర్వహించారు.

నందివాడలో...

మండల పరిధిలోని గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగాయి. జనార్ధనపురం, తుమ్మలపల్లి, టెలీఫోన్‌నగర్, పోలుకొండ, నందివాడ గ్రామాల్లో నిమజ్జనం సందర్భంగా స్వామివారిని గ్రామాల్లో ఊరేగించారు. డి జె సౌండ్స్, డప్పు వాయిద్యాలతో యువత, భక్తులు కోలాహలంగా డ్యాన్స్‌లు వేశారు. అనంతరం దోసపాడు, గుడివాడ ఛానల్స్‌లో గణేష్‌ను నిమజ్జనం చేశారు.

సందడిగా హ్యాపీ సండే



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న చైర్మన్ యలవర్తి, కమిషనర్ ప్రమోద్‌కుమార్

గుడివాడ టౌన్: ప్రతి వ్యక్తి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆరోగ్యవంతంగా జీవించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం హ్యాపీ సండే నిర్వహించాలని ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆనంద ఆదివారం ప్రతి ఒక్కరిని రంజింప చేసింది. ఆట పాటలు, డ్యాన్స్‌లు, మహిళలు ఆటలు ఉత్తేజపరిచాయి. ఆనంద ఆదివారం ప్రతి ఒక్కరికి ఆరోగ్యం కలిగిస్తుందనే ఉద్దేశ్యంతో పట్టణంలోని పుర వీధుల్లో నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కమిషనర్ ఎన్. ప్రమోద్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మెప్మా పీడీ ప్రియంవద, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం యలవర్తి మాట్లాడుతూ ప్రతి ఆదివారం కార్మికులకు, విద్యార్థులకు సెలవు దినం కావడంతో వారం అంతా పనిచేసిన వ్యక్తులు ఉల్లాసంగా గడపడానికి ఆనంద ఆదివారం ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. వాయు కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ సైకిల్ వినియోగించాలని పిలుపునిచ్చారు. స్పందన ఆర్ట్స్ కళాకారులు నిర్వహించిన మిమిక్రీ, నాటికలోని ఘట్టాలు అందరిని ఆకర్షించాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. మొత్తంమీద ఎజికె హైస్కూల్ ప్రాంగణమంతా ఆనంద ఆదివారంతో ఆదుర్స్ అనిపించేలా కార్యక్రమాలు నిర్వహించారు.



కుర్చీలాట ఆడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గ్యాస్ సమాచారం

ఏజెన్సీ	సరఫరా తేదీ	ఫోన్ నెం.	ఆన్‌లైన్ నెం.
● విజయ్ ఎంటర్ ప్రైజెస్	ఏరోజుకారోజు	243398	9666023456
● అయ్యప్ప ఎంటర్ ప్రైజెస్	ఏరోజుకారోజు	244345	9666023456
● సాయిసువర్ణ ఎంటర్ ప్రైజెస్	ఏరోజుకారోజు	247888	9848824365
● పద్మనాభ ఎంటర్ ప్రైజెస్	2లేక 3రోజులకు	243558	9848824365

సినిమాలు

శ్రీలక్ష్మి	అర్జున్‌రెడ్డి
మిని బొమ్మరిల్లు	వివిపి -2
సింధూర	ఆనందోబ్రహ్మ
శ్రీరామ్	
భాస్కర్ 35 ఎంఎం	ప్రతిక్షణం
	వివేకం
బొమ్మరిల్లు	వివిపి -2
బాలాజి	సోగ్గాడే చిన్నినాయన
భాస్కర్ 70 ఎంఎం	జయజానకి నాయక
శ్రీబ్రహ్మ	వాసుకి

పశువుల ఆస్పత్రుల్లో అన్నీ కొరతే...



బొమ్ములూరు వెటర్నరీ డిస్పెన్సరీ(పశువుల ఆసుపత్రి)



నూజెళ్ళలో ఉన్న గ్రామీణ పశుగణాభివృద్ధి సబ్ సెంటర్

గుడివాడ రూరల్: దేశానికి వెన్నెముక రైతేనని... రైతు లేనిదే రాజ్యంలేదని ఆర్భాటంగా ప్రకటించే పార్టీలు ఏవీ అధికారంలోకి వచ్చినా వారి స్థితిగతులను పట్టించుకునే వారే కరువవుతున్నారు. ముఖ్యంగా రైతులకు వ్యవసాయంతోపాటు పశుపోషణ ప్రధాన ఆదాయ వనరు. కానీ నేడు అది గుదిబండగా మారింది.. కారణం పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత, మందుల కొరత. ఇవి రైతులకు చుక్కలు చూపిస్తున్నాయి.

గుడివాడ రూరల్ మండలంలో మోటూరు, బొమ్ములూరు గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. మూడు సబ్‌సెంటర్‌లు ఉన్నాయి. అవి లింగవరం, దొండపాడు, నూజెళ్ళ గ్రామాల్లో ఉన్నాయి. ఈ ఐదు పశువైద్యశాలలు, సబ్ సెంటర్‌లలో సిబ్బంది కొరత ఉంది. మండలంలో 6,500 గేదెలు ఆవులు, 4800 గొర్రెలు మేకలు, 19 వేలకుపైగా పెరటి కోళ్ళు పెంచుతున్నారు. సంవత్సరానికి ఒక్కో పశువైద్యశాలకు సుమారు రూ. 30 వేల విలువగల మందులను పంపిణీ చేస్తున్నారు. రెండు పశువైద్యశాలలకు రూ.60 వేలు మందుల వరకే ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. మూడు సబ్‌సెంటర్‌లకు సంవత్సరానికి ఒక్కొక్కదానికి రూ. 12 వేల చొప్పున మందులు పంపిణీ చేస్తున్నారు. సంవత్సరం మొత్తం మీద మండలానికి సంవత్సరానికి రూ. 96 వేల మందులు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఒక్కొక్క జీవానికి సంవత్సరానికి రూ. 3 వేల చొప్పున ప్రభుత్వం మందుల రూపంలో ఖర్చు చేస్తుంది. కానీ ఏ పశువుకైనా అనారోగ్యం వస్తే రైతు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది.. కనీసం పశువైద్యశాలకు వెళితే మందులు కూడా దొరకని పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికుంటు, గురక వ్యాధులకు మాత్రం అదనంగా వ్యాక్సిన్‌లను పంపుతోంది. రైతులు పశువైద్యశాలకు వెళితే మందులు లేవని చీటీలు రాసిస్తున్నారు. దీంతో రైతులు గుడివాడ వచ్చి వేలాది రూపాయలకు మందులు కొనుగోలు చేస్తున్నారు.

సిబ్బంది కొరత

అంతేకాక సిబ్బంది కొరత వల్ల సకాలంలో పశువులకు వైద్యం అందని పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి సిబ్బంది కొరత ఒక కారణమైతే, ఉన్న సిబ్బందిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించుకోవడం మరో కారణం. 21 గ్రామ పంచాయతీలకు ఉన్న సిబ్బంది సరిపోవడం లేదు. సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి మండలంలోని దాతల సహాయం తీసుకొని మెరుగైన పశువైద్యం అందించడానికి కృషి చేయాలని పలువురు పశుపోషకులు కోరుతున్నారు. ఉన్న వైద్య సిబ్బందిని పశువుల ఆసుపత్రులలోనే విధులు నిర్వహించే విధంగా, ఇతర పనులకు వినియోగించుకోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది



మా గ్రామం మేజర్ పంచాయతీ కావడం వల్ల మల్లాయిపాలెం, చౌటపల్లికి ఒక సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఈ రెండు గ్రామాల రైతులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోటూరు పశువైద్యశాలకు పశువులను తీసుకు వెళ్లవలసి వస్తోంది. ఇంత ప్రయాసపడి వెళ్లినా సిబ్బంది కొరత వల్ల ఒక్కొక్కసారి పశువులకు వైద్యం చేయించకుండానే వెనుతిరిగి రావాల్సి వస్తోంది. ఆసుపత్రులలో తగినన్ని మందులు లేకపోవడం వల్ల వేలాది రూపాయలు ఖర్చుచేసి బయట కొనుగోలు చేసి పశువులను రక్షించుకుంటున్నాం.

సూరపనేని నగేష్, చౌటపల్లివాసి

లింగవరం సబ్‌సెంటర్‌లో మందుల కొరత



లింగవరంలో పశువైద్య సబ్‌సెంటర్ ఉన్నప్పటికీ మందుల కొరత ఉంది. పశువులకు ఎక్కువగా అనారోగ్యం వస్తే గుడివాడ తీసుకెళుతున్నాం. సబ్‌సెంటర్‌లో సిబ్బందిని పెంచి, లింగవరం, వలివర్తిపాడు గ్రామాలకు ఒక పశువైద్యుడిని నియమించాల్సి ఉంది.

గాదిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, లింగవరం

వేలాది పశువులకు వైద్యం అందిస్తున్నాం



మండలంలో వేలాది పశువులు, మేకలు, గొర్రెలు, పెరటికోళ్ళు ఉన్నాయి. వీటన్నింటికి వైద్యం అందించడానికి కృషి చేస్తున్నాం. పశువైద్యమే కాకుండా ప్రభుత్వపరమైన ఇతర పనులకు కూడా సిబ్బంది వెళ్ళడం వల్ల పూర్తిగా వైద్యం అందించలేకపోతున్నాం. మండలంలోని రైతులందరి పశువులు, కోళ్ళకు వ్యాక్సిన్‌లు వేస్తున్నాం.

జి. రామకృష్ణ, బొమ్ములూరు పశువైద్యాధికారి



మొక్కలు నాటుతున్న రంగారావు, సన్యాసిరావు

హరితాంధ్రప్రదేశ్ కోసమే వనం-మనం

నందివాడ: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వనం - మనం కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హరితాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ఇలపర్రు గ్రామ టీడీపీ అధ్యక్షులు సువారి వెంకటరంగారావు అన్నారు. మండలంలోని ఇలపర్రు శివారు ఎల్.ఎన్. పురం గ్రామంలో డ్వాక్రా మహిళలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. మహిళలతో కలిసి గ్రామంలోని వీధి వీధినా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ పర్యావరణం సమతుల్యంగా ఉండేందుకు మొక్కలు నాటడం ముఖ్యమన్నారు. . ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలనే ధ్యేయం పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ సీనియర్ నాయకుడు దానేటి సన్యాసిరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

మచిలీపట్నం-టౌన్: పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకు రావాలని మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. బుట్టాయిపేటలోని అన్నం వీరరాఘవయ్య కల్యాణ మండపంలో అవోపా ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని 120 మంది పేద విద్యార్థులకు లక్ష రూపాయలు నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చైర్మన్ మాట్లాడుతూ, అవోపా ఇస్తున్న సహాయం ఆసరాగా తీసుకుని విద్యార్థులు ఉన్నతస్థితికి ఎదగాలన్నారు. సంస్థ అధ్యక్షుడు నంబూరి గోపాలకృష్ణ, కార్యదర్శి కొల్లూరి రామమోహనరావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు రమేష్, రామచంద్రరావు ప్రసంగించారు.

అన్ని దానాల్లో రక్తదానం మిన్న

మచిలీపట్నం-టౌన్: అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు అన్నారు. కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు, కొట్టె ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో స్థానిక పరాసుపేటలోని కె.వి.ఆర్.పార్కులో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అర్జునుడు మాట్లాడుతూ, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం ముదావహమన్నారు. మునిసిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ, పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు, ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు రక్తం ఇచ్చేందుకు వచ్చిన దాతలను మరచి పోలేమన్నారు. కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు మాట్లాడుతూ, తాము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం (చంటి), ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్లు నారగాని ఆంజనేయప్రసాద్, లోగిశెట్టి వెంకటస్వామి, నాయకులు గోపీచంద్, తలారి సోమశేఖర్, వెంకటరాజు, ఇలియాస్ పాషా, పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి జి.పాపరాజు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు అల్లాడ శ్రీనివాసరావు, కార్మిక సంఘ నాయకులు మజ్జి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. 98 మంది రక్తదానం చేశారు. చిలకలపూడి పోలీసు శర్మ 57వ సారి రక్తదానం చేసి అతిథుల ప్రశంసలు అందుకున్నారు.



పరాసుపేటలో జరిగిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్సీ అర్జునుడు, చైర్మన్ బాబా ప్రసాద్, కౌన్సిలర్ వెంకట్రావు, డా.అల్లాడి శ్రీనివాసరావు తదితరులు

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు రేపటి నుంచి

గుడివాడ రూరల్: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు ఈ నెల 28వ తేదీ నుంచి బొమ్ములూరు గ్రామంలో ప్రారంభిస్తున్నట్టు పశువైద్యాధికారి జి. రామకృష్ణ ఆదివారం తెలిపారు. మండలంలోని రైతులు తమ పశువులకు సకాలంలో టీకాలు వేయించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో తమ వైద్య సిబ్బంది క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి వెళ్లి ఆయా పశువులకు టీకాలు వేస్తారన్నారు. ఆయా గ్రామాలకు తమ సిబ్బంది వచ్చినప్పుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

గుడివాడ టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బీసీ నేతలు కఠారి రామ్‌కుమార్, కె.ఎల్. రాజ తదితరులు తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ఘంటసాల వారి వీధిలో ఫీ అండ్ శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా జరుగుతున్న గణపతి మహోత్సవాల్లో వారు పాల్గొని స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పెంపొందించే దిశగా ఫీ అండ్ శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహంతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కొలుసు సతీష్, వి. పోలేరయ్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సమతా సైనిక్ దళ్ మండల అధ్యక్షుడిగా 'పెనుమాల'

గుడివాడ టౌన్: సమాత సైనిక్ దళ్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కమిటీలను నియమిస్తున్నట్టు సమతా సైనిక్ దళ్ గుడివాడ కన్వీనర్ పంతగాని సురేష్ అన్నారు. స్థానిక సమతా సైనిక్ దళ్ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం రూరల్ మండలం యూత్ అధ్యక్ష, కార్యదర్శులుగా పెనుమాల నాగరాజు, మేరుగు రవితేజలను నియమించి నియామక పత్రాలు అందజేశారు. దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఎదుర్కొనేందుకు సమతా సైనిక్‌దళ్ నిరంతరం కృషి చేస్తుందని సురేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కనపర్తి నవీన్, రవితేజ, నత్తా సందీప్, జి రఘువర్మ, వి. నాగార్జున, నాని, ఎన్. సతీష్, కె. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అమలు అంతంత మాత్రమే

● అందరికీ అందని అన్నఅమృత హస్తం ● అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమి ● రేషన్ బియ్యంతో భోజనం ● రాకపోకలకూ ఇబ్బందే


ఖాళీగా ఉన్న నూజివీడు అంగన్‌వాడీకేంద్రం


అంగన్‌వాడీకేంద్రంలో బాలింత, చిన్నారులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో 37 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్నఅమృతహస్తం పథకం అమలు అంతంత మాత్రమే. పట్టణంలో ప్రీస్కూళ్ళు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మినహా ఎక్కడా సౌకర్యాలు లేక పోవడంతో అంగన్‌వాడీ పరిధిలో బాలింతలు, గర్భిణీలు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 37 కేంద్రాలకు 337 మంది గర్భిణులు, 299 మంది బాలింతలతో కలుపుకుని రెండు వేల మంది చిన్నారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సి ఉండగా, అందులో సగం మంది మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అమ లు కాలేదు. బాలింతలు, గర్భిణులకు ప్రతిరోజూ ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనం ఐరన్ ట్యాబ్‌లెట్లను అంగన్‌వాడీ కేంద్రాల అందించాల్సి ఉంది. దీంతో కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు సుమారు 3 నుంచి 4 గంటల సమయం ఉండాల్సిన పరిస్థితి ఉంది. వారు కిందే కూర్చోవాల్సి ఉండడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల లేమి

నూజివీడు రూరల్ : నూజివీడు మండల పరిధిలో మొత్తం 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో మూడు వేల మంది చిన్నారులకు, 478 మంది బాలింతలు, 599 మంది గర్భిణులు అన్న అమృతహస్తం పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. దాదాపు సగానికి పైగా ఈ పథకాన్ని వినియో గించుకుంటున్న దాఖలా కనిపించటం లేదు. విద్యుత్‌బిల్లులు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను గ్రామపంచాయతీలకు అందించినా అవి అన్ని గ్రామాల్లోనూ అమలు కావడం లేదు. మరోవైపు బాలింతలు సిజేరియన్ల కారణంగా అంగన్‌వాడీకేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారుతోంది.

రేషన్ బియ్యంతో ఇబ్బందులు

చాట్రాయి : ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అన్న అమృతహస్తం పథకం గర్భిణిలు, బాలింతలకు వరం అయినా కోటా బియ్యం వల్ల నీరు గారి పోతున్నది. మండల కేంద్రం చాట్రాయిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం గుడ్డు, పాలు పోషకవిలువలు కలిగిన కూరతో భోజనం పెడుతున్నారు కానీ కోటా బియ్యం వల్ల గర్భిణిలు, బాలింతలు కడుపు నిండా భోజనం చేయలేకపోతున్నారు. కోటా బియ్యంవల్ల అరుగుదల ఉండక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం మంచి బియ్యం ఇస్తుందనే ఆశతో రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నట్లు పలువురు చెప్పారు. కొంతమంది ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని గుడ్డు, కూరతో భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం పెట్టించుకుని తీసుకు వెళుతున్నారు. కేంద్రానికి రాలేని నిండుగర్భిణిలు, పచ్చి బాలింతలకు మాత్రం భోజనం వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇళ్ళకు పంపుతున్నారు. ప్రభుత్వం కోటా బియ్యానికి బదులు మంచి బియ్యం సరఫరా చేస్తే అన్న అమృతహస్తం పథకం మంచి ఫలితాలిస్తుంది.

అధికారుల వైఫల్యం

విస్సన్నపేట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలుకు అధికారులు సమర్ధంగా పనిచేయటం లేదనే విమర్శలు నెలకొన్నాయి. బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకు రావడంలో వైఫల్యం చెందుతున్నారు. గర్భిణులు, బాలింతల బంధువులు వచ్చి ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారే తప్ప అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్న నిబంధనను సమర్ధంగా అమలు జరపటం లేదు. కొన్ని కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు ఇంటి వద్ద నుంచి అన్నం తెచ్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలతో భుజించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చిన రేషన్‌బియ్యం ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో అన్నం పెట్టాలని కోరుతున్నారు.

ఏటీఈత..లంకమేత..చందం

ఆగిరిపల్లి : రేషన్ బియ్యం అన్నం తినడం ఇష్టంలేక కొందరు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ఆసక్తి చూపటం లేదు. గర్భిణిలు, బాలింతలు పాలు, గుడ్డుకోసం, మధ్యాహ్నం భోజనం కోసం రెండు దఫాలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివాసం ఉండేవారు ఈ పథకానికి దూరమవుతున్నారు. భోజనం కోసం నడిచి రావాల్సి రావడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో భోజనానికి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. కొందరు మాత్రం వచ్చి అంగన్‌వాడీల్లో అసౌకర్యాల నడుమ భోజనం చేయలేక క్యారేజిల్లో భోజనం తీసుకువెళుతున్నారు. లంక మేత కోసం ఏటిఈతలా ఉందని వాపోతున్నారు. మండలంలో మొత్తం 67 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా, 470మంది గర్భిణిలకు 373 మంది, 413 మంది బాలింతల్లో 322 మంది అన్న అమృతహస్తం పథకంలో భోజనం చేస్తుండగా భోజనం నాణ్యతలేక కొన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో ఈ పథకంపై పెదవివిరుస్తున్నారు.

ముసునూరు మండలంలో

మండలంలోని 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో 382 మంది బాలింతలు, 437మంది గర్భిణులు, 3550 మంది చిన్నారులు అన్నఅమృతహస్తం పథకం ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇందులో 270 మంది బాలింతలు, 300 మంది గర్భిణుల మాత్రమే పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. చిన్నారులకు మాత్రం మెనూ ప్రకారం ఆహారం అందించటం లేదనే విమర్శలు ఉన్నాయి. కూరగాయలు తదితర వస్తువులను అంగన్‌వాడీకార్యకర్తలే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీనుండి రూ.5వేలు నిధులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు నిధులు అందలేదు. సౌకర్యాల లేమితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యంలో నాణ్యత లేకపోవడంతో సరిగ్గా ఉపయోగించుకోలేక పోతున్నారని సర్వత్రావిమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుడివాడలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర నేడు

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర సోమవారం గుడివాడలో జరుగుతుంది. ఈనెల 26న హనుమాన్ జంక్షన్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారంనాడు నూజివీడులో జరిగింది, తిరువూరు, నందిగామలో పర్యటనను పూర్తి చేసుకుని విజయవాడకు చేరుకుంది. సోమవారం గుడివాడ, మచిలీపట్నం, చల్లపల్లి, ఆవనిగడ్డ, రేపల్లెలో ఈ యాత్ర సాగుతుంది.

ఎన్నికల్లో బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

● యువతకు రమేష్‌నాయుడు సూచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికలలో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్ళొద్దని బీజేపీ యువమోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యాలయ మీడియా సెల్ ఇన్‌ఛార్జి దిలీప్‌లతో కలిసి మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా రూపొందించేందుకు తమ పార్టీ తరపున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బీజేపీ,టీడీపీకి ఉమ్మడి శత్రువులుగా ఉన్న కొందరు అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటితో పాటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యంగా కొందరు నాయకుల మాటలు విని యువత బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, దీని జోలికి పోవద్దని వారు సూచించారు.

ఆల్ మునిసిపల్ ఇంజనీర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

● ప్రెసిడెంట్‌గా ఎంపికయిన టి.రంగారావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జోన్-2 ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాటర్ సప్లై డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న టి.రంగారావు ఎంపికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్-2కు చెందిన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు. జోన్-2 కమిటీ ఎంపికలో సెక్రటరీగా అసిస్టెంట్ ఇంజనీరు డి.దుర్గారావు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా జె.ఫణి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు కే.వి. సాయిప్రసాద్, ట్రెజరర్‌గా విజయవాడ సర్కిల్-1 ఈఈగా పనిచేస్తున్న కే.కోటేశ్వర్రావు, సభ్యులుగా డీఈఈ ఎంసీఎస్.పాత్రుడు, డీఈఈ వి.పద్మాకర్ ప్రసాద్, ఏఈ కే.రాజ్‌కుమార్, ఏఈ పి.సూర్యకుమారి, ఏఈ డి.లక్ష్మీనారాయణ, ఏఈ డి.రామకిషోర్, డీఈఈ అబ్దుల్ రహీమ్, బి.హెచ్.సుబ్బారావు డీఈఈ, ఏఈ నాగేశ్వర్రావు ఎంపికయ్యారు.

దేరాబాబాతో లాలూచి వల్లే ఉత్తరాదిలో విధ్వంసం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

విజయవాడ : సిపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో దేరా బాబా సహకారంతో హర్యానాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. డేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. హింస చెలరేగే ప్రమాదం ఉన్నదని ముందే ఊహించి 200 రైళ్లను రద్దు చేసిన ప్రభుత్వం డేరాబాబా 200 వాహనాల కాన్వాయ్‌తో కోర్టు హాజరయ్యేందుకు ఎందుకు అనుమతించిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో దళితులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, అభద్రతాభావంతో వారు జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ఎండగడుతూ నెల రోజులూ ప్రచార కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. చోటామోటా నాయకులకు వారి విలువను బట్టి రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వెచ్చించి కొనుగోలు చేస్తున్నందున ఎన్నికల బదులుగా వేలాన్ని నిర్వహిస్తే సబబుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎక్కడికక్కడ నోట్లను ప్రధాన పార్టీలు వెదజల్లుతున్నాయని తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టిడీపీ, వైకాపా పోటీలు పడిమరీ ఓటర్లను కొనుగోలు చేశాయన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఆంధ్రజ్యోతి
17
కైకలూరు
కృష్ణా ● సోమవారం 28 ఆగస్టు, 2017
కైకలూరు । మండవల్లి । ముదినేపల్లి । కలిదిండి

సినిమాలు

కైకలూరు
వెంకటరమణ : అర్జున్‌రెడ్డి
విజయలక్ష్మి : జయ జానకి నాయక
మాగంటి : వివేకం

ముదినేపల్లి
పూర్ణిమ : జయ జానకి నాయక

పాఠశాలలోనే పాలిటెక్నిక్ కళాశాల!

కలిదిండి : మండల కేంద్రమైన కలిదిండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు పలు ఇక్కట్లు పడుతున్నారు. 2008లో కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతుల భవనంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో విద్యార్థులు ఇరుకు గదుల్లో కాలం వెళ్లబుచ్చుతున్నారు. పాలిటెక్నిక్ కళాశాల స్థాపించి 9 సంవత్సరాలు గడిచినప్పటికీ ఇంత వరకు సొంత భవనాలు ఎందుకు నిర్మించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కళాశాలలో ల్యాబ్‌లు లేకపోవడంతో కలిదిండికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుడివాడ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి వస్తున్నారు. తాగడానికి మంచినీరు కూడా ఉండడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాలకు రూమ్‌లలో అద్దెకుంటూ వంట చేసుకుని తింటున్నారు. ఒకొక్క విద్యార్థికి నెలకు రూ. 4 వేలకుపైగా ఖర్చు అవుతోంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల విద్యార్థులు అధికంగా ఉన్నారు. కళాశాలలో వసతులు లేకపోవడంతో స్థానిక విద్యార్థులు ఈ కళాశాలలో చేరడంలేదు. దీంతో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. ప్రతి సబ్జెక్ట్‌కు అధ్యాపకులు ఉన్నప్పటికీ వసతులు లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు కళాశాల నుంచి వెనుతిరిగి వెళ్ళిపోతున్నారు. అదే పరిస్థితి కొనసాగితే కలిదిండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను రద్దు చేసే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. వెంకటాపురంలో ఐదు ఎకరాల స్థలంలో కళాశాల సొంత భవనాలు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఇది ఎప్పటి కార్యరూపం దాల్చుతుందో చెప్పలేమని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని విద్యా ర్థులు పలుమార్లు రోడ్కెక్కి ధర్నాలు చేసినప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.


కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బోర్డు


కళాశాలకు ఏర్పాటు చేసిన అదనపు తరగతుల భవనం

ఫొటోట్రేడ్ వేల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

కైకలూరు: కైకలూరు ఫొటో ట్రేడ్ వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా కసగాల శ్యామ్‌సువర్ణరాజును ఎన్నుకున్నారు. కైకలూరు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యవర్గ గౌరవ అధ్యక్షులుగా అడవి వెంకటకృష్ణ, సాగర్‌బాబు, టి.ఎన్. ఆచారిలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వీరమల్లు రాంబాబు, సెక్రటరీగా మోరు సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీగా మోరు లాజర్, ట్రెజరర్‌గా ఎస్.సుబ్రహ్మణ్యం, జాయింట్ ట్రెజరర్‌గా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు.


కైకలూరు ఫొటోట్రేడ్ వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

జోరందుకున్న బెట్టింగ్‌లు

ముదినేపల్లి : నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితంపై ముదినేపల్లి మండలంలో జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. సోమవారం ఈ ఎన్నిక ఓట్ల లెక్కింపు జరుగుతున్న నేపథ్యంలో ఫలితంపై పెద్ద ఎత్తున ముదినేపల్లి ప్రాంతంలో కూడా పందేలు కడుతున్నారు. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల గెలుపు, మెజారిటీలపై పలువురు ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పందేలకు ముందుకు వస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు నంద్యాల ఫలితంపై పందేలు కడుతున్నారు. వివిధ సర్వేల ఆధారంగా ఎక్కువగా టీడీపీ అభ్యర్థి గెలుపుపై పందేలు కట్టడం జరుగుతుంది.

అభినందనలు



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిసి శుభాకాంక్షలు చెబుతున్న తెలుగు యువత నాయకుడు రామచంద్రశ్రీనివాస్, దేవపూడి టీడీపీ నేత జోగి సురేష్

ముదినేపల్లి : ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఆదివారం విజయవాడ సమీపంలోని స్వర్ణభారత్ ట్రస్టు కార్యాలయంలో ముదినేపల్లి మండల తెలుగు యువత నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల తెలుగు యువత నాయకులు ఈడ్పుగంటి రామచంద్ర శ్రీనివాస్, దేవపూడికి చెందిన జోగి సురేష్ వెంకయ్యనాయుడుకు అభినందనలుతెలిసి ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు.

పోటెత్తిన భక్తజనం

ముదినేపల్లి : సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరుడి పుట్టలో పాలుపోసి అభిషేకాలు జరిపారు. దేవస్థానం చైర్మన్ పరసా విశ్వేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

హోరెత్తిన గణేష్ నామస్మరణం


ముదినేపల్లిలో వినాయకుడికి పూజలు జరుపుతున్న భక్తులు


వడాలిలో ఆకట్టుకుంటున్న వినాయకుడు

ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలో గణేష్ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు భక్తుల కోలాహలంతో నిండిపోయి గణేష్ నామస్మరణ మార్మోగుతున్నది. సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వినాయకుడికి అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. శ్రీహరిపురంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహంవద్ద అనందాసు సురేష్ దంపతులు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ముదినేపల్లి హైస్కూల్ సమీపంలోని లక్ష్మీ గణపతి ఆలయంలో భక్తులు పూజలు జరిపారు. సింగరాయపాలెంలో గణేష్ నిమజ్జనం నిర్వహించగా శ్రీహరిపురం శివారు హస్తినాపురంలో వినాయకుని లడ్డు వేలంపాట కార్యక్రమాన్ని జరిపారు. వడాలి, పెదపాలపర్రు, పదగొన్నూరు, ఉప్పరగూడెం, వాడవల్లి, బొమ్మినంపాడు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కైకలూరు: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా కైకలూరు కెనాల్ రోడ్డులోని వినాయక స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారి ఊరేగింపు చేశారు. ఇంటింటా మహిళలు హారతులు పట్టారు. యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ గులాం చల్లుకుని ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

31న దేవీ శరన్నవరాత్రి రాట ప్రతిష్ఠ

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ అమ్మవారి చండీ మహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను వచ్చే నెల 21వ తేదీ నుంచి అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఈ నెల 31వ తేదీన రాట ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ మేనేజర్ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కైకలూరుకు చెందిన నంబూరి ప్రతాప్‌రాజ్ దంపతులచే స్తంభపూజలను నిర్వహిస్తారని అన్నారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

కైకలూరు: నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ కైకలూరు సమితి యూనిట్ అధ్యక్షుడిగా భుజబలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్. కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సమితి యూనిట్ పరిధిలోని కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో నాల్గవ తరగతి ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జె. శ్రీరామమూర్తి అధ్యక్షతన నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్. ఈశ్వరరావు, సెక్రటరీగా ఎంఆర్‌వి. రంగారావు, ట్రెజరర్‌గా ఎండీఎస్‌కె. గౌస్యా, జాయింట్ సెక్రటరీగా బేబామ్మ, కోఆప్షన్ సభ్యుడిగా పి. విజయ్‌కుమార్‌ను, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సభ్యులు

కైకలూరు: పేద విద్యార్థుల కొరకు హెల్పింగ్ హ్యాండ్స్ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు వైస్ ఎంపీపీ ఎంఏ రహీం అన్నారు. కైకలూరులో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నలుగురు పేద విద్యార్థులకు రూ. 15 వేలు ఆర్థిక సహకారాన్ని సంస్థ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో అందజేశారు. 2011 సంవత్సరం నుంచి హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా వేలాది మంది పేదల విద్యార్థులకు ఆర్థికంగా సహకారాన్ని అందచేయడమే కాక, ప్రభుత్వ పాఠశాలలోని 6630 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికి పాదరక్షలు, బూట్లను త్వరలో అందచేసే దిశగా సంస్థ ఆలోచన చేస్తుందని, సహకారం చేసేందుకు దాతలకు కొదవలేరని అన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గాధంశెట్టి నాగరాజారావు, పూర్ణ, జగన్, గురజాడ జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలు నేడు

కైకలూరు: మీసాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కైకలూరు శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు సీహెచ్ హేమలత ఆధ్వర్యంలో శ్రీరామానుజ చిన్నజీయర్‌స్వామి వారి ఆశీస్సులతో భగవద్గీత 7వ అధ్యాయంలో పోటీలను నిర్వహించబడునని తెలిపారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు పోటీలో పాల్గొనవలసిందిగా హేమలత కోరారు.

పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు

కలిదిండి : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలను జనసేన నాయకులు ఆదివారం కోరకొల్లులో ఘనంగా ప్రారంభించారు. వినాయకుడి ఆలయంలో పవన్ కళ్యాణ్ పేరిట అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు(నాని) మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 2న పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కేశిరెడ్డి బలరామ్, కొల్లి బాబి, ప్రవీణ్, ఫణి, చిన్న, మంతిన రామరాజు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


కోరకొల్లులోని వినాయకుడి ఆలయంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

పామర్రు మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

పామర్రు : అనారోగ్యంతో ఉన్న పామర్రు మాజీ సర్పంచ్ కలగాని కోటేశ్వరరావును ఆదివారం ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన పరామర్శించారు. ఆయన స్వగృహంలో కలసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కనకదుర్గ దేవస్థాన సభ్యుడు పామర్తి విజయశేఖర్, టౌన్ ఉపాధ్యక్షుడు వల్లూరుపల్లి గణేష్, మండల కార్యదర్శి పెదపూడి నాగేశ్వరరావు, వీరంకి వెంకటేశ్వరరావు, టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు పొనిపిరెడ్డి శ్రీహరి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జోగి శ్రీనివాసరావు, పులి కేశవబాబు తదితరులు పాల్గొన్నారు.



దళితవాడ గంగానమ్మగుడి వద్ద మురుగులో కుళాయి



చెత్త డంపింగ్ కేంద్రంగా కమ్యూనిటీ హాలు ఆవరణ

పారిశుధ్యం అధ్వానం.. అనారోగ్యంతో జనం

● పట్టించుకోవడంలేదని భద్రిరాజుపాలెం దళితవాడవాసుల ఆవేదన

(తోట్లవల్లూరు)

భద్రిరాజుపాలెం దళితవాడలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా అధికారులు, సిబ్బంది స్పందించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మీడియాను రావెళ్ల పండు, వల్లూరు వెంకటేశ్వరరావు, వల్లూరు రమేష్, అంజయ్య, కుమార్, చీలి కోటేశ్వరరావు, వల్లూరు నాగభూషణం తదితరులు ఆదివారం తీసుకెళ్ళి మురుగునిల్వలను చూపించి ఆవేదన వ్యక్తంచేశారు.

వాటర్‌ట్యాంకు బజారు, గంగానమ్మగుడి బజారు, మరికొన్నిచోట్ల పబ్లిక్ కుళాయిలు మురుగులో ఉన్నాయి. దళితవాడ కమ్యూనిటీ హాలు ఆవరణ చెత్తడంపింగ్ యార్డుగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చెత్తాచెదారంతో పాటు ఇతర వ్యర్థాలను వేయటం వల్ల దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంచాయతీ మొక్కుబడిగా బ్లీచింగ్ పౌడర్ చల్లి తమపని అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారన్నారు. పూడిపోయిన డ్రెయిన్లను ఆధునీకరించడలేదని ఆరోపించారు. దీంతో వర్షం కురిస్తే రోజుల తరబడి మురుగు నిలిచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల దళితవాడలో చాలామంది జ్వరాల బారిన పడ్డారన్నారు. వల్లూరు జాస్మిన్ అనే మహిళ 15 రోజుల నుంచి టైఫాయిడ్‌తో బాధపడుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. విజయవాడలో చికిత్స చేయించినా తగ్గకపోవటంతో చివరకు తోట్లవల్లూరు పీహెచ్‌సీకి తీసుకువచ్చామన్నారు. ఇదేవిధంగా జ్వరాల బారిన పడిన వారు ఉన్నారని వారు తెలిపారు.

మురుగులో కుళాయిలు



దళితవాడలో పబ్లిక్ కుళాయిలో మురుగులో ఉన్నాయి. దానిలో నిలుచుని తాగునీరు పట్టుకుంటున్నారు. వారం వారం స్మార్ట్‌విలేజ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అవి మొక్కుబడి తంతుగా అధికారులు పర్యటన ఉంది. కుళాయిలకు సిమెంటు వరలువేసి మెరక చేయాలి.

చీలి కోటేశ్వరరావు

అధికారులు చర్యలు చేపట్టాలి



దళితవాడలో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పంచాయతీ ఇంత నిర్లక్ష్యంగా ఉండటం తగదు. ప్రజలు రోగాల బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. మురుగువల్ల వస్తున్న వాసనను భరించలేకున్నాం. పంచాయతీ స్పందించి చర్యలు చేపట్టాలి.

వల్లూరు నాగభూషణం

చందాలతో రహదారికి మరమ్మతులు

సూరపానిపల్లె(కూచిపూడి): రహదారి అధ్వానంగా ఉన్న ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోవడంలేదని, వీధిదీపాలు కూడా సరిగా వెలగడంలేదని మంత్రిపాలెం శివారు సూరపానిపల్లె గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలోనికి ఆటోలు కూడా రాని పరిస్థితి. వృద్ధులు, పిల్లలు, విద్యార్థులు రాక నరకప్రాయంగా తయారైంది. తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా గ్రామస్థులు చందాలువేసుకుని ముక్కచెక్కరాయి కొనుగోలుచేసి ఆదివారం నిర్మాణానికి నడం బిగించారు. తమ ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని రహదారి నిర్మాణ పనులు చేపట్టి, వీధిదీపాలు సక్రమంగా వెలిగేట్లు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మరమ్మతులు చేస్తున్న సూరపానిపల్లె దళితవాడ వాసులు

బాలల ఆటల పోటీలు

గుర్రాలంక (పమిడిముక్కల): గుర్రాలంక బాలగణేష్ సంఘం ప్రతి ఏడాది వినాయక చవితిని వేడుకగా జరుపుతున్నారు. గణనాథునికి రోజూ భక్తితో పూజలు చేస్తూ, అందరూ కలిసి ఆటపాటలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, స్పూన్ ఆట, గోనెసంచులతో నడక, ఖోఖో, పాటల పోటీలు, ఏకపాత్రాభినయం వంటి కార్యక్రమాలతో అలరించారు. రంగస్థల కళాకారుడు పిల్లి సుబ్బారావు పిల్లలచే పౌరాణిక నాటిక ప్రదర్శనకు శిక్షణ ఇస్తున్నారు.

దైవకార్యక్రమాన్ని కొందరు మద్యం ప్రియులు అపహాస్యం చేస్తున్నారు. మద్యం తాగి వారు చేసే హడావుడి బాధకలిగిస్తుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



కబడ్డీ ఆడుతున్న పిల్లలు

టీడీపీ, బీజేపీకే ఓట్లు వేయండి

● మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'లకనం'

నాగాయలంక: కాకినాడ కార్పొరేషన్‌కు 29న జరిగే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని మత్స్యకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ఆ ప్రాంత మత్స్యకారులను కోరారు. గత ప్రభుత్వాల కంటే టీడీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తుందన్నారు. వేట నిషేధితకాలంలో గత ప్రభుత్వాలు 31కిలోల బియ్యాన్ని ఇస్తే, చంద్రబాబు ప్రభుత్వం రూ.4 వేల జీవనభృతిని మత్స్యకారులకు ఇస్తుందన్నారు. వేటసమయంలో చనిపోతే చంద్రన్న బీమా ద్వారా రూ.5 లక్షలు ఇస్తుందన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

అవనిగడ్డ రూరల్: బీఏఎంసీఈఎఫ్ (భారతీయ బ్యాక్‌వార్డ్ అండ్ మైనార్టీ కమ్యూనిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్) మహాసభలను విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకుడు దోవా గోవర్ధన్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన తన కార్యాలయం వద్ద ఆవిష్కరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

వైభవంగా ఎన్ఎంయూ ఆవిర్భావ దినోత్సవం

అవనిగడ్డ: నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎం యూ) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని రీజినల్ కార్యదర్శి రావి సుబ్బారావుతోపాటు పలువురు కార్మిక నాయకులు ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నేతలు మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీని లాభాల బాటలో పయనింపజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సక్రమంగా డ్యూటీలు నిర్వహిస్తూ అటు యూనియన్‌కు, ఇటు సంస్థకు పేరు తెచ్చిపెట్టాలని కార్మికులకు సూచించారు. రీజినల్ అధ్యక్షుడు బి.కొండలు, రీజినల్ చైర్మన్ మండవ ప్రసాద్, రీజినల్ కార్యదర్శి రావి సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.బి.ప్రసాద్, నాయకులు ఆర్.వి.ఎల్.నారాయణ, ఆళ్ల కుమార్, కె.ఎస్.ఎన్.మూర్తి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజనల్ చైర్మన్ మండవ ప్రసాద్

వసతుల కల్పనకు కృషి : సర్పంచ్

పెదపారుపూడి : గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు వానపాముల సర్పంచ్ ఎలిసి డేవిడ్‌రాజు అన్నారు. వానపాములలో ప్రత్యేక నిధులు రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించి ఓడీఎఫ్ గ్రామంగా చేయడం జరిగిందన్నారు. రోడ్లన్నీ సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ డేవిడ్‌రాజు

పామర్రులో సినిమాలు

శివరామ: అర్జున్‌రెడ్డి
గగన్‌మహల్: ఆనందో బ్రహ్మం

గ్యాస్ సమాచారం

శ్రీ ప్రియ ఇండేన్, పామర్రు
ఏరోజుకారోజు, ఫోన్:254333
సెల్ నెం. 98488 24365

పామర్రు రైతుబజారు ధరలు

టమాట 36.00, వంగ 22.00, బెండ 11.00, పచ్చిమిర్చి 19.00, కాకర 12.00, బీర 16.00, కాలిఫ్లవర్ 10/12.00, క్యాబేజి 15.00, క్యారెట్ 44.00, దొండ 20.00, బంగాళాదుంప 14.00, ఉల్లిపాయలు 20.00, గోరుచిక్కుళ్ళు 19.00, దోస 12.00, సొర 10/8.00, పొట్ల 12/10.00, అరటి 8/7.00, చిక్కుళ్ల హైబ్రిడ్ 24.00, చామదుంప 27.00, మునగ 6/5, కంద 25.00, బీట్‌రూట్ 27.00, కీర దోస18.00, బీన్స్ 50.00, కాప్సికం 44.00, నిమ్మకాయలు (12)12/10.00, కొత్తి మీర 14/7, పొదీన 8/4, ముల్లంగి 6.00, చిలకడదుంప 17.00.



పామర్రులో ఎమ్మెల్యే కల్పన పూజలు



కూచిపూడిలో పూజలందుకుంటున్న గణనాథుడు



చోరగుడిలో నిమజ్జన ఊరేగింపు

పూజలందుకుంటున్న గణనాథులు

పామర్రు : గణపతికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బందరు రోడ్డులో కొబ్బరితోట వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన దర్శించుకుని పూజలు నిర్వహించారు. విజయవాడ కనకదుర్గ దేవస్థాన సభ్యుడు పామర్తి విజయశేఖర్, పంచాయతీ సభ్యురాలు పూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో బొగ్గరపు జాలయ్య, సుబ్బరత్నమ్మ కల్యాణ మండపంలో ఆదివారం చండీసహిత రుద్రహోమం నిర్వహించారు. సుమారు 2 వేల మందికి అన్నసమారాధన జరిపారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మిశెట్టి శ్రీధర్, తాళ్ళూరి శ్రీనివాసరావు, అప్పల రామారావు, ప్రోగ్రామ్స్ కమిటీ చైర్మన్ బొగ్గరపు సాయిబాబు, వార్డు సభ్యుడు పరిశ నాంచారయ్య, తాళ్ళూరి నరేష్ పాల్గొన్నారు. ప్రసన్న కళాశాల వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనం చేశారు.

● **పెదపారుపూడి :** వెంట్రప్రగడ, వానపాముల, ఈదులమద్దాలి గ్రామాల్లో వినాయకుని నిమజ్జన నిర్వహించారు. వెంట్రప్రగడలోని ఎర్ర చెరువు వద్ద విద్యార్థులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని ఆదివారం గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. దోసపాడు చానల్‌లో నిమజ్జనం చేశారు. వానపాములంలో యాదవుల బజారులో ఏర్పాటుచేసిన స్వామికి పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఈదులమద్దాలి పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని కూడా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.

● **కూచిపూడి:** వివిధ గ్రామాల్లో చలువ పందిళ్లు వేసి విద్యుత్‌దీపాలు అలంకరించి ప్రతిష్ఠించిన గణనాథులు ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. చినముత్తేవి, కారకంపాడు, కూచిపూడి, మొవ్వ, కాజ తదితర గ్రామాల్లో పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పూజాకార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

● **తోట్లవల్లూరు :** మండలంలో ఆదివారం గణేష్ నిమజ్జనాలు జరిగాయి. గుర్విందపల్లి, భద్రిరాజుపాలెం, యాకమూరు, మద్దులవానిగూడెం, చినపులిపాక గ్రామాల్లో మూడు రోజులుగా పూజలందుకున్న గణనాథులను ట్రాక్టర్లపై అలంకరించి డప్పువాయిద్యాలతో ఊరేగిస్తు భక్తులు నృత్యాలు చేశారు. సాయంత్రం నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● **చోరగుడి (పమిడిముక్కల):** చోరగుడిలో గణపతిని ఆదివారం నిమజ్జనం చేశారు. గ్రామంలో డప్పువాయిద్యాల నడుమ యువత చిందులు వేస్తూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. గుర్రాలంకలో గణేష్ నిమజ్జనం

గుర్రాలంకలో..

గణేష్ యువజన సంఘ అధ్వర్యంలో మూడు రోజులుగా పూజలందుకున్న గణనాథుడు ఆదివారం నిమజ్జనం చేశారు. డప్పు కళాకారుల వాయిద్యాలు, యువకులు కేరింతలు, రంగులు చిమ్ముకొంటూ ఆనందోత్సాహంతో గణేష్ విగ్రహాన్ని వీరంకిలాకు ఎగువ, దిగువ సెంటర్లలో ఊరేగించి, అనంతరం బందరు కాల్వలో నిమజ్జనం చేశారు.

సందడిగా ఆనంద ఆదివారం

పెదపారుపూడి: యలమర్రు జెడ్పీ పాఠశాలలో ఆనంద ఆదివారం ఉత్సాహం నిర్వహించారు. విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కేరింతలతో సినీ పాటలకు నృత్యాలు చేసి సందడి చేశారు. ఎంపీపీ కాజ విజయలక్ష్మి చిన్ననాటి జ్ఞాపకాలతో మైమరిచి పిల్లలతోకలిసి పాటలకు స్టెప్‌లు వేస్తూ అలరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు సజ్జా వెంకట రాధిక, నరసింహారావు, ఎలీషారావు, బీసీ శ్రీనివాసరావు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి తదితరులు

‘నంద్యాల’ గెలుపోటములపై బెట్టింగ్‌ల జోరు

కోడూరు: కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికల గెలుపోటములపై మండల వ్యాప్తంగా వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. వైసీపీ తరపున పోటీ చేసిన శిల్పా మోహనరెడ్డి రెండు ఓట్ల తేడాతోనైనా గెలుస్తారని కార్యకర్తలు బెట్టింగ్‌లు కాస్తున్నారు. టీడీపీ తరపున పోటీ చేసిన భూమా బ్రహ్మానందరెడ్డి 10 వేల ఓట్లతో గెలుపొందుతారని రూపాయికి రెండు రూపాయలు ఇచ్చి బెట్టింగ్‌లు కాస్తున్నారు. సుమారు లక్షలాది రూపాయలకుపైగా పందేలు కాస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



శిథిలావస్థలో మండల కార్యాలయం

మొవ్వ(కూచిపూడి): మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మొవ్వ మండల పరిషత్‌కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. గోడలు బీటలువారి కిటికీలు తలుపులు ఊడిపోయాయి. పైకప్పు నుంచి వర్షం కురిస్తే నీరు కారుతుంది. దాంతో పరిపాలనా కార్యకలాపాలకు తీవ్ర ఆటంకంగా మారింది. పంచాయతీరాజ్ ఏఈ కార్యాలయం, మండల పరిషత్ సమావేశ మందిరం, ఈవోపీఆర్డీ, ఎంపీపీ కార్యాలయం, ఎంపీడీవో, కంప్యూటర్, పరిపాలనా అధికారులు, సిబ్బంది కార్యాలయాలు ఈ భాగంలోనే ఉన్నాయి. విలువైన రికార్డుల, ఫర్నిచర్, కంప్యూటర్లకు భద్రత కొరవడింది. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడమే కాని అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన భవన నిర్మాణంపై దృష్టిసారించడంలేదు. శిథిలావస్థలో ఉన్న ఈ భవనాన్ని తొలగించి నూతన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, స్థానికులు కోరుచున్నారు.

రూ.1.25 కోట్లతో ప్రతిపాదనలు

చంద్రశేఖర్‌రావు, పీఆర్ ఏఈ



శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో నూతన నిర్మాణానికి రూ.1.25కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైన వెంటేనే నిర్మాణాపనులు చేపడతాం.

ఏటీఎంలో సాంకేతిక లోపం ఖాతాదారుల ఆందోళన

కోడూరు: స్థానిక ఎస్‌బీఐ ఏటీఎంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగదు డ్రా చేసినా.. రాకపోగా డ్రా చేసినట్టు మెస్సేజ్‌లు రావటంతో అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌కు తెలియజేయగా.. అకౌంట్‌లో నగదు ఉందనీ, భయాందోళన చెందవద్దని చెబుతున్నారు. కాగా, ఇదే విషయమై సమాధానం చెప్పేందుకు కొంతమంది ఖాతాదారులపై మేనేజర్ మండిపడినట్టు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంలో సాంకేతిక లోపాలను సరిచేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.

సాగరతీరంలో యాత్రికుల సందడి

కోడూరు: హంసల దీవి సమీపంలోని సాగర సంగమం, సముద్రతీరం వద్ద ఆదివారం యాత్రికు లు, భక్తుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వివిధ వాహనాల్లో యాత్రికులు తరలివచ్చి పుణ్యస్నానా లుఆచరించారు. డాల్ఫిన్ భవనం వద్ద సేదతీరి తిరుగు ప్రయాణంలో హంసలదీవిలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అమలు అంతంత మాత్రమే

● అందరికీ అందని అన్నఅమృత హస్తం ● అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమి ● రేషన్ బియ్యంతో భోజనం ● రాకపోకలకూ ఇబ్బందే



ఖాళీగా ఉన్న నూజివీడు అంగన్‌వాడీకేంద్రం



అంగన్‌వాడీకేంద్రంలో బాలింత, చిన్నారులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో 37 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్నఅమృతహస్తం పథకం అమలు అంతంత మాత్రమే. పట్టణంలో ప్రీస్కూళ్ళు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మినహా ఎక్కడా సౌకర్యాలు లేక పోవడంతో అంగన్‌వాడీ పరిధిలో బాలింతలు, గర్భిణీలు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 37 కేంద్రాలకు 337 మంది గర్భిణులు, 299 మంది బాలింతలతో కలుపుకుని రెండు వేల మంది చిన్నారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సి ఉండగా, అందులో సగం మంది మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అమ లు కాలేదు. బాలింతలు, గర్భిణులకు ప్రతిరోజూ ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనం ఐరన్ ట్యాబ్‌లెట్లను అంగన్‌వాడీ కేంద్రాల అందించాల్సి ఉంది. దీంతో కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు సుమారు 3 నుంచి 4 గంటల సమయం ఉండాల్సిన పరిస్థితి ఉంది. వారు కిందే కూర్చోవాల్సి ఉండడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల లేమి

నూజివీడు రూరల్ : నూజివీడు మండల పరిధిలో మొత్తం 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో మూడు వేల మంది చిన్నారులకు, 478 మంది బాలింతలు, 599 మంది గర్భిణులు అన్న అమృతహస్తం పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. దాదాపు సగానికి పైగా ఈ పథకాన్ని వినియో గించుకుంటున్న దాఖలా కనిపించటం లేదు. విద్యుత్‌బిల్లులు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను గ్రామపంచాయతీలకు అందించినా అవి అన్ని గ్రామాల్లోనూ అమలు కావడం లేదు. మరోవైపు బాలింతలు సిజేరియన్ల కారణంగా అంగన్‌వాడీకేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారుతోంది.

రేషన్ బియ్యంతో ఇబ్బందులు

చాట్రాయి : ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అన్న అమృతహస్తం పథకం గర్భిణిలు, బాలింతలకు వరం అయినా కోటా బియ్యం వల్ల నీరు గారి పోతున్నది. మండల కేంద్రం చాట్రాయిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం గుడ్డు, పాలు పోషకవిలువలు కలిగిన కూరతో భోజనం పెడుతున్నారు కానీ కోటా బియ్యం వల్ల గర్భిణిలు, బాలింతలు కడుపు నిండా భోజనం చేయలేకపోతున్నారు. కోటా బియ్యంవల్ల అరుగుదల ఉండక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం మంచి బియ్యం ఇస్తుందనే ఆశతో రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నట్లు పలువురు చెప్పారు. కొంతమంది ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని గుడ్డు, కూరతో భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం పెట్టించుకుని తీసుకు వెళుతున్నారు. కేంద్రానికి రాలేని నిండుగర్భిణిలు, పచ్చి బాలింతలకు మాత్రం భోజనం వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇళ్ళకు పంపుతున్నారు. ప్రభుత్వం కోటా బియ్యానికి బదులు మంచి బియ్యం సరఫరా చేస్తే అన్న అమృతహస్తం పథకం మంచి ఫలితాలిస్తుంది.

అధికారుల వైఫల్యం

విస్సన్నపేట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలుకు అధికారులు సమర్ధంగా పనిచేయటం లేదనే విమర్శలు నెలకొన్నాయి. బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకు రావడంలో వైఫల్యం చెందుతున్నారు. గర్భిణులు, బాలింతల బంధువులు వచ్చి ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారే తప్ప అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్న నిబంధనను సమర్ధంగా అమలు జరపటం లేదు. కొన్ని కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు ఇంటి వద్ద నుంచి అన్నం తెచ్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలతో భుజించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చిన రేషన్‌బియ్యం ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో అన్నం పెట్టాలని కోరుతున్నారు.

ఏటీత..లంకమేత..చందం

ఆగిరిపల్లి : రేషన్ బియ్యం అన్నం తినడం ఇష్టంలేక కొందరు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ఆసక్తి చూపటం లేదు. గర్భిణిలు, బాలింతలు పాలు, గుడ్డుకోసం, మధ్యాహ్నం భోజనం కోసం రెండు దఫాలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివాసం ఉండేవారు ఈ పథకానికి దూరమవుతున్నారు. భోజనం కోసం నడిచి రావాల్సి రావడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో భోజనానికి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. కొందరు మాత్రం వచ్చి అంగన్‌వాడీల్లో అసౌకర్యాల నడుమ భోజనం చేయలేక క్యారేజిల్లో భోజనం తీసుకువెళుతున్నారు. లంక మేత కోసం ఏటిఈతలా ఉందని వాపోతున్నారు. మండలంలో మొత్తం 67 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా, 470మంది గర్భిణిలకు 373 మంది, 413 మంది బాలింతల్లో 322 మంది అన్న అమృతహస్తం పథకంలో భోజనం చేస్తుండగా భోజనం నాణ్యతలేక కొన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో ఈ పథకంపై పెదవివిరుస్తున్నారు.

ముసునూరు మండలంలో

మండలంలోని 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో 382 మంది బాలింతలు, 437మంది గర్భిణులు, 3550 మంది చిన్నారులు అన్నఅమృతహస్తం పథకం ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇందులో 270 మంది బాలింతలు, 300 మంది గర్భిణుల మాత్రమే పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. చిన్నారులకు మాత్రం మెనూ ప్రకారం ఆహారం అందించటం లేదనే విమర్శలు ఉన్నాయి. కూరగాయలు తదితర వస్తువులను అంగన్‌వాడీకార్యకర్తలే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీనుండి రూ.5వేలు నిధులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు నిధులు అందలేదు. సౌకర్యాల లేమితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యంలో నాణ్యత లేకపోవడంతో సరిగ్గా ఉపయోగించుకోలేక పోతున్నారని సర్వత్రావిమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుడివాడలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర నేడు

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర సోమవారం గుడివాడలో జరుగుతుంది. ఈనెల 26న హనుమాన్ జంక్షన్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారంనాడు నూజివీడులో జరిగింది, తిరువూరు, నందిగామలో పర్యటనను పూర్తి చేసుకుని విజయవాడకు చేరుకుంది. సోమవారం గుడివాడ, మచిలీపట్నం, చల్లపల్లి, ఆవనిగడ్డ, రేపల్లెలో ఈ యాత్ర సాగుతుంది.

ఎన్నికల్లో బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

● యువతకు రమేష్‌నాయుడు సూచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికలలో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్ళొద్దని బీజేపీ యువమోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యాలయ మీడియా సెల్ ఇన్‌ఛార్జి దిలీప్‌లతో కలిసి మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా రూపొందించేందుకు తమ పార్టీ తరఫున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బీజేపీ,టీడీపీకి ఉమ్మడి శత్రువులుగా ఉన్న కొందరు అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటితో పాటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యంగా కొందరు నాయకుల మాటలు విని యువత బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, దీని జోలికి పోవద్దని వారు సూచించారు.

ఆల్ మునిసిపల్ ఇంజనీర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

● ప్రెసిడెంట్‌గా ఎంపికయిన టి.రంగారావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జోన్-2 ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాటర్ సప్లై డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న టి.రంగారావు ఎంపికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్-2కు చెందిన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు. జోన్-2 కమిటీ ఎంపికలో సెక్రటరీగా అసిస్టెంట్ ఇంజనీరు డి.దుర్గారావు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా జె.ఫణి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు కే.వి. సాయిప్రసాద్, ట్రెజరర్‌గా విజయవాడ సర్కిల్-1 ఈఈగా పనిచేస్తున్న కే.కోటేశ్వర్రావు, సభ్యులుగా డీఈఈ ఎంసీఎస్.పాత్రుడు, డీఈఈ వి.పద్మాకర్ ప్రసాద్, ఏఈ కే.రాజ్‌కుమార్, ఏఈ పి.సూర్యకుమారి, ఏఈ డి.లక్ష్మీనారాయణ, ఏఈ డి.రామకిషోర్, డీఈఈ అబ్దుల్ రహీమ్, బి.హెచ్.సుబ్బారావు డీఈఈ, ఏఈ నాగేశ్వర్రావు ఎంపికయ్యారు.

డేరాబాబాతో లాలూచి వల్లే ఉత్తరాదిలో విధ్వంసం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విజయవాడ : సిపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో దేరాబాబా సహకారంతో హర్యానాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. డేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. హింస చెలరేగే ప్రమాదం ఉన్నదని ముందే ఊహించి 200 రైళ్లను రద్దు చేసిన ప్రభుత్వం డేరాబాబా 200 వాహనాల కాన్వాయ్‌తో కోర్టు హాజరయ్యేందుకు ఎందుకు అనుమతించిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో దళితులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, అభద్రతాభావంతో వారు జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ఎండగడుతూ నెల రోజులూ ప్రచార కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. చోటామోటా నాయకులకు వారి విలువను బట్టి రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వెచ్చించి కొనుగోలు చేస్తున్నందున ఎన్నికల బదులుగా వేలాన్ని నిర్వహిస్తే సబబుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎక్కడికక్కడ నోట్లను ప్రధాన పార్టీలు వెదజల్లుతున్నాయని తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టిడీపీ, వైకాపా పోటీలు పడిమరీ ఓటర్లను కొనుగోలు చేశాయన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పార్శ్వనాథ స్వామికి విశేష పూజలు

గుడివాడ టౌన్: మార్వాడి గుడి రోడ్డులో వేంచేసి ఉన్న జైన్ శ్వేతాం బర్ దేవాలయంలోని శ్రీ పార్శ్వనాథ స్వామి వారికి మార్వాడి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. పర్వపజుషన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఎనిమిది రోజులుగా ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. 9వ రోజున 18 రకాల పాలు, పెరుగు తదితర పూజ సామాగ్రితో పార్శ్వనాథ స్వామికి అభిషేకాలు నిర్వహించామన్నారు.

డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు



లింగవరం గ్రామం వద్ద చంద్రయ్య డ్రెయిన్ గుర్రపుడెక్క తొలగిస్తున్న

గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ మండలం లింగవరం గ్రామ సర్పంచ్ మలిరెడ్డి నర్సారెడ్డి ఆధ్వర్యంలో లింగవరం కాలనీ పక్కన ఉన్న చంద్రయ్య డ్రెయిన్‌లో ఎక్స్‌కవేటర్ ద్వారా గుర్రపుడెక్క ఆదివారం తొలగించారు. కాలనీ డొంకరోడ్లలో ఉన్న ముళ్ళ పొదలను తొలగించారు. గ్రామంలో కొంతమందికి జ్వరాలు వస్తున్న విషయం తెలుసుకొని సర్పంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. లింగవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటూరి ఏసుపాదం, మట్టా జాన్ విక్టర్ గ్రామస్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు.

గంగాభవానీకి బంగారు నత్తు బహూకరణ



అమ్మవారికి బంగారపు నత్తు అందజేస్తున్న దాతలు

గుడివాడ రూరల్: గుడివాడ రూరల్ మండలం బిళ్ళపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నాగగంగభవాని అమ్మవారికి గుడివాడ పట్టణానికి బాలచంద్రశేఖర్-లీలాభవాని దంపతులు బంగారపు నత్తు ఆదివారం ఉదయం సమర్పించారు. పూజారి కన్నయ్యకు అందచేయడం జరిగింది. తమ కోర్కెలు తీర్చినందుకు కృతజ్ఞతగా బంగారు నత్తు అందచేశామని ఈ దంపతులు పేర్కొన్నారు.

త్వరలో ఇంటింటికి బీజేపీ

గుడివాడ టౌన్: భారతీయ జనతా పార్టీని గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయిలో బలోపేతం చేసేందుకు ఇప్పటికే బూత్ కమిటీలు ఏర్పాటు చేశామని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ఇంటింటికి బీజేపీ కార్యక్రమం త్వరలో చేపడతామని బీజేపీ బందరు పార్లమెంట్ విస్తారక్ ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావులు అన్నారు. స్థానిక 17వ వార్డులో మాజీ కౌన్సిలర్ మరీదు విజయలక్ష్మి స్వగృహం వద్ద బూత్ స్థాయి కమిటీ ఎన్నిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 60 బూత్‌స్థాయి కమిటీలను నియమించామన్నారు. మిగిలిన కమిటీలు త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై బూత్ కమిటీలు స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు కూడా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పేరం శ్రీనివాసరావు, షేక్ హర్షాద్, బూత్‌స్థాయి కమిటీ ఇన్‌చార్జిలు శొంఠి దేవివరప్రసాద్, శొంఠి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చవితి ఉత్సవాలు

గుడ్లవల్లేరు : ఇందిరాకాలనీలో ఆ కాలనీ యూత్ ఏర్పాటుచేసిన వినాయకుడి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. విగ్రహాన్ని ఊరేగించి గుడ్లవల్లేరు లాకుల వద్ద నిమజ్జనం చేశారు. యువకులు డ్యాన్స్‌లతో ఎంతో ఉల్లాసంగా గ్రామోత్సవం నిర్వహించారు.

నిర్విఘ్నంగా వినాయక ఉత్సవాలు



స్వామివారికి 25 కేజీల లడ్డూను సమర్పిస్తున్న రెల్లి యూత్, యలవర్తి యువసేన సభ్యులు



మహాగణపతికి నీరాజనం



నందివాడలో వినాయక నిమజ్జనం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో గణపతి నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారు మహా గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ పరిసే వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ నెరుసు చింతయ్య, మేనేజర్ ఎస్‌కె కిషోర్, పాలకవర్గ సభ్యులు విశేష పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన భరతనాట్యం పలువురిని ఆకట్టుకుంది.

రెల్లి యువత 25 కేజీల లడ్డూ సమర్పణ

గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యలవర్తి యువసేన, రెల్లి యువత సంయుక్త ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్‌లో వేంచేసి ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామి వారికి పట్టు వస్త్రాలు, 25 కేజీల లడ్డును ఆదివారం సమర్పించారు. రెల్లి బజారు నుంచి తీన్‌మార్ డప్పులు, నృత్యాలతో ఊరేగింపుగా మార్కెట్ సెంటర్‌కు చేరుకుని స్వామివారికి లడ్డు ప్రసాదాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వెంపల హైమావతి, వసంతవాడ దుర్గారావు, కలిమి వెంకటరెడ్డి, టీడీపీ నేతలు వెంపల అప్పారావు, వడ్డాది నాగరాజు, రెల్లి యూత్ నాయకులు మాడుగుల రేణుకుమార్, వడ్డాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వేసిన చలువ పందిళ్లలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

గుడ్లవల్లేరులో...

27 జిడివిఎల్ 1 : గుడ్లవల్లేరు ఎస్ఇఆర్ఎం హైస్కూల్ ప్రాంగణంలో వినాయకుని పందిరిలో హారతులిస్తున్న పురోహితుడు, తిలకస్తున్న భక్తులు

● గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గుడ్లవల్లేరులో ఎస్ఇఆర్ఎం హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సిద్దిబుద్ధి వినాయకుని పూజా కార్యక్రమాల్లో మూడవరోజు పడవల వెంకటేశ్వరరావు దంపతులు, తాతాని సుబ్బయ్య దంపతులు, రాఘవులు దంపతులు, కోటేశ్వరరావు దంపతులు, వెంకటేశ్వరరావు దంపతులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అలానే గ్రామంలోని శ్రీ మద్దంగా పార్వతి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో విఘ్నేశ్వరుని నవరాత్రి మహోత్సవాల్లో గద్దె సోమరాజు దంపతులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరాలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అలానే ఎస్ఇఆర్ఎం విద్యా సంస్థల ప్రాంగణంలో సిద్ది, బుద్ధి సమేత వినాయకునికి 27 రకాల ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాలలో వల్లభనేని వెంకట్రావు, ఈడ్పుగంటి ఉమా మహేశ్వరరావు, కొసరాజు వెంకటాద్రిచౌదరి, చంద్రం, యలమంచిలి రామకోటేశ్వరరావు, వల్లభనేని కృష్ణప్రసాద్, సిద్దేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొసరాజు వెంకటాద్రి(పెదబాబు), డైరెక్టర్లు గవిర్నేని రామారావు, అన్నె ప్రసాదరావు, స్వామి, నారాయణ ప్రసాద్, వీరభద్రరావు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్‌లో...

మండలంలో వినాయక ఉత్సవాలు మూడవరోజు విఘ్నేశ్వరుని చలువ పందిళ్ళలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొమ్ములూరు, మోటూరు, లింగవరం తదితర గ్రామాల్లో శ్రీ వినాయకుని పందిళ్ళలో గణేష్‌ను ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.భజన కార్యక్రమం నిర్వహించారు.

నందివాడలో...

మండల పరిధిలోని గ్రామాల్లో గణేష్ నిమజ్జన వేడుకలు వైభవంగా జరిగాయి. జనార్దనపురం, తుమ్మలపల్లి, టెలీఫోన్‌నగర్, పోలుకొండ, నందివాడ గ్రామాల్లో నిమజ్జనం సందర్భంగా స్వామివారిని గ్రామాల్లో ఊరేగించారు. డి జె సౌండ్స్, డప్పు వాయిద్యాలతో యువత, భక్తులు కోలాహలంగా డ్యాన్స్‌లు వేశారు. అనంతరం దోసపాడు, గుడివాడ ఛానల్స్‌లో గణేష్‌ను నిమజ్జనం చేశారు.

సందడిగా హ్యాపీ సండే



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న చైర్మన్ యలవర్తి, కమిషనర్ ప్రమోద్‌కుమార్

గుడివాడ టౌన్: ప్రతి వ్యక్తి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆరోగ్యవంతంగా జీవించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం హ్యాపీ సండే నిర్వహించాలని ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆనంద ఆదివారం ప్రతి ఒక్కరిని రంజింప చేసింది. ఆట పాటలు, డ్యాన్స్‌లు, మహిళలు ఆటలు ఉత్తేజపరిచాయి. ఆనంద ఆదివారం ప్రతి ఒక్కరికి ఆరోగ్యం కలిగిస్తుందనే ఉద్దేశ్యంతో పట్టణంలోని పుర వీధుల్లో నిర్వహించిన ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కమిషనర్ ఎన్. ప్రమోద్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మెప్మా పీడీ ప్రియంవద, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం యలవర్తి మాట్లాడుతూ ప్రతి ఆదివారం కార్మికులకు, విద్యార్థులకు సెలవు దినం కావడంతో వారం అంతా పనిచేసిన వ్యక్తులు ఉల్లాసంగా గడపడానికి ఆనంద ఆదివారం ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. వాయు కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ సైకిల్ వినియోగించాలని పిలుపునిచ్చారు. స్పందన ఆర్ట్స్ కళాకారులు నిర్వహించిన మిమిక్రీ, నాటికలోని ఘట్టాలు అందరిని ఆకర్షించాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. మొత్తంమీద ఎజికె హైస్కూల్ ప్రాంగణమంతా ఆనంద ఆదివారంతో ఆదుర్స్ అనిపించేలా కార్యక్రమాలు నిర్వహించారు.



కుర్చీలాట ఆడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గ్యాస్ సమాచారం

ఏజెన్సీ	సరఫరా తేదీ	ఫోన్ నెం.	ఆన్‌లైన్ నెం.
● విజయ్ ఎంటర్ ప్రైజెస్	ఏరోజుకారోజు	243398	9666023456
● అయ్యప్ప ఎంటర్ ప్రైజెస్	ఏరోజుకారోజు	244345	9666023456
● సాయిసువర్ణ ఎంటర్ ప్రైజెస్	ఏరోజుకారోజు	247888	9848824365
● పద్మనాభ ఎంటర్ ప్రైజెస్	2లేక 3రోజులకు	243558	9848824365

సినిమాలు

కమల	: అర్జున్‌రెడ్డి
నటరాజ్ ఏసీ	: వివేకం
సాయికృప	: నేనేరాజు నేనేమంత్రి

జగ్గయ్యపేట బులియన్ మార్కెట్

బంగారం	: రూ. 29,920 (24 క్యారెట్లు-10గ్రా)
	: రూ. 27,510 (22 క్యారెట్లు-10గ్రా)
వెండి	: రూ.40,000 (కేజీ)

భిన్నరూపాల్లో గణనాథులు



మల్లెపూల గణపతి




విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన వినాయకుడు విగ్రహం



బండ్లబజార్‌లో కోలాటం వేస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని బాలాంజనేయ స్వామి ఆలయంలో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న చిన్నారులు



అనిగండ్లపాడు సొసైటీ సెంటర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



అనిగండ్లపాడు సొసైటీ సెంటర్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



తిరుపతమ్మ దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలు బ్రాహ్మణ వీధిలో గణపతి హోమం

జగ్గయ్యపేట: పట్టణంలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులు భిన్న రూపాల్లో భక్తులు పూజలు అందుకున్నారు. సీతారాంపురంలో బాబీవీధిలో భక్తబృందం మట్టి వినాయకుడితో నవరాత్రులు నిర్వహిస్తు ఆదర్శంగా నిలిచారు. మిట్టగూడెంలో బండ్లబజార్‌లో భక్తబృందం నవరాత్రోత్సవ వేదికపై కోలాటంతో భక్తి పాటలకు నృత్యాలు చేశారు. మండపంవద్ద నాగుల పుట్టరూపంలో అలంకరించారు. చెరువుబజార్‌లో శివ గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలో వైదేహి అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంవద్ద ఆదివారం అన్న సంతర్పణ నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలో శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామికి మల్లెపూలతో అలంకరణ చేశారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. షరాబు వర్తక సంఘం సభ్యులు హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం ప్రధానార్చకుడు టీవీ శ్రీనివాస్, పిల్లలమర్రి నాగకృష్ణశర్మలు పైకార్యక్రమాలను జరిపించారు.

- **పెనుగంచిప్రోలు:** మండలంలో గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని అనిగండ్లపాడు సొసైటీ సెంటర్‌లో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులు, తది తరులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ సెంటర్ సమీపంలోని బ్రాహ్మణ వీధిలోని వినాయక పందిరి వద్ద ఆదివారం గణపతి హోమా న్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



చెరువుబజార్‌లో శివగణపతి

నిమజ్జనానికి తరలిన గణనాథులు

జగ్గయ్యపేటరూరల్ : గణపతి నవరాత్రులను పురస్కరించుకుని వివిధ గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్న వినాయక విగ్రహాలు మూడో రోజు ఆదివారం నుంచి నిమజ్జన కార్యక్రమానికి బయలుదేరాయి. ఆయా గ్రామాల నుంచి ట్రాక్టర్లపై విగ్రహాలను ఏర్పాటు చేసుకుని ముక్త్యాల, వేదాద్రి గ్రామాల్లోని కృష్ణానదిలో నిమజ్జనాన్ని నిర్వహిస్తున్నారు. వేదాద్రి వద్ద దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫంటు మీదుగా విగ్రహాలను నది మధ్యభాగానికి తీసుకువెళ్లి నిమజ్జనం చేస్తుండగా, ముక్త్యాల వద్ద అటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో నది అంచునే నిమజ్జనాలు చేస్తున్నారు. ముక్త్యాల వద్ద విగ్రహాలను నిమజ్జనానికి తీసుకురావడం కూడా ఇబ్బందికరంగా ఉంది. భారీ విగ్రహాలను నిర్వాహకులు చేతులపై పెట్టుకుని వందల సంఖ్యలో ఉన్న మెట్ల పైనుంచి నది వద్దకు విగ్రహాలను తీసుకువస్తున్నారు. పోలీసులు, పంచాయతీ అధికారులు స్పందించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు సహకరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ముక్త్యాల వద్ద మెట్ల పైనుంచి విగ్రహాన్ని దించుతున్న భక్త బృందం



సీతారాంపురం బాబీ వీధిలో మట్టి వినాయకుడు

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో...

జగ్గయ్యపేటరూరల్: మండలంలోని తొర్రగుంటపాలెం వెళ్లే రోడ్డు మార్గంలో విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. జంపర్‌ల కోసం ఏర్పాటు చేసిన ఆ పోల్‌పై తీగలు పెరగడం మూలంగా విద్యుత్ సరఫరాలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని. తక్షణం ఆ శాఖాధికారులు స్తంభాలకు పెరిగిన చెట్లు, తీగలను తొలగించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.



చెట్లు, తీగలతో అల్లుకుపోయిన విద్యుత్ స్తంభాలు

అన్న సంతర్పణ

జగ్గయ్యపేట : ఇటీవల దివంగతులైన మహాలక్ష్మి వెండి దేవాలయం అర్చకులు దూళిపాళ పూర్ణానందశాస్త్రికి స్మృత్యర్థం ఆదివారం దేవస్థానం ప్రైవేట్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ జరిగింది. దూళిపాళ ఆత్మశాంతి కోరుతూ కమిటీ సభ్యులు మౌనం పాటించారు. అత్తులూరి వెంకటేశ్వర్లు పర్యవేక్షణ అన్నప్రసాదాన్ని పేదలకు అందజేశారు.

కుల మతాలకు అతీతంగా ఉండాలి

జగ్గయ్యపేటరూరల్: కులమతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలు నిర్వహించుకుంటే గ్రామసీమలు కళకళలాడతాయని, చిల్లకల్లు ఎస్సై షణ్ముఖసాయి అన్నారు. గౌరవరంలో ఆదివారం జెండా చెట్టు వద్ద వినాయకుడి మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గంగూరి నరేష్, ముత్తవరపు వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

'కన్య పథకం' పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వత్సవాయి: బ్రాహ్మణ కార్పొరేషన్ అమలు చేస్తున్న పింఛన్ పథకంలో భాగంగా మరో రెండు వేలు అదనంగా కావాల్సిన పింఛనుదారులు బ్రాహ్మణ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా రాష్ట్ర బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ చైర్మన్ సూర్య పిలుపు నిచ్చినట్లు నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొమరగిరి భరద్వాజ్ తెలిపారు. పింఛన్‌తోపాటు కన్యా పథకం ద్వారా అదనంగా పింఛను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినందున ఈ దరఖాస్తును ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31 లోపు పంపాలని ఆయన తెలిపారు.

చివరిదశకు బుద్ధ విగ్రహ నిర్మాణం

◆ రంగులు వేస్తున్న కళాకారులు ◆ దసరా నాటికి సిద్ధం ◆ ప్రారంభానికి మంత్రుల రాక

జగ్గయ్యపేట: పట్టణంలో ఊరచెరువులో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహం నిర్మాణం చివరిదశకు చేరింది. ద రాంకో సిమెంట్స్ సౌజన్యంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహ నిర్మాణానికి రాంకో సంస్థ రూ.15లక్షలు వెచ్చించింది. వరంగల్‌కు చెందిన కళాకారులు సిమెంట్‌తో బుద్ధ విగ్రహాన్ని నిర్మించారు. మూడు నెలల్లో విగ్రహ నిర్మాణం పూర్తి కాగా ప్రస్తుతం రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో నగిషికి రంగులు వేయటం పూర్తవుతుందని విగ్రహ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న రాంకో సంస్థ ప్రతినిధులు తెలిపారు. దసరా నాటికి విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులతో ప్రారంభించాలని ఎమ్మెల్యే తాతయ్య యోచిస్తున్నారు. వాస్తవానికి ఈ నెలలోనే విగ్రహాన్ని ఆవిష్కరింజేయాలని తాతయ్య భావించినా నంద్యాల, కాకినాడ ఉప ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర మంత్రులతో పాటు తాను బిజీగా ఉండటంతో విగ్రహ ప్రారంభోత్సవం వాయిదా పడింది. బుద్ధ విగ్రహం ఏర్పాటుతో ఊరచెరువు ట్యాంకుబండ్ తరహాలో రూపు రేఖలు మారనున్నాయి.

బోటు షికారుకు పర్యాటకశాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఊరచెరువు చుట్టు సిమెంట్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. కృష్ణా పుష్కరాల నిధులతో చిల్లకల్లు రోడ్డు నుంచి చెరువు రోడ్డు మున్తాబు అయింది.



రంగులతో కొత్త కళ సంతరించుకున్న బుద్ధ విగ్రహం

గ్యాస్ సమాచారం

ఏజెన్సీ	సరఫరా తేదీ	ఫోన్ నెం.	ఆన్‌లైన్ నెం.
• జయసంతోషి (ఇండేన్)	23.8.17వరకు	222359, 223492	9848824365
• అన్నపూర్ణ(హెచ్‌పీ)	24.8.17 వరకు	225500, 225400	9666023456
• శ్రీరామసత్య(ఇండేన్)	25.8.17 వరకు	225666	9848824365

కుటుంబంతో మిలీనియం మార్చ్‌కు రండి



మిలీనియం మార్చ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలు

జగ్గయ్యపేట: సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మిలీనియం మార్చ్‌కు కుటుంబాలతో పాల్గొనాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కౌన్సిలర్ టీఎల్ నరసింహారావు కోరారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఆదివారం సీపీఎస్ ఉద్యోగుల సమావేశంలో పాల్గొని మిలీనియం మార్చ్ సీపీఎస్ ఉద్యోగులకు జీవన్మరణ పోరాటమని అన్నారు. మిలీనియం మార్చ్ ప్రభుత్వ పెద్దల ఆలోచనను మార్చేలా ఉండాలని, అందుకు కుటుంబాలతో సహా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎన్జీవో నేతలు వెంకట్రావు, ఈఈ చక్రవర్తి, ముప్పాళ్ల శ్రీను, పెన్షనర్ల అసోసియేషన్ నేత గంధం శేషగిరిరావు, డీఈఈ మునిరత్నం, ఏఈలు అనిల్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కృషి ఉంటే సాధించలేనిదేమీ లేదు

— చింతకుంట్ల లక్ష్మీనారాయణ —

వత్సవాయి : అంకితభావంతో బాధ్యతలు నిర్వర్తించే ఉద్యోగులకు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని నాగార్జున సాగర్ ఎడమ కాలవ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో ఆదివారం ఉత్తమ ఎస్సైగా జిల్లా మంత్రులు, అధికారుల నుంచి అవార్డు అందుకున్న వత్సవాయి ఎస్సై జేవీ రమణను ఎస్సీ కాలనీవాసులు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టుదల, కృషి ఉంటే సాధించలేనిదేమి లేదన్నారు. పేద కుటుంబం నుంచి అనేక అటుపోట్లతో ఉత్తమ ఎస్సైగా అవార్డు పొందడం పట్ల ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న వక్తలు ఆయన సేవలు, గుణగణాలను కొనియాడారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బంధువులు, మిత్రులు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. విశ్రాంతి ఉద్యోగి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గంటా నాంచారయ్య, పెంటి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ నర్సిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముక్కు నాగభూషణం, ఎంపీటీసీ సభ్యులు గంగిపోగు రమేష్, ఎస్‌కె హుస్సేన్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె సలీమ్, టీడీపీ నాయకులు, ఇంజం రామారావు, న్యాయవాదులు బసవయ్య, బాపిరాజు,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సై రమణను సన్మానిస్తున్న ఎస్సీ కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు

రైతుబజార్ ధరలు

టమాటో (కిలో)రూ. 35, వంగ 25, వంగ (గుండ్రం)22, బెండ 12, పచ్చిమిర్చి 20, బజ్జిమిర్చి 24, కాకర 13, బీర 16, క్యాబేజి 16, క్యారెట్ 43, దొండ 20, బంగాళాదుంప 15, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుళ్లు, 19, దోస 10, సొర 10/8, పొట్ల 20, అరటి (పెద్దది/చిన్నది)7/6, చిక్కుళ్లు 25, చామదుంప 25, మునగ 5/4, ఆకుకూరలు2.50, కంద 24, బీట్‌రూట్ 26, కీర దోస 20, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికం 42, బఠాణి కాయలు--, ఆకాకర 130, కూర గుమ్మడి 16, బూడిద గుమ్మడి 16, చిలకడదుంప --, విడి గోంగూర --, నిమ్మకాయలు, (పెద్దవి/చిన్నవి) 16/14, బొప్పాయి 22, కొత్తిమీర కట్ట (పెద్దది/చిన్నది) 14/7 పొదీన (పెద్దది/చిన్నది) 7/3, స్వీట్‌కార్న్ --, ముల్లంగిదుంప 8, పచ్చిమామిడి (పెద్దది/చిన్నది) 10/8 కోడిగుడ్డు -1 రూ.3.85

అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణం నష్ట పరిహారాన్ని అందించాలి

నూజివీడు టౌన్: అగ్రిగోల్డ్‌బాధితులకు తక్షణం నష్టపరిహారాన్ని అందించాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్‌అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజలు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్రవ్యాపిత చైతన్యయాత్ర ఆదివారం నూజివీడు చేరిన సందర్భంగా నూజివీడు రాజీవ్‌సర్కిల్‌నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూజివీడు చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో నిర్వహించిన సభలో మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా అతిపెద్ద ఆర్థిక కుంభకోణం జరగ్గా, తొమ్మిది రాష్ట్రాల్లో రూ.7,800కోట్లను ఏజెంట్లు, కష్టమర్లు నష్ట పోవాల్సి వచ్చిందన్నారు. 143మంది ఏజెంట్లు ఆత్మహత్యలకు పాల్పడినా రాష్ట్రప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డిపాజిట్లు చెల్లించిన వారు రోడ్డునపడితే అగ్రిగోల్డ్ డైరెక్టర్లు మాత్రం కోట్లరూపాయల విలువచేసే కార్లలో రోడ్లమీద యధేచ్ఛగా సంచరిస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు సైతం పట్టించు కోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చలసాని వెంకటరామారావు, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో: అగ్రిగోల్డ్ బాధితులకు సీపీఐ అండగా ఉంటుందని వారికి న్యాయం జరిగే వరకు బాధితుల తరపున పోరాటం చేస్తుందని రాష్ట్ర సీపీఐ కార్యవర్గసభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్రను పురస్కరించుకుని ఆదివారం ఆగిరిపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, నూజివీడు డివిజన్ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ముత్యాల సుధాకర్ పాల్గొన్నారు.

విస్సన్నపేటలో: అగ్నిగోల్డ్ బాధితుల సమస్యలపట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగినవిధంగా ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య రథయాత్ర ఆదివారం విస్సన్నపేట వచ్చిన సందర్భంగా జరిగిన సభలో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, మర్సకట్ల త్యాగరాజు అగ్రిగోల్డ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల హర్షం



గ్రామీణ వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కామినేని భూపాలరావు

వత్సవాయి : రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చేందుకు అంగీకరించిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య, ఆరోగ్య శాఖామంత్రి కామినేని శ్రీనివాస్‌లకు గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా నాంచారయ్య, జిల్లా అధ్యక్షుడు కామినేని భూపాలరావులు కృతజ్ఞతలు తెలిపారు. మక్కపేటలోని సాయిసెంటరీ పబ్లిక్‌స్కూల్ ఆవరణలో ఆదివారం మండల గ్రామీణ వైద్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి రోగికైన ప్రాథమికంగా వైద్యం అందించేది గ్రామీణ వైద్యులే అన్నారు. వారి సేవలను ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చి 104, 108లో ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ప్రతి గ్రామీణ వైద్యుడిని నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సమావేశంలో పలువురు గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

అమలు అంతంత మాత్రమే

● అందరికీ అందని అన్నఅమృత హస్తం ● అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమి ● రేషన్ బియ్యంతో భోజనం ● రాకపోకలకూ ఇబ్బందే



ఖాళీగా ఉన్న నూజివీడు అంగన్‌వాడీకేంద్రం



అంగన్‌వాడీకేంద్రంలో బాలింత, చిన్నారులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో 37 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్నఅమృతహస్తం పథకం అమలు అంతంత మాత్రమే. పట్టణంలో ప్రీస్కూళ్ళు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మినహా ఎక్కడా సౌకర్యాలు లేక పోవడంతో అంగన్‌వాడీ పరిధిలో బాలింతలు, గర్భిణీలు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 37 కేంద్రాలకు 337 మంది గర్భిణులు, 299 మంది బాలింతలతో కలుపుకుని రెండు వేల మంది చిన్నారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సి ఉండగా, అందులో సగం మంది మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అమ లు కాలేదు. బాలింతలు, గర్భిణులకు ప్రతిరోజూ ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనం ఐరన్ ట్యాబ్‌లెట్లను అంగన్‌వాడీ కేంద్రాల అందించాల్సి ఉంది. దీంతో కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు సుమారు 3 నుంచి 4 గంటల సమయం ఉండాల్సిన పరిస్థితి ఉంది. వారు కిందే కూర్చోవాల్సి ఉండడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల లేమి

నూజివీడు రూరల్ : నూజివీడు మండల పరిధిలో మొత్తం 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో మూడు వేల మంది చిన్నారులకు, 478 మంది బాలింతలు, 599 మంది గర్భిణులు అన్న అమృతహస్తం పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. దాదాపు సగానికి పైగా ఈ పథకాన్ని వినియో గించుకుంటున్న దాఖలా కనిపించటం లేదు. విద్యుత్‌బిల్లులు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను గ్రామపంచాయతీలకు అందించినా అవి అన్ని గ్రామాల్లోనూ అమలు కావడం లేదు. మరోవైపు బాలింతలు సిజేరియన్ల కారణంగా అంగన్‌వాడీకేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారుతోంది.

రేషన్ బియ్యంతో ఇబ్బందులు

చాట్రాయి : ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అన్న అమృతహస్తం పథకం గర్భిణిలు, బాలింతలకు వరం అయినా కోటా బియ్యం వల్ల నీరు గారి పోతున్నది. మండల కేంద్రం చాట్రాయిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం గుడ్డు, పాలు పోషకవిలువలు కలిగిన కూరతో భోజనం పెడుతున్నారు కానీ కోటా బియ్యం వల్ల గర్భిణిలు, బాలింతలు కడుపు నిండా భోజనం చేయలేకపోతున్నారు. కోటా బియ్యంవల్ల అరుగుదల ఉండక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం మంచి బియ్యం ఇస్తుందనే ఆశతో రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నట్లు పలువురు చెప్పారు. కొంతమంది ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని గుడ్డు, కూరతో భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం పెట్టించుకుని తీసుకు వెళుతున్నారు. కేంద్రానికి రాలేని నిండుగర్భిణిలు, పచ్చి బాలింతలకు మాత్రం భోజనం వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇళ్ళకు పంపుతున్నారు. ప్రభుత్వం కోటా బియ్యానికి బదులు మంచి బియ్యం సరఫరా చేస్తే అన్న అమృతహస్తం పథకం మంచి ఫలితాలిస్తుంది.

అధికారుల వైఫల్యం

విస్సన్నపేట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలుకు అధికారులు సమర్ధంగా పనిచేయటం లేదనే విమర్శలు నెలకొన్నాయి. బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకు రావడంలో వైఫల్యం చెందుతున్నారు. గర్భిణులు, బాలింతల బంధువులు వచ్చి ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారే తప్ప అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్న నిబంధనను సమర్ధంగా అమలు జరపటం లేదు. కొన్ని కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు ఇంటి వద్ద నుంచి అన్నం తెచ్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలతో భుజించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చిన రేషన్‌బియ్యం ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో అన్నం పెట్టాలని కోరుతున్నారు.

ఏటీత..లంకమేత..చందం

ఆగిరిపల్లి : రేషన్ బియ్యం అన్నం తినడం ఇష్టంలేక కొందరు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ఆసక్తి చూపటం లేదు. గర్భిణిలు, బాలింతలు పాలు, గుడ్డుకోసం, మధ్యాహ్నం భోజనం కోసం రెండు దఫాలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివాసం ఉండేవారు ఈ పథకానికి దూరమవుతున్నారు. భోజనం కోసం నడిచి రావాల్సి రావడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో భోజనానికి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. కొందరు మాత్రం వచ్చి అంగన్‌వాడీల్లో అసౌకర్యాల నడుమ భోజనం చేయలేక క్యారేజిల్లో భోజనం తీసుకువెళుతున్నారు. లంక మేత కోసం ఏటిఈతలా ఉందని వాపోతున్నారు. మండలంలో మొత్తం 67 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా, 470మంది గర్భిణిలకు 373 మంది, 413 మంది బాలింతల్లో 322 మంది అన్న అమృతహస్తం పథకంలో భోజనం చేస్తుండగా భోజనం నాణ్యతలేక కొన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో ఈ పథకంపై పెదవివిరుస్తున్నారు.

ముసునూరు మండలంలో

మండలంలోని 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో 382 మంది బాలింతలు, 437మంది గర్భిణులు, 3550 మంది చిన్నారులు అన్నఅమృతహస్తం పథకం ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇందులో 270 మంది బాలింతలు, 300 మంది గర్భిణుల మాత్రమే పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. చిన్నారులకు మాత్రం మెనూ ప్రకారం ఆహారం అందించటం లేదనే విమర్శలు ఉన్నాయి. కూరగాయలు తదితర వస్తువులను అంగన్‌వాడీకార్యకర్తలే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీనుండి రూ.5వేలు నిధులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు నిధులు అందలేదు. సౌకర్యాల లేమితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యంలో నాణ్యత లేకపోవడంతో సరిగ్గా ఉపయోగించుకోలేక పోతున్నారని సర్వత్రావిమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుడివాడలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర నేడు

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర సోమవారం గుడివాడలో జరుగుతుంది. ఈనెల 26న హనుమాన్ జంక్షన్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారంనాడు నూజివీడులో జరిగింది, తిరువూరు, నందిగామలో పర్యటనను పూర్తి చేసుకుని విజయవాడకు చేరుకుంది. సోమవారం గుడివాడ, మచిలీపట్నం, చల్లపల్లి, ఆవనిగడ్డ, రేపల్లెలో ఈ యాత్ర సాగుతుంది.

ఎన్నికల్లో బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

● యువతకు రమేష్‌నాయుడు సూచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికలలో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్ళొద్దని బీజేపీ యువమోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యాలయ మీడియా సెల్ ఇన్‌ఛార్జి దిలీప్‌లతో కలిసి మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా రూపొందించేందుకు తమ పార్టీ తరపున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బీజేపీ,టీడీపీకి ఉమ్మడి శత్రువులుగా ఉన్న కొందరు అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటితో పాటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యంగా కొందరు నాయకుల మాటలు విని యువత బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, దీని జోలికి పోవద్దని వారు సూచించారు.

ఆల్ మునిసిపల్ ఇంజనీర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

● ప్రెసిడెంట్‌గా ఎంపికయిన టి.రంగారావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జోన్-2 ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాటర్ సప్లై డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న టి.రంగారావు ఎంపికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్-2కు చెందిన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు. జోన్-2 కమిటీ ఎంపికలో సెక్రటరీగా అసిస్టెంట్ ఇంజనీరు డి.దుర్గారావు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా జె.ఫణి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు కే.వి. సాయిప్రసాద్, ట్రెజరర్‌గా విజయవాడ సర్కిల్-1 ఈఈగా పనిచేస్తున్న కే.కోటేశ్వర్రావు, సభ్యులుగా డీఈఈ ఎంసీఎస్.పాత్రుడు, డీఈఈ వి.పద్మాకర్ ప్రసాద్, ఏఈ కే.రాజ్‌కుమార్, ఏఈ పి.సూర్యకుమారి, ఏఈ డి.లక్ష్మీనారాయణ, ఏఈ డి.రామకిషోర్, డీఈఈ అబ్దుల్ రహీమ్, బి.హెచ్.సుబ్బారావు డీఈఈ, ఏఈ నాగేశ్వర్రావు ఎంపికయ్యారు.

డేరాబాబాతో లాలూచి వల్లే ఉత్తరాదిలో విధ్వంసం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విజయవాడ : సిపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో దేరా బాబా సహకారంతో హర్యానాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. డేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. హింస చెలరేగే ప్రమాదం ఉన్నదని ముందే ఊహించి 200 రైళ్లను రద్దు చేసిన ప్రభుత్వం డేరాబాబా 200 వాహనాల కాన్వాయ్‌తో కోర్టు హాజరయ్యేందుకు ఎందుకు అనుమతించిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో దళితులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, అభద్రతాభావంతో వారు జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ఎండగడుతూ నెల రోజులూ ప్రచార కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. చోటామోటా నాయకులకు వారి విలువను బట్టి రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వెచ్చించి కొనుగోలు చేస్తున్నందున ఎన్నికల బదులుగా వేలాన్ని నిర్వహిస్తే సబబుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎక్కడికక్కడ నోట్లను ప్రధాన పార్టీలు వెదజల్లుతున్నాయని తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టిడీపీ, వైకాపా పోటీలు పడిమరీ ఓటర్లను కొనుగోలు చేశాయన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

ముసురు వర్షాల వల్ల సాగునీరు అందుతుండటంతో కంచికచర్ల మండలంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు మునేటికి కొద్దిగా నీళ్ల వస్తున్నాయి. మున్నలూరు, కునికినపాడు, చెవిటికల్లు సాగునీటి ఎత్తిపోతల పథకాలకు నీళ్ల అందుతున్నాయి. పరిటాల, కంచికచర్ల చెరువులకు నీళ్ల వచ్చాయి. కొద్ది రోజుల నుంచి సాగునీటి పథకాలు, చెరువుల ఆయకట్టులో వరి నాట్లు వేస్తున్నారు. **- కంచికచర్ల**



225 మందికి కళ్లజోళ్ల పంపిణీ

నందిగామ: ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంలో వాకర్స్ అసోసియేషన్ ముందంజలో ఉంటుందని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిరుమామిళ్ల చైతన్యకుమార్ అన్నారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి వైద్యశాల సౌజన్యంతో 225 మంది రోగులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. చైతన్యకుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దయెత్తున కంటి వైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మన్నెం శ్రీరామమూర్తి, ఖలీల్ అహ్మద్ రజ్వి, ఆకుల నారాయణ, మట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చైతన్యకుమార్

బీజేపీ అభివృద్ధికి కృషి

● జిల్లా కార్యదర్శి మాగంటి రమణ

నందిగామ: నందిగామ నియోజకవర్గంలో బీజేపీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బీజేపీ జిల్లా కార్యదర్శి మాగంటి రమణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీతో పొత్తు ఉన్నప్పటికీ ప్రభుత్వ కమిటీలలో బీజేపీ నాయకులకు అన్యాయం జరుగుతుందన్నారు. పదవులు రాకపోయినా ప్రజా సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వానికి సహకరిస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు పార్టీకి దగ్గర చేయడమే తన లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోనూ, జిల్లా లోనూ బీజేపీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వీరులపాడు : ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అక్బర్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం వీరులపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పీఆర్టీయూ మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు అనుక్షణం అండగా ఉంటూ పీఆర్టీయూ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి అమర్లపూడి బేబి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, మండల కార్యదర్శి నాగేశ్వరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.



సన్మానం

పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితి సందర్భంగా ప్రచారం నిర్వహించిన పలువురికి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీధర్ ఘనంగా సన్మానం చేశారు. ఆదివారం ముక్కోటి మహామండపంలో మేకల మౌళి, దివి కృష్ణమాచార్యులు, తిరుపతిరెడ్డి, చిరుమామిళ్ల శ్రీనివాసరావులను సన్మానించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణం పట్ల బాధ్యత వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రముఖ ఆంగ్ల అధ్యాపకుడు ఉప్పుటూరి వాసుదేవరావు, విశ్రాంత అధ్యాపకుడు తుర్లపాటి కోటేశ్వరరావు, ఎస్సై తులసీ రామకృష్ణ, కామసాని ఉదయ్, పాల్గొన్నారు. - నందిగామ

కన్నుల పండువగా గణేష్ ఉత్సవాలు

కంచికచర్ల: కంచికచర్లలో దమ్మాలపాటి వారి వీధిలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం ఆకట్టుకుంటుంది. పర్యావరణానికి ముప్పు రాకుండా కేవలం మట్టితో మాత్రమే తయారుచేసిన ఐదు అడుగుల విగ్రహాన్ని ఏర్పాటుచేసి భక్తులు పూజలు చేస్తున్నారు. రంగులు కూడా వినియోగించకపోవటం విశేషం. ఈ విగ్రహాన్ని ప్రత్యేకంగా పోరంకి నుంచి తెప్పించినట్టు భక్తులు చెప్పారు. పలు గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. పరిటాల గ్రామంలో సాయిబాబా దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన విగ్రహం నిమజ్జనం సందర్భంగా నాలుగు వేల మంది భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● **నందిగామ:** గణపతి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం పందిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాంధీ సెంటర్, వాసవీ మార్కెట్, గీతామందిరం, రైతుపేటల, ముక్కోటి మహామండపం తదితర ప్రాంతాలో ఏర్పాటుచేసిన భారీ గణనాథులను ప్రజలు పెద్దయెత్తున దర్శించుకొని పూజలు నిర్వహించారు. పలు కూడళ్లలలో ఏర్పాటుచేసిన గణనాథులను భారీ ఊరేగింపుతో కృష్ణ, మునేరు నదుల్లో నిమజ్జనం చేశారు.

● **వీరులపాడు :** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేష్ నవరాత్రి మహోత్సవాలు మూడవరోజు ఘనంగా నిర్వహించారు. దొడ్డదేవరపాడులో తెలుగుయువత ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జుజ్జూరు, కొణతాలపల్లి, పెద్దాపురం, వీరులపాడు గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దొడ్డదేవరపాడు సర్పంచ్ బోజడ్ల డూండి సంగమేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు జమ్ముల రవికుమార్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బోజడ్ల దుర్గారావు, గిరిసిల నాగేశ్వరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.



కంచికచర్లలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడు



పాతబస్టాండ్ వినాయకుడి గ్రామోత్సవం

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

నందిగామ : నందిగామ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక క్లాత్ మర్చంట్స్ హాల్‌లో ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆల్ట్రా సౌండ్ పరికరాల ద్వారా పలు పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు జల్లా రవి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు మారం సత్యావతి, వైభవ్ క్లబ్ అధ్యక్షుడు మారం రమేష్, దుడ్డు నాగేశ్వరరావు, మారం అమరయ్య, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా సుబాబుల్‌పై ఒకే విధానం : సీపీఎం

నందిగామ: సుబాబుల్ విషయంలో సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానంలో పనిచేస్తుందని ఆ పార్టీ నాయకులు చనుమోలు సైదులు, కటారపు గోపాల్, సయ్యద్ ఖాసింలు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీలో ప్రతిపక్షంలో ఉన్ననాటి నుంచి తాము వారితో కలసి సుబాబుల్‌పై అనేక పోరాటాలు చేశామన్నారు. ఇప్పుడు కూడా సుబాబుల్‌పై రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానంలో పనిచేస్తున్నామన్నారు. ఈ విషయంలో టీడీపీ నాయకులకు తమను విమర్శించే హక్కు లేదన్నారు. చేతనైతే సుబాబుల్ రైతులకు మేలు చేయాలి తప్ప అసంబద్ధ విమర్శలు చేయడం మానుకోవాలన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు

ఎవరూ ... భయపడవద్దు

● కాలనీలో ఎవరినీ ఖాళీ చేయించం
● ఏఎంసీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు

నందిగామ: నందిగామ డీవీఆర్, ఉమా కాలనీలు జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నిర్మించినవేనని, ఆ కాలనీలలో ఉన్న వారికి ఎటువంటి ఇబ్బంది కలగదని ఏఎంసీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం డీవీఆర్, ఉమా కాలనీలలో పర్యటించిన ఆయన కాలనీలను ఖాళీ చేయించి గృహసముదాయాలు నిర్మిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని చెప్పారు. ఈ కాలనీల్లో ఎవరినీ ఖాళీ చేయించేది లేదని, సుదీర్ఘకాలంగా నివాసం ఉంటున్న వారందరికీ పట్టాలు ఇప్పిస్తామని మంత్రి ఉమా తెలిపినట్లు చెప్పారు. పూటకో పార్టీ నాయకులు కాలనీలోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హులైన వారందరికీ పట్టాలు ఇప్పించి ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. కొత్తగా నిర్మించబోయే గృహ సముదాయాలు వేరే ప్రాంతంలో నిర్మించాలని మంత్రి ఉమా ఆదేశించారని, ఎవరూ భయపడాల్సిన పని లేదన్నారు. రాజకీయ లబ్ధి కోసం అలజడి సృష్టిస్తున్న పార్టీల నాయకులను కాలనీలోకి రానివ్వదని సూచించారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ కాలనీలో ఎవరికీ ఇబ్బంది లేకుండా ఖాళీగా ఉన్న స్థలాల్లో గృహ సముదాయాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అవసరమైతే వేరే ప్రాంతంలో నిర్మించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో పట్టణ టీడీపీ కార్యదర్శి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్ బాబూరావు మృతి

నందిగామ: మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కారెం బాబూరావు ఆకస్మికంగా మృతి చెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాబూరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నందిగామలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అవిశ్రాంత కృషి చేసిన బాబూరావు మృతి పట్ల పీసీసీ అధికార ప్రతినిధి వేల్పుల పరమేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలేటి సతీష్, తలమాల డేవిడ్‌రాజు తదితరులు సంతాపం తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు



ముసురు వర్షాల వల్ల సాగునీరు అందుతుండటంతో కంచికచర్ల మండలంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు మునేటికి కొద్దిగా నీళ్ల వస్తున్నాయి. మున్నలూరు, కునికినపాడు, చెవిటికల్లు సాగునీటి ఎత్తిపోతల పథకాలకు నీళ్ల అందుతున్నాయి. పరిటాల, కంచికచర్ల చెరువులకు నీళ్ల వచ్చాయి. కొద్ది రోజుల నుంచి సాగునీటి పథకాలు, చెరువుల ఆయకట్టులో వరి నాట్లు వేస్తున్నారు. - కంచికచర్ల

కన్నుల పండువగా గణేష్ ఉత్సవాలు

కంచికచర్ల: కంచికచర్లలో దమ్మాలపాటి వారి వీధిలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం ఆకట్టుకుంటుంది. పర్యావరణానికి ముప్పు రాకుండా కేవలం మట్టితో మాత్రమే తయారుచేసిన ఐదు అడుగుల విగ్రహాన్ని ఏర్పాటుచేసి భక్తులు పూజలు చేస్తున్నారు. రంగులు కూడా వినియోగించకపోవటం విశేషం. ఈ విగ్రహాన్ని ప్రత్యేకంగా పోరంకి నుంచి తెప్పించినట్టు భక్తులు చెప్పారు. పలు గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. పరిటాల గ్రామంలో సాయి బాబా దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన విగ్రహం నిమజ్జనం సందర్భంగా నాలుగు వేల మంది భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● **నందిగామ:** గణపతి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం పందిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాంధీ సెంటర్, వాసవీ మార్కెట్, గీతామందిరం, రైతుపేటల, ముక్కోటి మహామండపం తదితర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన భారీ గణనాథులను ప్రజలు పెద్దయెత్తున దర్శించుకొని పూజలు నిర్వహించారు. పలు కూడళ్లలో ఏర్పాటుచేసిన గణనాథులను భారీ ఊరేగింపుతో కృష్ణ, మునేరు నదుల్లో నిమజ్జనం చేశారు.

● **వీరులపాడు** : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గణేష్ నవరాత్రి మహోత్సవాలు మూడవరోజు ఘనంగా నిర్వహించారు. దొడ్డదేవరపాడులో తెలుగుయువత ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జుజ్జూరు, కొణతాలపల్లి, పెద్దాపురం, వీరులపాడు గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దొడ్డదేవరపాడు సర్పంచ్ బోజడ్ల దూండి సంగమేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు జమ్ముల రవికుమార్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బోజడ్ల దుర్గారావు, గిరిసిల నాగేశ్వరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.



కంచికచర్లలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడు



పాతబస్టాండ్ వినాయకుడి గ్రామోత్సవం

225 మందికి కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చైతన్యకుమార్

నందిగామ: ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంలో వాకర్స్ అసోసియేషన్ ముందుంటుందని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిరుమామిళ్ల చైతన్యకుమార్ అన్నారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి వైద్యశాల సౌజన్యంతో 225 మంది రోగులకు కళ్లజోళ్ళ పంపిణీ చేశారు. చైతన్యకుమార్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దయెత్తున కంటి వైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లజోళ్ల అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మన్నెం శ్రీరామమూర్తి, ఖలీల్ అహ్మద్ రజ్వి, ఆకుల నారాయణ, మట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభివృద్ధికి కృషి

● జిల్లా కార్యదర్శి మాగంటి రమణ

నందిగామ: నందిగామ నియోజకవర్గంలో బీజేపీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని బీజేపీ జిల్లా కార్యదర్శి మాగంటి రమణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీతో పొత్తు ఉన్నప్పటికీ ప్రభుత్వ కమిటీలలో బీజేపీ నాయకులకు అన్యాయం జరుగుతుందన్నారు. పదవులు రాకపోయినా ప్రజా సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వానికి సహకరిస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు పార్టీకి దగ్గర చేయడమే తన లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోనూ, జిల్లా లోనూ బీజేపీ పటిష్ఠతకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వీరులపాడు : ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అక్బర్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం వీరులపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పీఆర్టీయూ మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు అనుక్షణం అండగా ఉంటూ పీఆర్టీయూ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి అమర్లపూడి బేబీ, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, మండల కార్యదర్శి నాగేశ్వరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.



సన్మానం

పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితి సందర్భంగా ప్రచారం నిర్వహించిన పలువురికి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీధర్ ఘనంగా సన్మానం చేశారు. ఆదివారం ముక్కోటి మహామండపంలో మేకల మౌళి, దివి కృష్ణమాచార్యులు, తిరుపతిరెడ్డి, చిరుమామిళ్ల శ్రీనివాసరావులను సన్మానించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణం పట్ల బాధ్యత వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రముఖ ఆంగ్ల అధ్యాపకుడు ఉప్పుటూరి వాసుదేవరావు, విశ్రాంత అధ్యాపకుడు తుర్లపాటి కోటేశ్వరరావు, ఎస్పై తులసీ రామకృష్ణ, కామసాని ఉదయ్, పాల్గొన్నారు. - నందిగామ

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

నందిగామ : నందిగామ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక క్లాత్ మర్చంట్స్ హాల్‌లో ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆల్ట్రా సౌండ్ పరికరాల ద్వారా పలు పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు జల్లా రవి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు మారం సత్యావతి, వైబ్రెంట్ క్లబ్ అధ్యక్షుడు మారం రమేష్, దుడ్డు నాగేశ్వరరావు, మారం అమరయ్య, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా సుబాబుల్‌పై ఒకే విధానం : సీపీఎం

నందిగామ: సుబాబుల్ విషయంలో సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానంలో పనిచేస్తుందని ఆ పార్టీ నాయకులు చనుమోలు సైదులు, కటారపు గోపాల్, సయ్యద్ ఖాసింలు అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీలో ప్రతిపక్షంలో ఉన్ననాటి నుంచి తాము వారితో కలిసి సుబాబుల్‌పై అనేక పోరాటాలు చేశామన్నారు. ఇప్పుడు కూడా సుబాబుల్‌పై రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానంలో పనిచేస్తున్నామన్నారు. ఈ విషయంలో టీడీపీ నాయకులకు తమను విమర్శించే హక్కు లేదన్నారు. చేతనైతే సుబాబుల్ రైతులకు మేలు చేయాలి తప్ప అసంబద్ధ విమర్శలు చేయడం మానుకోవాలన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు

ఎవరూ ... భయపడవద్దు

● కాలనీలో ఎవరినీ ఖాళీ చేయించం

● ఏఎంసీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు

నందిగామ: నందిగామ డీవీఆర్, ఉమా కాలనీలు జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు నిర్మించినవేనని, ఆ కాలనీలలో ఉన్న వారికి ఎటువంటి ఇబ్బంది కలగదని ఏఎంసీ చైర్మన్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం డీవీఆర్, ఉమా కాలనీలలో పర్యటించిన ఆయన కాలనీలను ఖాళీ చేయించి గృహసముదాయాలు నిర్మిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని చెప్పారు. ఈ కాలనీల్లో ఎవరినీ ఖాళీ చేయించేది లేదని, సుదీర్ఘకాలంగా నివాసం ఉంటున్న వారందరికీ పట్టాలు ఇప్పిస్తామని మంత్రి ఉమా తెలిపినట్టు చెప్పారు. పూటకో పార్టీ నాయకులు కాలనీలోకి వచ్చి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హులైన వారందరికీ పట్టాలు ఇప్పించి ఇళ్ల నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. కొత్తగా నిర్మించబోయే గృహ సముదాయాలు వేరే ప్రాంతంలో నిర్మించాలని మంత్రి ఉమా ఆదేశించారని, ఎవరూ భయపడాల్సిన పని లేదన్నారు. రాజకీయ లబ్ది కోసం అలజడి సృష్టిస్తున్న పార్టీల నాయకులను కాలనీలోకి రానివ్వద్దని సూచించారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ కాలనీలో ఎవరికీ ఇబ్బంది లేకుండా ఖాళీగా ఉన్న స్థలాల్లో గృహ సముదాయాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అవసరమైతే వేరే ప్రాంతంలో నిర్మించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో పట్టణ టీడీపీ కార్యదర్శి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్ బాబూరావు మృతి

నందిగామ: మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కారెం బాబూరావు ఆకస్మికంగా మృతి చెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాబూరావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నందిగామలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అవిశ్రాంత కృషి చేసిన బాబూరావు మృతి పట్ల పీసీసీ అధికార ప్రతినిధి వేల్పుల పరమేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలేటి సతీష్, తలమాల డేవిడ్‌రాజు తదితరులు సంతాపం తెలిపారు.

నందిగామలో సినిమాలు

లక్ష్మీప్రసన్న : అర్జున్‌రెడ్డి
విజయ : వీఐపీ-2
మయూరి : వివేకం
● కంచికచర్ల..
పీవీఆర్ సినీప్లెక్స్ **స్క్రీన్ 1 :** వివేకం
స్క్రీన్ 2 : జయజానకి
శ్రీనివాస ఏసీ : అర్జున్‌రెడ్డి

గ్యాస్ సమాచారం

ఏజెన్సీ	సరఫరా తేదీ	ఫోన్ నెం.	ఆన్‌లైన్ బుకింగ్ నెం.
హెచ్‌పీ గ్యాస్ (కంచికచర్ల)	26 వరకు	273234	9666023456
ఇండేన్ గ్యాస్(నందిగామ)	26 వరకు	275238	9848824365

గణపతి పప్పా మోరియా ...



కొండూరు గ్రామంలో తలపాగాతో పూజలందుకుంటున్న లంబోదరుడు

నందిగామరూరల్: మండలంలోని పలు గ్రామాలు గణపతి నామ సంకీర్తనలతో మార్మోగాయి. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు లంబోదరునికి బిల్వ, పుష్పర్చాన విశేష పూజలు జరిగాయి. కొండూరు, జొన్నలగడ్డ, అడవిరావులపాడు రామిరెడ్డిపల్లి, సోమవరం గ్రామాల్లో గణనాథునికి విశేష పూజలు, మూలమంత్ర హోమాది క్రతువులు జరిగాయి. అంబారుపేట గ్రామంలో అన్న సంతర్పణ జరిగింది. హనుమంతుపాలెం, తొర్రగుడిపాడుతోపాటు పలు గ్రామాల్లో మూడోరోజు గణనాథున్ని పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఏర్పాటుచేసి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ గణపతి పప్పా మోరియా అంటూ యువత నృత్యాలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించి అనంతరం స్వామిని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు.



హనుమంతుపాలెంలో గణనాథుని నిమజ్జోనత్సవంలో పాల్గొన్న యువత



ఆకట్టుకున్న గణనాథుడి విగ్రహం

కంచికచర్ల: కంచికచర్ల ఆయిల్ బంకు సెంటర్‌లో ఏర్పాటుచేసిన గణనాథుడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. బాల వినాయక కమిటీ ఆధ్వర్యంలో 1990 నుంచి ఈ సెంటర్‌లో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి 14 అడుగుల విగ్రహాన్ని తెప్పించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

కంచికచర్ల ఆయిల్ బంకు సెంటర్‌లో ఏర్పాటుచేసిన గణనాథుడు

అన్వర్ మృతి టీడీపీకి తీరని లోటు

జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

కంచికచర్ల: జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ అన్వర్ మృతి తెలుగుదేశం పార్టీకి, ముస్లిం మైనార్టీ వర్గాలకు తీరని లోటని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు అన్వర్ అనారోగ్యంతో శనివారం మృతి చెందిన సంగతి విదితమే. ఆదివారం పెండ్యాల వచ్చిన ఆమె, అన్వర్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్వర్ భౌతికకాయాన్ని మసీదులో ఉంచి కొద్దిసేపు ప్రార్ధనలు చేశారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎంపీపీ వేల్పుల ప్రశాంతి, జడ్‌పీటీసీ సభ్యులు కోగంటి బాబు, వాసిరెడ్డి ప్రసాద్, ఏఎంసీ చైర్మన్లు నన్నపనేని లక్ష్మినారాయణ, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, విజయవాడ అర్బన్ నాయకులు గన్నె వెంకట నారాయణ ప్రసాద్ (అన్న) పొన్నం రవి తదితరులు పాల్గొన్నారు.



అన్వర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, ఎమ్మెల్యే సౌమ్య

రైతుబజార్ల ధరలు

	నందిగామ	కంచికచర్ల			
టమాటో	35	35	ఉల్లిపాయలు	21	21
వంగ	24	24	గోరు చిక్కుళ్లు	18	18
బెండ	11	11	దోస	12	12
పచ్చిమిర్చి	18	19	సొరకాయ	8	10
బజ్జీ మిర్చి	22	22	అరటికాయ	8	8
కాకర	10	10	చామ దుంప	26	25
బీర	15	16	మునగకాయ	5	5
కాలిఫ్లవర్	18	17	కంద	25	25
క్యాబేజి	15	15	బీట్‌రూట్	22	26
క్యారెట్	43	43	కీరదోస	18	18
దొండ	20	20	బీన్స్	50	50
బంగాళ దుంప	14	14	కాప్సికం	43	43
			చిలకడ దుంప	26	28

మాంసం విక్రయాలు బంద్ నేటి నుంచి

జి.కొండూరు: జి.కొండూరులో విషజ్వరాలు ప్రబలుతున్నందున జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీ నుంచి మాంసం,చేపలు విక్రయాలు నిలుపుదల చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎన్. కుసుమా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీవారు తిరిగి అమ్మకాలు జరుపుకోవచ్చుని చెప్పే వరకు ఎవరూ దుకాణాలు తెరవకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా షాపులు తెరిచి విక్రయాలు జరిపితే వారిపై పంచాయతీరాజ్ చట్టం అనుసరించి సివిల్, క్రిమినల్ కేసులు తీసుకుంటామని ఆమె తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

- మీనమేషాలు లెక్కిస్తున్న చంద్రబాబు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నందిగామ: అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మీనమేషాలు లెక్కిస్తున్నాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. అగ్రిగోల్డ్ బాధితులకు సంఘీభావంగా సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం నందిగామ చేరుకుంది. మధిర రోడ్డు వద్ద నుంచి అగ్రిగోల్డ్ బాధితులు యాత్రకు ఘనస్వాగతం పలికి ర్యాలీగా స్థానిక చండ్ర రాజేశ్వరరావు భవన్ వద్దకు చేరుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో రామకృష్ణ మాట్లాడతూ రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలు అగ్రిగోల్డ్ బారినపడి ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అటాచ్ చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులు ప్రభుత్వ ధర ప్రకారం 29 వందల కోట్లు ఉన్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆ ఆస్తులు అమ్మి బాధితులకు ఎందుకు జమ చేయడం లేదని ప్రశ్నించారు. లక్షలాది మంది బాధితులు కనీసం తిండి కూడా తినలేని స్థితిలో ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జరబన నాగేశ్వరరావు, చుండూరు సుబ్బారావు, అగ్రిగోల్డ్ బాధిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరావు, బండారు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమలు అంతంత మాత్రమే

● అందరికీ అందని అన్నఅమృత హస్తం ● అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమి ● రేషన్ బియ్యంతో భోజనం ● రాకపోకలకూ ఇబ్బందే



ఖాళీగా ఉన్న నూజివీడు అంగన్‌వాడీకేంద్రం



అంగన్‌వాడీకేంద్రంలో బాలింత, చిన్నారులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో 37 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్నఅమృతహస్తం పథకం అమలు అంతంత మాత్రమే. పట్టణంలో ప్రీస్కూళ్ళు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మినహా ఎక్కడా సౌకర్యాలు లేక పోవడంతో అంగన్‌వాడీ పరిధిలో బాలింతలు, గర్భిణీలు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 37 కేంద్రాలకు 337 మంది గర్భిణులు, 299 మంది బాలింతలతో కలుపుకుని రెండు వేల మంది చిన్నారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సి ఉండగా, అందులో సగం మంది మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అమ లు కాలేదు. బాలింతలు, గర్భిణులకు ప్రతిరోజూ ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనం ఐరన్ ట్యాబ్‌లెట్లను అంగన్‌వాడీ కేంద్రాల అందించాల్సి ఉంది. దీంతో కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు సుమారు 3 నుంచి 4 గంటల సమయం ఉండాల్సిన పరిస్థితి ఉంది. వారు కిందే కూర్చోవాల్సి ఉండడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల లేమి

నూజివీడు రూరల్ : నూజివీడు మండల పరిధిలో మొత్తం 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో మూడు వేల మంది చిన్నారులకు, 478 మంది బాలింతలు, 599 మంది గర్భిణులు అన్న అమృతహస్తం పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. దాదాపు సగానికి పైగా ఈ పథకాన్ని వినియో గించుకుంటున్న దాఖలా కనిపించటం లేదు. విద్యుత్‌బిల్లులు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను గ్రామపంచాయతీలకు అందించినా అవి అన్ని గ్రామాల్లోనూ అమలు కావడం లేదు. మరోవైపు బాలింతలు సిజేరియన్ల కారణంగా అంగన్‌వాడీకేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారుతోంది.

రేషన్ బియ్యంతో ఇబ్బందులు

చాట్రాయి : ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అన్న అమృతహస్తం పథకం గర్భిణిలు, బాలింతలకు వరం అయినా కోటా బియ్యం వల్ల నీరు గారి పోతున్నది. మండల కేంద్రం చాట్రాయిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం గుడ్డు, పాలు పోషకవిలువలు కలిగిన కూరతో భోజనం పెడుతున్నారు కానీ కోటా బియ్యం వల్ల గర్భిణిలు, బాలింతలు కడుపు నిండా భోజనం చేయలేకపోతున్నారు. కోటా బియ్యంవల్ల అరుగుదల ఉండక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం మంచి బియ్యం ఇస్తుందనే ఆశతో రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నట్లు పలువురు చెప్పారు. కొంతమంది ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని గుడ్డు, కూరతో భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం పెట్టించుకుని తీసుకు వెళుతున్నారు. కేంద్రానికి రాలేని నిండుగర్భిణిలు, పచ్చి బాలింతలకు మాత్రం భోజనం వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇళ్ళకు పంపుతున్నారు. ప్రభుత్వం కోటా బియ్యానికి బదులు మంచి బియ్యం సరఫరా చేస్తే అన్న అమృతహస్తం పథకం మంచి ఫలితాలిస్తుంది.

అధికారుల వైఫల్యం

విస్సన్నపేట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలుకు అధికారులు సమర్ధంగా పనిచేయటం లేదనే విమర్శలు నెలకొన్నాయి. బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకు రావడంలో వైఫల్యం చెందుతున్నారు. గర్భిణులు, బాలింతల బంధువులు వచ్చి ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారే తప్ప అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్న నిబంధనను సమర్ధంగా అమలు జరపటం లేదు. కొన్ని కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు ఇంటి వద్ద నుంచి అన్నం తెచ్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలతో భుజించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చిన రేషన్‌బియ్యం ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో అన్నం పెట్టాలని కోరుతున్నారు.

ఏటీత..లంకమేత..చందం

ఆగిరిపల్లి : రేషన్ బియ్యం అన్నం తినడం ఇష్టంలేక కొందరు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ఆసక్తి చూపటం లేదు. గర్భిణిలు, బాలింతలు పాలు, గుడ్డుకోసం, మధ్యాహ్నం భోజనం కోసం రెండు దఫాలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివాసం ఉండేవారు ఈ పథకానికి దూరమవుతున్నారు. భోజనం కోసం నడిచి రావాల్సి రావడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో భోజనానికి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. కొందరు మాత్రం వచ్చి అంగన్‌వాడీల్లో అసౌకర్యాల నడుమ భోజనం చేయలేక క్యారేజిల్లో భోజనం తీసుకువెళుతున్నారు. లంక మేత కోసం ఏటిఈతలా ఉందని వాపోతున్నారు. మండలంలో మొత్తం 67 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా, 470మంది గర్భిణిలకు 373 మంది, 413 మంది బాలింతల్లో 322 మంది అన్న అమృతహస్తం పథకంలో భోజనం చేస్తుండగా భోజనం నాణ్యతలేక కొన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో ఈ పథకంపై పెదవివిరుస్తున్నారు.

ముసునూరు మండలంలో

మండలంలోని 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో 382 మంది బాలింతలు, 437మంది గర్భిణులు, 3550 మంది చిన్నారులు అన్నఅమృతహస్తం పథకం ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇందులో 270 మంది బాలింతలు, 300 మంది గర్భిణుల మాత్రమే పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. చిన్నారులకు మాత్రం మెనూ ప్రకారం ఆహారం అందించటం లేదనే విమర్శలు ఉన్నాయి. కూరగాయలు తదితర వస్తువులను అంగన్‌వాడీకార్యకర్తలే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీనుండి రూ.5వేలు నిధులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు నిధులు అందలేదు. సౌకర్యాల లేమితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యంలో నాణ్యత లేకపోవడంతో సరిగ్గా ఉపయోగించుకోలేక పోతున్నారని సర్వత్రావిమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుడివాడలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర నేడు

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర సోమవారం గుడివాడలో జరుగుతుంది. ఈనెల 26న హనుమాన్ జంక్షన్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారంనాడు నూజివీడులో జరిగింది, తిరువూరు, నందిగామలో పర్యటనను పూర్తి చేసుకుని విజయవాడకు చేరుకుంది. సోమవారం గుడివాడ, మచిలీపట్నం, చల్లపల్లి, ఆవనిగడ్డ, రేపల్లెలో ఈ యాత్ర సాగుతుంది.

ఎన్నికల్లో బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

● యువతకు రమేష్‌నాయుడు సూచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికలలో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్ళొద్దని బీజేపీ యువమోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యాలయ మీడియా సెల్ ఇన్‌ఛార్జి దిలీప్‌లతో కలిసి మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా రూపొందించేందుకు తమ పార్టీ తరఫున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బీజేపీ,టీడీపీకి ఉమ్మడి శత్రువులుగా ఉన్న కొందరు అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటితో పాటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యంగా కొందరు నాయకుల మాటలు విని యువత బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, దీని జోలికి పోవద్దని వారు సూచించారు.

ఆల్ మునిసిపల్ ఇంజనీర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

● ప్రెసిడెంట్‌గా ఎంపికయిన టి.రంగారావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జోన్-2 ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాటర్ సప్లై డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న టి.రంగారావు ఎంపికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్-2కు చెందిన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు. జోన్-2 కమిటీ ఎంపికలో సెక్రటరీగా అసిస్టెంట్ ఇంజనీరు డి.దుర్గారావు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా జె.ఫణి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు కే.వి. సాయిప్రసాద్, ట్రెజరర్‌గా విజయవాడ సర్కిల్-1 ఈఈగా పనిచేస్తున్న కే.కోటేశ్వర్రావు, సభ్యులుగా డీఈఈ ఎంసీఎస్.పాత్రుడు, డీఈఈ వి.పద్మాకర్ ప్రసాద్, ఏఈ కే.రాజ్‌కుమార్, ఏఈ పి.సూర్యకుమారి, ఏఈ డి.లక్ష్మీనారాయణ, ఏఈ డి.రామకిషోర్, డీఈఈ అబ్దుల్ రహీమ్, బి.హెచ్.సుబ్బారావు డీఈఈ, ఏఈ నాగేశ్వర్రావు ఎంపికయ్యారు.

డేరాబాబాతో లాలూచి వల్లే ఉత్తరాదిలో విధ్వంసం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

విజయవాడ : సిపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో దేరా బాబా సహకారంతో హర్యానాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. డేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. హింస చెలరేగే ప్రమాదం ఉన్నదని ముందే ఊహించి 200 రైళ్లను రద్దు చేసిన ప్రభుత్వం డేరాబాబా 200 వాహనాల కాన్వాయ్‌తో కోర్టు హాజరయ్యేందుకు ఎందుకు అనుమతించిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో దళితులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, అభద్రతాభావంతో వారు జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ఎండగడుతూ నెల రోజులూ ప్రచార కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. చోటామోటా నాయకులకు వారి విలువను బట్టి రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వెచ్చించి కొనుగోలు చేస్తున్నందున ఎన్నికల బదులుగా వేలాన్ని నిర్వహిస్తే సబబుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎక్కడికక్కడ నోట్లను ప్రధాన పార్టీలు వెదజల్లుతున్నాయని తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టిడీపీ, వైకాపా పోటీలు పడిమరీ ఓటర్లను కొనుగోలు చేశాయన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సినిమాలు

కమల	: అర్జున్‌రెడ్డి
నటరాజ్ ఏసీ	: వివేకం
సాయికృప	: నేనేరాజు నేనేమంత్రి

జగ్గయ్యపేట బులియన్ మార్కెట్

బంగారం	: రూ. 29,920 (24 క్యారెట్లు-10గ్రా)
	: రూ. 27,510 (22 క్యారెట్లు-10గ్రా)
వెండి	: రూ.40,000 (కేజీ)

భిన్నరూపాల్లో గణనాథులు



మల్లెపూల గణపతి



విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన వినాయకుడు విగ్రహం

జగ్గయ్యపేట: పట్టణంలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులు భిన్న రూపాల్లో భక్తులు పూజలు అందుకున్నారు. సీతారాం పురంలో బాబీవీధిలో భక్తబృందం మట్టి వినాయకుడితో నవరాత్రులు నిర్వహిస్తు ఆదర్శంగా నిలిచారు. మిట్టగూడెంలో బండ్ల బజార్‌లో భక్తబృందం నవరాత్రోత్సవ వేదికపై కోలాటంతో భక్తి పాటలకు నృత్యాలు చేశారు. మండపంవద్ద నాగుల పుట్టరూపంలో అలంకరించారు. చెరువుబజార్‌లో శివ గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలో వైదేహి అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంవద్ద ఆదివారం అన్న సంతర్పణ నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలో శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామికి మల్లెపూలతో అలంకరణ చేశారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. షరాబు వర్తక సంఘం సభ్యులు హోమంలో పాల్గొన్నారు. దేవస్థానం ప్రధానార్చకుడు టీవీ శ్రీనివాస్, పిల్లలమర్రి నాగకృష్ణశర్మలు పైకార్యక్రమాలను జరిపించారు.


- **పెనుగంచిప్రోలు:** మండలంలో గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని అనిగండ్లపాడు సొసైటీ సెంటర్‌లో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులు, తది తరులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ సెంటర్ సమీపంలోని బ్రాహ్మణ వీధిలోని వినాయక పందిరి వద్ద ఆదివారం గణపతి హోమా న్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



బండ్లబజార్‌లో కోలాటం వేస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని బాలాంజనేయ స్వామి ఆలయంలో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న చిన్నారులు



అనిగండ్లపాడు సొసైటీ సెంటర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



అనిగండ్లపాడు సొసైటీ సెంటర్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



తిరుపతమ్మ దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలు బ్రాహ్మణ వీధిలో గణపతి హోమం



చెరువుబజార్‌లో శివగణపతి

నిమజ్జనానికి తరలిన గణనాథులు

జగ్గయ్యపేటరూరల్ : గణపతి నవరాత్రులను పురస్కరించుకుని వివిధ గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్న వినాయక విగ్రహాలు మూడో రోజు ఆదివారం నుంచి నిమజ్జన కార్యక్రమానికి బయలు దేరాయి. ఆయా గ్రామాల నుంచి ట్రాక్టర్‌లపై విగ్రహాలను ఏర్పాటు చేసుకుని ముక్త్యాల, వేదాద్రి గ్రామాల్లోని కృష్ణానదిలో నిమజ్జనాన్ని నిర్వహిస్తున్నారు. వేదాద్రి వద్ద దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫంటు మీదుగా విగ్రహాలను నది మధ్యభాగానికి తీసుకువెళ్లి నిమజ్జనం చేస్తుండగా, ముక్త్యాల వద్ద అటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో నది అంచునే నిమజ్జనాలు చేస్తున్నారు. ముక్త్యాల వద్ద విగ్రహాలను నిమజ్జనానికి తీసుకురావడం కూడా ఇబ్బందికరంగా ఉంది. భారీ విగ్రహాలను నిర్వాహకులు చేతులపై పెట్టుకుని వందల సంఖ్యలో ఉన్న మెట్ల పైనుంచి నది వద్దకు విగ్రహాలను తీసుకు వస్తున్నారు. పోలీసులు, పంచాయతీ అధికారులు స్పందించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు సహకరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ముక్త్యాల వద్ద మెట్ల పైనుంచి విగ్రహాన్ని దించుతున్న భక్త బృందం



సీతారాంపురం బాబీ వీధిలో మట్టి వినాయకుడు

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో...

జగ్గయ్యపేటరూరల్: మండలంలోని తొర్రగుంటపాలెం వెళ్లే రోడ్డు మార్గంలో విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. జంపర్‌ల కోసం ఏర్పాటు చేసిన ఆ పోల్‌పై తీగలు పెరగడం మూలంగా విద్యుత్ సరఫరాలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని. తక్షణం ఆ శాఖాధికారులు స్తంభాలకు పెరిగిన చెట్లు, తీగలను తొలగించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.



చెట్లు, తీగలతో అల్లుకుపోయిన విద్యుత్ స్తంభాలు

అన్న సంతర్పణ

జగ్గయ్యపేట : ఇటీవల దివంగతులైన మహాలక్ష్మి వెండి దేవాలయం అర్చకులు దూళిపాళ పూర్ణానందశాస్త్రికి స్మత్యర్థం ఆదివారం దేవస్థానం ప్రైవేట్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ జరిగింది. దూళిపాళ ఆత్మశాంతి కోరుతూ కమిటీ సభ్యులు మౌనం పాటించారు. అత్తులూరి వెంకటేశ్వర్లు పర్యవేక్షణ అన్నప్రసాదాన్ని పేదలకు అందజేశారు.

కుల మతాలకు అతీతంగా ఉండాలి

జగ్గయ్యపేటరూరల్: కులమతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలు నిర్వహించుకుంటే గ్రామసీమలు కళకళలాడతాయని, చిల్లకల్లు ఎస్సై షణ్ముఖసాయి అన్నారు. గౌరవరంలో ఆదివారం జెండా చెట్టు వద్ద వినాయకుడి మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గంగూరి నరేష్, ముత్తవరపు వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

గ్యాస్ సమాచారం

లక్ష్మిగ్యాస్ ఏజన్సీ: 24వ తేదీ వరకు గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు నేడు గ్యాస్ అందిస్తారు.

వైష్ణవి గ్యాస్ ఏజన్సీ: 24వ తేదీవరకు గ్యాస్ బుక్‌చేసుకున్న వినియోగదారులకు నేడు గ్యాస్ ఇస్తారు.

సినిమాలు

ద్వారకా - నేనేరాజు-నేనేమంత్రి
తిరుమల -వివేకం
సత్యనారాయణ - జైజానకినాయక
మినీసత్యనారాయణ - ఫిదా



ఎంఈవో ప్రసాద్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ కాపా శ్రీనివాసరావు తదితరులు

ఎంఈవోకు ఘన సన్మానం

నూజివీడు రూరల్:నూజివీడుమండల విద్యాశాఖ అధికారిగా తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి, పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా రావిచర్ల గ్రామసర్పంచ్ కాపాశ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎనిగళ్ళ సాంబశివరావుల ఆధ్వర్యంలో గ్రామస్థులు, పలుపాఠశాలల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఘనసన్మానం చేశారు. ఆదివారం జరిగిన ఈ సన్మానంలో పలువురు ఎంఈవో ఆర్.ఎస్.వి ప్రసాద్‌తో తమకున్న సాన్నిహిత్యాన్ని, సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.



ముమ్మరంగా పారిశుధ్య పనులు

ముసునూరు: రమణక్కపేట గ్రామంలోని పలుకాలనీల్లో రెండోరోజు పారిశుధ్య కార్యక్రమాలు వరవేగంగా జరుగుతున్నాయి. ఈవోపీఆర్డీ పి.శంకర్‌రావు, సర్పంచ్ జుజ్జునూరి వెంకమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ స్వర్ణాభాయ్, వైద్యఆరోగ్యసిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపట్టారు. ఎస్సీకాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో రహదారులకు ఇరువైపుల డ్రెయినేజీ పూడికతీత పనులను చేపట్టారు. మురుగునీరు నిల్వవున్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించడంతో పాటు మురుగునీటిని తొలగించే పనులు చేపట్టారు. కాలనీలోని ఇళ్ళలో దోమలనివారణమందు, మలాథిన్ స్ప్రేయింగ్ చేయించడంతో పాటు గ్రామపురవీధిలో ఫాగింగ్ నిర్వహించారు.



అలరించిన విద్యార్థులు నృత్యప్రదర్శనలు

ఆనందోత్సాహలతో హ్యాపీ సండే

నూజివీడు: నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో ఆనంద ఆదివారం ఆనందోత్సాలమధ్య పిల్లల కేరింతలమధ్య సాగింది. ఈ సందర్భంగా నూజివీడు స్నేహారైడ్స్ విద్యార్థినీ విద్యార్థులు నృత్యాలు, గానాలతో ఆహుతులను అలరించగా ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్‌కమిషనర్ రాంబాబు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. నూజివీడుమండలంలోని పలుగ్రామాల్లో ఆనంద ఆదివారం సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలతో సందడి చేశారు. రావిచర్ల గ్రామంలో ఎంఈవో ఆర్.ఎస్.వి ప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్ కాపాశ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎనిగళ్ళ సాంబశివరావు పాల్గొనగా విద్యార్థులు దేశభక్తిగేయాలు, గీతాలు పాటడంతో పాటు పలుపాటలకు చేసిన నృత్యాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రమాదం అంచున రమణక్కపేట పీహెచ్‌సీ

- భవనం పూర్తిగా శిథిలం ■ భయం గుప్పెట్లో వైద్యులు, రోగులు
- ఇంజినీరింగ్ అధికారులు హెచ్చరించి రెండేళ్లయినా స్పందన కరువు
- దయనీయ స్థితిలో 9 గ్రామాల ప్రజలకు సేవలందించే పీహెచ్‌సీ
- వైద్యశాఖ నిర్లక్ష్యంపై సర్వత్రా నిరసన



రమణక్కపేట ప్రాథ మిక ఆరోగ్యకేంద్రం

(ముసునూరు)

ఎన్నోఏళ్ళుగా రోగులకు వైద్యసదుపా యాలు అందించిన రమణక్కపేట ప్రాథ మిక ఆరోగ్యకేంద్రభవనం పూర్తిగా శిథిలా వస్థకు చేరుకుంది. దీంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఇటు వైద్యసిబ్బంది, అటు రోగులు భయాందోళనతో కాలం వెళ్ళదీస్తున్నారు. ఈ భవనం నిర్మించి 23సంవత్సరాలని, శిథిలావస్థకు చేరుకుందని, ఆసుపత్రినిర్వహణ ప్రమాదకరమని, ఇంజినీరింగ్ అధికారులే సాక్షాత్తు నిర్ధారించి రెండేళ్ళుగడుస్తున్నా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని రోగులు వైద్యం చేయించుకుంటున్నారు. మండలంలోని ఏడుగ్రామపం చాయతీలు, చాట్రా యి మండలంలో సోమవారం, తుమ్మగూడెం పంచాయతీల ప్రజలకు రమణ క్కపేటపీహెచ్‌సీ సేవలు అందిస్తోంది. ఆయాగ్రామాలనుంచి రోగులతో ఆసుపత్రి రద్దీగా ఉండటంతో పాటు రోజువారి 150మంది వోపీఉం టున్నారు. భవనంలోని గదుల్లోపెచ్చులు ఊడిపోవడంతో పాటు ఇనుపచువ్వలు బయటపడి వర్షంపడిన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



పెచ్చులూడి బయటపడిన ఇనుపచువ్వలు

నిర్లక్ష్యం తగదు

డోలా ఏసు, అక్కిరెడ్డిగూడెం



రమణక్కపేట పీహెచ్‌సీలో నిత్యం రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో భవనంశిథిలావస్థకు చేరుకున్నా ప్రత్నామ్నాయంగా పీహెచ్‌సీని వేరే భవనంలోకి మార్చడంలో నిర్లక్ష్యం తగదు

శ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి

మల్లేశ్వరరావు, రమణక్కపేట



రెండురోజుల పాటు చికిత్స పొందాలంటే ఆసుపత్రిలో వీలుకాని పరిస్థితి. భవనంలోని అన్ని గదుల్లో శ్లాబు పెచ్చులూడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతూ వైద్యం చేయించుకునే పరిస్థితి నెలకొంది.

నూతన భవనాన్ని నిర్మించాలి

-డి.రుతుమ్మ, అక్కిరెడ్డిగూడెం



ఈ భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేయించేందుకు కూడా అవకాశం లేదు. తక్షణమే నూతన భవనాన్ని నిర్మించాలి లేదాఅద్దెభవనంలోకి మార్చాలి

అందరి దృష్టికి తీసుకువెళ్ళాం

వైద్య అధికారిణి అనూష

భవనం శిథిలావస్థకు చేరడంతో గత రెండేళ్ళుగా తీవ్ర ఇబ్బందులు పడుతూ వైద్యం చేస్తున్నాం. ఈ సమస్యనుఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి అనేకమార్లు తీసుకువెళ్ళాం. ప్రస్తుతం అద్దెభవనంకోసం వెతుకుతున్నాం.

అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణం నష్ట పరిహారాన్ని అందించాలి

నూజివీడు టౌన్: అగ్రిగోల్డ్‌బాధితులకు తక్షణం నష్టపరిహారాన్ని అందించాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్‌అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజలు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్‌బాధితుల రాష్ట్రవ్యాపిత చైతన్యయాత్ర ఆదివారం నూజివీడు చేరిన సందర్భంగా నూజివీడు రాజీవ్‌సర్కిల్‌నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నూజివీడు చిన్నగాంధీబొమ్మసెంటర్లో నిర్వహించిన సభలో మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా అతిపెద్ద ఆర్థికకుంభకోణం జరగ్గా, తొమ్మిది రాష్ట్రాల్లో రూ.7,800కోట్లను ఏజెంట్లు, కష్టమర్లు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. 143మంది ఏజెంట్లు ఆత్మహత్యలకు పాల్పడినా రాష్ట్రప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డిపాజిట్లు చెల్లించిన వారు రోడ్డునపడితే అగ్రిగోల్డ్ డైరెక్టర్లు మాత్రం కోట్లరూపాయల విలువచేసే కార్లలో రోడ్లమీద యథేచ్ఛగా సంచరిస్తున్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను రాష్ట్రప్రభుత్వాలు, ప్రతిపక్షాలు సైతం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చలసాని వెంకటరామారావు, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో:



అగ్రిగోల్డ్ బాధితులకు సీపీఐ పార్టీ అండగా ఉంటుందని వారికి న్యాయంజరిగేవరకు బాధితుల తరపున పోరాటంచేస్తుందని రాష్ట్ర సీపీఐ కార్యవర్గసభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్రను పురస్కరించుకుని ఆదివారం ఆగిరిపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఐ కార్యదర్శి అక్కినేనివనజ, నూజివీడు డివిజన్ కార్యదర్శి బత్తులవెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ముత్యాలసుధాకర్ పాల్గొన్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న అక్కినేని వనజ ముప్పాళ్ళ నాగేశ్వరరావు

విస్సన్నపేటలో:




అగ్నిగోల్డ్ బాధితుల సమస్యలపట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగినవిధంగా ఆదుకోవాలని సీపీఐ రాష్ట్రసహకార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యరథయాత్ర ఆదివారం విస్సన్నపేట వచ్చిన సందర్భంగా జరిగిన సభలో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, మర్సకట్ల త్యాగరాజుఅగ్రిగోల్డ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

త్వరలో వోడీఎఫ్‌గా ప్రకటిస్తాం

నూజివీడు ఎంపీడీవో పి.అనురాధ

(నూజివీడు రూరల్)



ప్రశ్న: నూజివీడు మండలాన్ని సంపూర్ణ పారిశుధ్య (వోడీఎఫ్) మండలంగా ఎప్పుడు ప్రకటిస్తున్నారు?

జ: 7,322మరుగుదొడ్ల నిర్మాణాలకు 5,728 పూర్తి అయ్యాయి. 932 మొదటిస్టేజ్‌లో ఉండగా, మిగిలినవి ఈ నెలాఖరులోగా పూర్తిచేసి మండలాన్ని త్వరలో వోడీఎఫ్ మండలంగా ప్రకటిస్తాం.

ప్రశ్న: నిరుద్యోగయువతకు ఉపాధికల్పించేందుకుఎన్ని యూనిట్లు మంజూరు చేశారు?

జ: ఎస్సీలకు 128, బీసీలకు 100, కాపులకు 100, మైనార్టీలకు తొమ్మిది, ఎస్టీలకు 14 యూనిట్లు మంజూరయ్యాయి. ఇటీవలఇంట ర్వ్యూలు కూడా నిర్వహించాం. త్వరలో యూనిట్లు మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నీటిగుంతలు, ఇంకుడుగుంతల నిర్మాణం ఎంత వరకు పూర్తిఅయింది?

జ:515నీటికుంటలకు 278పూర్తి అయ్యాయి. 153 నీటిగుంతలు వివిధ నిర్మాణదశలో ఉన్నాయి. అదేవిధంగా 1093 ఇంకుడు గుంతలకు 996 నిర్మాణదశలో, 272 ఇంకుడుగుంతలు పూర్తి అయ్యాయి. వచ్చేనెలాఖరులోగా వీటి నిర్మాణా న్ని పూర్తి చేస్తాం

రైతుబజార్ ధరలు

వంగ - రూ. 23	పచ్చిమిర్చి - రూ.22	కంద - రూ.28
బెండ - రూ. 12	బంగాళదుంప - రూ.16	క్యారెట్ - రూ.28
బీర - రూ.17	చామదుంప - రూ.29	దొండ - రూ.22
కాకర - రూ.12	ఉల్లిపాయలు - రూ.24	ఆకుకూర కట్టలు - రూ.2
టమాట - రూ.37	దోస - రూ.15	చిక్కుడు - రూ.28
		బీట్‌రూట్ -25
		బీన్స్ - రూ.60

మరుగుదొడ్ల పనులు పరిశీలన

ముసునూరు: చెక్కపల్లి గ్రామంలో అట్లూరిరమేష్‌ఛారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను జడ్పీటీసీ సభ్యుడు చిలుకూరి వెంకటేశ్వరరావుతో కలిసి ట్రస్ట్ చైర్మన్ అట్లూరి రమేష్ ఆదివారం పరిశీలించారు.

పారిశుధ్యంపై అధికార యంత్రాంగం దృష్టి



ఆరుగొలనుపేటలో దోమల నివారణమందు పిచికారీ చేయిస్తున్న ఎమ్డీవో

చాట్రాయి: మండలంలోని ఆరుగొలనుపేటలో ఓ బాలుడికి డెంగ్యూ లక్షణాలు కనిపించటం అన్నిగ్రామాల్లో సీజనల్‌జ్వరాలతో జనం బాధపడుతుండటంతో అధికారయంత్రాంగం అప్రమత్తమై పారిశుధ్యం పై దృష్టిసారించారు. ఎమ్డీవో నాగేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యఅధికారి డాక్టర్ నాగమల్లిక ఆధ్వర్యంలో అన్నిగ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, జ్వరాలపై సర్వే జరుపుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు తాగునీరుకలుషితం కాకుండా రక్షితపథకం ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నారు. పైపులైన్ల లీకేజీలు, మరమ్మతులు చేస్తూ నీటిని క్లోరినేషన్ చేస్తున్నారు. నివాసప్రాంతాల్లో మురుగునీరునిల్వఉంటే తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నారు. దోమలమందును పిచికారీ చేస్తున్నారు. ఏఎన్‌ఎమ్‌లు, వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్ళి జ్వరాలువున్నవారిని గుర్తించి వైద్యసేవలు అందిస్తున్నారు. అవసరమైన వారిని చాట్రాయి పీహెచ్‌సీకి తీసుకువచ్చి వైద్యం చేస్తున్నారు. కాచిచల్లార్చిన నీరు తాగాలని, దోమలతెరలు వాడాలని వేడి ఆహారపదార్థాలు మాత్రమే తినాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జ్వరలక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించుకోవాలని ఏఎన్‌ఎమ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



నూజివీడు టౌన్: గణేష్‌నవరాత్రుల్లో భాగంగా మూడవరోజు గణేష్‌ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు

నూజివీడు మండలంలో

మండలంలోని పలుగ్రామాల్లో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడి విగ్రహాలకు పెద్దఎత్తున ప్రజలు, ప్రజాప్రతినిధులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేకంగా చలువపందిళ్ళు ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల ఎదుట భక్తులు కోలాటం, నృత్యాలతో వేడుకలను నిర్వహించారు.

గణపతిని సైకిల్‌పై ఊరేగించిన బాలలు



చాట్రాయిలో: చాట్రాయి పవర్‌పేటలో బాలలుచందాలు సేకరించి వినాయక చవితినాడు గణపతివిగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. ఆ విగ్రహాన్ని ఆదివారం సైకిల్ పై పెట్టుకుని గ్రామంలోని ఊరేగించి, అనంతరం పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. భక్తులకు బాలలు పులిహోర ప్రసాదం కూడా పంపిణీచేశారు.చాట్రాయి మరీదుఅప్పారావు ఇంటివద్ద ఏర్పాటుచేసిన గణేష్‌విగ్రహాన్ని ఆదివారం గ్రామంలో డప్పువాయిద్యాలతో ఊరేగించి పెద్దచె రువులో నిమజ్జనం చేశారు. చనుబండలో ఏర్పాటుచేసిన గణేష్‌విగ్రహాన్ని డప్పువాయిద్యాలు యువకులు రంగులుచల్లుకుంటూనృత్యాలు చేస్తూ గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేశారు.చాట్రాయి: చాట్రాయి వర్తకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతివిగ్రహం మండపంలో కరెన్సీనోట్లతో అలంకరించారు.



విస్సన్నపేటలో:విస్సన్నపేటలోని నూజివీడు రోడ్డులో ఆయిల్‌బంకు వద్ద ఏర్పాటుచేసిన పెద్దగణనాథుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు మర్రిబోయిన వెంకటేశ్వరరావు (చిన్నోడు) ఆధ్వర్యంలో ఈ గణనాథుడి విగ్రహం ఏర్పాటు చేశారు. విస్సన్నపేటలోని ఆర్యవైశ్యకల్యాణమండపం వద్ద ఏర్పాటుచేసిన గణనాధునికి ప్రత్యేక పూజలు చేసి పెద్దఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఆర్యవైశ్యప్రముఖులు నాగుబండి రాఘవేంద్రకృష్ణ, రంగాచక్రవర్తి, నాగుబండి సురేష్, నాగుబండి రవిచంద్, కుక్కడపు శ్రీనివాసరావు (రైసుమిల్లు) గోళ్ళకోటేశ్వరరావు, కుక్కడపు హీరాబాబు, నాగుబండి భద్రినాథ్, నాగుబండి శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.



ముసునూరులో: ముసునూరులోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శాంతిగణపతి, తూర్పురామాలయంలోని మహాగణపతి, శిల్కానగర్‌లోని బొజ్జగణపతి, చిన్నారులు ఏర్పాటుచేసిన గణేష్‌విగ్రహాలకుఆదివారం తీన్‌మార్‌డప్పులు, వివిధ రకాల వేషదారణలతో గ్రామపురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగింపుచేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం నగరాలా చెరువు, ధర్మవరం చెరువుల్లో నిమజ్జన ం చేశారు. అలాగే చింతలవల్లి, చెక్కపల్లి, కొర్లకుంట, వేల్పుచర్ల తదితర గ్రామాల్లోకూడా గణనాధులను బారీగా ఊరేగించి నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయం వ్యవసాయ విద్యుత్ అందించేందుకు చర్యలు: ఎస్ఈ

నూజివీడు: ప్రభుత్వసూచనలమేరకు రైతులకు వ్యవసాయ విద్యుత్‌ను ఉదయంపూట పంపిణీచేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రాత్రి నూజివీడుడీఈ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అనంతరంస్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం నూజివీడుడి విజన్‌పరిధిలో 14 గిగావాట్స్ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. వ్యవసాయానికి పగటిపూట విద్యుత్‌ను అందిస్తే మరో 30శాతం విద్యుత్‌ను అదనంగా అందించాల్సి ఉంటుందన్నారు. ఇందుకుగాను నూజివీడు డివిజన్‌లో 220కె.వి సబ్‌స్టేషన్‌ను రూ.50కోట్లతో త్వరలో అందుబాటు లోకి తీసుకువస్తున్నామన్నారు. అదేవిధంగా విస్సన్నపేట మండలం నరసాపురం, నూజివీడు, కంభంపాడులో రూ.25కోట్లు వెచ్చిస్తూ 132కె.వి సబ్‌స్టేషన్‌లను చేపట్టామని వాటిని త్వరలోనే ఫీడర్‌కు అనుసందానిస్తామన్నారు. అదేవిధంగా రూ.4.5కోట్లతో బోర్వంచ సమీపంలో ఇండోర్‌సబ్‌స్టేషన్‌ను త్వరలో చార్జ్‌చేస్తామన్నారు. ముక్కొల్లుపాడు, నెమలి, నూజివీడులో అధనంగా మూడుసబ్‌స్టేషన్‌లను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇక సర్కిల్‌పరిధిలో 500పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

గృహ నిర్మాణలో తిరువూరు ముందంజ

విస్సన్నపేట: జిల్లాలో ప్రభుత్వగృహాల నిర్మాణంలో తిరువూరు నియోజకవర్గం ముందంజలో ఉందని హౌసింగ్ డీఈ శ్యామ్‌మోహన్ తెలిపారు. విస్సన్నపేట హౌసింగ్ ఏఈ కార్యాలయంలో ఏఈ కె.వి సత్యనారాయణతో ప్రభుత్వగృహాల నిర్మాణం పై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గం ప్రభుత్వగృహాల నిర్మాణంలో ముందంజలో ఉందన్నారు. తిరువూరు నియోజకవర్గానికి 2,186 గృహాలు మంజూరుకాగా, అందులో 550 ఇళ్ళు ఇప్పటికే నిర్మాణం పూర్తి అయిందన్నారు. మిగతా గృహాలు వివిధ దశల్లో నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 2017-18, 18-19 సంవత్సరానికి సంబంధించి నియోజకవర్గానికి 2,200 ఇళ్ళు కొత్తగా మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ వారంలో ఆగృహాలనిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయన్నారు.

నూజివీడులో 'దీన్‌ఇస్తమా'



నూజివీడు టౌన్: నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలురవున్నతపాఠశాల ప్రాంగణంలో ముస్లిం మతపెద్దల ఆధ్వర్యంలో దీన్ ఇస్తమా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. నూజివీడు పెద్దమసీదు మతపె ద్దల ఆధ్వర్యంలో మహారాష్ట్ర పరిణినుంచి వచ్చిన మతపెద్ద అబ్దుల్‌అజీజ్ మహ్మాద్‌ప్రవక్త సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు మహ్మాద్‌ఆలీ, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న కాపా శ్రీనివాసరావు

ఆర్థిక సాయం

చాట్రాయి: పర్వతాపురం గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు (కలెక్టర్) ఇటీవల మృతిచెందగా ఆదివారం నూజివీడుమండల టీడీపీ మాజీఅధ్యక్షుడు కాపాశ్రీనివాసరావు మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రాష్ట్రనాయకులతో మాట్లాడి మృతుడి ఇద్దరిపిల్లలను ఎన్టీఆర్‌ట్రస్ట్‌స్కూల్లో చేర్పించటానికి కృషిచేస్తానని కాపా హామీ ఇచ్చారు. ఆయన వెంట మండలటీడీపీ మాజీ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పౌల్‌రాజు, టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు.



మదర్‌థెరిసా అవార్డును ప్రముఖుల చేతులమీదుగా అందుకుంటున్న ఉపాధ్యాయిని రామరాజేశ్వరి

గోగులంపాడు హెచ్.ఎంకు థెరిసా అవార్డు

ముసునూరు: విద్యారంగంలో ఉత్తమసేవలు అందిస్తున్న గోగులంపాడు ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రామరాజేశ్వరి మదర్‌థెరిసా నేషనల్‌అవార్డును ఆదివారం ప్రముఖుల చేతులమీదుగా అందుకున్నారు. హైదరాబాద్ పొట్టిశ్రీరాములు తెలుగుయూనివర్సిటీలో హెల్త్‌కేర్‌ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్య, సామాజిక సేవలో ఉత్తమసేవలను అందించిన వారికి మథర్‌థెరిస్సా నేషనల్ అవార్డులను ప్రకటించగా ముసునూరు మండలంలో విద్యారంగంలో అత్యుత్తమసేవలను అందిస్తూ ఉత్తమరాష్ట్ర ఉపాధ్యాయినిగా అవార్డు పొందిన రామరాజేశ్వరి నేషనల్ అవార్డును తమిళనాడు మాజీగవర్నర్ కె.రోశయ్య, తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విఫ్ పి.సుధాకర్‌రెడ్డి తదితరుల చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మండల ఎంపీపీ మల్లిపెద్దివిజయమధుసూదన్‌రావు, జడ్పీటీసీ సభ్యుడు చిలుకూరి వెంకటేశ్వరరావు, ఎంఈవో శాంతభూషణం, టీడీపీ నాయకులు శ్యామలరావు, మండల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల సంఘ నాయకులు రామరాజేశ్వరికి అభినందనలు తెలిపారు.



ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల స్వచ్ఛభారత్

నూజివీడు టౌన్: నూజివీడుట్రిపుల్‌ఐటీ క్యాంపస్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ వి.విదాసు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించగా, యోగశాల, బ్యాంకుహాస్పిటల్ పరిసరప్రాంతాలను వలంటీర్లు పరిశుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాకాంత్, ప్రోగ్రామ్‌ఆఫీసర్ అక్కినేని సత్యశ్రీధర్, పీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అమలు అంతంత మాత్రమే

● అందరికీ అందని అన్నఅమృత హస్తం ● అంగన్‌వాడీల్లో సౌకర్యాల లేమి ● రేషన్ బియ్యంతో భోజనం ● రాకపోకలకూ ఇబ్బందే



ఖాళీగా ఉన్న నూజివీడు అంగన్‌వాడీకేంద్రం



అంగన్‌వాడీకేంద్రంలో బాలింత, చిన్నారులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో 37 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్నఅమృతహస్తం పథకం అమలు అంతంత మాత్రమే. పట్టణంలో ప్రీస్కూళ్ళు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు మినహా ఎక్కడా సౌకర్యాలు లేక పోవడంతో అంగన్‌వాడీ పరిధిలో బాలింతలు, గర్భిణీలు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం 37 కేంద్రాలకు 337 మంది గర్భిణులు, 299 మంది బాలింతలతో కలుపుకుని రెండు వేల మంది చిన్నారులు ఈ పథకాన్ని వినియోగించుకోవాల్సి ఉండగా, అందులో సగం మంది మాత్రమే ఈ సేవలు అందుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాతల సహకారం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు అమ లు కాలేదు. బాలింతలు, గర్భిణులకు ప్రతిరోజూ ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనం ఐరన్ ట్యాబ్‌లెట్లను అంగన్‌వాడీ కేంద్రాల అందించాల్సి ఉంది. దీంతో కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు సుమారు 3 నుంచి 4 గంటల సమయం ఉండాల్సిన పరిస్థితి ఉంది. వారు కిందే కూర్చోవాల్సి ఉండడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల లేమి

నూజివీడు రూరల్ : నూజివీడు మండల పరిధిలో మొత్తం 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో మూడు వేల మంది చిన్నారులకు, 478 మంది బాలింతలు, 599 మంది గర్భిణులు అన్న అమృతహస్తం పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. దాదాపు సగానికి పైగా ఈ పథకాన్ని వినియో గించుకుంటున్న దాఖలా కనిపించటం లేదు. విద్యుత్‌బిల్లులు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను గ్రామపంచాయతీలకు అందించినా అవి అన్ని గ్రామాల్లోనూ అమలు కావడం లేదు. మరోవైపు బాలింతలు సిజేరియన్ల కారణంగా అంగన్‌వాడీకేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారుతోంది.

రేషన్ బియ్యంతో ఇబ్బందులు

చాట్రాయి : ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన అన్న అమృతహస్తం పథకం గర్భిణిలు, బాలింతలకు వరం అయినా కోటా బియ్యం వల్ల నీరు గారి పోతున్నది. మండల కేంద్రం చాట్రాయిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం గుడ్డు, పాలు పోషకవిలువలు కలిగిన కూరతో భోజనం పెడుతున్నారు కానీ కోటా బియ్యం వల్ల గర్భిణిలు, బాలింతలు కడుపు నిండా భోజనం చేయలేకపోతున్నారు. కోటా బియ్యంవల్ల అరుగుదల ఉండక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం మంచి బియ్యం ఇస్తుందనే ఆశతో రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నట్లు పలువురు చెప్పారు. కొంతమంది ఇంటి నుంచి అన్నం తెచ్చుకుని గుడ్డు, కూరతో భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం పెట్టించుకుని తీసుకు వెళుతున్నారు. కేంద్రానికి రాలేని నిండుగర్భిణిలు, పచ్చి బాలింతలకు మాత్రం భోజనం వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇళ్ళకు పంపుతున్నారు. ప్రభుత్వం కోటా బియ్యానికి బదులు మంచి బియ్యం సరఫరా చేస్తే అన్న అమృతహస్తం పథకం మంచి ఫలితాలిస్తుంది.

అధికారుల వైఫల్యం

విస్సన్నపేట : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం అమలుకు అధికారులు సమర్ధంగా పనిచేయటం లేదనే విమర్శలు నెలకొన్నాయి. బాలింతలు, గర్భిణులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకు రావడంలో వైఫల్యం చెందుతున్నారు. గర్భిణులు, బాలింతల బంధువులు వచ్చి ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారే తప్ప అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేయాలన్న నిబంధనను సమర్ధంగా అమలు జరపటం లేదు. కొన్ని కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు ఇంటి వద్ద నుంచి అన్నం తెచ్చుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలతో భుజించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చిన రేషన్‌బియ్యం ఆహారాన్ని ఇంటికి తీసుకువెళుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో అన్నం పెట్టాలని కోరుతున్నారు.

ఏటీత..లంకమేత..చందం

ఆగిరిపల్లి : రేషన్ బియ్యం అన్నం తినడం ఇష్టంలేక కొందరు ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు ఆసక్తి చూపటం లేదు. గర్భిణిలు, బాలింతలు పాలు, గుడ్డుకోసం, మధ్యాహ్నం భోజనం కోసం రెండు దఫాలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం కష్టసాధ్యంగా మారడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా నివాసం ఉండేవారు ఈ పథకానికి దూరమవుతున్నారు. భోజనం కోసం నడిచి రావాల్సి రావడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో భోజనానికి వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. కొందరు మాత్రం వచ్చి అంగన్‌వాడీల్లో అసౌకర్యాల నడుమ భోజనం చేయలేక క్యారేజిల్లో భోజనం తీసుకువెళుతున్నారు. లంక మేత కోసం ఏటిఈతలా ఉందని వాపోతున్నారు. మండలంలో మొత్తం 67 అంగన్‌వాడీకేంద్రాలు ఉండగా, 470మంది గర్భిణిలకు 373 మంది, 413 మంది బాలింతల్లో 322 మంది అన్న అమృతహస్తం పథకంలో భోజనం చేస్తుండగా భోజనం నాణ్యతలేక కొన్ని అంగన్‌వాడీకేంద్రాల్లో ఈ పథకంపై పెదవివిరుస్తున్నారు.

ముసునూరు మండలంలో

మండలంలోని 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో 382 మంది బాలింతలు, 437మంది గర్భిణులు, 3550 మంది చిన్నారులు అన్నఅమృతహస్తం పథకం ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇందులో 270 మంది బాలింతలు, 300 మంది గర్భిణుల మాత్రమే పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. చిన్నారులకు మాత్రం మెనూ ప్రకారం ఆహారం అందించటం లేదనే విమర్శలు ఉన్నాయి. కూరగాయలు తదితర వస్తువులను అంగన్‌వాడీకార్యకర్తలే కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీనుండి రూ.5వేలు నిధులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలని అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఇప్పటి వరకు నిధులు అందలేదు. సౌకర్యాల లేమితో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బియ్యంలో నాణ్యత లేకపోవడంతో సరిగ్గా ఉపయోగించుకోలేక పోతున్నారని సర్వత్రావిమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుడివాడలో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర నేడు

ఆంధ్రజ్యోతి, విజయవాడ : అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్య యాత్ర సోమవారం గుడివాడలో జరుగుతుంది. ఈనెల 26న హనుమాన్ జంక్షన్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారంనాడు నూజివీడులో జరిగింది, తిరువూరు, నందిగామలో పర్యటనను పూర్తి చేసుకుని విజయవాడకు చేరుకుంది. సోమవారం గుడివాడ, మచిలీపట్నం, చల్లపల్లి, ఆవనిగడ్డ, రేపల్లెలో ఈ యాత్ర సాగుతుంది.

ఎన్నికల్లో బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

● యువతకు రమేష్‌నాయుడు సూచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికలలో యువత బెట్టింగ్‌ల జోలికి వెళ్ళొద్దని బీజేపీ యువమోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రమేష్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యాలయ మీడియా సెల్ ఇన్‌ఛార్జి దిలీప్‌లతో కలిసి మాట్లాడారు. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని చెప్పారు. కాకినాడను స్మార్ట్‌సిటీగా రూపొందించేందుకు తమ పార్టీ తరఫున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. బీజేపీ,టీడీపీకి ఉమ్మడి శత్రువులుగా ఉన్న కొందరు అబద్ధ ప్రచారాలు చేస్తున్నారని, వాటితో పాటే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ముఖ్యంగా కొందరు నాయకుల మాటలు విని యువత బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, దీని జోలికి పోవద్దని వారు సూచించారు.

ఆల్ మునిసిపల్ ఇంజనీర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక

● ప్రెసిడెంట్‌గా ఎంపికయిన టి.రంగారావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జోన్-2 ఆల్ మునిసిపల్ ఇంజనీర్ల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాటర్ సప్లై డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న టి.రంగారావు ఎంపికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో జోన్-2కు చెందిన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు. జోన్-2 కమిటీ ఎంపికలో సెక్రటరీగా అసిస్టెంట్ ఇంజనీరు డి.దుర్గారావు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా జె.ఫణి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు కే.వి. సాయిప్రసాద్, ట్రెజరర్‌గా విజయవాడ సర్కిల్-1 ఈఈగా పనిచేస్తున్న కే.కోటేశ్వర్రావు, సభ్యులుగా డీఈఈ ఎంసీఎస్.పాత్రుడు, డీఈఈ వి.పద్మాకర్ ప్రసాద్, ఏఈ కే.రాజ్‌కుమార్, ఏఈ పి.సూర్యకుమారి, ఏఈ డి.లక్ష్మీనారాయణ, ఏఈ డి.రామకిషోర్, డీఈఈ అబ్దుల్ రహీమ్, బి.హెచ్.సుబ్బారావు డీఈఈ, ఏఈ నాగేశ్వర్రావు ఎంపికయ్యారు.

దేరాబాబాతో లాలూచి వల్లే ఉత్తరాదిలో విధ్వంసం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

విజయవాడ : సిపిఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో దేరాబాబా సహకారంతో హర్యానాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. దేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. హింస చెలరేగే ప్రమాదం ఉన్నదని ముందే ఊహించి 200 రైళ్లను రద్దు చేసిన ప్రభుత్వం దేరాబాబా 200 వాహనాల కాన్వాయ్‌తో కోర్టు హాజరయ్యేందుకు ఎందుకు అనుమతించిందో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో దళితులు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, అభద్రతాభావంతో వారు జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ ఎండగడుతూ నెల రోజులూ ప్రచార కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. చోటామోటా నాయకులకు వారి విలువను బట్టి రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వెచ్చించి కొనుగోలు చేస్తున్నందున ఎన్నికల బదులుగా వేలాన్ని నిర్వహిస్తే సబబుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎక్కడికక్కడ నోట్లను ప్రధాన పార్టీలు వెదజల్లుతున్నాయని తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టిడీపీ, వైకాపా పోటీలు పడిమరీ ఓటర్లను కొనుగోలు చేశాయన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గ్యాస్ సమాచారం

ఏజెన్సీ	సరఫరా తేదీ	ఫోన్ నెం.	ఆన్‌లైన్ నెం.
• శ్రీ రఘు గ్యాస్ ఏజెన్సీ	ఏరోజుకారోజు	252208	9848824365
• శ్రీసాయి వెంకరాఘవ ఏజెన్సీ	ఏరోజుకారోజు	251644	9966552447

(నూతన గ్యాస్ కనెక్షన్ల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు)

సినిమాలు

వెంకటేశ్వర-అర్జున్‌రెడ్డి
న్యూప్యాలెస్ - నేనేరాజు నేనే మంత్రి
శ్రీకృష్ణా - వివేకం
వెంకట్రామా - జయ జానకి నాయక

విస్సన్నపేటలో ట్రాఫిక్ సమస్య జటిలం



సత్తుపల్లిరోడ్డులో అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేత

- ప్రధాన రహదారికి ఇరువైపులా ఎడాపెడా ఆక్రమణలు
- డ్రెయినేజీలపైనే యథేచ్ఛగా వ్యాపారాలు
- నియంత్రణలో పూర్తిగా విఫలం
- అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పట్టని ప్రజల బాధలు

(విస్సన్నపేట)

మండలకేంద్రమైన విస్సన్నపేటలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలంగా మారుతోంది. విద్యాసంస్థలు, పరిసరప్రాంతాల నుంచి వచ్చివెళ్ళే ప్రజలతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా ఎడాపెడా ఆక్రమణలతో సత్తుపల్లిరోడ్డులో ట్రాఫిక్ కష్టాలు ఎక్కువగా ఉన్నాయి. ఉన్నకొద్ది పాటి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలను వ్యాపారస్థులు పూర్తిస్థాయిలో ఆక్రమించి షాపులు నిర్వాహిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ప్రధాన రహదారి పై ఇరువైపుల ద్విచక్రవాహనాలు, ఆటోలు, పార్శిల్‌లారీలు నిలిచి ఉండటంతో రాకపోకలు తరచూ స్తంభించిపోతున్నాయి. ప్రధానంగా గాంధీ బొమ్మసెంటర్‌నుంచి పాత పోలీస్‌స్టేషన్ వరకు ఈ ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉంది . ట్రాపిక్ నియంత్రణలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే అభి ప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బస్టాండు నుంచి పాత పోలీస్‌స్టేషన్ వరకు నిరంతర పర్యవేక్షణగా కొద్దిరోజుల పాటు అయినా పెట్రోలింగ్ నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్య కొంతవరకు పరిష్కారమయ్యే అవకాశం ఉందని, ఆ దిశగా పోలీసులు దృష్టిసారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

ఘనంగా ఆనంద ఆదివారం

తిరువూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆనంద ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, విద్యార్థినులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఖోఖో, షటిల్, మోకులాగుడు ఆటలు నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మరకాల కృష్ణకుమారి,కమిషనర్ జి.రఘుకుమార్‌లు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్, ఏఈ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు



సభలో ప్రసంగిస్తున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

తిరువూరు: అగ్రిగోల్డ్ బాధితుల్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు వైపల్యం చెందాయని, బాధితులకు అండగా ఉండాల్సిన పాలకులు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపిఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజలు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ టవర్స్ సెంటర్‌లో అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్ర ఆధ్వర్యంలో జరిగిన సభలో వారు మాట్లాడుతూ కుటుంబ అవసరాలకు ఆసరాగా ఉంటాయని పేద వర్గాలకు చెందిన ప్రజలు తాము కాయకష్టం చేసిన సంపాదించుకున్న నగదులో కొంత అగ్రిగోల్డ్ సంస్థలో పొదుపుచేస్తే కంపెనీ మూతవేసి మూడు సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సంస్థలో నగదు దాచుకున్న బాధితులు తమకు న్యాయం చెయ్యమని విన్నవిస్తున్నా పాలకుల్లో, అధికారుల్లో చలనం లేదని వారు ఆరోపించారు. కేంద్ర రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వాల కంటే అగ్రిగోల్డ్ సంస్థ ఎందరికో ఉపాధి కల్పిస్తుందని కితాబులు ఇచ్చారని, వీరి మాటలు విశ్వశించి ఈ సంస్థను నమ్మిన పేదల్ని నేడు నట్టేట ముంచారని వారు విమర్శించారు. బాధితులకు న్యాయం జరిగేవరకు తాము వారికి అండగా ఉంటామని ఆందోళన మరింత ఉధృతంగా కొనసాగిస్తామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గం సభ్యుడు తూము కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సభలో విశ్వనాథ్‌రెడ్డి, కొత్తపల్లి సుందరరావు, తిరుపతి రావు, గండ్ర ప్రసాదు తదితరులు ప్రసంగించారు. తొలుత స్థానిక అయ్యప్ప దేవాలయం నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఔషధ మొక్కలను సద్వినియోగం చేసుకోవాలి



నాగుబండి శ్రీశ్రితను సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

తిరువూరు: ఆరోగ్య సంరక్షణపట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధచూపించాలని మన చుట్టూ ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధ మొక్కలు ఉన్నాయని, వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని ఆయుర్వేద వైద్యుడు జి.వి.ఎం.శర్మ, స్థానిక సీఐ కె.వి.వి.ఎ.స్.సత్యనారాయణలు అన్నారు. పట్టణ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో షిర్డిసాయి కల్యాణ మండపంలో ఆయుర్వేద జీవన విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రకృతిలో లభించే ఆయుర్వేద మొక్కలు వాటి విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్, ఐసీడబ్ల్యూ ఎంట్రన్సుల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన నాగుబండి శ్రీశ్రిత, కుందా రేవతి, గుబ్బ కృష్ణచందన్‌లను ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. పట్టణ వాసవీక్లబ్ అధ్యక్షుడు కొత్తగుండ్ల వెంకట శేష హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థలో: స్థానిక సిద్ధార్థ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థిని కుందా రేవతి సీఎంఎ(కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్)లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించటాన్ని పురస్కరించుకొని ఆదివారం స్కూల్ యాజమాన్యం సన్మానించింది. ఈస్కూల్‌లో ప్రాథమిక విద్య నుంచి 10 వరకు సిద్ధార్థ స్కూల్‌లో విద్యనభ్యసించింది. స్కూల్‌లో ఉపాధ్యాయులు తనకు అందించిన సహకారంతో తాను ఉత్తమ ఫలితం సాధించినట్లు విద్యార్థిని తెలిపింది. స్కూల్ కరస్పాండెంట్ ఉప్పలపాటి చక్రపాణి, హెచ్.ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన నాగార్జున విద్యార్థులు

తిరువూరు: స్థానిక నాగార్జున డిగ్రీకాలేజీ విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెకండ్ సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ తూముల సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఎంపీసీలో తొండేటి అనిత 400 మార్కులకు 387 మార్కులు, పర్వతం కీర్తి 381 మార్కులు, బీఎస్సీ బీజడ్‌సీలో నంబూరి స్పందన 450 మార్కులకు గాను 413 మార్కులు సాధించారని, గణితంలో 100కి 100 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల్ని కాలేజీ కరస్పాండెంట్ వేమూరి నాగేశ్వరరావు, చైర్మన్ దిరిశాల హనుమంతరావు, కుక్కపల్లి శేషగిరిరావు, కాటంనేని నరసింహారావులు అభినందించారు.

చీమలపాడు గ్రామశివారులో వైద్యశిబిరం

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామశివారు హరిజనవాడలో ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యబృందం వైద్యశిబిరాన్ని నిర్వహించింది. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో పీహెచ్‌సీ డాక్టర్ ఎం. అనూష రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులను అందజేశారు. గ్రామంలో సాధారణ జ్వరాలు ఉన్నాయని ఆమె తెలిపింది. ప్రజలు వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, దోమలు లేకుండా చూసుకోవడం ముఖ్యమన్నారు. నిల్వ ఉండే పదార్థాలను తినవద్దని, టైర్లు, కొబ్బరిబొండాలు వంటివి లేకుండా చూడాలని గ్రామస్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళీ, స్వరూపరాణి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష



గణనాథుడి ఊరేగింపు

తిరువూరు: స్థానిక పాతతిరువూరు వడ్డెరబజార్, శాంతి నగర్ శ్రీనిధిస్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మేళాతాళాతో ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనంపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించి కట్టలేరులో నిమజ్జనం చేశారు.

ఎ.కొండూరు మండలంలో



ఎ.కొండూరులో నిమజ్జనానికి వెళుతున్న వినాయక విగ్రహం

వినాయక చవితి పర్వదినం సందర్భంగా మూడోవ రోజు మండలంలోని పలు గ్రామాలలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఎ.కొండూరు, కంభంపాడు, గోపాలపురం, రామచంద్రాపురంతోపాటు ఇతర గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దఎత్తున మేళతాళాలతో ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనాలు చేశారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

తిరువూరు: పట్టణంలో అన్ని వార్డుల్లో దోమల నివారణ, పారిశుధ్యం పనుల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ జి.రఘుకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం సమీపంలో దోమల మందు పిచికారీ చేయించారు. మురుగునీరు నిలిచిన గోతుల్లో దోమల నివారణకు ప్రత్యేక మందు(ఆయిల్‌బాల్స్) వేయించారు. కమిషనర్‌తో పాటు చైర్‌పర్సన్ మరకాల కృష్ణకుమారి, శానిటరి ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమం పర్యవేక్షించారు.